కం. వారిడిరి ధనము లెల్ల న,వారిగ నవిమెల్ల మెల్ల•వచ్చుచు నుండన్
దారిన్ మున్నే వచ్చితిఁ, దీరక సందేశహారులు•తీవరపెట్టన్. ౧౯౧

అవారిగన్=విస్తారముగ, సందేశహారులు=దూతలు.

తా త్ప ర్య ము.

వారు నాకు దండిగ ధనమిచ్చిరి. అవి మెల్ల మెల్లగ వెనుక దోవలో వచ్చుచున్నవి. దూతలు తొందరపెట్టిన కారణమున ముందుగా నేను వచ్చితిని.

చం. అడిగినవాని నీవు చెపు•మా జననీ! కనకాంచితంబు నీ
పడుకొనుపాన్పు శూన్య మయి • భాసిల కున్నది రాచవారలున్
మిడికెద రేల దీనతో? న•నింద్యచరిత్రుఁడు తండ్రి యింద యె
ప్పుడు భవదీయ గేహమునఁ • బొల్చును నేఁ డిట లేఁ డ దేమొకో? ౧౯౨

కనకాంచితంబు=బంగారుచేఁ బ్రకాశించునది, శూన్యమయి = సంస్కారము లేనిదై, భాసిలకున్నది=ప్రకాశింపకున్నది, రాచవారలు = రాజబంధువులు లోనగువారు, అనింద్యచరిత్రుఁడు=నిందింపఁబడని నడవడి కలవాఁడు, ఎప్పుడు = సర్వదా? భవదీయగేహమునన్=నీ యింట.

తా త్ప ర్య ము.

ఆ ముచ్చట లటుండనిమ్ము. నా ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరము లిమ్ము. తల్లీ! నీవు పండుకొను పానుపు పాడుపెట్టినట్టులేల వాడుకొనఁబడక సంస్కారశూన్యమై ప్రకాశింపకున్నది. ఏల రాజబంధువులు రాజునకు సంబంధించినవారు దుఃఖపడుచున్నారు? దోషరహితుఁడైన నా తండ్రి రాజకార్యములు లేనియప్పు డెప్పుడును నీ యిల్లు విడిచి యుండఁడుగదా నేఁడు లేఁడే యేల?

విధవాధర్మములు.

ఏకకాల స్సదాకార్యో నద్వితీయః కదాచన
యవాన్నైర్వా ఫలాహారై, శ్శాకాహారైః పయోభృతైః
ప్రాణయాత్రాం ప్రకుర్వీత యావత్ప్రాణాః స్వయంవ్రజేత్
పర్యంక శాయినీనారీ విధవా పాతయేత్పతిమ్
తస్మాద్భూశయనం కార్యం, పతిసౌఖ్య సమీహయా
నచాంగో ద్వర్తనం కార్యం, స్త్రియా విధవ యాక్వచిత్
గంధద్రవ్య స్యసంబంధో నైవకార్య స్తథాక్వచిత్
తర్పణం ప్రత్యహంభ ర్త్రుః కుర్యా త్కుశతి లోదకైః
తత్పితు స్త త్పితుశ్చాపి, నామగోత్రాను పూర్వకమ్
విష్ణోస్తు పూజనం కార్యం, పతిబు ద్ధ్యానచాన్యథా
పతిమేవ సదాధ్యాయే ద్విష్ణురూప ధరంపరం
ఏవంధర్మ పరానిత్యం విధవాపి పతివ్రతా।

అర్థము. భర్త మరణించిన స్త్రీ యొంటిపూఁట భుజింపవలెను. రెండవసారి భుజింపరాదు. యవాన్నముతోఁగాని ఫలముతోఁగాని, శాకములతోఁగాని, పాలతోఁగాని, నెయ్యితోఁగాని ప్రాణముతానై పోవువఱకు ప్రాణయాత్ర జరుపవలెను. మంచముమీఁదఁ బఱుపుమీఁదఁబండుకొను విధవ మగని నరకమునఁబడఁద్రోయును. కావునఁ బరలోకమునఁ దనపతి సౌఖ్యమును గోరునది భూమిమీఁదఁ బండుకొనవలెను. సువాసనగల పదార్థముల సంబంధమెప్పుడును గూడదు. విధవ నలుగు పెట్టించుకొనరాదు. (ఇవి తాంబూలము, దలదువ్వుకొనుట మొదలగు భోగముల కుపలక్షణమని యెఱుఁగునది) ప్రతిదినము దర్భలు, పూవులు నీళ్ళుఁతో దన భర్తకు ఆయనతండ్రికి, ఆయనతండ్రికి నామము గోత్రము చెప్పి స్నానవేళ నీళ్ళు విడువ వలయును. తన పతియను తలంపుతోనే విష్ణుపూజచేయావలెను. మఱియొక భావముతో మఱియొకని బూజింపరాదు. భర్తను విష్ణుస్వరూపుఁడుగా ధ్యానింపవలెను. ఇట్టి ధర్మము లాచరించునది విధవయైనను బతివ్రతయే.

పానుపు పాడుపెట్టఁబడినదనుటచే విధవలు మంచములమీఁదఁ బఱుపుల మీఁదఁ బండుకొనరాదని యేర్పడుచున్నది. శ్రీరాముని నెప్పుడు ద్వేషించెనో యాగడియయందే కైకకు విధవాత్వచిహ్నములు అలంకారహీనత నేలపడకమూలయింట మూల్గుట ముసుఁగులోనైనవి నప్పుడే ప్రాప్తించెను. (చూ. అయో. ౫౪౭, ౫౬౮, ౫౭౬ వ ప.) కావున శ్రీరామద్వేషము సౌభాగ్య నాశకరము. కావున రామకోటి వ్రాయుటను రామభజనపూజను ద్వేషించు స్త్రీలకు వైధవ్యము తప్పదు.

—♦ కైకేయి భరతునకు దశరథుఁడు మరణించుట దెలుపుట ♦—

చం. జనకునిఁ జూడఁ గోరి యిటు ♦ చయ్యన వచ్చితి నిందు మ్రొక్కఁగా,
వినయము మీఱ నాయనకు ♦ నే వచియింపుము, పెద్దభార్యయిం
టనొ గలఁడే! యటం చడుగ ♦ నందనుతో వచియించె ఘోర వా
ర్తను బ్రియబుద్ధిఁ గైక నిజ♦రాజ్యమహాశఁ బ్రమోహితాత్మయై. ౧౭౩

ఘోరవార్తన్=భయంకరమైన వృత్తాంతమును, నిజరాజ్యమహాశన్=తనకు రాజ్యమందుఁగల గొప్ప యాశచే, ప్రమోహితాత్మయై = మిక్కిలి మోహము నొందిన మనస్సుగలదై.

తాత్పర్యము.

వినయముతోఁ దండ్రినిజూచి నమస్కరింపవలయునను కోరికతో నిటు వేగముగ వచ్చితిని. ఆయనకు నేను వచ్చినవార్త చెప్పి పంపుము. పెద్దభార్య కౌసల్య యింటియందున్నాఁడో? అట్లైన నే నక్కడికే పోయెదను అని యడుగఁగా భయంకరమైన వృత్తాంతమును దనకు రాజ్యమందుండు మహాశయాయనకుఁగలదని మిగుల మోహము చెందిన మనస్సుగలదై యది యాయనకుఁ బ్రియమను తలంపుతో నిట్లనియె.

ఆ. యజ్ఞశీలుఁ డనఘుఁ • డవనీధవుండు మ,హాత్ముఁ డధిక తేజుఁ • డార్యసుగతి
యెల్లభూతములకు • నెయ్యది గతి నీదు,తండ్రి యట్టిగతికిఁ•దనయ యరిగె.

యజ్ఞశీలుఁడు=యజ్ఞముచేయు స్వభావముగలవాఁడు, అనఘుఁడు = పాపరహితుఁడు, మహాత్ముఁడు=గొప్ప మనస్సుగలవాఁడు, అధిక తేజుఁడు=గొప్ప తేజస్సుగలవాఁడు, ఆర్యసుగతి=ఆర్యులకు మంచి రక్షకుఁడగువాఁడు, ఇట్టివాఁడుగదా రాజుగారు అని చావువార్త చల్లగాఁ జెప్పుచున్నది.

తా త్ప ర్య ము.

నాయనా! నీ తండ్రి రాజుగారు సామాన్యుఁడా? ఆయనకు యజ్ఞములు చేయుటయే స్వభావము. పాపమెట్టిదో యెఱుఁగఁడు. గొప్ప మనస్సుగలవాఁడు, మిగుల తేజముగలవాఁడు, ఆర్యులకెల్ల దిక్కయినవాఁడు, ఇట్టివాఁడయ్యును, నీతండ్రి భూమిమీఁదఁ బుట్టినవన్నియు నే త్రోవఁబోవునో యాత్రోవనే పోయెను.

చం. అని వచియింపఁగా భరతుఁ • డార్తిని హా యని నేలఁ ద్రెళ్ళి చ
చ్చినగతి నుండి లేచి తన • చేతుల నెత్తి విలాపయుక్తుఁ డై
యనరుచు దిగ్భ్రమం గొనుచు • వ్రాలుచుఁ జూడుము నన్ను నాయనా!
యను నెట కేగితో యను ద•యామతి న న్గనరాదొకో! యనున్. ౧౭౫

తా త్ప ర్య ము.

అని యిట్లు కైక తనతండ్రి మరణవార్తను జెప్పఁగా ,విని భరతుఁ డార్తుఁడై హా తండ్రీయని నేలపైఁబడి చచ్చినవానివలె నుండి లేచి చేతులెత్తి యేడ్చుచు దుఃఖపడుచు దిగ్భ్రమగొనుచు నేలవ్రాలుచు నాయనా! నన్నుఁ జూడుమా యనును. ఎక్కడికిఁ బోయితివి తండ్రీయనును, దయచే నన్నుఁ జూడరాదా యనును.

ఉ. శారదరాత్రి యందు సమ•సారసశాత్రవుచే నభంబున
ట్లీరమణీయశయ్య మును•పెంతయుఁ గాంతి వహించు, నేఁడయో
యారమణుండు లేమి జల•జారివిహీననభంబుపోలికన్
నీరము లెండి నట్టిపెను•నీరధిచందముగాఁగఁ దోఁచెడున్. ౧౭౬

శారదరాత్రియందున్ = శరత్కాలమందలి రాత్రియందు, సమసారస శాత్రవుచేన్ = నిండు చందురునిచే, నభంబునట్లు=ఆకాశమువలె, జలజారివిహీననభంబుపోలికన్=చంద్రుఁడు లేని యాకాశమువలె, నీరములు = నీళ్లు, పెనునీరధిచందము = మహాసముద్రమువలె, తోఁచెడున్=కానవచ్చుచున్నది.

తా త్ప ర్య ము.

శరత్కాలమునాఁటి రాత్రియందుఁ బూర్ణచంద్రబింబముచే నాకాశమువలె నీయందమైన శయ్య రాజు పండుకొనుటచే నెంతయో కాంతిగలదై యుండెను. నేఁడో యీ రాజు లేనికారణమున చంద్రుఁడు లేని యాకాశమువలె జలము యెండిన మహాసముద్రమువలెఁ గానవచ్చుచున్నది.

కం. అనుచును వదనముఁ జేలం,బునఁ గప్పి కుఠారకృత్త•భూజం బన భూ
మిని వ్రాలి యేడ్వఁ గని నా, నినుఁ డన నెల యనఁగ నొప్పు•నింద్రసమానున్.

వదనము=ముఖము, చేలంబునన్ = వస్త్రముచే, కుఠారకృత్తభూజంబనన్ = గొడ్డలిచే నఱకఁబడిన చెట్టువలె, కరినాన్ = ఏనుఁగో యనునట్లు, ఇనుఁడనన్ = సూర్యుఁడనునట్లు, నెలయనన్ = చంద్రుఁడనునట్లు, ఇంద్రసమానున్ = ఇంద్రునితో సముఁడైన వానిని.

తా త్ప ర్య ము.

అని చెప్పుచు వస్త్రములో ముఖముఁగప్పుకొని గొడ్డలిచే నఱకఁబడిన చెట్టు వలె నేలపైఁబడి యేడ్వఁగా మదించిన యేనుఁగువలె సౌమ్యదర్శనమునఁ జంద్రుని వలెఁ బ్రతాపమున సూర్యునివలెనుండు నింద్రసమానుని.

కం. తనయుఁ దనకరముల మె, ల్లన లేవఁగఁ బట్టి యెత్తి • లాలించి కేఁడిం
గొని కాఱునీరు దుడుచుచుఁ, జనవు మెఱయఁగైక యనియె•శాంతమనమునన్.

తా త్ప ర్య ము.

కొడుకును దనచేతులతోఁబట్టి మెల్లన లేవనెత్తి బుజ్జగించి వానవలెఁ గన్నుల నుండి కాఱునీళ్ళను దుడుచుచుఁ జనవుతోఁ గైక శాంతిగల మనస్సుతో నిట్లనియె.

కం. లే లెమ్ము రాజ! యేలా; యీలీలన్ వగచె దిట్టు • లిల వ్రాలి నినున్
బోలినసుమతులు వగతురె, కాలంబును మీఱి బ్రతుకఁ•గా నరువశమే. ౧౧౯౯

రాజ=(౧) రాజవంశమునఁ బుట్టినవాఁడు ధైర్యము విడిచి పరులచావున కేడ్చునా? (౨) నీవు రాజవై యెంతో సుఖసంతోషము లనుభవింపవలసియుండఁగా నేడ్వఁదవేల? భరతుఁడు రాజపీఠ మంగీకరించునని యే కైక తలంపు. ఆమాట చెప్పిన సంతోషించునని రాజా యనుచున్నది.

తా త్ప ర్య ము.

రాజా! లే లెమ్ము. ఈ విధముగా నేలపైఁబడి యేల యేడ్చెదవు? నీ వంటి బుద్ధిమంతులుగలరా? బుద్ధిమంతు లిట్లేడ్తురా? నియమితకాలమును మించి బ్రతుకఁగా నరునకు వశమా?

చం. చదివితి వెల్లవేదములు • సభ్యసుసమ్మతవర్తనంబులన్
బొదలితి, దానయజ్ఞ విధిఁ • బొల్చు నజస్రము మందరంబుఁన్
మొదలురవిప్రభంబలెను • నీమతి. యేడ్పుట లాభ మేమొ నీ
మదిఁ బరికింపుమా యనుడు • తప్పఁ బడి పొర్లుచు నట్టకేనునున్. ౧౨౦౦

సభ్యసుసమ్మతవర్తనంబులన్=సాధువులకు మిగుల సమ్మతమైన నడవడిచే, అజస్రము = ఎల్లప్పుడు, మందరంబునన్ = మందరపర్వతమునందు, రవిప్రభంబలెన్ = సూర్యకాంతివలె, ఉత్తరాయణమున మందరగతుఁడైన సూర్యకాంతి విశేషముగఁ బ్రకాశించునని ప్రసిద్ధము. తక్కిన పర్వతములకంటె మందర మెత్తగుటచే సూర్య

కాంతి దీర్ఘకాలముండునని భావము. దానయజ్ఞవిధి=దానమనెడి విష్ణుపూజ'యజ్ఞోవై విష్ణుః శ్రుతి. దానవిధి యజ్ఞవిధియనియుఁ జెప్పవచ్చును. యజ్ఞార్థాత్. భ. గీ. ౩-౯ అనుచోట యజ్ఞోవైవిష్ణు రితిశ్రుతేః యని శంకరులు వ్రాసియున్నారు.

### తాత్పర్యము.

నాయనా! సమస్తవేదములు చదివితివి సభకు యోగ్యులగు పెద్దలకు నిష్టమైన విధముగా వర్తించెదవు. మందరపర్వతమందు సూర్యకాంతివలె దానమనెడి విష్ణుదేవపూజయందు నీ మనస్సెప్పుడు నిలిచియుండును నీ విట్టివాఁడవు కావునఁ జచ్చినవారికై యేడ్చుటవలన లాభముగలదేమో యాలోచింపుము. అని చెప్పఁగా భరతుఁడు నేలపైఁబడి పొర్లుచు మాటలాడలేకయుండియు నతికష్టముపై నిట్లనెను.

ఉ. రాముని యౌవరాజ్యమున • రాజిలఁ జేయునో, కాక యజ్ఞమే
శ్రీమహితుండు తండ్రి యొనరించునో, యంచును నాశ వచ్చితిన్
భూమిధవుం గనుంగొనెడి•పుణ్యము లేమిని గోర్కు లెల్లఁ గ
ట్టా మొదలంటిపోయెను, నె•డందయు వ్రీలెడిఁ దున్క తున్కలై. ౧౮౦౧

రాజిలన్=ప్రకాశింపఁగ, ఎడంద=హృదయము.

### తాత్పర్యము.

తండ్రి శ్రీరాముని యౌవరాజ్యమున నిలుపునో యే దేని యజ్ఞమే చేయునో యను నాశచే వచ్చితిని. రాజును జూచెడి పుణ్యము లేకుండుటచే నాకోరుకు లెల్ల నయ్యో మొదలంట నాశమయ్యెను. హృదయమును ముక్కలు ముక్కలై పగిలిపోవుచున్నది.

ఉ. ఏ మయి యుండెఁ దండ్రి కిట • నే నరుదేరకమున్నె చిద్దఁగా?
నామయ మెద్ది? ధన్యులు గ•దా పితృ కార్యము లెల్లఁ దీర్చి రా
రాముఁడు లక్ష్మణుండును, ధ•రాపతి నేఁ జనుదేర మూర్ధముం
బ్రేమను మూర్కొనండె తన•మేన నొకింతయుఁ బ్రాణ ముండినన్. ౧౮౦౨

చిద్దఁగాన్=మరణింపఁగా, ఆమయము=రోగము, మూర్ధమున్ = శిరమును, మూర్కొనండె=వాసనచూడఁడా, మేనన్=దేహమందు.

### తాత్పర్యము.

నేను రాకముందే యింటఁ జచ్చుటకు నాయన దేహమునకు నేమయి యుండెను? రోగము పేరేమి? తండ్రికిఁ బరలోకకార్యము లొనర్చిన శ్రీరామ లక్ష్మణు లెంత పుణ్యులోకదా? నేను వచ్చువఱకుఁ దండ్రి బ్రదికియుండిన నాశిరమును వాసన చూచి యుండునుగదా?

కం. ధూళిని బ్రుంగిననా మెయిఁ, జాలఁగ ననురక్తిఁ దుడిచి•స్వకరంబుల నన్
లాలించునాతఁ డెవఁ డిఁక, నాలీలాస్పర్శ మిడెడి•హస్తం బేదీ. ౧౮౦౩

మ్రుంగిన=మునిఁగిన, మెయి=దేహము. అనురక్తిన్=అనురాగముచే, స్వకరం బులన్=తన చేతులచే. లీలాస్పర్శము=సుఖస్పర్శము, ఏదీ=లేదేయని యర్థము.

తా త్ప ర్య ము

ఇఁక దుమ్ములో మునిఁగిన నా దేహమును దన చేతులచేఁ బ్రేమముగఁ దుడిచి బుజ్జగించువాఁ డెవఁడు? నాకు సుఖముగఁ దాఁకెడి చేయి యేది?

ఉ. ఎవ్వఁడు నాకు భ్రాత, పిత • యెవ్వఁడు. చుట్టము నెవ్వఁ, డెప్డు నే
నెవ్వరికింకరుండనో య•హీనగుణాకరుఁ డైనరాముకై
చివ్వన వార్తఁ బంపు మిఁక • జ్యేష్ఠుఁడె తండ్రి వివేకశాలి, కే
నవ్విభుఁడే మదీయగతి • యాతని వ్రాలెదఁ దత్పదద్వయిన్. ౧౫౦౪

భ్రాత=అన్న, పిత=తండ్రి, అహీనగుణాకరుఁడు=గొప్ప గుణములకు స్థాన మైనవాఁడు, చివ్వనన్=త్వరగా, వివేకశాలికిన్=యుక్తాయుక్తములు దెలిసినవానికి మదీయగతి=నాదిక్కు, పదద్వయిన్=రెండు పాదములందు, లక్ష్మణుఁడు చెప్పిన (౧౧౧౩-వ ప) మాటలకు వీనికి భేదముకలదేమో చూడుఁడు. ఇందుఁ గింకరుఁడ నని చెప్పుకొనుట విశేషము.

తా త్ప ర్య ము.

ఎవఁడు నాకన్నయో యెవఁడు తండ్రియో, బంధువెవ్వఁడో యెప్పుడైనను నే నెవ్వని కింకరుండనో యట్టి మహాగుణఖనియగు శ్రీరామచంద్రునకు నేను వచ్చిన వార్త చెప్పి పంపుము. తండ్రి పోయినకారణమున నిఁక నన్నయె కదా తండ్రివలెఁ బూజ్యుఁడు. ఆయనయే కదా నాకిఁక రక్షకుఁడు, కావున నాయన పాదయుగముపైఁ బడెదను.

కం. ప్రాకటధర్మజ్ఞుఁడు సత్యైకరతుం డమలచరితుఁ • డౌజనకుఁడు తా
నాకంబున కేగెడిచో, నా కేమని చెప్పె మనెనో•న్యాయహితోక్తుల్. ౧౫౦౫

ప్రాకటధర్మజ్ఞుఁడు=ప్రసిద్ధధర్మములఁ దెలిసినవాఁడు, సత్యైకరతుండు=సత్య మందే ప్రీతిగలవాఁడు, అమలచరితుఁడు=మలినములేని నడవడికగలవాఁడు, నాకం బునకున్=స్వర్గమునకు, న్యాయహితోక్తుల్=ధర్మముతోఁగూడినమాటలు, దీనివలన మరణించువారును దీర్ఘప్రవాసము చేయఁబోవువారును, బిడ్డలకు బుద్ధులు చెప్పవల యునని సూచన. వాలియు నిట్లే చేసెనుగదా!

తా త్ప ర్య ము

ధర్మము దెలిసినవాఁడని ప్రసిద్ధి కెక్కినవాఁడు సత్యమందే ప్రీతిగలవాఁడు, మలినములేని నడవడికగలవాఁడు నగు మా తండ్రి స్వర్గమునకుఁబోవు సమయంబున నాకు ధర్మముతోఁగూడిన హితబోధ యేమిచేసెను.

కం. జనకుండు కడపట నాకై, యని నట్టిహితంబు వినఁగ • నాకపడెద నం
చును భరతుఁడు పలికిన నాతనికి యథాతథ్యముగను•వసుగే వచించెన్. ౧౫౦౬

యథాతత్త్వము=వాస్తవము నతిక్రమింపక యున్నదున్నట్టులు.

తా త్ప ర్య ము.

తండ్రి మరణించునప్పుడు కడపట నాకుఁ జెప్పుమని చెప్పిన హితవాక్యము లను నేను వినఁగోరెదను. అని భరతుఁడు చెప్పఁగ నాకైక యున్నదున్నట్టు లిటు చెప్పెను.

కం. రామా యని సీతా యని, సౌమిత్రీ యనుచు మిగుల•సంతాపములో
భూమీశుఁ డేడ్చు చేడ్చుచుఁ, దామేను బాసి విబుధ•ధామముఁ జేరెన్. ౧౫౦౭

విబుధధామము=స్వర్గము.

తా త్ప ర్య ము.

రామాయని సీతాయని లక్ష్మణాయని మిగుల దుఃఖముతో నేడ్చుచు నేడ్చుచు రాజు స్వర్గమునకుఁ బోయెను.

చం. అవిరళపాశపీడితమ•హాకరి నాఁగఁ దపించి చచ్చుచో
భువిజను లెవ్వ రాభువన•పూజ్యుని రాము ససీతు లక్ష్మణున్
సవురుగ వెండి రాఁ గనఁగఁ • జాలుదు రట్టిర ధన్యు లంచుఁ దా
నివి కడమాట లాడె, మఱి • యింతయు నాడఁ డోకం డటం చనన్. ౧౫౦౮

అవిరళపాశపీడితమహాకరి=దట్టమైన పగ్గములచే బాధింపఁబడిన పెద్దయేనుఁ గువలెఁ దాపమునొంది చచ్చునపుడు లోకపూజితుఁడైన రాముని సీతతోఁ గూడిన వానిని, లక్ష్మణుని క్షేమముగ మరలిరాఁగ నేమనుష్యులు చూడఁగలుగుదురో వారే పుణ్యాత్ములని యొకనేకాని యింతకుమించి వేఱొకమాట మాట్లాడిన వాఁడుకాఁడు. కావున నీకుఁ జెప్పినమాట లేమియు లేవు

కం. విని రెండవయప్రియముం, దనజనని వచింప మిగులఁ • దహతహపడుచున్
మనమున విషణ్ణవదనం,బున భరతుం డనియె జనని•మోముం గనుచున్. ౧౫౦౯

అప్రియము=అనిష్టము. విషణ్ణవదనంబునన్ = విషాదముతోఁ గూడిన ముఖముతో.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము రెండవ యప్రియవాక్యమును దల్లి చెప్పఁగా విని మనసున మిక్కిలి పరితాపపడి యేమవు ముఖముతోఁ దల్లి ముఖముఁ జూచుచు నిట్లనెను.

కం. అమ్మా రఘురాముఁడు దా, నమ్మహిళారత్న మైన•యవనీసుతతోఁ
దమ్మునితో నెట కేగెనొ, యమ్మాయిఁ జన హేతు వేమి•యాడుము తెలియన్.

మహిళారత్నము=స్త్రీరత్నము. అవనీసుతతోన్ = సీతతో, తమ్మునితో = లక్ష్మణునితో, అమ్మాయిన్=అ విధముగా, అడుము=పలుకుము.

తా త్ప ర్య ము

అమ్మా! శ్రీరాముఁడు సీతాదేవితో లక్ష్మణుతో నెచటికిఁ బోయెను. అట్లు పోవఁ గారణమేమి కలిగెనో తెలియఁ జెప్పుము.

కం. అని యడిగినఁ గైకేయియు, విన నప్రియ మైనవార్తఁ • బ్రియ మనుబుద్ధిన్
దనయునకుఁ జెప్పఁ దొడఁగెను,దనచేసినయట్టిపని య•థాతథ్యముగన్. ౧౫౧౧

అప్రియమైనవార్త=విననింపుగాని వృత్తాంతము, ప్రియము = ప్రీతికరము. యథాతథ్యముగన్=వాస్తవముగ, తాను జేసిన ఘనకార్యము తనతనయుఁడు మెచ్చుకొని సంతోషించునను తలంపుతోఁ దన ప్రతిష్ఠగోరి తన ప్రతాపము చెప్పుచున్నది.

తాత్పర్యము.

అని ప్రశ్నింపఁగా గైకేయియు వినుటకు దుఃఖకరమైనవార్తను సంతోషవార్తయను బుద్ధితోఁ దాను జేసినపని యున్నదున్నట్లు లిట్లు చెప్పఁదొడఁగెను.

—• కైకేయి భరతునకు శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుటఁ దెలుపుట •—

ఉ. నారలు గట్టి దండకవ•నంబున కేగెను బుత్ర ! రాముఁడా
ధారిణికన్యతోడఁ దన•తమ్ముఁడు గొల్వ న టంచుఁ బల్కఁ—నన్
దారుణవార్తకున్ భయవి•దారితమానసుఁడై స్వవంశశీ
లోరుమహత్త్వ మెంచుచును • సోదరసద్గుణశంక నిట్లనన్. ౧౫౧౨

నారలు=నారచీరలు, దారుణవార్తకున్=భయంకరమైన వృత్తాంతమునకు, భయవిదారితమానసుఁడై = భయముచేఁ జీల్పఁబడిన మనస్సుగలవాఁడై, స్వవంశశీలోరు మహత్త్వము=తన వంశముయొక్క సదాచారవిషయమైన గొప్ప తనము, సోదరసద్గుణశంకన్=అన్నయందు మంచి గుణవిషయమైన సందేహము, అనఁగా నన్న యేదైనఁ జేయరానిపనిచేసి శిక్షింపఁబడెనా? వంశమునకు నపకీర్తి వచ్చునేయను సందేహములో, దండకవనము=ఇది సాధ్యసమాసము గావున దీర్ఘము రాలేదని తెలియవలయును

తాత్పర్యము

కుమారా! నారచీరలు గట్టుకొని శ్రీరాముఁడు సీతతో లక్ష్మణునితో దండకారణ్యమునకుఁ బోయెను. అనిన నా భయంకరవార్త విని భయముచేఁ జీల్పఁబడిన మానసముగలవాఁడై యన్న యేదో చేయరానిదోషము చేసెను దానివలన వంశమునకు నపకీర్తివచ్చునే యని తలంచుచు నిట్లనెను.

ఉ. కోరఁడుగా ధరామరుని•కూర్చినవిత్తము లెవ్వియేనియున్ !
క్రూరత దోషహీను ధని•కున్ నిజుపేదను నొంపలేడుగా?
కోరఁడుగా పరాంగనల•కూటమి, శ్రీరఘురామచంద్రుఁడిన్
గారణ మేమి భ్రూణహుని•కైవడిఁ ద్రోయఁగ దండకాటవిన్! ౧౫౩

ధరామరుని కూర్చినవిత్తము=బ్రాహ్మణుఁడు కూడఁబెట్టిన ధనము, దోషహీనున్=పాపము చేయనివానిని, ధనికున్=ధనవంతుని, నొంపలేడుగా=నొప్పింప లేదుగదా, పరాంగనలన్=ఇతర స్త్రీలయొక్క, కూటమి=సాంగత్యము, భ్రూణహుని కైవడి=భ్రూణహత్య చేసినవానివలె, భ్రూణుహుండనఁగా వేదాధ్యయనము చేసిన

వాఁడు. "అనూచానో నుగైర్యుక్తో వ్రతవిద్యా యువాన్ శుచిః। భ్రూణ ఇత్యుచ్యతే సద్భిః స్త్వేషదో విజితేంద్రియః॥" అను భ్రూణలక్షణ వాక్యములఁ బ్రమాణము.

తా త్ప ర్య ము.

అమ్మా! శ్రీరామచంద్రుఁడు బ్రాహ్మణవిత్తమును నాశింపలేదుగదా? నేరము చేయని ధనవంతునైనను నిఱుపేదనైనను బాధింపలేదుగదా? పరాంగనల సాంగత్యము చేయలేదుగదా? అట్లు చేయఁడని శ్రీరామచంద్రుని భ్రూణహత్య చేసినవానివలె నడవులలోఁ ద్రోయఁగారణమేమి?

కం. అనవుఁడు బండితమానిని,యును జపలయు నైన కైక • యున్నది యున్న
ట్లనుఁ గామినీస్వభావం,బునఁ దనచేఁతకును దాన•పొంగుచు మదిలోన్. ౯౮

పండితమానిని=తాను పండితురాలు గాకుండినను, బండితురాలనని తలంచునది. పండితమానియొక్క స్త్రీలింగరూపము పండితమానిని, చపలయు = స్థిరబుద్ధి లేనిది. కామినీస్వభావంబునన్=కామముగల స్త్రీలస్వభావగుణముచే. పొంగుచున్ = సంతోషమున నుబ్బుచు.

తా త్ప ర్య ము.

అని భరతుఁ డడుగఁగాఁ బండితురాలనని తలంచు చపలచిత్తయగు కైక యున్నదున్నట్లు కామముగల స్త్రీస్వభావమునఁ దాను జేసినపనికిఁ దానే యుబ్బిపోవుచు నిట్లనెను.

ఉ. రాముఁడు గొంచెమేన్ గొనఁడు • బ్రాహ్మణవిత్త మొకప్డు దేనియున్
గాముకుఁడై పరాంగనలఁ • గన్నులనైనఁ గనండు, పేదనేన్
శ్రీమహితాఢ్యు నేనియు ని•శిష్టుని నొంపఁడు; నీదుతండ్రినిన్
రాముని గాన కంప నిను•రా జొనరింపఁగ నేన కోరితిన్. ౯౯

కాముకుఁడై=దుష్టకామముగలవాఁడై, పరాంగనలన్=ఇతరుల భార్యలను, శ్రీమహితాఢ్యులన్=సంపదచే నధికుఁడగు వానిని గొప్పవానినైనను, నొంపఁడు = బాధింపఁడు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి బ్రాహ్మణధనమును గొంచెమైనను గోరినవాఁడు కాఁడు. పరస్త్రీలను గామదృష్టిచేఁ గన్నెత్తియైనఁ జూడఁడు. పేదవానినైననుగొప్ప గుణముగల నిర్దోషిని బాధింపఁడు. శ్రీరాముని నడవులకంపుమని నిన్ను రాజుగాఁ జేయుమని నేనేరా నీ తండ్రిని గోరితిని.

కం. తనమాటను విన్నిరు మె నీ,జనకుఁడు వని కనిచె రాము • సహజన్మునితో
జనకజతోఁ బిమ్మటఁ బ్రియు,తనయుం గనలేమి ననటఁ•దా మరణించెన్. ౧౦౦

తాను జెప్పినమాటపై విన్ని నీ తండ్రి తమ్మునితోడను సీతతోడను, శ్రీరా

ముని వడవులకుఁ బంపెను. అట్లు పంపి తన ప్రియకుమారుని జూడకయుండ లేక దుఃఖముచేఁ దానే చచ్చెను.

ఉ. నీకొఱ కింతకార్యమును • నే ఘటియించితిఁ బుత్ర ! మానవా
శోకము నీకుఁ గా నెదురు•చూచెద రెల్లపురోహితాదు ల
స్తోకధరావిభూతి వర•సూరకులాగ్రణీ నిన్నుఁ బూన్పఁగాఁ
జేకొన వయ్య ధైర్యమును • సిద్ధము గమ్మభిషేక మందఁగన్. ౧౪౧౩

అస్తోకధరావిభూతి=గొప్పదగు భూమిసంపద, పూన్పఁగాన్ = పూనునట్లు చేయఁగా.

తా త్ప ర్య ము.

కొడుకా! నీ నిమిత్తము నేనింతకార్యముఁ జేసితిని, ఏడుపుమానుము, పురోహితులు మొదలగువార లీరాజ్యసంపద నీవు పూనునట్లు చేయవలయునని నీ రాకకై యెదురుచూచుచున్నారు కావున ధైర్యముఁ దెచ్చుకొని పట్టాభిషేకోత్సవమునకై సిద్ధపడుము.

కం. ఈనగరం బీరాజ్యం, బీనానాకోశచయము • లెల్లను నీ వా
భూనాథునిసంస్కారము,గా నీయభిషేకవిధియుఁ • గావింత్రు ద్విజల్. ౧౪౧౪

తా త్ప ర్య ము.

ఈ పట్టణ మీ రాజ్యము నానావిధములైన బొక్కసములు నివన్నియు నీవే యగుదువు. రాజునకుఁ గావలసిన సంస్కారములు ముగిసినతోడనే బ్రాహ్మణులు నీ కభిషేకము చేయుదురు.

—• ౨౩-వ సర్గము, భరతుఁడు కైకేయిని దూషించుట •—

చం. అపుడుఁ దండ్రిచావుఁ దన•యన్నయుఁ దమ్ముఁడు గాన కేగుటల్
విని భరతుండు శోకమున • వేఁగుచు నిట్లనుఁ దల్లితోడ నా
జనకునిఁ దండ్రివంటిరఘు•చంద్రము రామునిఁ బాసి యేడ్చు నీ
యనదకు హీనభాగ్యునకు • హా సిరి యేటికి రాజ్య మేటికిన్. ౧౪౧౫

వేఁగుచున్=కాలిపోవుచు, అనదకున్=అనాథ శబ్దభవము అనద దిక్కులేనివానికి, హీనభాగ్యునకున్=నిర్భాగ్యునకు దరిద్రునకు.

తా త్ప ర్య ము.

అని కైక చెప్పఁగాఁ దండ్రిమరణము నన్నయుఁ దమ్ముఁడు నడవులకుఁబోవుట విని భరతుండు శోకాగ్నిని గాలిపోవుచుఁ దల్లితోడ నిట్లనియె నా తండ్రినిఁ దండ్రితోడ సమానుఁడగు రఘువంశశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రమూర్తిని విడనాడి యేడ్చు నీ యనాథునకు నీ నిర్భాగ్యునకు నయోధ్యా నైశ్వర్యమేల. రాజ్యమేల !

ఉ. చండి! ధరాపతి న్నెడపి • సద్గుణసాంద్రుని రామచంద్రునిన్
దండక మానిఁ జేసి భృశ•దారుణ దుఃఖమునీఁద దుఃఖమున్

బుండున నుప్పు నిక్షగతిఁ • బూని ఘటించితి నాకు; నాన్నృపా
ఖండలుఁ డయ్యొ చిచ్చు నోడిఁ•గట్టెఁ గదే నినుఁ బొంది మూర్ఖుఁడై. ౧౮-౨౦

చండీ=క్రూరకర్మురాలా! గెడపి=చంపి, భృశదారుణ దుఃఖముమీఁదన్ = అధికమై భయంకరమైన దుఃఖముమీఁద, దఃఖమున్=రెండవ దుఃఖమును, నృపాఖండలుఁడు=రాజేంద్రుఁడు, కైకచేసిన యకార్యముఁ దలఁచుకొలఁది కోపమతిశయించుటచే దూషించుచున్నాఁడు.

తాత్పర్యము.

ఓసీ క్రూరురాలా! రాజును జంపితివి, సాధుగుణములు విశేషముగఁగల శ్రీరామచంద్రుని నడవులపాలు చేసితివి. ఈప్రకారము పుండుచేసి యాబాధ చాలనట్లు దానిలో నుప్పును గూరినట్లు తీవ్రదుఃఖముమీఁద దుఃఖమును నాకుఁ గలిగించితివిగదా. అయ్యో! యీరాజేంద్రుఁడు బుద్ధిలేనివాఁడై నిన్నుఁదెచ్చుకొని నిప్పును నోడిలోఁ గట్టుకొన్నవాఁ డయ్యెఁగదా.

ఉ. ఎక్కడ దాపరం బయితి•వే చెనఁటీ! యిటు కొంపఁ గూల్పఁగా?
నక్కట కాళరాత్రిగతి • వాధరణీశుని నీవ చంపితే!
మ్రుక్కడి! యీకులంబునను • మోహమునన్ సుఖమెల్లఁ గూల్చితే!
దిక్కటి చచ్చెఁ దండ్రి కడు•దీనత నిన్ను వివాహమాడుటన్. ౧౮-౨౧

కాళరాత్రి = ప్రలయకాలమందు సర్వము నాశముచేయు మహాశక్తి, మ్రుక్కడి=బుద్ధిలేని నీచురాలా, మోహమునన్=అజ్ఞానముచే, దిక్కటి = దిక్కులేక.

తాత్పర్యము.

ఓసీ దుష్టురాలా! మావంశము నాశముచేయుటకు నీ వెక్కడ దాపరించితివే. సమస్తలోకము నాశముచేయు కాళరాత్రివలె రాజును జంపితివిగదా. బుద్ధిలేనిదానా అజ్ఞానముచే ధనకాంక్షచే నీవంశసుఖమెల్లను నాశముచేసితివికదా. నిన్నుఁబెండ్లాడిన కారణమున రాజు దిక్కులేనివాఁడై చచ్చెను.

'ఆచార్యశ్చపితాచైవ మాతాభ్రాతాచ పూర్వజః, నార్తేనాప్యవమంతవ్యా' యని తానెంతదుఃఖములో నున్నను ఆచార్యుని, తండ్రిని, తల్లిని అవమానింపరాదని శాస్త్రము చెప్పుచుండఁగా నెట్లు భరతునివంటి ధర్మాత్ముఁడు తల్లిని నింతకఠోరముగ నిందించెను?

భరతుఁడు చేయరానిపని చేయలేదు. భర్తను జంపుటచేతను రామచంద్రమూర్తిని మరణాంతకదశయం దుంచుటచేతను, కైక వాగ్దండనమునకేగాక వధకును యోగ్యురాలే. (మా. ౧౩౯-వ ప.) అయినను దల్లియని నోటిమాటలతో వదలెను. అధర్మమందున్న తండ్రిని, ఆచార్యుని, మిత్రుని, తల్లిని, భార్యను కొడుకును పురోహితుని రాజు దండింపవచ్చును. మనువు.

పితాచార్యః సుహృన్మాతా భార్యా పుత్రః పురోహితః

నాదండ్యోనామ రాజ్ఞోఽస్తి, య స్స్వధర్మేణ తిష్ఠతి,

ఈ శ్లోకమునకు ముద్రితపాఠము కొంచెము భిన్నముగానున్నది. ఇదిగాక;

"కార్యమియ్యది యిదియు నకార్యమనుచుఁ
దెలియకైనను గర్వంబు బలిమినైనఁ
గాని తెరువునఁ జనిమెడి వానిగురుని
నైన దండింపవలయు" అయోధ్యా, ౧౬ ౩.

అని యుండుటచే భరతుఁడు తల్లిని దిట్టుట దోషముగాదు.

మ. అనఘున్ సత్యరతాత్ము నాజనకు నేలా చంపె? నాయన్న స
జ్జనసమ్మాన్యు నరణ్యభూములకుఁ బుచ్చం గారణం బేమి? యిం
కను గౌసల్య సుమిత్రయుం గడుపుదుఃఖం బెట్టు సైరింతురే?
మను టే దుష్కర మింక వార లిట నస్మన్మాత నీసిదరిన్. ౧౮౨

పాపరహితుని=సత్యమందుఁ బ్రేమగల మనస్సుగలవానిని నాతండ్రిని నేటికే చంపితివి. సజ్జనపూజితుఁడైన మాయన్న నేల యరణ్యభూములకుఁ బంపితివే. ఇంకను గౌసల్యయు సుమిత్రయుఁ బుత్రశోకము నెట్లు సహింపఁగలరే? దుఃఖము సహించు మాటయేల నాతల్లివైన నీసమీపమున వారికి బ్రతుకుటే దుర్లభము. నీపోరు పడలేక వారును జత్తురు.

మ. తతధర్మాత్ముఁ డనుత్తమవ్రతుఁడు శ్రద్ధాభక్తియుక్తంబుగా
సతమున్ రాముఁడు గన్నతల్లిగతి నిన్ సంభావనం దన్పఁడే?
నతసల్లోకయు దీర్ఘదర్శినియు నా నా తల్లి కౌసల్య స
మ్మతిఁ దోఁబుట్టినదానిరీతి నిను సమ్మానింపదే ప్రేముడిన్? ౧౮౩

తతధర్మాత్ముఁడు=విశేషముగ ధర్మమందే మనస్సుగలవాఁ డగుటచే నీవు సవతితల్లివైనను గన్నతల్లివలెనే యెంచువాఁడు, అనుత్తమవ్రతుఁడు=ఉత్తమోత్తమములయిన వ్రతములుగలవాఁడు, శ్రద్ధాభక్తియుక్తంబుగాన్=శ్రద్ధతోడను భక్తితోడను, సతమున్=ఎల్లప్పుడు. సంభావనన్=బహుమానముచే, తన్పఁడే=తృప్తిపడఁజేయుచున్నవాఁడుకాఁడా? నతసల్లోకము=నమస్కరించుసత్పురుషులుగలదియు, దీర్ఘదర్శినియు=దూరాలోచనగలదియు, ప్రేముడిన్ = ప్రేమచే, "దూరానర్థస్య సందర్శీ దీర్ఘదృష్టిః ప్రకీర్త్యతే"

తాత్పర్యము.

మిగుల ధర్మాత్ముఁడును నుత్తమోత్తమవ్రతుఁడును నగు రామచంద్రుఁడు నీవు సవతితల్లివి పరమపాపినివనికూడ నెంచక తన తల్లియే యనుతలంపుతో శ్రద్ధాభక్తులతోఁ దన తల్లిని నాదరించినట్లు నిన్ను గౌరవించుచుండలేదా? సత్పురుషులచే నమస్కరింపఁబడినదియు దురాలోచనముగలదియు నగు నాతల్లి కౌసల్య మనఃపూర్వకముగఁ బ్రేమతోఁ దన చెల్లెలివలె నిన్ను నాదరింపదా?

ఉ. ఆమహనీయపుత్రకుఁ గృ•తాత్మును నారలు గట్టఁజేయుచున్
భీమమహాటవీస్థలుల • నెట్టియు దుర్భగురాల! కొంచెమున్
నీమదిఁ గుందఁ జాలవ య•నింద్యచరిత్రుని శూరు సత్ప్రథున్
రాముఁ బ్రవాసిఁ జేసియు దు•రాత్మిక యేమిఫలంబుఁ గాంచెదే. ౧౮౪

అటువంటి మహాత్మురాలి కుమారుని, కృతాత్మునన్=సత్కారములందు దిట పడిన మనస్సుగలవానిని, భీమమహాటవీస్థలులన్=భయంకరమైన గొప్ప యడవులందు, నెట్టియు=బలాత్కారముగఁ బోవఁద్రోచియు, దుర్భగురాల = దరిద్రురాల శ్రీరాముని విడనాడునది పుణ్యమున దరిద్రురాలుగాక మఱియెవతె, ధన దారిద్ర్యము నింద్యముగాదు. గుణదారిద్ర్యము నింద్యము, అనింద్య చరిత్రునిన్ = శ్లాఘ్యమైన నడవడిగలవానిని, శూరున్=పరాక్రమము గలవానిని, సత్ప్రథున్ = గొప్పకీర్తిగలవానిని, ప్రవాసి=దేశాంతరవాసిని, దురాత్మిక=చెడ్డమనస్సుగలదానా ?

## తాత్పర్యము

అటువంటి మహానుభావురాలి కుమారుని ధర్మమునఁ బరిపక్వమైన మనస్సు గలవాని నారచీరలు గట్టునట్లుచేసి తలఁచుటకే భయంకరమైన పెద్ద యడవులందు బలాత్కారముగఁద్రోసియు దరిద్రురాలా కొంచెమైనను నీవు మనస్సునందైన వ్యసన పడలేకయున్నావు. శ్లాఘ్యశీలుని శూరుని సత్కీర్తిమంతుని శ్రీరాముని నూరు వెడలఁగొట్టి నీవు పొందఁబోవు పుణ్యలాభమేమికలదు.

కం. రామునియెడ నే నెట్టిఁడ, నై వెలఁగుట నీ వెఱుఁగ • నైతివి లుబ్ధా!
యీమహితానర్థము ధర, కీమాడ్కిం దెచ్చి పెట్టి•తీవు కులఘ్నీ. ౧౮౫

ఎట్టిఁడను=ఎట్టివాఁడను, లుబ్ధా=ధనాశగల పిసినీ, మహితానర్థము = గొప్ప కీడు, కులఘ్నీ=వంశనాశకురాలా ?

## తాత్పర్యము

శ్రీరాముని విషయమున నేనే భావముగలవాఁడనై చరించుట పిసినిగొట్టా నీవు తెలిసికొనలేక పోయితివి. ఓసీ వంశనాశకురాలా! నాకొకనికేకాదు. ఈభూమికి నీ వెంతకీడు గలిగించితివో యెఱుంగి లేవుగదా ?

ఉ. శూరకులాగ్రగణ్యులును • శుద్ధమనస్కులు రామలక్ష్మణుల్
దూరగులైన నేబలము•తో ధర నేలఁ గలాఁడ నింక నీ వ
మ్మేరువనంబుపొంతఁ గల•మేరువనం బన వారిప్రాపుచే
ధారుణి నేలు చుండెడి వసు•ధాపతి యాజి యనన్యభేద్యుఁ డై. ౧౮౬

శూరకులాగ్రగణ్యులును=శూరుల సమూహమునందు మొదట లెక్కింపఁ దగినవారు, శుద్ధమనస్కులు=నిర్మలమైన మనస్సుగలవారు, దూరగులైనన్=దూరమునందుండువారైరి లేని నేబలముతో నేనింత గొప్పరాజ్యమును భరింపఁగలను, అనన్యభేద్యుఁడై=ఇతరులకు భేదింపరానివాఁడై.

తా త్ప ర్య ము.

శూరుల సమూహములో మొదట నెన్నఁదగినవారును, నిర్మలమైన మనస్సు గలవారును నగు శ్రీరామలక్ష్మణులు దూరదేశవాసులు కాఁగా నేయిబలముతో నీ రాజ్యము నీ నగరము నింక నేను బాలింపఁగలను? స్వయముగ రాజ్యము రక్షించుకొను శక్తి చాలకున్నను మేరవు పొంతనున్నవనము గహనమైన మేరువుచే రక్షింపఁబడునట్లు రామలక్ష్మణుల సహాయమువలన దశరథుఁడు శత్రువులకు భేదింపరాని వాఁడై పాలించుచుండెను ఇప్పుడు వారి సహాయములేక నేనెట్లు పాలింపఁగలను.

తే. భూరివిక్రమశాలు లౌ • వారిచేతఁ, దాల్పఁబడయోగ్యమైనయీ • ధరణిభరము
నన్ను బోఁటికి శక్యమే • యెన్నిచూడ, నెద్దుబరువును లేఁగ దా • నెట్లు మోయు.

భూరివిక్రమశాలులు=విశేషపరాక్రమముచేఁ బ్రకాశించువారు, లేఁగ = లేఁతదూడ, దృష్టాంతాలంకారము.

తా త్ప ర్య ము.

విశేషపరాక్రమవంతులచేత ధరింపఁబడఁదగిన యీ భూభారమును నావంటి బాలుఁడు ధరింప నెట్లు సాధ్యమగును. పెద్ద యెఁబోతుకోడె మోయందగిన బరువును లేఁగ యెట్లు మోయఁగలదు.

ఉ. ఓపుదుఁ గాక బుద్ధిబల • యోగబలంబులచేత ధారుణిం
బ్రోవఁ బోషరింప, నల్లయినఁ • బుత్రకగర్ధినివై వసిదుబల్
పాపపుఁగోర్కిఁ దీర్పఁగను • బాల్పడ నోపుదునే? దురంతహృ
త్తాపముచేత మాఁదు మింక • దథ్యము నీ కిది శిక్ష రాక్షసీ. ౨౮

ఓపుదున్=సమర్థుఁడనగుదును, ప్రావు=రక్షణము, బుద్ధిబల = గ్రహణముధారణము మొదలగు నష్టాంగములతోఁ గూడిన బుద్ధిబలముచేతను, యోగబలంబుచేతను =సామదానభేద దండోపాయములచేతను, పుత్రకగర్ధినివి=ధర్మమువిడిచియైన పుత్రునకు లాభము గలిగింపవలయుననుటయే ముఖ్యముగాఁ బాటించుదానవు, పాపపుఁగోర్కి=పాపిష్ఠమైన యాశను, తీర్పఁగను=నెఱవేర్పఁగను, దురంత = అంతములేని, హృత్తాపముచేత=మనోవ్యథచేత, మాఁడుము=కాలిపొమ్ము.

తా త్ప ర్య ము.

దశరథుఁడనిన ముసలివాఁడు నీవు రాజకుమారుఁడవుకావా ? క్షత్రియవంశమునఁబుట్టలేదా? యౌవనవంతుఁడవుకావా? నీకేల యితరుల సహాయము. ఆలోచనలు చెప్పుటకు పనులుచేయుటకు మంత్రులు నధికారులు లేరా? నీవు పడుకష్టమేమియు నెదవు కాఁబోలు, బుద్ధిబలముచేత సామదానాద్యుపాయములచేత భూమి రక్షింప సమర్థుఁడనేయున్నాను,అయినను నీవు ధర్మముగాని యధర్మముగాని (చూ. ౩౮౦—వ ప) న్యాయ్యముగాని యన్యాయ్యముగాని పుణ్యముగాని పాపముగాని యేమార్గమునన నైనఁ బుత్రునకు ధనము సంపాదించి యియ్యవలయునను పాపిష్ఠమైన నీ యాశను

జక్కఁ జేయుటకు నేను బూనుకొనఁజాలను. కావున నీ సంకల్పము వ్యర్థముకాఁగా నాదురంత తాపముచేతనే మాడిపొమ్ము! నీ కదియే శిక్ష. వేఱుశిక్ష పనిలేదు.

ఉ. రాముఁడు నిన్నుఁ దల్లివలెఁ • బ్రత్యయబుద్ధిని జూచుచుంటచే
నేమియుఁ జేయ నిన్ను మది • నీయకొనం జుమి, గాకయున్న నిన్
బూమెలమారి! దూరముగఁ • బుచ్చి సుఖింపనె. యిట్టిబుద్ధి నీ
కే మని పుట్టెనే, చెనఁటి • హేయచరిత్ర సువంశపాంసనీ. ౨౯

ప్రత్యయబుద్ధిని=తల్లియను విశ్వాసముచేత, ఈయకొనంజుమి = అంగీకరింపను జుమా! బూమెలమారి=మోసస్వభావముగలదానా! హేయచరిత్ర = నిందింపఁదగిన నడవడిగలదానా!

### తా త్ప ర్య ము.

వ్యర్థసంకల్పవై యేడ్చుచుండుము. నీకిది శిక్షయంటివే నేను నీకు మేలు తలఁపఁగా దానికి బదులుగా నిదియా నీవు నాకుఁ జేయుమేలు అనెదవా? వినుము. అంత కెక్కువ శిక్ష చేయుటకు ననుకూలము లేమిని నిన్నింతతో విడువవలసి వచ్చినది. శ్రీరాముఁడు నిన్నుఁ దల్లియను విశ్వాసముతోఁ జూచుచుండు కారణముచే నేను నిన్ను వేఱువిధముగా దండించిన నాయనకుఁ గోపమువచ్చునేయని భయపడి యింతతో విడువవలసివచ్చినది. అటుగాకున్న నోసి మాయలమారీ! నీవు చేసిన మోసపుఁజేతలకు నిన్నూరనుండి దూరముగా వెడలఁగొట్టి హాయిగా సుఖింపనా? ఓసి దుష్టురాలా! నీచ చరిత్రా సద్వంశనాశకురాలా! నీ కేమని యిటువంటి పాపపు బుద్ధిపుట్టెనే?

ఉ. మాకులమందు జ్యేష్ఠుఁడు క్ష•మాధర మెల్ల ధరింప సోదరుల్
ప్రాకటభక్తిచే జనకు•భంగిని నాతనిఁ గొల్చు టొప్పు, న
స్తోకపుధర్మ మిా తెలుఁగు•దోఁపదొ నీ, కిది యెల్లరాజులున్
జేకొనుచుంద్రు, మాయెడ వి•శేషముగాఁ గొనియాడఁగాఁబడున్. ౩౦

క్షమాధరము=భూభారము, రాజ్యభారము పెద్దవాఁడే ధరింపవలయు ననుటకు, "జ్యేష్ఠఏవతు గృహ్ణీయాత్ పిత్ర్యం ధన మశేషతః । శేషా స్త ముపజీవేయు ర్యథైవ పితరంతథా॥" మనువు. చరిత్రం చరితంశీలం చారిత్రంచ సమం మతమ్మని హలాయుధుఁడు.

### తా త్ప ర్య ము.

మా వంశమునఁ బెద్దవాఁడు భూభారమును వహింపఁగాఁ దక్కిన సోదరులు చిన్నవాండ్రందఱు నాయనను దండ్రినివలె సేవింపఁదగును. ఇది గొప్ప ధర్మము. నీకేల యిది తోఁపలేదు. ఈధర్మము సమస్తరాజులు పాటింతురు. అందు మావంశమం దది విశేషముగా గౌరవింపఁబడును. మావంశమున దానికి భిన్నము రానేకూడదు

తే. అట్టి ధర్మైకరక్షుల • యనఘవంశ,సాధుచారిత్రశోభుల • శస్తచరిత
యుతుల మనియెడిపొగ రిప్డు•మట్టిఁగలసె, నీదుసంబంధమునఁ జేసి • నీచురాల.

ధర్మైకరక్షులన్=(1) ధర్మమే ప్రధానముగఁగొని రక్షించువారియొక్క (2) ధర్మమునే ముఖ్యముగా రక్షించువారియొక్క, చారిత్రశోభులన్ = పాపరహితమైన వంశముచేతను మంచినడవడిచేతను ప్రకాశించు మాయొక్క, శస్తచరితయుతులము= కీర్తింపఁబడిన శీలముతోఁ గూడినవారము రక్షుల, శోభుల యనియెడి షష్ఠ్యంతము లకుఁ "బొగరుతో" నన్వయము, శస్తచరితులము అనునది ఆపొగరు వివరణము,మట్టిఁ గలిసెన్=మట్టిపాలాయెను.

తాత్పర్యము.

ఓసీ నీచురాలా! యిదివఱకు మావంశమునఁ బుట్టినవారు ధర్మమునే ప్రధాన ముగ రక్షించుకొనువారు ధర్మమునే ప్రధానముగఁగొని లోకులఁ బాలించువారు ఏదోషములేని వంశమునఁ బుట్టినవారు మంచిచరిత్రముచేఁ బ్రకాశించువారు. ఇట్టి వారని మేము శ్లాఘ్యమైన నడవడిగలవారము. అనియెడి పొగరుండెను. నీతో సంబంధము చేసిన కారణముచే నా మాపొగరు మట్టిలోఁ గలిసెను.

కం. నీపుట్టినయింటను గోత్రాపాలురలోన శ్రేష్ఠు • ధరణీపతిఁగాఁ
జేపట్టరో నీతల నేఁలా పుట్టెనె యిట్టి చెనఁటి•యాశయమసతీ! ౧౮౩౨

గోత్రాపాలురు=భూమిని రక్షించువారు, రాజులు చేపట్టరె = అంగీకరింపరా, చెనఁట యాశయము=దుష్టమైన యభిప్రాయము.

తాత్పర్యము

పతివ్రతాధర్మ మెఱుఁగని పాపినీ! మావంశముమాట యటుండనిమ్ము, నీపుట్టి నింటి వంశముమాట చెప్పుము. నీపుట్టినయింటి రాజులలోఁ బెద్దవాఁడే రాజని యంగీకరింపరా ఇట్టిదుర్బుద్ధి నీతలయందే యేల క్రొత్తగా నెందులేనిది పుట్టెనే.

కం. నన్నుఁ జంపఁ జాలునంతటి ఘనతరదుఃఖంబు నీవు • గలిగించితి గా
వున నీయిష్టముఁ దీర్చెడి,పనికిన్ నేఁ బూనఁ జాలఁ • బాపచరిత్రా. ౧౮౩౩

తాత్పర్యము

ఓసి పాపాత్మురాలా! నన్నుఁ జంపఁజాలినంత దుఃఖము నీవు నాకుఁ గలిగించి నాతండ్రిని జంపినట్లే నన్నుఁజంపఁ జూచితివి. మాతండ్రి మోహావశమున నీమాయ మాటలకు లోఁబడి చచ్చెను, నేనును జావనైనఁ జచ్చెదనుగాని నీమాటలకు లో పడను. నీయిష్టము నెఱవేఱుపకున్నఁ జచ్చెదనని నాతండ్రితో నంటివిగదా (౩౮౧౫) నేను నీకోరిక నెఱవేర్పను. చచ్చెదవేని చావుము

కం. ఇష్టముఁ దీర్పను గాక యు,నిష్టంబును గూర్తు నిట్టి•నీ కిప్పుడె యా
శిష్టుని స్వజనప్రియు నో,దుష్టాత్మిక మరలఁ జేయు•దుం బురమునకున్. ౧౮౩౪

### తా త్ప ర్య ము.

ఓసీ దుష్టాత్మురాలా నీయిష్టము నెఱవేర్పకుండుటయేకాదు, నీయిష్టమునకు విరోధముగనుండు కార్యమును జేసెదను. ఏమిచేసెదవందువా, ఆ సాధువైన శ్రీరాముని స్వజనులయందుఁ బ్రియముగలవానిని పట్టణమునకు మరలి వచ్చునట్లు చేసెదను.

కం. కొనివచ్చుట కా దట కా,యనలప్రభు నేను సుస్థి*రాంతఃకరణం
బున దాసుఁడనై కొలిచెద, జనపతిఁగాఁ జేసి యతని*సమ్మద మారన్. ౧౫౩౫

### తా త్ప ర్య ము.

ఊరక తెచ్చుటమాత్రమేకాదు. అగ్నిప్రభకలిగిన యాయనసే రాజుగాఁ జేసి స్థిరమైన యంతఃకరణముతో నాయనకు దాసుఁడనై ఛత్రచామరాదుల సేవ చేయుచు నాయనకు సంతోషము గలిగింతును. ఇది నీవిఁక దీ కోపముతోఁ జేయు పనికాదు. కోపముతోఁ జేయుపని కోపముచల్లారిన నిలిచిపోవును. ఇది నాస్వరూప ప్రాప్తము గావున శాశ్వతముగా నుండును నా స్వరూపముచేతనే నే నాయనకు దాసుఁడను. ఇది నీవు తెలియక తాఱుమాఱుచేయఁ జూచితివి.

కం. ఇటు భరతుఁడు కటకటఁ బడి, కుటిలాత్మికఁ గైకఁ దిట్టి*కుతిలపడంగాఁ
బటుతరదుఃఖంబున నా,ర్భటు లొనరిచెఁ గందరస్థ*పారీంద్ర మనన్. ౧౫౩౬

* కుటిలాత్మన్=వంచనమనస్సుగలకైకను, కుతిలపడంగాన్ = బాధపడఁగా - ఆర్భటులు=పెద్దధ్వనులు, కంధరస్థ = గుహలోనుండు, పారీంద్రము = సింహము, గుహకు నింటికి నుపమానోపమేయములు. 'సింహః, కంఠీరవో, భీమ। విక్రాంతః కరిమ్యాచలః। పంచశిఖశ్చ కైలాటః పారీంద్రః శ్వేతపింగళః॥ త్రికాండశేషము.

### తా త్ప ర్య ము.

ఈ ప్రకారము నపహ్యాపడి వంచనమనస్సుగల కైకను బాధపడఁగాఁ దిట్టి మిక్కిలి దుఃఖముతోఁ గుహలోని సింహమువలె పెద్దధ్వని లొనరించెను.

## ౭౪-వ సర్గము

కం. అని పరుసము లాడియు నె,మ్మనమున నంతంత రేఁగు*మన్యూర్ధతి ని
ల్లనిరెను భరతుఁడు గైకం,గనుఁగొని రోషమున మేనఁ*గంపం బెత్తన్. ౧౫౩౭

దుర్వార్త వినఁగానే కలిగిన యల్పకోపముచే మృదువుగాఁ దల్లిని నింతవఱకు దూషించెను. ఆమెచేసినకార్య మాలోచించుకొలఁదిఁ ఘోరతరముగాఁ గానవచ్చుటచేఁ గోపము మఱింత వృద్ధికాఁగాఁ దీవ్రముగ దూషించుచున్నాఁడు. పరుసములు=నిష్ఠురములు, రేఁగు=విజృంభించు, మన్యూర్ధతిన్ = కోపాతిశయముచే- కంపము=వణఁకు.

తా త్ప ర్య ము

ఈప్రకారము కలిసి కొత్తలాడియుఁ దనమనస్సునఁ గైకచేసినకార్య మాలోచించుకొలఁది కోపమంతికంతకు హెచ్చఁగాఁ గైకనుజూచి దేహము వణఁకుచుండ నిట్లనియె.

కం. ఛీ ఛీ యీరాజ్యము విడి, పాపచరిత్రా నృశంస • బాలిశ యిటు ధ
ర్మాపాయము ఘటియించితి,వాపోవుము నేను దెగిన• వాఁడ నటంచున్. ౧౭౩౮

తా త్ప ర్య ము.

చెడునడవడిగలదానా ఛీఛీ నీతల్లివలె నీ వీ రాజ్యమువందుండ కడవులకుఁ బొమ్ము. క్రూరురాలా బుద్ధిలేనిదానా యిటువంటి ధర్మహానికార్యము చేసితివిగదా భార్యా భర్తృన్యాయము నీయందు లేదు కావున మగఁడు చచ్చెనని నీవేడ్చియుండవు నేను జచ్చితినని యేడువుము.

కం. భూరమణుఁడౌ పుణ్యుఁడు నీ, కారమణుఁడౌ తిట్టి రేమి • తత్పూర్వము నీ
కారణమున సురపురికి మ,హారణ్యములకు వార • లరుగఁగ నొకటన్. ౧౭౩౯

తత్పూర్వము=నీవిట్టి పాపకార్యము చేయుటకుముందు, మహారణ్యములకున్ =పెద్ద యడవులకు.

తా త్ప ర్య ము

(నీ కారణమున స్వర్గమున కొకరిని ఘోరారణ్యములకు నొకరిని నేకకాలమునఁ బంపితివే) రాజుగాని పుణ్యాత్ముఁడు శ్రీ సీతావిభుఁడుగాని (భరతుఁడు శ్రీ రాముని బుణ్యుఁడని చెప్పెనుగాని నిష్కారణముగా శ్రీరాము నడవికంపి పాప కార్యము చేయుటచేఁగాఁబోలు పుణ్యుఁడను విశేషణము దశరథునిపక్షమునఁ జెప్ప లేదు) నీవిట్లు దుష్కార్యము చేయుటకుముందు తిట్టిరా.

కం. కైకేయీ కూల్చుటచే, నీకులమును భ్రూణహత్య • యేఁప నిను నధో
లోకమున కరుగు నీకుం, జేకుఱదు సలోకసుఖము • సిద్ధము పతితోన్. ౧౭౪౦

భ్రూణహత్య=గర్భస్రావము చేసికొనుటవలనఁ గలిగెడు జీవహత్యాపాపము, భ్రూణోర్భకే స్త్రైణ గర్భే గర్భిణ్యాం శ్రోత్రియే ద్విజే" నానా. ర. గర్భము దించు కొను స్త్రీలు మహాఘోర నరకములకుఁబోయి యావల మఱుజన్మంబునఁ బశు పక్ష్యాది హీనయోనులందు జన్మింతురు. సలోకసుఖము=సాలోక్యసుఖము, పతివ్రత లైన స్త్రీలకుఁ బతితోడ సాలోక్యసుఖము గలుగును. ఇట్టిసుఖము పతిభక్తి లేని స్త్రీ లకుఁ గలుగదు.

తా త్ప ర్య ము

కైకేయీ! యీవంశమును గూలిపోవునట్లు చేయుటచే నిన్ను భ్రూణహత్య బాధింపఁగా నీ వధోలోకముల కరుగుము. నీకునీభర్తతో సాలోక్యసుఖము గలుగదు.

మ. తిర మూ క్రూరవుకొ త్తికోలు గలయీ• దృగ్ఘోరపాపక్రియా
చరణాసక్తను నిన్నుఁ గాంచినజగ• జ్జాతిప్రియుండైన శ్రీ

ధరణీజాపతి చెంత లేమి భయము ♦ ల్త్పాదిల్లెఁగా కక్కటా
ధరణీరాజ్యము నాకుఁ గల్గుటలు మి♦థ్యల్ దుష్టకష్టాత్మికా. ౧౭౪౧

తిరము=ఫలము కలుగువఱకు వదలనిది,ఎత్తికోలు=ప్రయత్నము, ఈదృక్ = ఇటువంటి, ఘోర = భయంకరమైన, పాపక్రియా=పాపకార్యములయొక్క, ఆచరణ =చేయుటయందు,ఆసక్తను=ఆసక్తిగలదానిని జగజ్జాతప్రియుండు = జగముల సమూహమునకుఁ బ్రియుఁడు. "బృందజాతో వ్రస్తు సద్వయోః" నానా.,ర. ధరణీజాపతి= శ్రీరాముఁడు, ఉత్పాదిల్లెన్=కలిగెను. మిథ్యలు=అసత్యములు, దుష్టకష్టాత్మికా = పాపపు నీచమనస్సుగలదానా.

## తా త్ప ర్య ము

దుష్టమైనది నీచమైనదియగు మనస్సుగలదానా. స్థిరమైన పట్టుదలతో నిర్దయమైన ప్రయత్నముగల యిటువంటి భయంకరమైన పాపకార్యము చేయుట యందు నాసక్తిగల నిన్నుఁజూచి లోకముల సమూహముల కన్నిటికిఁ (నీకుఁదప్ప) ప్రియుఁడైన సీతావిభుఁడు నాసమీపమున లేనికారణమున నాకు రాజ్యము వచ్చుటచే నేనేలుట యసత్యముగాని నీచేఁ జచ్చుట నిజమని భయము కలుగుచున్నది. వైధవ్యమునకును హత్యకు వెఱువక మగనిఁ జంపిన పాపాత్మురాలవు నీ యిష్టప్రకారము పోని నన్నుఁజంపుట యాశ్చర్యమా. నీయిష్టప్రకారము పోయితినా లోకనిందచే నధర్మముచేఁ జత్తును.

కం. మన్ని గొని నాదుజనకుని, నన్నం గానలకు నెట్టి ♦ యపయశమున్ నా
కీ న్నితిఁ దలఁగట్టితివే, యెన్నయమున జగతి శిరము♦నెత్తిచరింతున్. ౧౭౪౨

మన్నిగొని=చంపి- ఎన్నయమునన్=ఏన్యాయము ననుసరించి-

## తా త్ప ర్య ము.

సాతంత్రిని జంపితివి, నాయన్నను గానలకంపితివి. ఈరెంటికి నేను మూలకారణమని నాకు నపకీర్తి తలకుఁగట్టితివి. ఇఁక నలువురిలో నేమి న్యాయమెంచి తలయెత్తి తిరుగఁగలను.

ఉ. తల్లివి గావు నీవు, చెడు♦దాయవు నాకు, నృశంస కాముకా
చెల్లదు పల్క, నీమొగముఁ ♦ జెల్లదు చూడఁగ భర్తృఘాతినీ!
చెల్లరె రామమాతయుఁ సు♦శీల సుమిత్రయు లోనుగాఁగ నా
తల్లులు దుఃఖముం గనిరి ♦ తథ్యము నీ విటు దాపరించుటన్. ౧౭౪౩

దాయవు=పగదానవు, నృశంస=దయలేనిదానా,కాముక = ధనాశగలదానా, మైథునాశగలది కాముకి, భర్తృఘాతినీ=మగనిఁ జంపినదానా.

## తా త్ప ర్య ము

నీవు నాకుఁ దల్లివిగావు, కొడుకుల సుఖము కీర్తి కోరునది తల్లిగాని నీవలె దుఃఖము నపకీర్తి గలిగించునది తల్లియెట్లగును? చెడ్డపగదానవు. పగవారును చేయ

లేని కార్యము నీవుచేసితివి. పగవారు యుద్ధమునఁ గొట్టినఁ గొట్టఁగలరుగాని నీవలె వంశనాశమును వంశమునకు నాకు నపకీర్తిని వచ్చునట్లు చేయఁగలరా. ఇట్టిదానవు నీవు నాకుఁ దల్లివిగావు బంధువైనను నెట్లుకాఁగలవు! నీవు నృశంసవు కనుకనే శ్రీరామ లక్ష్మణుల నట్లు కష్టపడఁజేసితివి. కాముకవు కనుకనే మగనిని జంపితివి. ఇట్టినీతో మాటలాడరాదు.మాటలాడినఁ బాపమువచ్చును. పలుకకుండుటే కాదు నీముఖమైనను జూడరాదు. ఏలఁ? నీవు భర్తను జంపితివి గావున నీవిటు కొంపను దాపరించుటచే నిజముగా శ్రీరాముని తల్లియు లక్ష్మణుని తల్లియు మొదలయిన నా తల్లులందఱు చాల దుఃఖము పొందినవారైరి.

చం. అతులితధర్మశీలుఁ డగు • నశ్వపతిప్రభుపుత్రి వీవుగా
వతఁకులంబుఁ గూల్ప నుద • యంబయినట్టిపిశాచి వేలనన్
పతతసుధర్మనిష్ఠుఁ డగు • సత్యపరాక్రముఁ రాముఁ గానఁ ద్రో
చితివి దివంబుఁ జేర్చితివి • శోకము తద్వ్యథ నాదుతండ్రినిన్. ౧౪౪

అతులిత ధర్మశీలుఁడు=అసమానమైనధర్మస్వభావముగలవాఁడు, అశ్వపతి = కేకయరాజు, అశ్వపతియు జనకునంతటి కర్మయోగి. "జనకాదయో జనకాశ్వపతి ప్రభృతయు" అని శంకరభాష్యము భ. గీ. ౩-౨౦, పిశాచివి=అఁడు దయ్యమవు. పతత=ఎడఁదెగని, సుధర్మ=మంచిధర్మమందు. నిష్ఠుఁడు = నిష్ఠగలవాఁడు. సత్యపరాక్రమున్=సత్యమే బలముగాఁ గలవానిని, దివంబున్=స్వర్గమును,తద్వ్యథన్ = ఆ శోకముచే.

## తాత్పర్యము.

అసమాన ధర్మనిష్ఠుఁడగు కేకయరాజు కూఁతురవు నీవుకావు ఆయన కూఁతురవైన పక్షమున నాయనగుణము నీయందుండవలయును అటులయిన నేనవతె నందువా. ఆయనవంశమును నపకీర్తిచే నాశముచేయఁ బుట్టిన యాఁడు దయ్యమవు. నావలన నాతని వంశమునకేల యపకీర్తి యందువా. కేకయ వంశమునఁ బుట్టిన యాఁడుబిడ్డలా అట్లా మగనిని జంపుకైకలేయని యెవఁడును వారిని వివాహమాడ భయపడుదురు. పుట్టినింటివారికి నటువంటి యపకీర్తి తెచ్చి, మగని యింటివారికో యెల్లప్పుడు ధర్మమందే నిష్ఠగల పత్యపరాక్రము శ్రీరాము నడవులఁద్రోచి యా శోకమున నాతండ్రిని స్వర్గమున కంపితివి.

కం. లోకాప్రియ! నీకృతి నే, లోకములకుఁ జెడినవాఁడ • లుబ్ధా! భవద
ప్లోకాఘము న న్నంటుట, రాకాసీ! తల్లి వనిన • రావె కలుషముల్. ౧౪౫

లోకాప్రియా=ప్రజలకు నప్రియురాలా! నీకృతిన్=నీవుచేసిన కార్యమువలన, లుబ్ధా=పిసినీ, భవదప్లోకాఘము=నీగొప్పపాపము, రాకాసీ=రాక్షసీ శబ్దభవము రాకాసి, కలుషముల్ = పాపములు.

తాత్పర్యము.

ప్రజల కందఱకు నీ వప్రియమైన కార్యము చేసినదానవగుటచే లుబ్ధా నీ కారణమున నేను లోకములకు నప్రియుఁడనై చెడినవాఁడనే, తల్లివంటివాఁడే కొడుకు. ఈక్షోభమునకు మూలకారణమతఁడే తాను జాటుగనుండి తల్లిచే నీకార్యము చేయించెననికదా లోకులు తలఁతురు. ఆకారణమున నామేలెవరుఁ గోరుదురు. ఇటు వంటినిన్నుఁ దల్లియనిన బాపములురావా

తే. సన్నుతాచార నైనకౌ•సల్య నకట, సుతవియుక్తను జేసి యే•గతిని బడయ
నీవు గోరితివే సిరి • యెట్టిఘోర,నరకమునఁ బడుదానవో • దురితశీల. ౧౨౭

సన్నుతాచార=సత్పురుషులచే స్తోత్రముచేయఁబడు నాచారముగలది. సుత వియుక్తను=కొడుకు నెడఁబాసినదానిని.

తాత్పర్యము.

సత్పురుషులచే నుతింపఁబడు నాచారముగల కౌసల్యను గొడుకులేనిదానిగాఁ జేసి నీవెట్టులే సంపదనొందఁగోరితివి. పాపాత్మురాలా నీకు సంపదరాదు. అది యటుండ నరకము తప్పకవచ్చును.

ఆ. బంధుసంశ్రయుఁడు • పరమ ధర్మిష్ఠుండు, పెద్దవాఁడు తండ్రి • యుద్దివాఁడు
కోసలాత్మజాత•కొమరుఁ డన్నియతుని, నెఱుఁగ వట వ క్రూర• హేయచరిత.

క్రూరహేయచరిత=దయలేని నీచమైన నడవడిగలదానా, కౌసల్యకొడుకు, బంధుసంశ్రయుఁడు=చుట్టములకుఁ బ్రాపయినవాఁడు, పరమధర్మిష్ఠుఁడు=శ్రేష్ఠమగు ధర్మమందు నిష్ఠగలవాఁడు, అన్నియతుని= ఆ నియమవ్రతుని.

తాత్పర్యము

దయాహీనురాలా! నీచపు నడవడిగలదానా, కౌసల్యకొడుకు బంధువులకం దఱకుఁ బ్రాపయిన వాఁడని పరమ ధర్మాత్ముఁడని నాకుఁబెద్దవాఁడని తండ్రితో సమానుఁడని నీ వెఱుఁగవటవే! అతనికిఁ జేసిన కీడందఱకుఁ జేసినట్లుకదా.

కం. తన నంగ ప్రత్యంగజుఁ,డును హృదయాబ్జాతజాతుఁ•డును నగుపుత్రుం
డెనసిన ప్రేమను దల్లికి, ఘనతరుఁ డగు సుతునినాటి • గా రేబంధుల్. ౧౨౮

కడుపునఁబుట్టిన కుమారుని విడిచియుండుట తల్లిసహింపదని తెలుపుటకై అంగాదంగాత్సంభవసి యను శ్రుతి వాక్యము స్మరించి చెప్పుచున్నాఁడు.

అంగ ప్రత్యంగజుఁడును = అంగములవలనఁ బ్రత్యంగములవలనఁ బుట్టిన వాఁడు, అంగములు ముఖ కంఠ కుక్షి వక్షః పాదములు. ప్రత్యంగములు. నేత్ర నాసికాంగుళ్యాదులు. "అంగాదంగాత్సంభవసి హృదయా దధిజాయసే ఆత్మావై పుత్రనామాసి" యను శ్రుతియందున్న అంగాత్ + అంగాత్ అనిమొదటి రెండు పదములలో మొదటిపదమునకు ముందుచెప్పినట్లు ముఖాద్యంగములే యర్థము రెండవపదమునకుఁ బ్రత్యంగములని యర్థము. అంగప్రత్యంగ తేజస్సువలనఁ బుట్టి

టయే "అంగాదంగాత్సంభవసి" యనుదాని యర్థము. "యాదేతత్రేత స్తదే తత్సర్వే భ్యోంగే భ్య స్తే జస్సంభూతి" మనెడి శ్రుతి యీయర్థమునకుఁ బ్రమాణము. స్త్రీ దేహమున శోణితమే రేతస్సనఁబడును.

హృదయాబ్జజాతుఁడును=జీవాత్మస్థానమగు హృదయకమలమునుండి పుట్టిన వాఁడును, వీనికే యౌరసుఁడని పేరు. ఎనసినప్రేమన్ = అధికమగు ప్రేమచేత, ఘన తరుఁడు=మిక్కిలిగొప్ప వాఁడు, ఏబంధుల్=అన్నలు దమ్ములు లోనగువారు, వాని పాటి= పుత్రునితో సమానము పుత్రునివంటి ప్రేమపాత్రులుగారు. ఇతర బంధు వులు మితమైన ప్రేమకుఁ బాత్రులనిభావము. ఇంత యసమాన ప్రీతిపాత్రుఁడగు పుత్రుని పరుల బలాత్కారమున వదలుట తల్లికి నెంతదుఃఖకరముగా నుండునోయని భావము. కామధేనువు బంధువుల కష్టముఁజూచి సహింపలేక దుఃఖించినది. కౌసల్య పుత్రవిషయమున దుఃఖించె నన్న దానింగూర్చి యేమిచెప్పవలయు నని సూచించుటకై వాని పాటిగారే బంధుల్ అని చెప్పఁబడెను.

సీ. మున్నొక్కనాఁ డిల • దున్నుచుఁ దనసుతుల్, నాఁగటిమ్రాఁకుల • వ్రేఁగు కతన
మెడలు వ్రేలఁగవైచి • పుడమిఁ గూలినమట్ట,మధ్యాహ్నమునను ధ•ర్మజ్ఞసురభి
పుత్రశోకంబున • బోరనయేడ్చిన, నశ్రువుల్ క్రిందుగ • నరుగఁ చున్న
పురుహూతుపై పడఁ • బుణ్యగంధములైన,కన్నీళ్ళు సురభివి•గాఁ దలంచి

ఆ. శిరము మీఁది కెత్తి • పరికించి నభమున, నిలిచి యేడ్చు చున్న • నిర్జరగవి
యొద్దకేగి మిగుల • నుద్విగ్నుఁడగుచును, మోడ్పుఁగేలఁబలికె • మొదవుతోడ.
౧౭౯

తల్లికిఁ బుత్రశోకము దుస్సహమను విషయమునకు నొక్క యితిహాసము నుదాహరణముగ వివరించుచున్నాఁడు. వ్రేఁగు =భారము, ధర్మజ్ఞ = దున్నవలసిన దెంతకాలమో యను ధర్మము తెలిసినది, సురభి=కామధేనువు, అశ్రువుల్=కన్నీరు, పైపడు ననుదానితో నన్వయము, పురుహూతుపై పడ. పైపడు, చేపడు,లోపడు నను నవి తోపాటువలె నేకశబ్దంబులు. ఇవి షష్ఠ్యంత శబ్దంబులతోఁ జేరును. పుణ్యగంధ ములు = మంచివాసనగలవి, పరీక్షించి తద్భవముపరికించి, నభమునన్ = ఆకాశము నందు, నిర్జరగవి=దేవతలయావు, కామధేనువు, ఉద్విగ్నుఁడు = భయపడినవాఁడు, మోడ్పుఁగేలన్=అంజలితో, మొదవుతోడన్=ఆవుతో.

తాత్పర్యము

పూర్వమొకనాఁడు కామధేను వాకాశమునఁబోవుచు భూమిని దున్నుచున్న తనబిడ్డలగు నెద్దులు మట్టమధ్యాహ్నమందు నాఁగటికొయ్యల బరువుచే మెడలువ్రేల వైచి నేలఁగూలఁబడఁగా నెప్పుడెంతకాలము దున్నవచ్చును. ఎప్పుడు దున్నరాదు అనుధర్మము తెలిసినదగుటచే నాకామధేనువు పుత్రులకు వచ్చినకష్టముఁజూచి బోరున నేడుచుచుఁ గన్నీరుకార్పఁగా నవి క్రిందుగఁబోవుచున్న యింద్రునిమీఁదఁబడఁగా

నాయనలెలమెత్తి యాకాశమున నిలిచి యేడ్చుచున్న యాదేవతలగోవును జూచి యామెయొద్దకుఁబోయి మిగుల భయపడి చేతులు జోడించి యిట్లనెను.

కం. మాలో మెదలుచు జగముల, మేలుం దలపోయునీకు • మిడుకఁగ భయ మే
లీల ఘటించెను ల్లె మాచేఁ, గ్రాలదుగా నెందుభయవి•కారముగోవా! ౧౮౫౦

మెదలుచున్=తిరుగుచు, మిడుకఁగన్=దుఃఖింపఁగా, ఏలీలన్=ఏవిధముగా.

తాత్పర్యము.

మాలో నొకతెవై తిరుగుచు లోకముల మేలునాలోచించుచుండు నీకు వ్యసన పడఁ గారణమేమి కలిగెను! మావలన నీకేమి భయము కలుగలేదుకదా.

చం. సురపతి యిట్లు పల్కనను • జూచి సుపర్వులధేను వి ట్లనున్
హరి హరి మీనిమిత్తమున • నాపద లే దెపు డేని, దుస్థితిన్
వరలెడిపుత్రులం గన న•వారితశోకము వచ్చెఁ, గంటివే
ఖరకరతప్తదీనతను•కార్శ్యయుతంబుల నాదుబిడ్డలన్. ౧౮౫౧

సురపతి=ఇంద్రుఁడు, సుపర్వులధేనువు = దేవతలయావు, హరిహరి=ఇది వినరానిమాట విన్నప్పుడు పాపపరిహారము నిమిత్తము చెప్పెడుమాట, భగవన్నామ స్మరణము సర్వపాపములకు శాంతి, దుస్థితిన్ = చెడ్డదశచే, వరలెడి = తపించుచు, ఖరకర=సూర్యునిచే, తప్త=తపించునట్లు చేయఁబడిన, దీన=దుర్భములైన, తనుకార్శ్యయుతంబులన్=దేహముల చిక్కుటతోఁగూడినవి.

తాత్పర్యము

ఇంద్రుఁ డీప్రకార మడుగఁగా గామధేను వాయనతో నిట్లనియె. హరిహరీ యెంతపాపపుమాట యంటివయ్యా మీనిమిత్తముగ నాకెపుడు నాపదలేదు. భూమిమీఁదఁ గష్టదశప్రాపించి కృశించుచున్న కొడుకులఁ జూడఁగా శోక మాఁపరాక దుఃఖించితిని. తీక్ష్ణములైన సూర్యకిరణములచేఁ దపించి చాలినంత మేపులేమిచే దుర్బలములై కృశించిన దేహములుగల నాబిడ్డలఁ జూచితివా?

కం. బడుగులయి యొడిగిలఁబడఁ, గడు ముక్కులు మూసి మేను•గాల్చుచుఁ గోలన్
బొడుచుచుఁ దోఁకలు విఱుచుచు, బడియుల మోఁదుచునుగాసి•పఱచిరి కాఁపుల్. ౧౮౫౨

బడుగులు=శక్తిలేనివి, ఒడిగిలంబడన్ = మొండికివేసికొని లేవక నేలఁబడియుండఁగా.

తాత్పర్యము.

బలహీనములయి నాగంస్లిద్యలేక మొండికివేసికొని నేలపైఁబడఁగా గాఁపులు దయాహీనులై వానికి నూపిరాడకుండునట్లు ముక్కులు గట్టిగామూసియు; దేహములమీఁద వాఁతలువేసియు, ముల్లుకోలలతో నెత్తురుగాఱఁ బొడిచియుఁ, దోఁకలు విఱిచియు, దుడ్డుకఱ్ఱలచే బాదియు, నెట్లు కష్టపెట్టుచున్నారో చూడుము.

కం. పొడుముట నాకడుపున నీ, యిడుములఁ బడుచుంటఁ జూచి • యేమియుఁ జేయన్
వడి చాలమి నిటు వగచెదఁ, గొడుకుఁ గంటెనె నిష్టతముఁడు • కోమలి కున్నే. గూ౧౩

పొడముటన్=పుట్టుట చేత, ఇడుములన్=కష్టములను, వడి=శక్తి, వగచెదన్=ఏడ్చెదను ఇష్టతముఁడు=మిక్కిలి యిష్టుఁడు, కోమలికిన్=స్త్రీకి, ఉన్నే=ఉండునా, కలఁడా. లేఁడనిభావము.

తాత్పర్యము

నాకడుపునఁ బుట్టుటచే నివి యిట్లు కష్టపడుటఁజూచియు నేమిచేయుటకుశక్తి చాలక యీప్రకార మేడ్చుచున్నాను. పుత్రునకంటె నెక్కువ యిష్టబంధువు స్త్రీకిఁ గలఁడా.

కం. వేలకొలందులు బిడ్డలు, భూలోకమునందు నుండిఁ • బొగిలెడిసురభిన్
బాలోకిపతి గని వని, తాళికి సుతచయమె పరమ • మంచుఁ దలంచెన్. గూ౧౪

ఉండిన్=ఉండియును, పొగిలెడి=దుఃఖించెడి, పాలోకిపతి=ఇంద్రుఁడు, వని తాళికిన్ = స్త్రీలసముదాయమునకు, సుతచయమె=కొడుకులసమూహమె, పరము=శ్రేష్ఠము.

తాత్పర్యము.

వేలకొలందులు బిడ్డలు భూలోకమందుండియు నందేవొకొక్క కొన్ని కష్టపడుచున్నవని దుఃఖించు కామధేనువును జూచి యింద్రుఁడు స్త్రీలకు బరమేష్టుఁడు పుత్రుఁడేకదా యని తలఁచెను.

చం. అసమశుభప్రవృత్తము స•మస్తజగంబులఁ బ్రోచుకోర్కియున్
లసితసమృద్ధియున్ నిరత•లాలితసద్గుణ చక్రవాళ మీ
డ్యసహజశీలముం గలస•హస్రసుతాఢ్యము కామధేనువే
వ్యసనము నొంద రాము నెడఁ •బాసినకోసలకన్య నే మనన్. గూ౧౫

అసమ=సాటిలేనిదియు, శుభ = మేలుకలిగించునదియునగు; ప్రవృత్తము = గొప్పచరిత్రకలది. లసితసమృద్ధియున్=ప్రకాశించెడి సమృద్ధిగలది, ఎందునుగొఱఁత లేనిది, నిరత=అభిలాషకలజనులచేత, లాలిత=ఆదరింపఁబడిన, సద్గుణ = మంచిగుణములయొక్క, చక్రవాళము=సమూహము, ఈడ్య, శీలము=ఈడ్య=పొగడఁదగిన సహజ=స్వభావసిద్ధమైన, శీలము=నడవడిగలది, సహస్రసుతాఢ్యము = వేయికొడుకులచే సంపూర్ణమైనది. ఇచట సహస్రశబ్దము అనంతము అను నర్థమును దెలుపును.

తాత్పర్యము.

అసమానమై శుభకరమైనచర్యయు, జగముల నన్నిటిని రక్షించుకోర్కియుఁ బ్రకాశముగాఁ దెలియు సమృద్ధియుఁ బ్రేమగలవారిచే నాదరింపఁబడిన మంచిగుణముల సమూహము పొగడఁదగిన సహజమైన యాచారము వేలకొలఁది బిడ్డలఁగల

దియునగు కామధేనువే దుఃఖింపఁగా నొంటికొడుకునుగల కౌసల్య శ్రీరాము నెడఁ బాసి యేడ్చుట యేమివింత.

తే. ఏకసుత సాధ్వి కౌసల్య • హీనబుద్ధి, వైననీచే వివత్స నై • యడల నున్న
యట్టిపాపంబుచేత నో•గట్టివాయి, యుభయలోకంబులను దుఃఖ • మొందెదీవు. ౧౮౫

ఏకసుత=ఒంటికొడుకునుగలది, సాధ్వి=పతివ్రత, హీనబుద్ధివి = బుద్ధిలేనిదా నవు వివత్సనై=బిడ్డలేనిదై, గట్టివాయి = గట్టిగావదరు నోరుగలదానా, గయ్యాళీ.

తా త్ప ర్య ము.

ఒంటికొడుకునుగలది. పతివ్రతయగుటచే మగఁడుచేసిన కార్యమునకు బదులు చెప్పలేనిది (ఆమెదిక్కుండు నీవుండిన నీవు సహించియుండవని భావము) యగు కౌసల్య బుద్ధిలేని నీచే బిడ్డలేనిదై యేడువకుండునా? అట్టిలామెను దుఃఖపెట్టిన కారణముచే నోసి గయ్యాళీ! రెండులోకంబులను నీవు దుఃఖించెదవు.

మ. పని మాయన్నను దోడితెచ్చి, ధరణీ•సామ్రాజ్యధారేయుఁగా
వినయం బారఁగఁ జేసి, తత్పదములం • బెంపార సేవించి, యా
జనకానంతర కార్యముల్ సలిపి, నే • సత్కీర్తియుం బుణ్యవ
ర్ధనముం గూర్చెదఁ జూచు చుండు జలధా•రాపూర్ణనేత్రాంత వై. ౧౮౬

నిష్కారణముగా నీవు కౌసల్య నేడిపించితివిగదా. నిన్ను నే నేడ్పించెదను జూడు మనుచున్నాఁడు.

ధరణీసామ్రాజ్యధారేయుఁగాన్ = భూమిప్రభుత్వమును వహించువానిఁగా, జనకానంతర కార్యముల్=తండ్రికై చేయవలసిన పితృకార్యములను, పుణ్యవర్ధనము =పుణ్యాభివృద్ధి, జలధారాపూర్ణ నేత్రాంతవై = కన్నీటిజలధారలతో నిండిన కనుఁగొనలు గలదానవై.

తా త్ప ర్య ము.

మాయన్న శ్రీరామచంద్రుఁ డుండుచోటికిఁబోయి యాయనను బిలుచుకొనివచ్చి మిగుల వినయముతో భూమిప్రభుత్వమును వహింపఁజేసి యాయనపాదములఁ గొలిచి తండ్రికిఁజేయవలసిన పైతృక కార్యములుచేసి నీవు నాకు సంపాదించి యిచ్చిన యపకీర్తికి బదులు సత్కీర్తిని పాపమునకుమారు పుణ్యవృద్ధిని సంపాదించెదను. నీవిపత్తికి, శ్రీరామసంపత్తికి, నాప్రతిపత్తికి నీవు కన్నులనిండ నీళ్ళుపెట్టుకొని యేడ్చుచుఁ జూచుచుండుము. నీవు కౌసల్యకుఁ గలిగించిన దుఃఖ మెట్టిదో యప్పుడు నీకుఁ దెలియును.

కం. పిలుచుకొని వచ్చి రాముని, నిలుపుదు రాజ్యంబునందు • నిజముగ మఱి నేఁ
దలఁగక పోచ్చెద మునిజన,నిలయం బగుకాననంబు • నీవు కనంగన్. ౧౮౭

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి రాజయ్యేనేని కౌసల్య రాజమాతయని గౌరవింపఁబడునని సవతికి నిట్టిగౌరవము దగునా అట్టిగౌరవము నాకు రావలయునని కదా నీవు చేసిన యాలోచన :—నీ వేడ్చుచుఁ జూచుచుండఁగనే శ్రీరామునే రాజుగఁ జేసెదను. కౌసల్యకే రాజమాతయను గౌరవము కలిగించెదను. నీ కామ్రాత మేమువే కాదు అంతకు నెక్కువగ నిప్పుడు కౌసల్య యెట్లు లేడ్చుచున్నదో యట్లు నీవేడువఁ జేసెదను. ఏమి చేసెదవందువా? శ్రీరామునిఁ బిలుచుకొనివచ్చి రాజ్యమునందు నిలుపుటమాత్రమే కాదు నీవు చూచుచుండఁగనే యిప్పుడు శ్రీరాముఁడెట్లు ముని వేషముధరించి యడవులకుఁ బోయెనో యట్లు మునివేషముధరించి మునులుండెడి యడవులకు నేనుబోయెదను.

కం. కన్నులకోలుకుల మెదలెడి, కన్నీళ్ళులతోడుతన్ స•కలజనులు భృశా
పన్నులు కన నీచేసిన,యన్నిచపుఁ జేఁత శక్య • మానే సైఁపన్. ౧౭౯

తా త్ప ర్య ము.

నీకు రాజ్యము రావలయును. అది నీకు స్థిరపడవలయునని శ్రీరాముని నడవులకుఁ బొమ్మంటివి, నీకు రాజ్యమక్కఱలేదని పోనిమ్ము. నీ యిష్టప్రకారము శ్రీరామునకే యిచ్చుకో. నీవేలయడవులకుఁబోవలె? ఎవరు కోరను లేదు రాజుచెప్పను లేదుగద్గా యందువా? కన్నుల కొలుకులందు నీళ్ళుగాఱఁగాఁ బ్రజలేడ్చినది శ్రీరామునకు రాజ్యము లేకపోయెననికాదు. శ్రీరాముఁ డరణ్యములపాలై పోయెనని యేడ్చిరి. అట్లు లోకులందఱు నేడ్చునట్లుచేసిన నీ నీచపుఁ జేఁత నీవట్లు లేడ్చినఁగాని నేనెట్లు సహింపఁగలను. కావున నీవేడ్చుచుండవలయు నని పోయెదను.

కం. ఈయెడ నగ్నిని దూఁకుము, హా యని దండకను జొరుము • యురిపోఁతను వే
పాయుము ప్రాణము వే ఱొక ప్రాయశ్చిత్తంబు లేదు • పాపిని నీకున్. ౧౮౦

తా త్ప ర్య ము.

నీవు పుత్రశోకమున నేడ్చుశిక్ష నీకుఁజాలదు. అదియెప్పటికగునో, కావున నీవుచేసిన పాపమునకుఁ బ్రాయశ్చిత్తముగ నిప్పుడే యగ్నిలో దూఁకుము. హా యని యేడ్చుచు దండకలోఁ బ్రవేశింపుము. లేదా యురిపోసికొని చావుము. ఇట్టిది తప్ప నీకు వేఱొక ప్రాయశ్చిత్తములేదు.

చం. అడవుల కంచినట్టియఘ•లాఘము వాయఁగ రామచంద్రునిన్
గడువడిఁ దోడి తెచ్చి జన•కాండము లెంతయు సంతసింపఁగాఁ
బుడమికి రాజుఁ జేసి కడుఁ • బుణ్యుఁడ నయ్యెద, నంచు నేలపైఁ
బడి స్మృతిచేదితేఘ మునఁ • బా మన రోఁజుచు నుండెఁ గ్రుద్ధుఁడై. ౧౮౧

అతులాఘము=అసమానమైన పాపము, జనకాండములు=జనసమూహములు, సృణిచోదితేభము = అంకుశముచేఁ గొట్టఁబడిన యేనుఁగు, క్రుద్ధుఁడై = కోపము గలవాఁడై.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని వడవులకంపిన మహాపాపముపోవ నాయనను మరలఁ బిలుచుకొనివచ్చి జనసమూహము మిక్కిలి సంతోషించుచుండఁగా భూమికిరాజుఁ జేసి నేను బుణ్యుఁడనయ్యెదను. అని నేలపైఁబడి యంకుశముచేఁ గొట్టఁబడిన యేనుఁగువలెఁ గ్రుద్ధుఁడై రోఁజుచుండెను.

౭౫-వ సర్గము

చం. భరతుఁడు రక్తనేత్రుఁ డయి • పాఱఁగ నైచి విభూషణంబులన్
బరిశిథిలాంబరుం డగుచు • వ్రాలె మహోత్సవమందు వ్రాలు నా
సురపతికేతువో యనఁగ • జొక్కి యటుండియు వెండి లేచి ని
ష్ఠుర గతి దీన మాతదెసఁ • జూచి యమాత్యులతోడ నిట్లనెన్. ౧-౨

రక్తనేత్రుఁడయి=ఎఱ్ఱని కన్నులుగలవాఁడై - పరిశిథిలాంబరుండు = జాఱిపోవువస్త్రముగలవాఁడు - మహోత్సవమందున్ = ఉత్సవము కడపట - వ్రాలు = నేలఁబడు - సురపతికేతువో = ఇంద్రధ్వజమో - జొక్కి = మూర్ఛపోయి - నిష్ఠుర గతిన్ = పరుషవిధమున - అమాత్యులతోడన్ = భరతునిరాక విని యాయనను జూచుటకై వచ్చిన మంత్రులు అమాత్యులు మొదలగువారితో.

తాత్పర్యము.

భరతుఁడు రోషముచేఁ గన్నులెఱ్ఱచేసికొని శరీరముమీఁద ధరించిన సొమ్ముల నెల్లఁ బాఱవైచి కట్టువస్త్రము జాఱిపోవుచుండ నుత్సవము కడపట నేలఁబడు నింద్ర ధ్వజమువలె శోషపోయి నేలఁబడి కొంచెముసేపులో లేచి మొగము వ్రేలవైచుకొని యున్న కైకను బరుషపుఁ జూపులఁ జూచుచుఁ దన్నుఁజూడ వచ్చుటకువచ్చిన యమాత్యులతో నిట్లనెను.

ఉ. కోరినవాఁడఁ గాను సిరిఁ • గుత్సితయోజన సేయఁ దల్లినిం
బ్రేరణ సేయ, భూమిపస•మీక్షిత మానభిషేకవార్త నన్
జేరదు దూరదేశమునఁ • జిన్నసహోదరుతోడ నుంకుటన్
ధారిజేకన్య రాఘవులు • దండక కేగు టెఱుంగ నేమియున్. ౩

సిరి=శ్రీ-ఐశ్వర్యము. కుత్సితయోజన = దురాలోచన - ప్రేరణసేయన్ = ప్రేరించిన వాఁడనుగాను - భూమిపసమీక్షిత = రాజుచే సంకల్పింపఁబడిన - రాఘవులు=రామలక్ష్మణులు.

తాత్పర్యము.

అయ్యా యమాత్యులారా వాస్తవము చెప్పెద వినుఁడు. రాజ్యము నాకుఁ గావలయునని నేను గోరలేదు. అది లభించుటకై దురాలోచనసేయుఁ దల్లినినేను

ప్రేరింపనులేదు. రాజు సంకల్పించిన శ్రీరాముని పట్టాభిషేకవార్తయైనను నేను దూరదేశమునఁ దమ్మునితో నుండినకారణమున విన్నవాఁడనుగాను. శ్రీ సీతా రామ లక్ష్మణులు దండకారణ్యమునకుఁ బోవుటయు నేనెఱుంగను.

కం. అని పెద్దయెలుంగున రోఁదన మొనరించుటయును విని • ధ్వనిసడి గొని యి
ట్లనియె సుమిత్రకుఁ గోసల, తనయామణివింటి కైక • ధామమునందున్. ౧౭-౪

సడి=జాడ - ధామమునందున్=ఇంటియందు.

తా త్ప ర్య ము.

అని పెద్ద పెట్టున గొంతెత్తి యేడ్చుటయు విని ధ్వనిజాడఁబట్టి కౌసల్య సుమిత్రతోఁ గైకయింటియందు వింటివా యేడ్పుధ్వని.

—• భరతుఁడు కౌసల్యఁ జూడఁ బోవుట •—

ఉ. వచ్చినవాఁడు చూడ ఖల • వర్తన కైకసుతుండు దీర్ఘదృ
క్సచ్చరితుఁడు వానిఁ గనఁ • గా మదిగొల్పెడు నాదు దీననై
వచ్చుట కుద్యమించెను వి•వర్ణత గార్శ్యము దోపఁ బ్రాణముల్
వచ్చునొ పోవునో యనున • వస్థను దప్పుచుఁ దున్న చోటికిన్. ౧౭-౫

ఖలవర్తన=దుర్మార్గపు నడవడిగల-దీర్ఘదృక్సచ్చరితుండు = దూరాలోచనముగల మంచినడవడిగలవాఁడు - భరతుని విషయమున నిట్టి యభిప్రాయముగలది కావునఁ గైక చేసినపనిని భరతుఁడు సమ్మతింపఁడనియే కౌసల్య యభిప్రాయము. మది గొల్పెడున్ = మనస్సు పురికొల్పుచున్నది - వివర్ణతన్ = కాంతి మాఱుట చేతను - కార్శ్యము = దేహము కృశించుటయు - అవస్థను = దశయందు - ఉద్యమించెన్ = ప్రయత్నించెను - అసుతుఁడనుటచేఁ గౌసల్యకు భరతునియందు సవతి కొడుకను భేదభావము లేదని తెలియుచున్నది.

తే. భరతశత్రుఘ్నులంత నా•పరమసాధ్వి, యున్న యింటికిఁ బోయి తా•రుల్లమగల
శోకవేగంబునను ధర•సోలి యున్న,యంబ నాలింగనము చేసి•యడల సతియు. ౧౭-౬

పరమసాధ్వి=ఉత్తమ పతివ్రత-ఉల్లము = మనస్సు; అగలన్ = భేదిల్లఁగా, సోల=మూర్ఛపోయి, అడలన్=దుఃఖింపఁగా.

తా త్ప ర్య ము.

ఇట్లు కైకతో ముచ్చటలాడిన తరువాత భరత శత్రుఘ్నులు పెద్దలు పుణ్యస్త్రీ పురుషులున్న చోటికిఁ దామేపోవలయునుగాని తమనిమిత్తమై వారు వచ్చునట్లు చేయరాదను ధర్మము స్మరించి తల్లియగుటయేగాక యుత్తమ పతివ్రతయుఁగావునఁ గౌసల్యయున్న యింటికిఁ దామేపోయి దుఃఖముచే గుండెలు ప్రేలి దేహము తెలియక నేలఁబడియున్న యా యమ్మను గౌఁగిలించి దుఃఖింపఁగా నా యిల్లాలును.

చం. భరతునిఁ జూచి యిట్లు లనెఁ • ప్రాజ్య మకంటక రాజ్యమెల్లనో
భరతుఁడ! నీకు నీవలచు•భంగి లభించెఁగదా క్షణంబులో
ఖరతరకార్యశీల యగు•కైకకతంబున; నింక నొమ్ములన్
గర మిడి నిద్రపొందు కృత•కార్యధురీణుల రీవు తల్లియున్. ౧౯౭

ప్రాజ్యము = విస్తారమైనది-అకంటకము = ముండ్లవలె బాధించు శత్రువులు లేనిది- వలచుభంగి = కోరిన విధముగ, ఖరతర = మిక్కిలి కఠినమైన, కార్యశీల = కార్యముచేయు స్వభావముగలది, కతంబునన్ = కారణముగా - కృతకార్యధురీణులగు నెఱవేర్పఁబడిన కార్యభారముగలవారు - ధురీణలరు = ఏకశేషకావున పుల్లింగరూపము ఒమ్ములపైఁ గరమిడి. నిద్రపొందు = ఇది సాభిల విచారములేక హాయిగా నిద్రింపుఁడు.

తా త్ప ర్య ము.

భరతునిఁజూచి యిట్లుపలికెను. విస్తారమై బాధించువారులేనిదైన రాజ్యమంతయు నీవు కోరినట్లు భరతా నీకు మిక్కిలి క్రూరమగు కార్యముచేయు స్వభావముగల నీతల్లి కారణము నన్ని నల్పకాలములో లభించెఁగదా. కార్యభారము నెఱవేర్చుకొంటివి కావున నీవు నీతల్లియింక నొమ్ములపై జేతులుంచుకొని విచారము మాని హాయిగా నిద్రపొందుడు.

ఉ. కట్టఁగఁ బంచి నాసుతునిఁ • గర్కశచీరములన్ వనంబులన్
నెట్టఁగ నేమి వారుకొనె•నీజనయిత్రి నృశంసతామతిన్,
గట్టిఁడి పంపుచున్న ననుఁ • గాఱడవిం బడ, నట్టులైన నా
పట్టి హిరణ్యనాభు నెడఁ•బాయకకూడి సుఖించి యుండుదున్. ౧౯౮

కర్కశ చీరములన్ = కఠినములైన నారచీరలను, నృశంసతామతిన్ = క్రూరపు మనస్సుతో- కట్టిఁడి = కట్టు+ఇఁడి, కట్టులకు లోపడియుండనిది. మర్యాదాహీనురాలు. హిరణ్యనాభున్ = బంగారువలె నింపైన బొడ్డుగలవానిని. బహువ్రీహిని నాభి అకారాంతమగును. నాభిశబ్ద మిచ్చట దేహమున కుపలక్షణము మనోహరమైన శరీరముగలవాఁడని భావము. "హిరణ్మయవపుః ధృతశంఖచక్రః" "హిరణ్య కేశ హిరణ్యశ్మశ్రుః" వను శ్రుతి వాక్యములు స్మరించునది. పట్టిన్ = కుమారుని.

తా త్ప ర్య ము.

క్రూరమగు మనస్సుగల నీ తల్లి నా కొడుకును గఠినములైన నారచీరలు కట్టఁజేసి యడవులకుఁబంపి యేమిలాభము సంపాదించెను. రాజ్యలాభము నీ పట్టాభిషేకముతోనే వచ్చెను. శ్రీరాముఁడు దండకకుఁ బోవుటచే వచ్చిన లాభమేమి? మర్యాదాహీనురా లప్పుడే శ్రీరామునితోడఁ గౌసల్యను నడవికిఁ బంపుమని మగనిఁ గోరి యుండరాదా. అప్పుడు గాకున్న నిప్పుడు రాజ్యమంతయుఁ దనదే కావున

నిప్పుడు పంపకుందునా యేమి! అవశ్యము పంపుదు. అట్లైన నేను నాకొడుకు హిరణ్యనాభునితోడ సుఖముగా నుందునే.

ఉ. అంపఁగ నేల నేని వసు•ధాధిపునగ్నులతో సుమిత్రతో
నింపుగ రాముఁడున్న యెడ•కేగెద నాతఁడ సంస్కరించుఁ బా
లింపుము నీవ మాతృకమ•లీమసతార్జితధాన్యవిత్తగో
సంపదిభాశ్వపూర్ణము ర•సాస్థలి నీసరి లేనిరాజ వై. ౧౪౮

మాతృక = తల్లియొక్క - మలీమసతా = క్రూరకార్యముచేత, అర్జిత = సంపాదింపఁబడిన - ధాన్య = ధాన్యములచేతను - విత్త = ధనముచేతను - గో = ఆవులచేతను - సంపత్ = సంపదచేతను - ఇభ = ఏనుఁగులచేతను - అశ్వ= గుఱ్ఱములచేతను - పూర్ణము=నిండినది - రసాస్థలి=భూప్రదేశము.

తా త్ప ర్య ము.

కైక పొమ్మనుటకు నేనేల కాచుకొనియుండవలెను. మగఁడు లేని దానికి దిక్కు కొడుకేకదా. నాకొడుకుదగ్గఱకు నేను బోవుటకు నా కొకరిసమ్మతమేల? కావున మీ తండ్రి నిత్యము వేల్చు నగ్నిహోత్రము పెద్దభార్యనగు నా స్వాధీనమందే కదాయున్నది. దానితోనేగదా రాజునకు సంస్కారము కావలసియున్నది. నీవు తనకు సంస్కారము చేయఁగూడదని నీతండ్రి చెప్పెనుగదా. (ప. ౧౧౭౩) నీ తల్లినిగూడ వదలెదనని నీవు నాకు భార్యవు గావని రాజే చెప్పెఁగదా. కావున రాజునకు సంస్కారముచేయు నధికారము నీకు లేదుగదా. ఈ కారణముచేత నగ్నిహోత్రము దీసికొని నేను సుమిత్ర యిరువురము శ్రీరాముఁడున్నచోటికిఁ బోవుదుము. చేయువలసిన సంస్కారములన్నియు శ్రీరాముఁడే చేయును. నీవో కుత్సిత వ్యాపారముచే నీ తల్లి సంపాదించి యిచ్చిన ధనధాన్యవిత్తకోశములచేతను గోవులచేతను గుఱ్ఱములు నేనుఁగులు మొదలగు వానిచేతను నిండిన భూమియంతయు నాసరి రా జెవఁడురా యని చెప్పుకొనుచుఁ బాలింపుము.

దశరథుని యగ్నిహోత్రములతోఁ గౌసల్య తాను శ్రీరామచంద్రమూర్తి యున్నచోటికిఁ బోనెదను. ఆయనయే తండ్రి కుత్తరక్రియలు నెఱవేర్చునని చెప్పెనుగదా. ఇట్లామె చేయవచ్చునా? తండ్రి కుత్తరక్రియలు కొడుకులలో నెవరైనఁ జేయవచ్చునుగాని సమీపమందు లేని కొడుకు వచ్చువఱకు సమీపమందుండువారు చేయరాదని శాస్త్రములేదు. ఎవఁడు సమీపమందున్నాఁడో వాఁడే చేయువలయును. నిత్యాగ్నిహోత్రముతోఁ బ్రేతసంస్కారము జరుగవలయును గాని, యితరాగ్నితోఁ జేయరాదు. అట్లుండ నే నగ్నిహోత్రమును దీసికొనిపోయెద ననవచ్చునా! అదియునుగాక దశరథున కామెయొక్కతెయే భార్యగాదు. సుమిత్రా కైకేయులున్నారు. వీరు క్షత్రియస్త్రీలుగా లేని యప్పుడు పెద్దభార్యయగు క్షత్రియస్త్రీ కధికారము, అట్లులును లేదు. కావున దశరథునకుఁ గౌసల్య యొట్టిభార్యయో

తక్కిన యిరువురు నట్టివారే. యజ్ఞము చేసినపుడు ముగ్గురు భార్యల నుంచుకొని చేసెనుగాని కౌసల్య నొక్కతెనే యుంచుకొని చేయలేదు. కావునఁ నగ్నిహోత్ర మందు ముగ్గురి కధికారము గలదు కావునఁ గైకసమ్మతిలేక యెట్లగ్నిహోత్రమును గౌసల్య తీసికొనిపోఁగలదు.

సమాధానము. కౌసల్య యాలోచింపక నిష్కారణముగఁ జెప్పలేదు. ఎందఱు భార్యలుండినను అగ్నిహోత్రరక్షణాధికారము పెద్ద భార్యకేకాని యిత రులది కాదు. జ్యేష్ఠభార్యతోడ నగ్నిహోత్రము వచ్చును. "జ్యేష్ఠాచే దగ్ని సంయుక్తాహ్యన్యాగచ్ఛే ద్యథాసుఖమ్." కావునఁ గైక కధికారములేదు. అది యునుగాక.

గీ. కేవలార్థ పరవు క్లిష్టధర్మవు నీవు, గాన నగ్ని సాక్షికముగఁ గొనిన
  తావకీన కరముఁ దద్దయు విడిచితి, నింక నూర్ధ్వలోకమందుఁగూడ.

అయో. ౧౧౭౩.

అను దశరథునివాక్యము చొప్పునఁ గైకయిపుడు తాను దశరథుని భార్యయని చెప్పుకొను నధికారముకూడ లేదు. అట్లైన భరతునిఁగూడ వదలిపెట్టెఁగదా యనిన భరతుఁడు కైక యిష్టముచొప్పున వర్తించి శ్రీరామచంద్రమూర్తికి రాజ్యము లేకుండఁజేసె నేని యతఁడును దనకుత్తరక్రియలు చేయరాదని చెప్పెను.

కం. భరతుండీరాజ్యముఁ గొని, మురియుట గలిగినను వాఁడు మొగిని నివా పా
  చరణం బొనురుపఁ దండ్రికిఁ, బరగతి నవి నాకుఁ గాక పరఁగుత మనుచున్॥

అని కదా చెప్పెను. కైకకుట్రలో భరతుఁడు చేరలేదు. కావున భరతున కుత్తర క్రియలు చేయునధికారము గలదు. భరతుఁడు శపథముచేసి తన యభి ప్రాయమును దెలుపకముందు కౌసల్య తా నగ్నిహోత్రములతో శ్రీరామచంద్ర మూర్తి యున్నచోటికిఁ బోయెద ననెను. కావున నామె యిట్లనుట తప్పుగాదు.

—• భరతుఁడు కౌసల్యతో శపథంబులు సేయుట •—

కం. అని పరుసంబులు పలికిన, విని పుండున సూది గ్రుచ్చు•విధనైనను దుః
  ఖనిహతిని గ్రిక్కె భరతుఁడు, వనితామణిపాదములను•వాలినమూర్ఛన్. ౧౭౦

పరుషంబులు=కఠినవాక్యములు పుండునసూది గ్రుచ్చినట్లు కైకేయి చేసినది హృదయమున పుండు. కౌసల్యమాటలు దానిలోఁ గ్రుచ్చినసూదులు.

౧౬౯వ పద్యములో భరతునివిషయమున సదభిప్రాయము సూచించిన కౌసల్య యిప్పుడేల యిట్లు పరుషము లాడెనని సందేహము దోఁపవచ్చును. ఇది దోషి యని నిశ్చయించి యనిన మాటలుకావు. ఆయన మనస్సు తెలిసికోవలె నని యనిన మాటలు. తరచినఁగదా తెన్నపడును.

తా త్ప ర్య ము

అని కఠినవాక్యములు కౌసల్య చెప్పఁగా విని పుండులో సూదిగ్రుచ్చినట్లు మఱింత బాధ కలుగఁగా దుఃఖముచేఁ గౌసల్యపాదములపై మూర్ఛపోయి పడెను.

శా. ఒల్లంబోయి యొకింత తెలి వినయం • బొప్పారఁ జేమోడ్పుతోఁ
దల్లీ! యేటికి నిందలాడెదవు; క్రో • శ్తా నీకు శ్రీరాముపైఁ
బెల్లైనాస్థిరభక్తి! నే నెఱుఁగ నే • వృత్తాంత మేపాపమున్
గల్లల్ గావివి. యంత ద్రోహి నొకో యు • న్నం గానలం ద్రోయఁగన్. ౧౮౭౧
ఒల్లంబోయి=మూర్ఛపోయి.

తా త్ప ర్య ము.

మూర్ఛపోయి కొంచెము తెప్పరిల్లుకొని లేచి వినయముతోఁ జేతులు మొగిడ్చి యిట్లనియె. తల్లీ! యేల నన్నుఁ దేరకు నిందించెదవు. శ్రీరాముపై నాకు నెట్టి స్థిరభక్తి గలదో యది నీ వెఱుంగవి క్రొత్తవిషయమా. ఇక్కడి పట్టాభిషేక విషయముగాని యది నా తల్లి విఘ్నముచేసి శ్రీరాముని నడవులకుఁ బంపిన పాపపుఁ జరిత్రగాని నేనేదియు నెఱుఁగను. ఇది యసత్యముగాదు. అన్నను గానలపాలు సేయునంతటి పాపినా.

ఉ. రామునిపోక కొప్పిన • దురాత్ముఁడు శాస్త్రసులబ్ధమైన ప్ర
జ్ఞామహిమంబుఁ బాయుత, నృ • శంసజనంబులఁ గొల్చుఁ గాత, దు
ష్కృముషీ మహాసర్జన మ • శీతకరాభిముఖంబు సేయునా
పామరుఁ డేగుదుర్గతుల • పా లయి పోవుత ధర్మతత్పరా. ౧౮౭౨

భరతుఁడు తనయందు దోషము లేదనుటకుఁ బ్రమాణములు చేయుచున్నాఁడు, ఇవన్నియు నెవ్వనికో యన్వయించునట్లు చెప్పఁబడిఁను 'నిర్విశేషం వసామాన్య' మను న్యాయమున భరతునందే యన్వయింపవలెను. నేను శ్రీరాముని కానల ప్రయాణము సమ్మతించియుండిన నాకు నీ పాపాత్ములకుఁ గలుగు దుర్గతులు గలుగునుగాక యని భావము. కైకకుఁ దగిలినను దగులవచ్చును.

ఇందు భరతుఁడు తనకు శాస్త్రజ్ఞానములేక పోవునుగాక యని శపథము చేసెను.

శ్లో॥ యః ప్రవృత్తిం శ్రుతిం సమ్యక్ శాస్త్రంవా మునిభిః కృతమ్
దూషయ త్యనభిజ్ఞాయ, తం విద్యా ద్బ్రహ్మఘాతుకమ్॥

శ్రుతిజ్ఞానముగాని స్మృతి జ్ఞానముగాని లేక యా శ్రుతితప్పు యీ స్మృతి తప్పని యెవఁడనునో వాఁడు బ్రహ్మహత్యచేసినవాఁడే. భార - అను.

శాస్త్రజ్ఞానములేక దానిని దూషించువాఁడు, భగవంతుని దూషించువాఁడే యగును.

శ్లో॥ ప్రకాశయితు మాత్మానం, భక్తానాం హితకామ్యయా
అవతీర్ణో జగన్నాథః, శాస్త్రరూపేణ వై ప్రభుః
తస్మాచ్ఛాస్త్రే౽నువృత్తిః కార్యా, భక్తిర్మోక్ష పరాయణైః
అభక్తస్య పరేశాస్త్రే, భగవాన్న ప్రసీదతి
శ్రవణం శ్రావణంచింతా । తదర్థే తస్య సంగ్రహః ।
చోదితానా మనుష్ఠానాం । శాస్త్ర భక్తస్యలక్షణమ్॥

భక్తుల మేలుగోరి తన్నుఁ బ్రకాశింపఁ జేయుటకు భగవంతుఁడు శాస్త్ర రూపమున నవతరించెను. కావున మోక్షమం దాసక్తిగలవారు శాస్త్రమందు భక్తి గలవారై యుండవలయును. శాస్త్రమందు భక్తిలేనివారు భగవంతునియందు భక్తి లేనివారే. కావున వారి విషయమున భగవంతుఁడు ప్రసన్నుఁడుగాఁడు. శాస్త్రము నందలి విషయములు వినుట వినిపించుట మననముచేయుట దాని నిమిత్తమై దానిని సంగ్రహించుట శాస్త్రము చెప్పినట్లు నడచుకొనుట యివి శాస్త్రభక్తుని లక్షణ ములు. "శ్రుతి స్మృతిర్మమైవాజ్ఞా" యని యుండుటచేఁ దన యాజ్ఞ మీఱి వర్తించు వారి విషయమునఁ బ్రభువెట్లు ప్రసన్నుఁడగును? ఇఁక దూషించువాని గతి యేమి?

తామసానాం విమూఢానాం, పతితానాం భవార్ణవే
విపరీతంచ సకలం, ధర్మజ్ఞానం ప్రకాశతే.

తామసులకు మూఢులకు సంసార సముద్రమున మునిఁగి యుండువారికిఁ బసిరికలు గలవానికి వస్తువులవలె ధర్మజ్ఞానము విపరీతముగాఁ బ్రకాశించును.

సూర్యునకెదురుగా మూత్రము విడుచుటకూడదు.

ప్రత్యాదిత్యం, ప్రత్యనలం, ప్రతిగాశ్చ ప్రతిద్విజమ్
యే మూత్రయంతి పథిచ, తే భవంతి గతాయుషః పరాశరుఁడు.

సూర్యునకు- అగ్నికి- గోవునకు బ్రాహ్మణునకు నెదుటను బాటసరుమును మూత్రము విడుచువాని యాయువు క్షీణించును. (చూ. మనుస్మృతి-౪-౪౮-౫౨)

ఈ పద్యము మొదలు కవి భరతుని శపథము నెపంబునఁ బాపకార్యముల నెఱిఁగించుచున్నాఁడు.

నృశంస జనంబులన్ = క్రూరజనముల - దుశ్శేముషి = చెడుబుద్ధి, మేహ సర్జనము = మలమూత్రముల విడుచుట - అశీతకరాభిముఖంబు = సూర్యున కెదు రుగాఁదిరిగి- దుర్గతులన్ = నరకముల.

శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవ సమ్మతించిన దుష్టమనస్సుగలవాఁడు గురు ముఖమున శాస్త్రము చదువుటవలనఁ జక్కఁగా లభించిన బుద్ధివిశేషము పోయిన వాఁడగునుగాక. (సత్పురుషుని యెడఁ జేసిన యపరాధము శాస్త్ర జన్యజ్ఞానమున

నాశముచేయు నని భావము) క్రూరజనుల సేవించుచుండుగాక. బుద్ధి హీనుఁడై సూర్యున కెదురుగాఁదిరిగి మల మూత్రములు విడుచునట్టి మందుఁడు పోవు నరకములపాలై పోవునుగాక.

ఉ. హామికఁ సుప్తధేనువు ని • జాంఘ్రితలంబులఁ దన్ను వానికిన్
 ప్రేమ యొసంగి నట్లు ఘన • కృత్యము లెల్లను జేయఁ బంచి తా
 నేమియు నీయ కూరకయ • భృత్యునిఁ బంచెడివాని కేగతుల్
 రామునిపోఁ గొల్పిన దు • రాత్మున కాగతు లబ్బుఁ దల్లిరో. ౧౮౭౩

హామికన్ = అహంకారముచే-సుప్తధేనువు = నిద్రించు గోవును, నిజాంఘ్రితలంబులన్=తనకాళ్ళతో-ఘనకృత్యములు=గొప్పకార్యములు.

దేవతానాం రాజ్ఞశ్చ బ్రాహ్మణస్య గోరితి పదోపస్పర్శనం వర్జయేత్తని ఆపస్తంబులు.

దేవతా విగ్రహములనుగాని రాజునుగాని బ్రాహ్మణుఁగాని గోవునుగాని కాలిచేఁ దాఁకరాదు.

తా త్ప ర్య ము.

పండుకొనియున్నయావును గాలితోఁదన్నువాఁ డేగతులకుఁ బోవునో ప్రేమ గలవానివలెనే నటించి భృత్యునిచే గొప్పపనులు చేయించి యేమియుఁ బ్రతిఫల మియ్యనివాఁ డేగతికిఁ బోవునో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవ సమ్మతించిన యాదుర్మార్గునకు లభించుగతులు నాకు లభించును గాక-

ఉ. ప్రేమను భూతజాలముల • బిడ్డలఁబోలెను సాఁకు నట్టి యా
 భూమిపుపట్ల ద్రోహమతిఁ • బూనెడివానికి, షష్ఠభాగమున్
 నేమముఁబన్ను లాగి యవ • నిం దయఁ బ్రోవనివాని, కేగతుల్
 రామునిపోఁ గొల్పిన దు • రాత్మున కాగతు లబ్బుఁ దల్లిరో. ౧౮౭౪

తా త్ప ర్య ము.

లోకుల నందఱను దనబిడ్డలవలె రక్షించురాజునెడ ద్రోహముదలంచువాని కేగతులు గల్గునో ఆఱవభాగము పన్నుతీసికొని ప్రజలను రక్షింపనిరా జేగతులకుఁ బోవునో యాగతులు శ్రీరాముని యరణ్యావాసము నే నంగీకరించియుంటినేని నాకుఁ గలుగునుగాక.

తన్నుఁబోషించు కరుణగల ప్రభువునకు ద్రోహమొంచువాఁడు క్రోఁతిగఁ బుట్టును.

భర్తృపిండాను పశ్నన్ యో । రాజ ద్విష్టానిసేవతే
సోపి మోహసమాపన్నో, మృగోజాయతే వానరః, భారత-అనుశా.

ప్రజలవలనఁ బన్నుదీసికొని వారి రక్షింపని రాజు వారి పాపములనెల్ల ననుభవించును.

అరక్షితారం రాజానాం, । బలిషడ్భాగహారిణమ్
తమాహు స్సర్వలోకస్య । సమగ్రమల హారకమ్- మను.

ఉ. సామములోడ మున్న తన • సత్రమునం దొగి వర్ణదక్షిణన్
గామము దీర నింత యొసఁ • గం గలవాఁడ నటంచుఁ బల్కి- తా
నామఖ మైన వంచనము • లాడెడియాతఁడు పోవుదుర్గతిన్
రాముని పోక కొప్పిన దు • రాత్ముఁడు పోవుట గల్గుఁ దల్లిరో. ౧౮౭౯

తా త్ప ర్య ము.

తాను జేయు యజ్ఞమునందు ముందుగా మంచిమాటలతో నింతదక్షిణ నిచ్చెద నని చెప్పి మాటనిష్కర్ష చేసికొని యజ్ఞమైన పిమ్మట మోసపు మాటలాడి దక్షిణ లీయనివాఁ డేగతికిఁబోవునో శ్రీరాముని పోక కొప్పిన పాపియు నాగతికిఁ బోవునుగాక.

ఉ. సామజఘోటకప్రకర • సంకులశస్త్రసమాకులోగ్రసం
గ్రామమునందుఁ బాఱెడిధ • రాపతికిన్, గురుదిష్టతత్త్వమున్
సోమరి యై మది న్మఱచు • తుంటున కేగతి గల్గు నందురో
రాముని పోక కొప్పిన దు • రాత్మున కాగతి గల్గుఁ దల్లిరో. ౧౮౮౦

సామజ=ఏనుఁగులయొక్క, ఘోటక = గుఱ్ఱములయొక్క, ప్రకర=సమూహములచే, సంకుల=నిండినట్టియు, శస్త్రసమాకుల = ఆయుధములచే నిండినదియునగు సంగ్రామమునందున్=యుద్ధమునందు, పాఱెడి=పిఱికియై పరువెత్తెడి, ధరాపతికిన్ = రాజునకు, గురుదిష్టతత్త్వమున్=గురువుచెప్పిన పరలోకోపయోగమగు వేదాంతార్థరహస్యమును, సోమరి=(సోము+అరి( మందుఁడు, తుంటునకున్=మూఢునకు.

బ్రహ్మోజ్ఝతా వేదనిందా, కౌటసాక్ష్యం, సుహృద్వధః
గర్హితా నాద్యయోర్జగ్ధిః, సురాపానం సమాని షట్ మను. ౧౧-౫౬.

గురువుచెప్పు బ్రహ్మజ్ఞానమును మఱచువాఁడు, తర్కయుక్తులచే వేదనింద చేయువాఁడు, తప్పుసాక్ష్యము చెప్పువాఁడు, స్నేహితుని జంపువాఁడు గర్హ్యములగు నుల్లి మొదలగునవి తినువాఁడు, ఈయార్గురు సురాపానముచేసినవారితో సమానులు.

తా త్ప ర్య ము.

రెండుపక్షములవారు యుద్ధసన్నద్ధులై యుండుసమయంబునఁ బిఱికియై పరువెత్తిపోవు రాజేగతికిఁబోవునో గురువుచెప్పిన వేదాంతార్థరహస్యమును సోమరితనమున ననుష్ఠింపక మఱచువాని కేగతిగలుగునో యాగతి శ్రీరాముని పోక సంగీకరించినవానికిఁ గలుగునుగాక.

ఉ. సోమరవిప్రభావిభవు • సుందరవిగ్రహు సింహశౌర్యు నా
స్వామిని సింహసంహనను • సామజవిక్రము వ్యూఢబాహువున్
రాము దృఢాంసు రాజగుచు • రాజిలుచుండఁగ భద్రపీఠిపై
రామునిపోకకొప్పిన దు • రాత్ముఁడు చూడమి కల్గుఁగావుతన్.　　౧౭౭

సోమరవిప్రభావిభవున్ = సూర్యచంద్రుల కాంతివంటి కాంతి సంపదగలవానిని, సుందరవిగ్రహున్ = అందమైన యాకారముగలవానిని, సింహశౌర్యున్ = సింహము శౌర్యమువంటి శౌర్యముగలవానిని, నాస్వామిన్ = నన్నుఁ దనసొత్తుగాఁ గలవానిని, స్వముగలవాఁడు స్వామి, సింహసంహననున్ = ప్రత్యవయవస్ఫూర్తి చక్కఁగాఁ గలవానిని, 'వరాంగ రూపోపేతో యస్సింహసంహననో హిసః' అమరుఁడు. సామజవిక్రమున్=ఏనుఁగు నడకవంటి నడకగలవానిని, వ్యూఢబాహువున్ = బలిసిన రెట్టలుగలవానిని, దృఢాంసున్=గట్టిమూఁపురములు గలవానిని.

తా త్ప ర్య ము.

శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట కంగీకరించినవాఁడు సూర్యచంద్రకాంతి గలవాఁడును దివ్యసుందర విగ్రహుఁడును సింహపరాక్రముఁడును నాకు స్వామియు సింహసంహననుఁడును ఏనుఁగునడకవంటి నడకగలవాఁడును బలిసిన రెట్టలు గలవాఁడును దృఢములైన మూఁపురములు గలవాఁడునునగు శ్రీరాముఁడు రాజై సింహాసనముపై నుండఁగాఁ జూచు భాగ్యము లేనివాఁడగునుగాక.

కం. దూరీకృతకరుణుండై, వార కజతిలోదనములఁ • బరమాన్నముఁ దా
నూరక తినుఖలుగతి యా శ్రీరామునిపోక కొప్పు • చెనఁటికిఁ గలుగున్.　　౧౭౮

దూరీకృతకరుణుండై=దూరముగాఁ జేయఁబడిన దయగలవాఁడై, అజతిలోదనములన్ = మేకమాంసము నూవులతోఁ గలసినయన్నము, పరమాన్నము, పాయసము, ఊరక=పండుగలు పర్వములు దేవతాదికార్యములు లేక జిహ్వాచాపల్యముచే, పాయసము అపూపముల (అప్పచ్చుల) కుపలక్షణము. పయస్సు (పాలు)తో వండినది పాయసము.

తా త్ప ర్య ము.

దయలేనివాఁడై మేకమాంసము నూవులయన్నము పాయసము నిష్కారణముగఁ దిను దుష్టునిగతికి శ్రీరాముని యరణ్యగమనమొప్పిన దుష్టుఁడుపోవును.

ఉ. తామసవృత్తిఁ బెద్దలను • ధార్ష్ట్యమునం గనువాని, గోవు ను
ద్దామపుఁగ్రొవ్వునం దవప • దంబునఁ దాఁకెడివాని, కొజ్జపై
నాముని నిందఁ జెప్పుకటి • లాత్ముఁనకున్ గతి యొద్ది గల్గునో
రామునిపోకకొప్పిన దు • రాత్మున కాగతి గల్గుఁ దల్లిరో.　　౧౭౯

తామసవృత్తిన్=తమోగుణమునకు సంబంధించిన నడతతో, దార్ఢ్యమునన్ =దిట్టతనముచే, ఉద్దామపు=అధికమైన, ఒజ్జపై=గురువుమీఁద, అమునన్ = అహంకారముచే, కుటిలాత్మునకున్=వక్రమనస్సుగలవానికి.

తాత్పర్యము.

తామసపు నడవడిచేఁ బెద్దలను దిరస్కారబుద్ధిచేఁ జూచువానికి, అధికమైన గర్వముచే నాలుక గాలఁ దాఁకెడువానికి గురువుమీఁద నహంకారమున నిందలు చెప్పు వక్రబుద్ధికి నేదిగతియో శ్రీరాముని పోకకొప్పినవాని కాగతియే ప్రాప్తించునుగాక.

ఆచార్యమృత్విజంచైవ, గురూంశ్చైవ తపోనిధిమ్
మునింశ్చాప్య వమన్యంతే, తేభవంతిహి రాక్షసాః మను.

ఆచార్యుని, ఋత్విజుని, గురువును, తపస్విని, మునిని నెవఁ డవమానించి మాటలాడునో వాఁడు రాక్షసుఁడుగాఁ బుట్టును.

ఉ. తా మది విశ్వసించినహి•తప్రవరుం జెఱుపంగఁ బూను నా
పామరుఁ డాత్మనమ్మకము•బల్మి రహస్యముఁ జెప్ప దానినిన్
భూమిజనాళికిం దెలుపు•పూరుషుఁ డేగతిఁ బోవునందురో
రామునిపోక కొప్పినదు•రాత్మకుఁ డాగతిఁ బోవుఁ దల్లిరో. ౧౮౦

తాత్పర్యము.

తన్ను నమ్మినస్నేహితునిఁ జెఱుపఁబూనినవాఁడును, మూర్ఖుఁడును మనస్సునందు విశేషమైన నమ్మకముచే స్నేహితుఁడుగదా యని రహస్యము చెప్పఁగా దానిని లోకుల కందఱకుఁ దెలుపువాఁడును నేగతికిఁ బోవునని పెద్దలు చెప్పుదురో శ్రీరాముని పోక కొప్పినవాఁ డాగతికిఁ బోవునుగాక.

తనకు రహస్యమని చెప్పినదానిని బయలుపఱుచువాఁడు చేపయై యావల మృగమైపుట్టును.

విశ్వాసహర్తా తు నరో, మీనో జాయేత దుర్మతిః
భూత్వా మీనోష్టవర్షాణి. మృగోజాయేత తత్పరమ్. భారత. అనుశా.

సీ. మేలునకును మఱు • మేలు సేయనివాఁడు, మేలు మఱచిన యట్టి•బాలిశుండు
సజ్జనావళిచేత • సంపరిత్యక్తుండు, సిగ్గు దలంపని • చెన్నఁటీఁడు
లోకమునకుఁ బగ•యై కలంగనివాఁడు. పెండ్లము బిడ్డలు • భృత్యజనులుఁ
దనరియు గృహమునఁ•దానొక్కఁడే మంచి, యన్నంబుఁ దినియెడి•యఘురతుండు

ఆ. తనసమానురాలి • దారను గైకోక, సంతు లేక చచ్చు•జనుఁడు ధర్మ్య
మైన క్రియలులేని•యతఁ డేగుగతు లగు,రాముపోక కొప్పు•రాక్షసునకు. ౧౮౧

బాలిశుఁడు = మూర్ఖుఁడు - సంపరిత్యక్తుఁడు = విడువఁబడినవాఁడు, చెన్నఁటేఁడు=దుష్టుఁడు - కలంగనివాఁడు = కలఁక లేనివాఁడు - అఘరతుండు = పాపరతుఁడు - సంతు=సంతానము - ధర్మ్యము = ధర్మయుక్తము - రాక్షసునకున్ = రాక్షసునివంటి క్రూరచరిత్రునకు-తన సమానురాలిన్=కులగుణాదులందు.

బ్రహ్మచారి గృహస్థుఁడై పిదప సన్న్యాస మవలంబింపవలెఁగాని ఋణముక్తుఁడుగాక బ్రహ్మచర్యాశ్రమ మందుండియే సన్న్యాస మవలంబింపరాదని యీ వాక్యములవలన నేర్పడుచున్నది. బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్తని శాస్త్ర ముండుటచేత నిక్కడఁ జెప్పిన విషయము వైరాగ్యము లేని వానిని గురించినదని చెప్పరాదు. బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్తనునది బ్రహ్మచారిగానుండియే సన్న్యసించుట యుత్తమపక్ష మని యర్థముగాదు. గృహస్థాశ్రమమునుండియే సన్న్యసించుట యుత్తమ పక్షము - ఏదేని కారణముచే గృహస్థుఁడుగా నగుటకు సాధ్యపడనియెడల బ్రహ్మచారిగానే సన్న్యసింపవలె ననునది యధమపక్షము. ఆపద్ధర్మము - పిల్లనిచ్చువాఁడు లేకపోవుటయే యాపత్తు అని యీశ్రుతి కర్థము - కాఁబట్టి యిక్కడఁ జెప్పినట్లు గృహస్థుఁడైన పిమ్మటనే సన్న్యసింపవలెను. ఆవాక్యమందే ఇతరథా యనియుండుటచే నీయర్థము స్ఫురించుచున్నది. గోవిందరాజీయము.

ఈకలికాలమున సన్న్యాసమేస్మృతి విరుద్ధము. వ్యాసమతమున ౮౮౦౦ సంవత్సరములు దాఁటిన నిషిద్ధము- వైరాగ్యము కుదిరిననాఁడే సన్న్యసింపవలయుననుట యీకాలము నాటిమాటకాదు. ఈ మాత్రము తెలియక పరాశరాదులు కలియుగమున సన్న్యాసము నిషేధింపలేదు. వానప్రస్థమే నిషిద్ధమైన యీ కలికాలమున సన్న్యాసమెట్లు శాస్త్రసిద్ధము కాఁగలదు. ఇప్పుడు నిజమైన జ్ఞాన వైరాగ్యములు దుర్లభము-అవి పూర్ణముగ లేనివాఁడు భక్తిప్రపత్తులచే సన్న్యాసిగాకయే ముక్తుఁడు గావచ్చును. గృహస్థధర్మము నిర్వహింపలేని దుర్బలుఁడు సన్న్యాసియగును. బ్రహ్మ విష్ణు శివులు సన్న్యాసులా? వసిష్ఠ యాజ్ఞవల్క్యాగస్త్యాదులు గృహస్థులు గారా?

## తాత్పర్యము

మేలుచేసినవారికి నుపకారముచేయవలసిన సమయమువచ్చి చేయశక్తియుండియుఁ జేయనివాఁడు, తనకుఁ జేసిన మేలు మఱచినమూర్ఖుఁడు, సాధువులుగానుండువారు తమలోఁ జేర్చుకొనుటకుఁ దగనివాఁడని త్రోసివేయఁబడినవాఁడు, చెడుకార్యముఁ జేసియు లజ్జింపని దుష్టుఁడు, ప్రజలకు విరోధి యయ్యును గలఁక చెందనివాఁడు, భార్యబిడ్డలు సేవకులు నింటనుండియు వారికిఁ బెట్టక తానొక్కఁడే మంచియన్నముఁదిను పాపరతుఁడు - కులమునఁ దనతో సమానురాలగు దానిని గ్రహింపక సంతానములేక చచ్చువాఁడును, ధర్మకార్యములు చేయనివాఁ డేగతికిఁ బోవునో శ్రీరాముని పోక కొప్పిన క్రూరాత్ముఁడాఁగతికిఁ బోవును.

తనకు మేలైనవిధముగా వంటచేయించుకొని తిని యింటిలోని యితరులకు మఱియొక విధముగఁ బెట్టువాఁడు కుక్కగను నావలఁ జండాలుఁడుగాను బుట్టును.

బుభుక్షి తేషు భృత్యేషు, యసకోశ్నాతి మానవః
శ్వయోనిం చ సమాసాద్య, చండాలో జాయతే నరః॥

మేలుచేసినవారికి నపకారము చేసినవాఁడు శ్వాపకాసిగను. జ్వరపీడితుఁడుగను సర్వాంగ రోగిగను బుట్టును. పరుల బిడ్డలను ద్వేషించువాఁడు చచ్చినబిడ్డలు గలవాఁడై తుదకు బిడ్డలులేనివాఁడగును.

అపకారంతు యః కుర్యా దుపకర్తరి యన్నరః
శ్వాపకాసీ, జ్వరీ సర్వగాత్రరోగీ, మృత ప్రజః
మృతపుత్రోథ వంధ్య స్స్యాద్యోద్వేష్టి పర సంతతిమ్॥ మాధవీయము.
తన సమానురాలి దారనుగైకొ౯క—
బ్రాహ్మణక్షత్రియ యోవైశ్యః సవర్ణేహాణి సంగ్రహమ్
అకృత్వాత్వన్యజాయాయాః పతంతి నృప సంగ్రహాత్॥ మార్కండేయ

బ్రాహ్మణుఁడుగాని క్షత్రియుఁడుగాని వైశ్యుఁడుగాని శూద్రుఁడుగాని తన జాతియందే వివాహముచేసికొనవలయును-అట్లు చేయక యితరజాతిభార్యలను సంగ్రహించినఁ బతితుఁడగును.

సవర్ణాగ్రే ద్విజాతీనాం, ప్రశస్తా దారకర్మణి
కామతస్తు ప్రవృత్తానా, మిమాస్స్యుః క్రమశోవరాః॥

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు సవర్ణకన్యకలనే వివాహమాడవలయును. కామదాసు లనులోమ వివాహములఁ జేయుదురు.

'శూద్రాం శయన మారోప్య, బ్రాహ్మణో యాత్యధోగతిమ్
జనయిత్వాసుతంతస్యాం బ్రాహ్మణ్యాదేవ హీయతే.

తనశయనమందు శూద్రస్త్రీనిఁబండుకో నిచ్చినవాఁడధోగతుల పాలగును. దానియందు బిడ్డలుగన్నవాఁడు బ్రాహ్మణ్యమునే పోఁగొట్టుకొనును.

వృషలీ ఫేనపీతస్య, నిశ్వాసోపహతస్యచ
తస్యాంచైవ ప్రసూతస్య, నిష్కృతి ర్నవిధీయతే॥ మను-౩-౧౭-౧౯

శూద్రస్త్రీయొక్క యధరపానము చేసినవానికి దాని నిట్టూర్పు సోఁకినవానికి దానియందు బిడ్డలు పుట్టించిన వానికిఁ బ్రాయశ్చిత్తములేదు.

సీ. రామచంద్రునియా యా•రణ్యవాసము సమ్మతించిన యట్టియ•కించనుండు
తనయాలికడుపునఁ • దనయాలిఁ గానక, యలమటించుచును స•ద్ధాయు వగుచుఁ
బరలోక మేగకు•వాఁ డగుఁ గావుత, వృద్ధుల బాలుర • నృపతి పతుల
వధియింపఁ గలిగెడి•పాపంబు భృత్యుల; విడిచినపాపంబుఁ • గుడువఁ గలఁడు

ఆ. కల్లు లక్క యుప్పు • గరళంబు లోహంబు, పలల మమ్మ పోష్య•వర్గములను
  ద్రోచువానిగతికిఁ•బోవును శ్రీరాము, కానకరుగుఁజేయుఁగు•కలుషబుద్ధి. ౧౮౮౨

అకించనుండు = దరిద్రుఁడు - తినయాలిన్ = బిడ్డలవరుసలను - అలమటించుచున్ = వ్యసనపడుచు - అల్పాయువు = చిన్నవయస్సులోనే చచ్చువాఁడు - పలలము = మాంసము - పోష్యవర్గములన్ = తాను పోషింపవలసిన వారిని - కలుషబుద్ధి=పాపపు బుద్ధిగలవాఁడు-గరళంబు=విషము.

'లాక్షాలవణ మాంసాని వర్జనీయాని విక్రయే' యనుస్మృతి వాక్యమిట స్మరించునది.

నూఱుకార్యములు చేసినైన భార్యను బిడ్డలను పోషింపవలయుననునది ముందుచెప్పిన స్మృతి వాక్యమున కపవాదము- కావున నీ యకార్యము చేయరాదు.

తా త్ప ర్య ము.

శ్రీరాముని యరణ్యవాసము సమ్మతించిన దరిద్రుఁడు తాను శాస్త్రప్రకారము వివాహమాడిన భార్యయందుఁ గొడుకులను గనక చింతపడుచు నడిమి వయస్సులోనే మరణించును గాక. ముసలివారినిఁ బిల్లవాండ్రను రాజును స్త్రీలను వధించినపాపము నిష్కారణముగ సేవకుల విడిచిన పాపంబుఁ బొందగలఁడు. కల్లు, లక్క, యుప్పు, విషము, ఇనుము, మాంస మమ్మి తాను రక్షింపవలసిన భార్యలను బిడ్డలు మొదలగు వారిని రక్షించువాఁ డేగతికిఁబోవునో శ్రీరాముఁడరణ్యమునకుఁ బోయినవార్త తెలిసినవాఁడు పోవును.

కం. ఘోరాజి డాయఁ బాఱెడి,భీరువు చేపడినఁ జంపు•విధమునఁ దల్లీ
  మారణ మొనరింపఁగ నగు, శ్రీరామునిపోక కొప్పు•చెనఁటిని నిపుడే. ౧౮౮౩

తా త్ప ర్య ము.

యుద్ధకార్యములు లేనపుడు రాజద్రవ్యమును దినుచుండి భయంకరయుద్ధము సమీపింపఁగాఁ బరువెత్తిపోవు పిఱికి దొరకెనేని వానినెట్లు చంపవలయునో శ్రీరాముని పోకకొప్పిన వాని నట్లు చంపవలయును.

సీ. కేలఁ గపాలంబు • గ్రాలఁ జింపులు గట్టి, వేఁడుఱుపోలిక•బిచ్చ మెత్తి
  తిరుగుచు ధరణిని • ద్రిమ్మరుటకాఁ దగు; నక్షపానంబుల•నతివలందుఁ
  దగు లగు మతి సత•తంబుఁ గామక్రోధ,వశుఁ డగు రాముని•పట్ల వంచ
  కుండు, ధర్మపుబుద్ధి • గూలుఁ గావుత వాని, కెప్డధర్మపుబుద్ధి • మొనఁగుఁగాత
ఆ. వాఁ డపాత్రములను • వర్షించు ధన మెల్ల, వానిసంచితంబు • లైనధనము
  లన్ని దొంగపాల•యగుత శ్రీరాముల, పట్లద్రోహమొంచు•పాపమతికి ౧౮౮౪

కేలన్ = చేతియందు- కపాలంబు = పుఱ్ఱ- వేఁడుఱుపోలికన్ = పిచ్చివాని వలె-అక్షపానంబులన్ = జూదమందు-సారాయిత్రాగుటయందు- అపాత్రములన్ = అయోగ్యులయందు-కామక్రోధవశుఁడగు.

త్రివిధం నరకస్యేదం, ద్వారం నాశన మాత్మనః
కామక్రోధ స్తథాలోభః। తస్మాదే తత్త్రియంత్యజేత్. భ. గీ.

కామక్రోధలోభములు నరకద్వారములు. తన్నునాశము చేయునవి. ఆత్మను నాశముచేయును కావున వానిని వదలవలయును.

ధర్మపుబుద్ధి కూలుఁగావుత.

యేనాస్తికా నిష్క్రియాశ్చ, గురు శాస్త్రాతిలంఘినః
అధర్మాజ్ఞా దురా చారా, స్తే భవంతిగ తాయుషః॥ అను.

నాస్తికులు క్రియాహీనులు గురువును శాస్త్రమును నుల్లంఘించినవారు అధర్మాత్ములు నజ్ఞులు దురాచారులు వీరికి నాయువు క్షీణించును.

అపాత్ర దానము

ప్రతిశ్రుత్యా ప్యధర్మ సంయుక్తో, నదద్యాత్॥ గౌతమ.

ముందుగ నిచ్చెదనని చెప్పియు వాఁడధర్మసంయుక్తుఁడయ్యెనేని నీయరాదు.

నవార్యపి ప్రయచ్ఛేత్తు, బైడాలవ్రతికేద్విజే
నబకవ్రతికే పాపే, నావేదవిది ధర్మవిత్
త్రిష్వప్యేతేషుదత్తంహి, విధినాప్యర్జితం ధనం
దాతుర్భవే దనర్థాయ, పరత్రాదాతు రేవచ॥ మను. ౪-౧౯౩

ధర్మమెఱిఁగినవాఁడు బైడాలవ్రతముగల బ్రాహ్మణునకు బకవ్రతముగల బ్రాహ్మణునకు వేదమెఱుఁగని బ్రాహ్మణునకు మంచినీరైన నీయరాదు.

ఈ మువ్వురకు ధర్మరీతి సంపాదించిన ధనము నెవ్వఁడు దానమిచ్చునో యెవఁడు పుచ్చుకొనునో వారి కిరువురకుఁ బరలోకమునఁ గీడుకలుగును.

కం. రవి యుదయించెడివేళల, రవి గ్రుంకెడివేళ నిద్ర • రం గొనుజనుఁ డే
యవిధింబడు జనకసుతా, ధవుద్రోహియు నట్టియవిధిఁ • దప్పకపడెడున్ ౧౮౭౫

తాత్పర్యము

సూర్యుఁడుదయించువేళల - సూర్యుఁడస్తమించువేళల నిద్దురపోవువానికే కష్టములు గలుగునో యాకష్టములు శ్రీరామవిషయమున ద్రోహమెంచినవానికిఁ గలుగునుగాక.

నాశ్నీయాత్సంధి వేళాయాం, నగచ్ఛేన్నాపి సంవిశేత్ మను. ౪-౫౫

సంధ్యాకాలములందు భుజింపరాదు. ప్రయాణము చేయరాదు. పరుండరాదు.

ఉ. పాప మెద్ది గల్గు గురు•భార్యను బట్టిననీచబుద్ధి, కే
పాపము గల్గు నింద్లకును • వహ్నిఁ దగిల్చినయట్టికూళ, కే
పాపము మిత్రవంచనను • బాతిలు, నాఘనపాప మొందు నీ
తాపతిఁ గైతవంబున వ్య•థ బడఁ జేసినయట్టి ద్రోహికిన్. ౧౮౭౬

కూళకున్=దుష్టునకు, కైతవము=వంచన, క్రూరశబ్దభవము కూళ.

తాత్పర్యము.

గురుభార్యతో సంగమించిన నీచున కేపాపమో యిండ్లకు నిప్పుపెట్టినవాని కేపాపమో మిత్రుని వంచించినవాని కేపాపమో యట్టి గొప్పపాపము శ్రీరాముని వంచనచే దుఃఖపెట్టిన ద్రోహికిఁ గలుగునుగాక !

ఆశ్రమేవా వనే వాపి గ్రామేవా నగరే పురే
అగ్నిం సముత్సృజేన్మోహా, త్తం విద్యాత్ బ్రహ్మఘాతుకమ్.

ఆశ్రమములకు, వనములకు, గ్రామ, నగర, పురములకు, నిండ్లకు నిప్పుపెట్టిన వానికి బ్రహ్మహత్యచేసినపాపము వచ్చును.

గురుభార్యను పొందినవాఁడు పుక్కగాఁబుట్టి మూఁడు సంవత్సరము లుండి యావల నరకమునకుఁబోయి మరలఁ గ్రిమిగాఁబుట్టును.

కం. దేవతలయుఁ బితరులయుం, బావనమతి జనకులయును ♦ బరిచర్యకుఁ గాఁ
డేవాఁ డాపాపము నీ, తావిభునెడ ద్రోహమెంచు ♦ తన్నరున కగున్. ౧౧౭

తాత్పర్యము.

శ్రీరాముని విషయమున ద్రోహమెంచినవానికి దేవతలయుఁ బితృదేవతలయు జీవించియుండు తల్లిదండ్రులయు సేవ కలుగకుండునుగాక !

తేషాంత్రయాణాం శుశ్రూషా పరమంతప ఉచ్యతే
అనాదృతాస్తు యస్యైతే, సర్వాస్తస్యా ఫలాఃక్రియాః. మను.

ఆముగ్గురి శుశ్రూషయే పరమ తపస్సు, అదివిడిచి యెవఁ డేతపస్సులు చేసినను వ్యర్థములు.

తే. పెక్కుబిడ్డలవాఁడును ♦ పేదవాఁడు, జ్వరముచే బాధపడువాఁడు♦సంతతంబు
బహుళకష్టంబులకుఁ జిక్కి♦నగచువాఁడు,నగును రాముని వనవాస♦మనుమతింప.

తాత్పర్యము ౧౧౮

శ్రీరాముని వనవాస మంగీకరించినవాఁడు పెక్కురు బిడ్డలఁగన్న పేదవాఁడగును. (పేదరికమునఁ బెక్కురుబిడ్డలు గలిగినచో సంసారబాధ నరకబాధకంటె నెక్కువ. బిడ్డలులేక దరిద్రుఁడైనను బిడ్డలుగలిగి ధనికుఁడైనను ఆబాధలేదు.) ఎల్లప్పుడు జ్వరముచే బాధపడువాఁడగును. పెక్కు కష్టంబులకుఁ జిక్కి దుఃఖించువాఁడగును.

ఆ. చేతు లొగ్గినుతులు ♦ సేయుచు నాశను, గనులు మీఁది కెత్తి ♦ కనుచు దీనుఁ
డగుచు వేఁడువాని♦యాసను వృథ సేయు,నమ్మ రాముపోక♦ననుమతించి. ౧౧౯

తాత్పర్యము.

తల్లీ ! శ్రీరామునిపోక ననుమతించినవాఁడు దరిద్రుఁడై చేతులొగ్గిస్తోత్రములు చేయుచు నాశచేతఁ గన్నులు మీఁదికెత్తి చూచుచుదీనుఁడై యాచించువాని యాసను వ్యర్థముచేయువాఁ డగును

చం. అనుపమసత్యధర్మరతు • లైనమహాత్ములతోడి చెల్మి స
జ్జనులకీర్తియున్ సుజన•సత్క్రియ లీక్షణమంద పాయులన్
జనకుని శ్రద్ధమీఱఁ బరి•చర్య లొనర్చు కవస్థకారుఁ డో
జననిరో రాముఁ గానలకు • సాగఁగఁ జేసినపాపజాతియున్. ౧౮౦

అనుపమ సత్యధర్మరతులు=సత్యమందు ధర్మమందు నసమానమైన ప్రీతిగల వారి, చెల్మి=స్నేహము, సజ్జనులకీర్తియున్=సత్పురుషులచేత స్తోత్రముచేయఁబడిన కీర్తియును, సుజనసత్క్రియలు=మంచివారుచేయు మంచి దేవపిత్రాది కార్యములు, జననికిన్=జననిజనక శుశ్రూష ముందుచెప్పినను జననీశుశ్రూష నిత్యానుష్ఠేయమని తెలుపుటకై మరలఁ జెప్పఁబడినది. తల్లిపతితయైనను నామెకుఁగొడుకు శుశ్రూష చేయవలెను.

తాత్పర్యము

తల్లీ! శ్రీరామునిఁ గానలకుఁబంపినవానికి సత్యధర్మములం దసమానప్రీతి గల సత్పురుషుల సహవాసము సాధువులచే స్తోత్రము చేయఁబడు కీర్తియు సుజనులు చేయు దేవపితృపూజాది సత్కార్యము లీనిమిషమునందే పాయునుగాక! తల్లికి శ్రద్ధతోఁ బరిచర్యచేయని కీడరి యగునుగాక!

సుజనులకు దేవపితృకార్యము లనివార్యములు నిత్యములు అవి చేయకుండ రాదు. ప్రతిదినము దేవతార్చనచేయకయుఁ బితృవేళలఁ బితృకార్యములు చేయకయు భుజించువాఁడు కాకియై పుట్టును,

శ్లో. దేవకార్య మకృత్వాతు, పితృకార్యమథాపివా
అనిర్వాప్య నరోహ్యశ్నన్ మృతోజాయతి వాయసః. మాధవీయము.

ఉ. మాయలమారియున్ గడుసు•మాటలమారియు దోషకారియున్
న్యాయముఁ దప్పి జేనికి వ•ణంకెడివాఁడును లోభి యయ్యెడున్
జాయను ముట్టునీళ్ళదివ•సంబున నొద్దన యుండి క్రీడలన్
డాయనిదుష్టుఁ డౌత రఘు•నందనుపోకకు నొప్పునాతఁడున్. ౧౮౧

తాత్పర్యము.

శ్రీరామచంద్రుని వనవాసగమన మంగీకరించినవాఁడు మాయలమారియుఁ బరుషముగా మాటలాడువాఁడును దోషములు చేయువాఁడును న్యాయముదప్పి నేరములుచేసి రాజునకు భయపడువాఁడును బిసినారియు నగునుగాక! అట్టివాఁడు తనభార్య ముట్టుస్నానముచేసిననాఁడు సమీపమందే యుండియుఁ గ్రీడింపని దుష్టుఁ డగునుగాక!

శ్లో. ఋతుస్నాతాంతు యోభార్యాం, సన్నిధౌ నోపగచ్ఛతి
ఘోరాయాం భ్రూణహత్యాయాం, యుజ్యతే నాత్రసంశయః

సమీపమందుండియు ముట్టుస్నానముచేసిన భార్యతో నెవఁడు సంభోగింపఁడో వానికి ఘోరమగు భ్రూణహత్యవచ్చును సందేహములేదు. ఇట్లని యిరువురిలో నొకరు వ్యాధిపీడితులయి యుండిరేని సంగమింపరాదు. నిషిద్ధదినములైనను గూడదు.

కం. ధర ధర్మదారఁ గూడక, పరదారలఁ గూడుత్యక్త • పరధర్మరతి
స్థిరుఁడౌ తరాము నడవుల, కరుగన్ ఘటియించినట్టి • యాబాలిశుఁడున్. ౯౯౨

తా త్ప ర్య ము.

శ్రీరాముఁ డడవులకుఁ బోవఁజేసిన యామూఢుఁడు ధర్మశాస్త్రప్రకారము వివాహమాడిన భార్యతో రమింపక యితరుల భార్యలతోఁ గూడుచు శ్రేష్ఠమగు భార్యాభర్తల ధర్మమందుఁ బ్రీతిలేనివాఁ డగునుగాక !

శ్లో. అకారణాద్ధర్మపత్నీం, త్యాగీ స్యాచ్చజలోదరీ
వేశ్యాంకులవధూం కృత్వా, వర్తతేయో నరాధమః. మాధవీయ.

నిష్కారణముగాఁ దనధర్మపత్నిని వదలిన నరాధముఁడును, వేశ్యను భార్యవలెఁ జేసికొనిన నీచుఁడును జలోదరము గలవాఁడుగ నగును.

ఉ. కూడును నీళ్లు నీక తన • కుం గలబిడ్డలఁ జంపువిప్రుఁడున్,
దోడనె చచ్చుబిడ్డలను • దోరముగాఁ గను బ్రాహ్మణుండు, లే
దూడలయావుపాల్పిదుకు • దుష్టుఁడు, బ్రాహ్మణదత్తహర్తయున్.
గోడును రామచంద్రునకుఁ • గూర్చినవాఁ డగుఁ జుమ్మ తల్లిరో. ౯౯౩

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రునకుఁ గష్టము గలిగించినవాఁడు తనబిడ్డలకుఁ గూడు నీళ్ళు పెట్టక చంపువాఁడును బుట్టినవెంటనే చచ్చు బిడ్డలనుగను బ్రాహ్మణుండును లేఁతదూడలుగల యావుపాలుపిదుకు దుష్టుఁడును బ్రాహ్మణులకై దానముచేసిన దాని హరించువాఁడు నగునుగాక !

కం. జలదూషకవిషదాయక, కలుషంబులు రెండు గలుగుఁ • గావుత జననీ
పలుగాకి యెవఁడు రాముని, బలుగాసిం బెట్టి విపిన • వాసముకతనన్. ౯౯౪

తా త్ప ర్య ము.

శ్రీరాముని వనవాసము కారణముగా నేనీచుఁడు కష్టపెట్టెనో వాఁడు త్రాగుట కుపయోగపడు నీటియందు మలమూత్రములు విడుచుట, ముట్టికివస్తువులనుమ్మివేయుట, లోనగుకార్యములు చేసినవాఁడును విషముపెట్టువాఁడును నగునుగాక !

త్రాగెడినీళ్ళను, శైలముచుటయు విషముపెట్టుటయు సమానములు.
నాప్సు మూత్రపురీషంకుర్యా నన్నిష్ఠీ వేత్. తైత్తి.
నీళ్ళయందు మలమూత్రములు విడువరాదు. ఉమ్మివేయరాదు.
ఇత్యేవ మాదయశ్చాన్యే, నరకాభృశదారుణాః

యమస్య విషయే ఘోరాః, శస్త్రాగ్ని విషదాయినః
పతంతి తేషు పురుషాః పాపకర్మరతాస్తు యే. వి. పు.

ఈ మొదలైన యనేక ఘోరనరకములు యమునిపురమందుఁ గలవు. శస్త్రము అగ్ని విషము వీనిచే జనులకుఁ గీడుకలిగించు పాపాత్ములీ నరకములఁ గూలుదురు.

ఉ. నీరముఁ గోర డప్పి జన • నీ! గృహమందున కల్గి మంచినీ
రార నొసంగఁ గేవిరియు • పాయములం జను మన్న వంచకుం
డరసి యుప్పునీరముల • నాతని కిచ్చునతండు వోవుత
న్నారక మేగు నీదుప్రియ • నందనుఁ బోకడ కొప్పు నాతఁడున్. ౧౮౫

## తా త్ప ర్య ము.

దప్పిగొని త్రాగుటకు నీళ్ళడుగఁగా నింట మంచినీళ్ళుండియు నేదో నెపము పెట్టి లేదుపొమ్మనువాఁడును, ఉప్పునీళ్ళిచ్చువాఁడును బోవు నరకములకు శ్రీరాము వనవాస మంగీకరించినవాఁడు పోవునుగాక! నరకమె నారకము స్వార్థక తద్ధితాంతము.

తే. తగవులను దాను మధ్యస్థుఁ • డగుచుఁ జెలిమి
నందు నొకనికి జయ మొందు • నట్లు తెలుపు
వానిగతి యగు జానకీ • జానియెడల
నఘము నెంచినవారల • యరుగుగతియు. ౧౮౬

## తా త్ప ర్య ము.

ఇరువురు కలహించి తన్ను మధ్యస్థుఁడుగా నుండి ధర్మముగాఁ బరిష్కరింపఁ గోరఁగా నందొకనిపైఁగల స్నేహభావము చే వానికి మేలుగలుగునట్లు పరిష్కరించువాఁ డేగతికిఁబోవునో శ్రీరామునిపట్లఁ బాపమెంచినవాఁ డాగతికిఁ బోవునుగాక!

బహువ్రీహిని జాయ జాని యయి జానకీజానియయ్యె. ఎవనికి జానకి జాయయో వాఁడు జానకీజాని.

—• కౌసల్య భరతు నూరార్చుట •—

చం. ఇటు పతిహీనయున్ సుతవి • హీనయు నై దురపిల్లుతల్లినిన్
బటుశపథాళి నూఱడఁగఁ • బల్కియు దుఃఖము పెర్మి నేల పైఁ
దటుకున వ్రాల నాయమయుఁ • దత్సుతుఁ గాంచి వచించెఁ దండ్రి! యొం
తటిశపథంబు లాడితివి • దారుణశాపముగల్గె నిన్గనన్. ౧౮౭

దురపిల్లు=దుఃఖించు, పటుశపథాళిన్=తీక్ష్ణములైన ప్రమాణ సమూహములచే; భరతుఁడు చేసిన ప్రమాణములవలన రెండుగుణములు కానవచ్చుచున్నవి భరతుఁడు తనయందు దోషములేదని చెప్పుట; రెండవది తా నిట్టిఘోరపాపముచేసి తినిగదాయని కైకకుఁ దోఁపఁజేయుట; ఇట్లగుటచే భరతునందు నెట్టికల్మష లేశ లేపము గానరాదని దృఢపడెను.

భరతుఁడు ప్రమాణము చేయుటచే నిర్దోషులగువారు తమయందు నిష్కారణ నిందమోపఁబడినచోఁ దమయందట్టిదోషము లేదని ప్రమాణము చేయవచ్చునని సూచింపఁబడియె.

విశ్వామిత్రుఁడు తన నూర్వురు కొడుకులను వసిష్ఠుఁడు చంపెనని దోషమారోపించినపుడు వసిష్ఠుఁడు ప్రమాణము చేసెనని మనుస్మృతియందుఁగలదు. తమయందు దొంగతనము మోపఁబడినపుడు సప్తర్షులు ప్రమాణము చేసిరని భార-అను పర్వమందుఁగలదు.

తా త్ప ర్య ము

మగఁడు లేనిదియు సుతుఁడు లేనిదియునై దుఃఖించుతల్లిని దీక్ష్ణములైనఘోర ప్రమాణముల చేనూరడిల్లఁబలికియు దుఃఖాతిశయముచేఁ దటాలున నేలపైఁబడఁగాఁ గౌసల్యయు నాకొడుకునుజూచి నాయనా యెంతటి కఠినములైన ప్రమాణములు చేసితివి- నిన్నుఁజూడఁగా నాకు మిక్కిలి పరితాపముగలుగుచున్నది.

కం. నాతనుజాతువియోగము, చేతను దపియించునాదు • చిత్తము నీవా
గ్జాతంబులఁ దీడించియు, నాతనయా యసువు నిలిపి • నాఁడవు నాకున్. ౧౮౯౭

నా తనుజాతువియోగము=నా కొడుకు నెడఁబాసియుండుట - ఇది యేక దేశిసమాసము- సు-వ్యా-సూ-రర వాక్యపరిచ్ఛేదము. వాగ్జాతంబులన్ = వాక్య సమూహములచే. నా తనయాయనుటచే నీవు కైకకొడుకవుగావు. రామునివలె నా కొడుకవే. ఇఁక నాదుఃఖము సగము శమించినది. అని భావము.

తా త్ప ర్య ము.

నాచిత్తము నాకొడుకును విడిచియుండవలసివచ్చుటకే తపియించుచున్నది. దానికిఁదోడు నీ ప్రమాణ వాక్యములు మఱింత తపింపఁజేసినవి. అయినను నీ మీఁది సందేహము తొలఁగిపోవునట్లుచేసి నాప్రాణము నిలిపినాఁడవు. నా కుమారా నీవిట్లుచేయకుండిన నేనే గతిపట్టియుందునో.

ఉ. తమ్ముఁడు లక్ష్మణుండు బలెఁ • దద్ద యదృష్టము నీవునున్ సుధ
ర్మమ్మును బాయ కున్నయెడ • రాజిలు పుత్రక ! సత్యసంధతన్
నెమ్మది సజ్జనుల్ చనెడి•నిస్తులలోకముఁ బొందు, మంచు నం
కమ్మున నిల్పి కట్టుకొని • కాఁతయు హా యని యేడ్చె దీననై. ౧౮౯౮

తద్ద = మిక్కిలి-అదృష్టము = పూర్వపుణ్యఫలము అంకమ్మునన్ = ఒడియందు - దీనివలన వయస్సువచ్చిన వారినైనను, కొడుకువరుసవారిని వృద్ధ స్త్రీలును, కూఁతువరుసవారిని (కోడలిని) వృద్ధపురుషులు కుడి తొడమీఁదను గూర్చుండఁబెట్టుకొనుట దోషముగాదు.

తా త్ప ర్య ము.

నాయనా! యిది నా యదృష్ట విశేషము- నీ తమ్ముఁడగు లక్ష్మణునవలెనీవును జ్యేష్ఠకనిష్ఠసోదర న్యాయము వదలినవాఁడవుకావు. సత్యసంధుఁడవై ప్రకాశిం

వుము. నీకు సత్పురుషులకుగలుగు పుణ్యలోకములు కలుగునుగాక యని యతనిఁ దనఁదొడపైఁగూర్చుండఁ బెట్టుకొని దుఃఖబాధచే దీనురాలై హా యని యేడ్చెను.

కం. ఇమ్మెయిని శోక మోహాభ,రమ్మున మూర్ఛలను నేల • వ్రాలుచుఁ గడు దీ
ర్ఘమ్ముష్ణమ్ముగ రోఁజుచు, నుమ్మలికము నొంద రేయి • యుం గడఁ గాంచెన్. ౧౯౦౦

ఇమ్మెయిన్=ఈవిధముగా-శోక మోహాభరమ్మునన్ = శోకమోహముల యతిశయముచే-కడుదీర్ఘము=మిక్కిలినిడివి- ఉష్ణము=మిక్కిలివేఁడి-ఉమ్మలికము = సంతాపము.

తాత్పర్యము.

ఈవిధముగఁ బితృమోహముచేతను భ్రాతృని విడిచినదుఃఖముచేతను భూమిమీఁదఁబడి మిగులవేఁడి నిట్టూర్పులు విడుచుచు దుఃఖించుచుండ నారాత్రి గడచిపోయెను.

ఇది భరతుఁడు కేకయపురమువిడిచిన యెనిమిదవనాఁటి చరిత్రము.

—• ౭౭-వ సర్గము. భరతుఁడు తండ్రికళేబరమునుజూచి యేడ్చుట •—

కం. వేకువ యగుడు వసిష్ఠుఁడు కైకయిసుతుఁ గాంచి పల్కు • గాఢ ప్రేమన్
శోకింపకు మన్నా నీ, వీకరణిన్ ఫలము గలదె • యేడ్చుచు నుండన్. ౧౯౦౧

వేకువ=ఉదయము,

తాత్పర్యము.

భరతుఁడయోధ్యచేరిన మఱుసనాఁటి యుదయమున వసిష్ఠుఁడు భరతునిఁ జూచి యతిశయ ప్రేమతో నన్నా యేల యేడిచెదవు- ఏడువకుము- ఇట్లు లేడుచుచుండిన లాఁగలలాభ మేమి ?

మ. అవనీనాథతనూజ ! నిజసకుసం•యానక్రియల్ దీర్పఁగాఁ
దవు నాకార్యము నిర్వహింపు మన నా•తండున్ ధృతిం బూని శా
స్త్రవిధిన్ దండ్రికి నౌర్ధ్వదైహికములం • జల్పంగఁ దా సెంచి భూ
ధవనిద్రాగతతుల్యకాయము సుపీ•తత్విట్చయోదాత్తమున్. ౧౯౦౨

సంయానక్రియల్ = ప్రేతను స్వర్గమునకుఁ బంపెడికార్యములు - ధృతిన్ = ధైర్యమును - ఔర్ధ్వదైహికములన్ = ఊర్ధ్వదేహసంబంధము ఔర్ధ్వదైహికము - ప్రేతకార్యములు-భూధవ=రాజుయొక్క- నిద్రాగతతుల్య = నిద్రపోయిన వానితో సమానమైన- కాయము = దేహము-నూనెకాగులోనుంచిన కారణముచే దేహము లవమైనఁ జెడలేదు. వికారమునొందలేదు. సుపీత = మిక్కిలి పచ్చని - త్విట్ = కాంతుల-చయ=సమూహముచే ఉదాత్తము=గొప్పది.

తా త్ప ర్య ము.

రాజకుమారా! నీవు నీ తండ్రికిఁ బరలోకక్రియలు దీర్పఁదగునుగదా. ఇఁక నీ కార్యములు చేయుమనిన భరతుండును ధైర్యముఁ దెచ్చుకొని యేడ్పుమాని శాస్త్రప్రకారము తండ్రికిఁ బరలోక క్రియలు చేయఁదలంచి నిద్రపోయినవానివలె నుండు రాజదేహమును దీర్ఘకాలము నూనెలో నుంచుటచేఁ బచ్చఁబాఱిన దానిని.

కం. నానారత్నపరిష్కృత, మానుజ్జ్వలహేమశయన • మం దిడి కైకే
యీనందనుఁ డతిదుఃఖతుఁ, డై నానాగతుల నేడ్చి • నారటపడుచున్. ౧౦౩

నానారత్న పరిష్కృతము = అనేకరత్నములచే నలంకరింపఁబడినదియగు- ఉజ్జ్వలహేమశయనము=ప్రకాశించుచున్న బంగారు పానుపునందు-ఇడి = ఉంచి.

తా త్ప ర్య ము.

అనేక రత్నములచే నలంకరింపఁబడిన బంగారు మయమైన శయనముమీఁద నుంచి భరతుఁడు మిగుల దుఃఖము గలవాఁడై యనేకవిధముల నారటపడుచు నేడ్చెను.

శా. రాజేంద్రా ! యటు విప్రవాసి నగునే • రాకుండ మున్ ధర్మని
ష్ఠాజుష్టాత్ముఁడు రామచంద్రుని మహా • శౌర్యుండు సౌమిత్రినిన్
వ్యాజం బేమియొ పంపఁ గానలకు నీ • వాధీశునిన్ నన్ను నీ
యోజన్ బాసియు నెందుఁబోయితివొ య • యోధ్యాధిపా చెప్పుమా. ౧౦౪

విప్రవాసిన్ = పరదేశమందున్నవాఁడను - ధర్మనిష్ఠాత్ముని = ధర్మమందలి నిష్ఠచేఁగూడినవానిని- వ్యాజంబేమియొ=ఏమినెపమో- ఓజన్ = విధముగా నాకుఁ గదా యిచ్చితివంటివి - నేను గ్రహింతునో గ్రహింపనో నాయభిప్రాయము దెలిసికో వలసిన పనిలేదా. అట్లు నాయభిప్రాయము దెలిసికొనక ముందే శ్రీరాముని వన వ్యాసమునకుఁబంపవలసిన కారణ మేమికలిగెను. నేను వచ్చువఱకు నిదానింపరాదా.

తా త్ప ర్య ము

రాజేంద్రా! పరదేశమందుండు నేను రాకముందే ధర్మనిష్ఠగల రామచంద్రుని మహాశౌర్యముగల లక్ష్మణుని నడవులకుఁబంప నేమికారణముకలిగెను. అట్లు శ్రీరాముని నన్ను నొద్దలేకుండఁ జేసికొని తండ్రీ ! యెందుఁబోయితివో. దేనికని నే నేడ్తును.

కం. నిరుపమనిర్మలచరితుఁడు ధరణీతనయావిభుండు • తలఁగి చనుటకున్
బరిపరివిధముల నేడ్వఁగఁ, బరికింపవు నన్ను నిచటి • వారి మహీశా. ౧౦౫

నిరుపమ = సరిలేని-నిర్మల = మలినములేని - చరితుఁడు = మంచి నడవడి గలవాఁడు.

తా త్ప ర్య ము.

శ్రీరాముని నొక్కని నడవికిఁ బంపితివిగాని దాని ఫలముగ నేను నిచ్చట నుండువారే విధముగ నేడ్చుచున్నారో చూడవుగదా.

కం. రాముఁడు వనులకుఁ జన స్వ, ర్గామమునకు నీవు పోవఁ • దగుగతి యోగ
క్షేమంబుల నిఁక నెవ్వరు, భూమీశ్వర కూర్చువారు • భూజనములకున్. ౧౦౬

తా త్ప ర్య ము

ప్రజలయోగక్షేమములు విచారింపవలసినవారు నీవు శ్రీరాముఁడు. మీ యిరువురిలో శ్రీరాముఁడడవులకుఁబోయెను. నీవు స్వర్గమునకుఁ బోయితివి. ఇఁకఁ బ్రజల యోగక్షేమము లెవరు విచారింతురు.

కం. రాజ వగునీవు లేమిని, రాజిల్ల దనాథ మగుచు • రాష్ట్రంబు నిశా
రాజు రహింపని రాతిరి, యోజను రాణింప దీయ • యోధ్య మహాత్మా. ౧౦౭

అనాథము = దిక్కులేనిది - నిశారాజు = చంద్రుఁడు-రహింపని = ప్రకాశింపని - ఓజను=విధమున.

తా త్ప ర్య ము.

దేశమునకు రక్షకుఁడవైన నీవు మరణించుటచే రాష్ట్రము నాయకుఁడు లేనిదై చంద్రుఁడు ప్రకాశింపని రాత్రివలె నీ యయోధ్యాపురము ప్రకాశింపక యున్నది.

—• భరతుఁడు దశరథున కుత్తరక్రియలు సలుపుట •—

సీ. అని పలవింపఁగాఁ • గని భరతునితోడఁ, బలుకు వసిష్ఠుఁ డో • భవ్యచరిత
ప్రేతకార్యములు తం • డ్రికిఁ జల్పు పనిఁబూను,మీఁవిచారముమాను • మీఁవటన్న
నగుఁగాక యని యాతఁ • డాచార్యఋత్విక్పు, రోహితాదుల వేగ • రూఢి వెలయ
సమకట్టుఁ డన బహి • స్థ్సలి నున్ననృపునగ్ను ,లను యథావిధిఁ దెచ్చి • రవఘులైన
తే. యాజకులు ఋత్విజులు నంత • నవనిపాలు,శవము శిబికను సల్పి బా • ష్పంబులురల
మోయఁ బరిచారకులు చల్లి • మున్ను వెండి,పైఁడి, చేలలుపఱచుచు • బాటలందు
౧౦౮

పలవింపఁగాన్=విలపింపఁగా-భవ్యచరిత్ర = శుభకరమైన నడవడికలవాఁడా-సమకట్టుఁడు = ప్రయత్నము చేయుఁడు-ఆచార్యులు = వసిష్ఠవామదేవాదులు- "ఉపనీయవ దేద్వేద మాచార్యస్స ఉదాహృతః" యని శాస్త్రము - ఋత్విక్కులు= యజ్ఞమునవరింపఁబడినవారు - పురోహితులు = రాజునకు నభివృద్ధికొఱకు శాంతికపౌష్టికాది కార్యములజరపువారు. "త్రయ్యాంచ ధర్మకృత్యేచ శాంతికర్మణి పౌష్టికే। అధ్వరేయాశ్చకుశలస్సస్యాద్రాజ పురోహితః" అని శాస్త్రము. రూఢి = నిశ్చయము-బహిస్థలిన్=అగ్నిగృహమునకు వెలుపల - ఇంటశవముండుటచే వపరి

శుద్ధి కావున నగ్నిని బయట నుంచిరని భావము నృపు అగ్నులన్ = రాజుయొక్క-గార్హపత్యాద్యగ్నులను–శిబికను=పల్లకియందు.

తా త్ప ర్య ము.

అని యేడ్చుచుండఁగా విని వసిష్ఠుఁడు భరతుతో నిట్లనియె శుభచరిత్రా నీ విట్టులేడ్చు చుండుటతగదు. తండ్రికిఁ బ్రేతకార్యములు జరుగవలసియున్నవి. వానిని జేయ యత్నింపుము. అని చెప్పఁగా సరియని యంగీకరించి యాచార్యులను ఋత్విక్కులను బురోహితులను జరుగవలసినకార్యములకై మీరు ప్రయత్నింపుఁడనిః వారు వెలుపలనున్న గార్హపత్యాద్యగ్నులను శాస్త్రప్రకారము దెచ్చిరి. అంత యాజకులు ఋత్విజులు రాజుపీనుఁగును బల్లకియందుంచిరి. పరిచారకులు కన్నీళ్ళు కాఱుచుండ మోసిరి. పీనుఁగునకు ముందు వెండి బంగారుపూలు చల్లుచు బాటలందు వస్త్రములు పఱుచుచుఁ గొందఱుపోవ.

సీ. జనములు కొందఱు • చన మఱికొందఱు, చందనాగరువులు • సరళపద్మ
కము గుగ్గిలంబు ధూ•పము వేయుచునుబోవ, గంధాది బహువిధ•కాష్ఠములను
జేర్చినచితిమీఁదఁ • జేర్చి భూమీశుని, ఋత్విజుల్ మంత్రిస•మేతముగను
భరతునిచే నగ్నిఁ • బ్రజ్వలింపఁగఁ జేసి, సామమంత్రంబులు•చదువు చుండ

తే. నృపతికాంతలు పల్లకి•లెక్కి– వృద్ధ, యుక్తముగఁ బురి వెడలి వా•రున్న చోటి
కరిగిసవ్యాపసవ్యంబు•గాఁగఁ జుట్టి, రధిపుఁ గౌసల్యలోనగు•నబ్జముఖులు. ౧౯

సరళపద్మకము=దేవదారు చెక్కలచేఁ జేసినధూపవస్తువులు–కాష్ఠములను = కట్టెలను–సవ్యాపసవ్యంబులు = ప్రదక్షిణముగను అప్రదక్షిణముగను – చుట్టి = తిరిగి–పల్లకీలు = పల్యంకికాశబ్ద భవము పల్లకీ – పల్లకి యని ప్రాస్వాంత మును గలదు.

తా త్ప ర్య ము

కొందఱు చందనము అగరుదేవదారు ధూపములు గుగ్గిలము ధూపము వేయుచుఁబోఁగా శ్రీగంధపుఁజెక్కలు మొదలయిన కట్టెలతోఁ జేర్చిన సాద మీఁద రాజు దేహమునుంచి ఋత్విజులు మంత్రములు చెప్పుచు భరతునిచే నగ్ని మండునట్లుచేసి సామమంత్రంబులు చదువుచుండ రాజస్త్రీలు కౌసల్య మొదలగువారు పల్లకిలెక్కి పురమునువిడిచి భరతుఁడు మొదలగువారున్న చోటికిఁబోయి శవము నకుఁ బ్రదక్షిణముగను నప్రదక్షిణముగాఁగను దిరిగిరి.

౨౦. ఖించినవగ వారలు దుఃఖించినఁ దద్రవము మూఁడఁ•గీ డొక్కటిగా
క్రౌంచీసహస్ర వార్క్రో,శించినగతి నెగసెఁ గరుణ•చేష్టాయుక్తన్. ౨౦

క్రౌంచీసహస్రము = అఁడుక్రౌంచపక్షులగుంపులు – ఆక్రోశించినన్ = ఏడ్చిన కరుణచేష్టాయుక్తన్=శోకపుఁగార్యముతోఁగూడినట్లు.

## తా త్ప ర్య ము.

అతిశయించిన దుఃఖముచే వారందఱేడువఁగా నా ధ్వని కీడుకలిగినపుడు వేయియాఁడు క్రౌంచపక్షులొక్కసారిగా దుఃఖస్వరముతో నేడ్చినట్లుండెను.

ఉ. వారక యేడ్చుచున్ సతులు • పల్లకులన్ సరయూతటంబునన్
చేరి పురోహితులున్ సచివ • శేఖరులున్ మఱి తారుఁ బుత్రుతో
నీరము వీడి యశ్రుయుత • నేత్రములం బురిఁ జేరి పండుచున్
ధారిణి ఘస్రముల్ పది యథా•విధిఁ బుచ్చిరి సూతకంబుతోన్. ౧౧౧

సచివశేఖరులు = మంత్రి శ్రేష్ఠులు-అశ్రుయుత నేత్రముల్ = కన్నీళ్లతోఁ గూడిన కన్నులతో-ధారిణిం బండుచున్ = భూమిపైఁ బండుకొనుచు, "కియల్లబ్ధా శ్మయనాః భూమావ్యపేయు స్తే, పృథక్" అని యాశౌచములవారికి భూశయ్య విధి యుక్తము - సూతకంబుతోన్ = మృతాశౌచంబుతో = చావంటుతో-పదిఘస్ర ముల్=పదిదినములు-"షోడశాహేన భూపాలా" యను శాస్త్రానుసారము క్షత్రి యులకు నాశౌచము పదియాఱుదినములయియుండఁగా నిటఁబదిదినములే యాశౌ చమని చెప్పుటయెట్లు యుక్తము- సమాధానము— క్షత్రియస్తుదశాహేన స్వకర్మ నిరతశ్శుచిః అను శాస్త్రానుసారము యిచ్చటఁ బదిదినములే క్షత్రియుల కాశౌచము చెప్పఁబడియున్నది. ముందుచెప్పిన శాస్త్రము స్వకర్మనిరతుఁడు కాని క్షత్రియున కని యూహింపవలయును.

ఇచ్చటస్త్రీలు ప్రదక్షిణ తర్పణములఁ జేసినట్లు చెప్పుటయు బోధాయన సూత్రానుసారమని తెలియుచున్నది- "ప్రదక్షిణ మపి బాంధవాః కుర్వంతి ఏవం మాౙ్గేపిచిశా మారోప్యచిశాయామే మేక్యేకే" యని బోధాయన సూత్రము.

ఈ ప్రకరణమున శవముతో నిప్పు తెచ్చినట్లును శవమును పాడపైఁ బెట్టి నట్లును సమంత్రకముగ నిప్పంటించినట్లును దానికిఁ బ్రదక్షిణించినట్లును బదిదినము లాశౌచముతో నున్నట్లును జెప్పినది దేశకుల సూత్రభేదములచేఁ బ్రేతకార్యములు భిన్నములని తెలుపుటకైనను బ్రధానములు చెప్పినది యప్రధానములఁ దెలిసి కొనుటకని యైనను దెలియుచున్నది.

ఆశౌచదినములందు నేలపైఁబండుకొనవలయునుగాని మంచములు పఱుపులు పనికిరావు.

## తా త్ప ర్య ము

స్త్రీలు వారించువారులేక యేడ్చుచుఁబల్లకీలందుఁబోయి సరయూతీరంబునఁ జేరి పురోహితులు మంత్రిశేఖరులు తామును గొడుకుతోడ నీళ్ళువిడిచిన నీటితోడి కన్నులతో నూరుచేరి నేలపైఁబండుకొనుచుఁ బదిదినములు సూతకముతోఁగడిపిరి.

౭౭-వ సర్గము

సీ. పదునొకండవనాఁడ • భరతుఁ డాశౌచంబు, దీర్చి పండ్రెండవ • దినమునందు
శ్రాద్ధకర్మము లెల్ల • జరపి బ్రాహ్మణులకు, నమితధనాన్నర • త్నములు మేలి
చేలలు నిర్భర • శ్వేతబాస్తికములు, గోవులు నూఱుల • కొలఁది గాఁగ
దాసదాసీయాన • ధామవితతు లెల్ల, దానంబు లిచ్చెను • దండ్రిగుఱిచి

తే. మఱి త్రయోదశదినమున • మహితనయుఁ, డస్థిసంచయనార్థమై•యరుగుదెంచి
రోదనధ్వని లెసఁగని•రుద్ధబాష్ప,కంఠుఁడై చితిమూలంబుఁ•గదిసి యేడ్చె.
౧-౫

ఆశౌచము = అంటు-మైల-తీర్చి = పుణ్యాహవాచన నవశ్రాద్ధాదులచేసని శేషము-శ్రాద్ధకర్మములెల్లన్=షోడశమాసికములు సపిండీకరణము మొదలైనవి - సపిండీకరణము సంవత్సరాంత కృత్యమైనను గాలవైపరీత్యమునుబట్టి ముందుగనే చేయుదురు. గరుడపురాణమున:—

ద్వాదశాహే త్రిపక్షేవా। షణ్మాసే వత్సరే పివా
సపిండీ కరణం ప్రోక్తం మునిభిస్తత్త్వదర్శిభిః॥
మయాతుప్రోచ్యతే తాత్వ శాస్త్ర ధర్మాను సారతః
చతుర్ణా మేవ వర్ణానాం ద్వాదశాహే సపిండనమ్॥
అనంత్యాత్కలి ధర్మాణాం పుంసాంచైవాయుషః క్షయాత్
అస్థిరత్వా చ్ఛరీరస్య, ద్వాదశాహేప్రశస్యతే॥		౧౩ అ-౯-౩౦

పండ్రెండవదినమందుగాని మూఁడవపక్షమందుఁగాని ఆఱవనెలయందుఁగాని సంవత్సరాంతమునఁగాని సపిండీకరణముచేయవచ్చునని తత్త్వమెఱిఁగిన మునులుచెప్పిరి కాని కలిధర్మములనంతములగుటను, పురుషులయాయువు క్షీణించుట చేతను శరీర మస్థిరమగుటను బండ్రెండవదినమందే సపిండీకరణము నాలుగు వర్ణముల వారు చేయఁదగునని శాస్త్రీయమైన నా యభిప్రాయము అనికలదు.

చేలలు = వస్త్రములు - నిర్భర=అనేకములగు - ఉద్గాఢ నిర్భరః తీవ్రైకాంత నితాంతాని గాఢబాఢ దృఢానిచ - అమరుఁడు - శ్వేతబాస్తికములు = తెల్లమేకల మందలను - త్రయోదశదినమునన్ = పదమూఁడవదినమునందు - అస్థిసంచయనార్థమై = ఎముకల నేఱుటకై - అరుగుదెంచి = తండ్రినిదహించినచోటికి వచ్చి - కదిసి=సమీపించి-అస్థిసంచయనముపదుమూఁడవ దినమునఁ జేయునట్లు బోధాయనసూత్రముగలదు "ద్వితీయేహ్ని యుగ్మదివసేషు అర్ధమాసాన్ మాసాన్ ఋతూన్ సంవత్సరం వా సంచయనం కుర్యాత్" తని యాసూత్రము- దాసీదాసయని యుండవలసియుండినను త్వద్దాసదాసీగణాఇత్యాది మహాకవి ప్రయోగములుకలవు.

### తాత్పర్యము.

పదునొకండవదినమందే భరతుఁడాశౌచము ముగించి పండ్రెండవదినమందుఁ బుణ్యాహవాచనాది కర్మములన్నియు జరిపి విస్తారముగ ధనము - అన్నము - రత్నములు- వెలగల వస్త్రములు తెల్లమేఁకల మందలు నూర్లకొలఁది గోవులు - దాసులను- దాసికలను- వాహనములను- ఇండ్లను ఈ మొదలయినవానిని దండ్రి నుద్దేశించి బ్రాహ్మణులకు దానమిచ్చెను. అవలఁబదుమూఁడవదినమునందు రాజకుమారుఁడస్థిపంచయనము కొఱకై తండ్రినిఁగాల్చినచోటికి వచ్చి కన్నీటిచే నడ్డగింపఁబడిన కంఠముగలవాఁడై సొద దగ్గఱచేరి యేడ్చెను.

కం. నన్నప్పగించితివి మా,యన్న యయినరామచంద్రు•హస్తమునకు నా
సన్నుతుఁడు కాన కరుగుట, నన్ను నిరాశ్రయుఁడుగా నొ•నర్చితె తండ్రీ. ౯౧౩

నిరాశ్రయుఁడు = దిక్కులేనివాఁడు - సన్నుతుఁడు = సత్పురుషులచేఁగొనియాడఁబడినవాఁడు.

### తాత్పర్యము.

తండ్రీ! నన్ను మాయన్న శ్రీరామచంద్రునకు నప్పగించితివి - ఆయన యడవికిఁబోవుటచే నన్ను దిక్కులేనివానిఁగాఁ జేసితివికదా రెంటను నీవుచేసినవే,

కం. కొడుకొక్కఁడ వానిని గా,ఆడవులఁ ద్రోయుటను ననద•నై యేడ్చెడు నీ
పడతిఁని గౌసల్యను నిటు, విడి యెచటికి నేగితయ్య•ప్రియహితచరితా. ౯౧౪

ప్రియహితచరితా=ప్రియము హితమునైన నడవడిగలవాఁడా - అనద = దిక్కులేనిది-అనాథశబ్దభవము.

### తాత్పర్యము.

నీ పట్టపుదేవియగు నీ కౌసల్యకు నొక్కఁడే కొడుకు- వానిని నీవు కాఱడవులకుఁబంపితివి- ఆమె దిక్కులేక యేడ్చుచున్నది. అట్టి యామెను వదలి నీ వెచ్చటికిఁబోయితివి.

కం. అని కాలుట నెఱ్ఱన నై, మెనుబూదిని నిండియున్న • క్షితిస్థితలం
బును గని జనకునిఁ దలఁచుచుఁ, బనవి పనవి యేడ్చి నేలఁ•బడియెన్ మూర్ఛన్.
౯౧౫

### తాత్పర్యము

ఈప్రకారమునుచుఁగాలిన కారణమున నెఱ్ఱనదై విస్తారపు బూదితోనిండియున్న తండ్రిదొముకలుండు స్థలంబుజూచి తండ్రినిఁదలఁచి వెక్కివెక్కి యేడ్చి మూర్ఛపోయి నేలఁబడెను.

ఆ. ప్రక్కనున్నవారు • పట్టి యెత్తియుఁ గట్టు, నడలు వజ్రధ్వజము • నరగేఁబడియె
నాశపతితుఁ డగుయ•యాతిని డాసెడి,ఋషులభంగినచివు•లెల్లఁగదియ. ౯౧౬

### తా త్ప ర్య ము.

ఇట్లు పడినవానిని బ్రక్కనున్నవారు పట్టి మెత్తిరిగాని యవశుఁడైన కారణమునఁ గట్టిన కట్టు వదలిపోఁగాఁబడెడి యింద్రధ్వజమువలెఁబడెను. అప్పుడు స్వర్గమునుండి పడిన యయాతిని ఋషులవలె మంత్రులందఱు సమీపించిరి.

సీ. భరతుండు నేలపైఁ • బడిన శత్రుఘ్నుండు, జనకుగుణాంగంబు•లను స్మరించి
సంతాపభరమున • సంజ్ఞావిహీనుఁడై, యున్మత్తుపోలికి • నుండి వెండి
తలపోసి తలపోసి • తండ్రిగుణంబుల. నిట్లని విలపించె • నెద గలంగ
మంథరాప్రభవ మ•మంథర కైకయీ, గ్రాహసంకులము వ•రప్రదాన
తే. మయగురుక్షోభమైన యీ•మహితశోక, సాగరంబున మముముంచి•చనితె తండ్రి
బాలు సుకుమారు సంతత•లాలితాత్ము, భరతు విడనాడ నీకెట్లు • వచ్చెమనసు. ౧౫౧౭

గుణాంగంబులను=గుణములను అవయవములను, సంజ్ఞావిహీనుఁడై = తెలివి తప్పినవాఁడై, ఉన్మత్తుపోలికన్=పిచ్చివానివలె, మంథరాప్రభవము = మంథరవలనఁ బుట్టినది అమంథర = అధికమైన, కైకయీగ్రాహ = కైకయనెడి మొసలిచే సంకులము = కలఁతనొందినది, వరప్రదానమయగురుక్షోభము=వరమిచ్చుట యనెడి గొప్ప కలఁతగలది, సాగరము = సముద్రము, సంతతలాలితాత్మున్ =సంతోషపెట్టఁబడిన మనస్సుగలవానిని.

### తా త్ప ర్య ము.

భరతుఁడు ధైర్యముతో నిబ్బరించుకొని యున్నంతవఱకుఁ దానును ధైర్యముతో నుండిన శత్రుఘ్నుఁడు భరతుఁడు పడిపోఁగానే యాయనగతియేమగునో యని భయఁపడి యప్పుడప్పుడు తమకుఁగావలసినవి తానై యిచ్చి సంతోషపఱుచు తండ్రిగుణములను దలఁచి దుఃఖాతిశయమునఁ దెలివితప్పి పిచ్చివానివలె నుండి స్మృతి తెచ్చుకొని మఱిమఱి తండ్రిగుణములను నాలోచించి యాలోచించి హృదయము కలఁకనొందఁగా నిట్లనియేడ్చెను. మంథరవలనఁబుట్టి కైకేయియనెడి పెద్దమొసలితోఁగూడి వరదానమనెడి కలఁతగల యీగొప్ప దుఃఖసముద్రమునందు మమ్ముఁ దండ్రీ ముంచిపోయితివా! బాలుఁడు సుకుమారుఁడుఎప్పుడు నీచే సంతోషపెట్టఁ బడిన మనస్సుగలవాఁడు నగు భరతుని విడనాడిపోవ నీకెట్లు సమ్మతమాయెను.

సీ. ఎవ్వరో మ మ్మింక • నేవి కోరిన నిచ్చి, బుజ్జగించెడివారు • పుణ్యశీల
మాకోరుభోజ్యముల్ • మాకోరుపానంబు, లింకఁ గొమ్మని యెవ్వఁ•డిచ్చుఁదండ్రి
మంచిచేలంబులు • మంచిభూషణములు, పిలిచి మాకీయంగఁ • దలఁచు నెవఁడు
తగినబుద్ధులు సెప్పి • తగవులు బోధించి. మమ్ము నెవ్వఁడు దిద్దు • మహితచరిత
ఆ. తొడను జేర్చి మమ్ముఁ•బుడికి ముద్దాడుచు, గారవించు నింకఁ • గరుణ నెవఁడు
నిన్ను విడిచి చెడక • నిలిచిన ధారిణి ప్రళయవేళ నైన • భంగపడదు. ౧౫౧౮

తా త్ప ర్య ము

పుణ్యస్వభావా! మేము కోరినవి మాకిచ్చి మమ్ము నీక నెవరు లాలింతురు? మేముకోరిన భోజ్యములు పానములు మాకు నీక నెవరిత్తురు! మంచి వస్త్రములు మంచిసొమ్ములు మమ్ము రమ్మనిపిలిచి యిచ్చువారెవరు! ఆయా సమయములందుఁ దగిన బుద్ధులు చెప్పి న్యాయము బోధించి మమ్ముఁ జక్కఁజేయువాఁ డెవఁడు! మమ్ముఁ దొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని దేహమునిమిరి ముద్దుపెట్టుకొనుచు నెవఁడు దయతో నాదరించును నీవు పోయినను దాను జెడిపోక నిలిచిన భూమి ప్రళయ కాలమందైనను జెడదు.

కం. ఇది కావలయున పుత్రక, యిది కావలయునె యటంచు ♦ నీరీతి మమున్
ముదమున బలవంతిం బుగ, నది గోరిన నిచ్చువార ♦ లెవరో యింకన్. ౧౯

తా త్ప ర్య ము.

కుమారా! నీకిదికావలయునా! నాయునా నీకిది కావలయునా యని బలవంత ముగ మమ్మడిగి యడిగి బలవంతపెట్టి యేదికోరినను మాకింక నెవరిత్తురు.

చం. జనకుఁడు స్వర్గ మేగెనఁట ♦ సత్యచరిత్రుఁడు రామచంద్రుఁడున్
వనములదారిఁ బట్టె నఁట ♦ వచ్చుని నిల్పఁగ మేనఁ బ్రాణముల్
వనముల నైనఁ జొచ్చెదను ♦ వహ్నుల నైనఁ జొరంగఁబొతెదన్
గని కని యీయయోధ్యఁ జొరఁ♦గా మది గొల్పదు వారు లేమినిన్. ౧-౨౦

తా త్ప ర్య ము.

తండ్రియా స్వర్గమేగెను సత్యచరిత్రుఁడు శ్రీరాముఁడా యడవులకుఁబోయెను. ఇఁక దేహమునఁ బ్రాణములు నిల్పశక్యమా కాదు కావున నేనును నడవులకైనఁ బోయెదను. అగ్నిలోనైన దూఁకెదను అంతియకాని చూచి చూచి వారు లేకుండుటచే నయోధ్యలోఁ బ్రవేశించుటకే మనస్సురాకున్నది.

సీ. అనుచు సోదరు లిటు ♦ లడలుచు ధరణిపైఁ, గొమ్ములు విఱిగిన♦కోడె లనఁగఁ
బడినఁ దోవచ్చిన♦వారును విలపింపఁ, జేరి వేదాంతి వ♦సిష్ఠమౌని
భరతునిఁ గనుఁగొని♦జరిగెడిఁ బదియుమూఁ, డవనాఁడు వృథ కాల♦యాపనంబు
చనునె శేషాస్థిసం♦చయనంబు సాంతంబు, గావలదే యది ♦ గాక మఱియు
తే. నాఁకలియు దప్పిశోక మో♦హములు జరయు
మరణ మనియెడి నిరుమూఁటి ♦ మర్త్యుఁ డెవఁడు
పరిహరింపఁగ శక్తుఁడు? ♦ భరత! తగునె
యపరిహార్యంబునకు శోక? ♦ మనుచు నుండ. ౧-౨౧

సోదరులు = అన్నదమ్ములు, భరతశత్రుఘ్నులు, కోడెలు = ముదిరిన పోతు దూడలు, వేదాంతి=వేదాంతమెఱిఁగినవాఁడు, జ్ఞాని, శేషాస్థిసంచయనంబు=మిగిలిన యెముకలఁ బ్రోగుచేయుట. ఇది పూర్వమే ముగిసినది కావున దేశాచార ప్రకా

తాత్పర్యము.

రము స్థలశోధనము, కాలయాపనంబు=కాలముగడపుట, సాంతంబు = అంతముతోఁ గూడినది=ముగిసినది, జర=ముసలితనము. ఇరుమూఁటిన్=ఆఱిటిని, పరిహరింపఁగన్ =త్రోసివేయఁగ, శక్తుఁడు=శక్తిగలవాఁడు, అపరిహార్యంబునకున్ = పరిహరింపరాని దానికి, "అపరిహార్యేర్థే నత్వంశోచితు మర్హసి" యను గీతావాక్యమనుసంధించునది.

ఈ ప్రకారము చెప్పుచు భరతశత్రుఘ్ను లిరువురు దుఃఖపడుచుఁ గొమ్ములు విఱిగిన కోడెలో యనునట్లు నేలమీఁదఁ బడఁగాఁ గూడవచ్చినవారును నేడుచుచుండఁగా జ్ఞానియగు వసిష్ఠమౌని భరతునితో నిట్లనియె. భరతా పదుమూఁడవనాఁడు జరుగుచున్నది. వ్యర్థముగఁ గాలము గడపుట తగునా మిగిలిన యెముకల సంచయనము పూర్తికావలదా. నీ విట్లుండిన నది యెట్లులగును. అంతేగాక ఆఁకలి, దప్పి, శోకము, మోహము, జరామరణము లనియెడి ద్వంద్వములను నెవఁడు త్రోసివేయఁ గలఁడు. త్రోసివేయ సాధ్యముగాదేని యట్టిదానికై దుఃఖింపవలయునా? దుఃఖింపక యేమిచేయమనెదవు అనిన సహించుకొనుము.

ఆగమాపాయినో నిత్యాఃస్తాన్ తితిక్షస్వ భారత. భ. గీ. ౨. అ.

కం. అంత సుమంత్రుఁడు తదనుజు, చెంతకుఁ జని లేవ నెత్తి • చెప్పె నతనికిన్
చింతాహరమగుభూతథ,వాంతయథావృత్తమెల్ల • నంతటఁ గొమరుల్. ౧౭౨

తాత్పర్యము.

అంత సుమంత్రుఁడు శత్రుఘ్ను నొద్దకుఁబోయి లేవనెత్తి యాయనకు దుఃఖము పోఁగొట్టు భూతముల పుట్టువిధము చచ్చువిధము నంతయుఁ జెప్పెను. అంతట నా రాజకుమారులు.

దీనివలన వివాహాదులు పూర్తికాఁగానే కర్తల శ్రేయస్సుకోరినవారు శోకోపశాంతివాక్యములుచెప్పి కర్తల నూరార్పవలయు నని యేర్పడుచున్నది.

ఉపశాంతివాక్యము లీవిధముగఁ జెప్పవలయునని స్మృతులు చెప్పుచున్నవి. పంచ భూతములవలన నేర్పడిన యీ శరీరములు జీవుని ప్రారబ్ధానుభవమునకై భగవత్సంకల్పమున కలుగుచుండును. ఆ ప్రారబ్ధానుభవము ముగియఁగానే యచట నవి పనికిరావు గావున నవిమరలఁ బంచభూతములలోఁ గలిసిపోవును మరల నేప్రారబ్ధము జీవుఁడనుభవింపవలసి యున్నదో దానికిఁ దగినశరీరము జీవునకు వచ్చుచుండును. ఇవి కర్మవశమున వచ్చునవి కావున రావలదనిన రాకయుండవు. పోవలసిన వేళవచ్చినఁ బోకయుండవు. ఇట్లనివార్యమైన రాకపోకలుగల యీదేహమునకై యేడువనేల? మనశరీరములే యిట్టివై యుండ మనవలెనే వారివారి కర్మము లనుభవింప దేహములతోఁ బుట్టిన జీవులదేహములకై యేడువనేల? పోయిన జన్మంబులందు మన మెవరితో నెట్టి సంబంధము గలవారమై యుంటిమో వారట్టివారై యీజన్మ

మున దాపరింతురు. ఏ చుట్టమైనను, ఏ బిడ్డమైనను వాని వాని ఋణము తీర్చుకొని పోవుటకు వచ్చునే కాని మనల నుద్ధరించుటకు వచ్చువారు లేరు.

వాయువశమున నాకాశమున మేఘములవలె నీటివేగమున నేటియందుఁ గట్టెలవలె దేహాలు కర్మవశమునఁ గలియుచుందురు, వీడిపోవుచుందురు. దేహములా నీటి బుగ్గలవలెఁ గారు మెఱుఁగులవలె క్షణభంగురములు, క్రిందియాకు నేఁడు రాలిన పైయాకు రేపురాలును. నేఁడు వీఁడుపోయిన రేపు మనముపోదుము. బంధుస్నేహము చలిపందిటిలోని పాంథస్నేహమువంటిది యని యీలాగు చెప్పవలెను

ఉ. వానకు నెండకున్ సుడిసి • వాసపు టెక్కెము లట్లు లోప్పుచున్
మానక కాఱు బాష్పముల • మార్జితులైనను వారి మంత్రులన్
దీనతఁ దక్కు కర్జములఁ • దీర్పుఁ డటంచును వేగిరించి య
న్యూనముగా సమస్తము క్రియోత్కరమున్ ముగియింప నందఱున్. ౧-౨౩

సుడిసి=చెడుపట్టి, మార్జితులైనను=తడిసినవారు కాఁగా, కర్జము=కార్యము, అన్యూనముగాన్=కొఱఁతలేకుండ, క్రియోత్కరమున్=కార్యసమూహమును.

తాత్పర్యము.

ఎండ కెండి వానకుఁ దడిసి చెడిపోవు నింద్రధ్వజమువలె నా రాజకుమారులు శోకాగ్నిఁ దపించి కన్నీటి జడివానచే నాని కాంతిపాసియుండఁగా వారిమంత్రులను దుఃఖముచేఁ దక్కు కార్యములు ముగింపుఁడని తీవరించి కొఱఁత లేకుండఁ జేయవలసిన కార్యములన్నియుఁ జేసి ముగింపఁగా నందఱును.

—• ౭౮-వ సర్గము. శత్రుఘ్నుఁడు భరతు నూరార్చి మంథరను దన్నుట •—

కం. ఇండులకుఁ బోవ శత్రుఘ్నుం డట రఘురాముఁ జూచు•కోరిక నపుడే
దండకకుఁ బోవుతలఁ పెద,నిండిన భరతునకు ననియె • నిర్వేదమునన్. ౧-౨౪

తాత్పర్యము.

వారివారి గృహములకుఁ బోఁగా రఘురాముఁ జూడవలయునను కోరికతో నపుడే దండకకుఁబోవు తలంపుగల భరతునితో శత్రుఘ్నుఁడు విచారపడుచు నిట్లనియె.

కం. గతిచెడి వగచెడి భూతవ్రతతుల కన్నింటి కెపుడు • ప్రభు వెవ్వఁ డగున్
గతి యాతండే నీకును, గతి యంచును జెప్పవలెన • కలుషవిహీనా. ౧-౨౫

తాత్పర్యము.

దిక్కులేక దుఃఖించు భూతసమూహముల కన్నింటికి సర్వకాలముల నెవ్వఁడు ప్రభువో వాఁడే నీకును దిక్కని పాపములేనివాఁడా నేను జెప్పవలయునా.

పాపాత్ములుగా నుండువారికిఁగూడ నతఁడే శ్రీరాముఁడే దిక్కయి రక్షించుచుండ నేపాపమెఱుఁగని నీకు రక్షకుఁడని చెప్పఁ బనిలేదనిభావము. మనకు అనక నీకు అనుటకు భరతుఁడు భగవత్పరతంత్రుఁడు శత్రుఘ్నుఁడు భాగవత పరతం

త్రుఁడు. కావున శత్రుఘ్నునకు భరతుఁడే ముఖ్యుఁడు నిమూలమున నాకు, అని యర్థము.

సీ. మన కన నేల సమ♦స్తభూతాళికిఁ, బట్టుఁగొమ్మగు రామ ♦ భద్రుఁ డధిక
సత్త్వవంతుం డయ్యుఁ ♦ జాలనిపోలికి, నాఁడుది పొమ్మని ♦ నంత వనికిఁ
బోయె నౌరౌర ప్ర♦భూతపరాక్రమ,వంతు, డాలక్ష్మణు ♦ వంతవాఁడు
జనకు నటుండు మం♦చనక రాముఁడు వని, కరుగఁ దా నెట్లొకో♦యనుమతించె
తే. నాఁడు దాడించు నట్టిల్ల ♦ నాడి తప్పుత్రోవలను బోవువానిని♦దొలుతఁ దాన
నీత్య నీతుల నారసి ♦ నిగ్రహింపఁ దగదె? జనకుం డటంచును♦దలఁపఁ దగునె? ౧౯౩

తాత్పర్యము.

అన్ననీకు రక్షకుఁడని వ్రేలుమడఁచి లెక్కించి చెప్పనేల- సమస్త భూతములకు నాశ్రయమగు శ్రీరామభద్రుఁడు మహా బలవంతుఁడయ్యును వసమర్థుని వలె నొకయాఁడుది పొమ్మనినంత మాత్రముననే యంబేడవలెఁ దలవంచుకొని పోయెను. ఏమి యాశ్చర్యము- శ్రీరాముఁడు తండ్రికిఁ బరతంత్రుఁడు కావున నాయన చెప్పినట్లు వినవలయునని తలంచెనుబో శ్రీరామునకుఁ బరతంత్రుఁడైన లక్ష్మణుఁడు విస్తారబలముకలవాఁడు. అంతవాఁడు తండ్రిని ఛీ యటుండు నీపెత్తన మేమి నా స్వామిని నీవా యడవికిఁ బంపువాఁడవని ధిక్కరింపక శ్రీరాముని వెంటఁ దానుకూడఁ బోవుటకెట్లు సమ్మతించె- ఇది యంతకంటె ఆశ్చర్యము. ఆఁడుది యెట్టులాడించిన నట్టిల్లనాడి తప్పు త్రోవలఁ బోవువానిని నీతియిది దుర్నీతి యిది యని నివారించి మొట్టమొదటనే నిగ్రహింపఁ దగునుగదా. అది విడిచి తండ్రి యని మర్యాద యొంచఁదగునా- నీతి తప్పి చరించువాఁడా తండ్రి.

సమయత్యాగినో లుబ్ధాన్ గురూనపిచ కేశవ
నిహంతి సమరే పాపాన్, క్షత్రియస్సహిధర్మవిత్. శాంతి. ౫౫-౧౬-

భీష్మార్జునాదులిట్లు చేసినవారే, విభీషణ ప్రహ్లాదులు పరోక్షకారణములు.

మ. అని శత్రుఘ్నుఁడు పల్కఁ దూర్పువఁ బ్రతీ ♦ హారంబునన్ మేనఁ జం
దనముం బూసి సుమాళిఁ దాల్చి నృపవ ♦ స్త్రంబుల్ మణీహేమమం
డనముల్ మేఖల మధ్యమం దమరఁ బ్రా ♦ టం గట్టఁబట్టెట్టిరో
తినబోలెం జను దేర మంథరయు న♦ర్థిన్ దానిఁ దద్ద్వాస్థనుల్. ౧౯౭

తాత్పర్యము.

శత్రుఘ్నుఁడిట్లు చెప్పుచుండఁగా దూర్పువాకిటఁ దనయుపాయము సఫలమాయెను. ఇఁక భరతుఁడు రాజగును- కైకరాజమాతయగును. ఆమెకు ముఖ్యురాల నేనగుదును. ఈ వీరందఱు నాచేతిక్రిందివారే- నేనెట్లుచెప్పిన నట్లునడువవలసినవారే. ఇంతకార్యముచేసినది నేనని నాప్రతిష్ఠ యందఱకుఁ దెలియవలయును

గదా. అందఱవలెఁగాక నేను విశేషముగ సొగసు చేసికొనిపోయిన నెవరిది యని భరతుఁడడుగును. ఇదియే నీకు రాజ్యము వచ్చునట్లుచేసిన బుద్ధిమంతురాలు మంథరయను దాసి యని యచ్చటివారు చెప్పెదురు. అప్పుడు భరతుఁడు నన్ను బహూకరించును. భరతుఁడు బహూకరించిన శత్రుఘ్నుఁడు బహూకరించును. వారిద్దఱు గౌరవించిన నన్నందఱు గౌరవింతురని యాలోచించి మంథర దేహమునిండ మంచిగంధముపూసికొని పూలుసిగయందు ముడిచి కైక తనకిచ్చిన రాజు ధరించు చొక్కాయంగ వస్త్రములోనై నవియును రత్నములు బంగారుతోఁ జేయఁబడిన యాభరణములు నడుమున నొడ్డాణము ధరించి నడుమునకుఁ ద్రాడుకట్టిన క్రోఁతివలె భరతునకు నెప్పుడు పట్టాభిషేకముచేయ నాలోచించుచున్నారో యిందమని కులుకుచుఁ గులుకుచునెంతో కోరికతో రాఁగా దానిని ద్వారమందుండువారు.

ఉ. పట్టె దయావిహీనఁ గడ • పార్థివనందను మ్రోల నిల్పి యీ
కట్టిఁడిచేతఁ బుట్టెఁ జుమి • కష్టము లన్ని యరణ్యదేశమున్
మెట్టుట రామచంద్రుఁ, డవ•నీపతి స్వర్గముఁ బోక, యిచ్చ నీ
కెట్టులొ యట్లు సేయు మన • నెంతయు మండి సుమిత్రపట్టియున్. ౯-౭౮

తాత్పర్యము.

దయలేని దానిని బట్టుకొనిపోయి కడపటి రాజకుమారుఁడైన శత్రుఘ్నుని ముందఱ నిలిపి యయ్యా యీ దుష్టురాలిచేతఁ జుమీ యీ కష్టములన్నియు నిందఱకుఁ బ్రాప్తించెను, శ్రీరాముఁడరణ్యమునకుఁ బోవుట, రాజు స్వర్గమునకుఁ బోవుట దీనివలననే దీని నీయిష్టమేమి చేయఁదలఁచితివో చేయుమనిన శత్రుఘ్నుఁడు కోపంబున–

శత్రుఘ్నుఁ డింతవఱకు దాని పేరు వినెనేకాని మంథరను జూచినవాఁడు కాఁడు.

ఉ. అంతకు మూల మాచెడుగ • యన్నుడి వీనుల సోఁకినంత నే
కాంతము సంతపించి యటఁ • గల్గినవారల నెల్లఁ గాంచి భూ
కాంతుని మత్సహోదరులఁ•గాఁచియ పెట్టిన యానృశంస దు
శ్చింతన నిప్పుడే కుడువఁ•జేసెదఁ జూడుఁడు తత్ఫలం బనన్. ౯-౪౮

తాత్పర్యము.

అన్నికష్టములకు మొదటికారణ మీదుష్టురాలే యనుమాట చెవులలోఁబడినంతనే యీ దాసియా యింతయనర్థము కలిగించినదని మిక్కిలి సంతాపపడి యందున్న వారినందఱఁజూచి రాజును నాయన్నలను బాధపెట్టిన యీ క్రూరురాలిని దురాలోచనపరను దాని యాలోచన ఫలము నిప్పుడే యనుభవింపఁ జేసెదను– చూడుఁడు అని చెప్పఁగా.

కం. వారు సఖీజనవృత యగు, క్రూరచరిత్రికను వల్ల•కుబ్జ నొగి బలా
త్కారమునఁ బట్ట నది తద,గారము మార్మోయ నేడ్వఁ•గని నృపసుతుఁడున్. ౧౯౦

తా త్ప ర్య ము.

దానియనుగ్రహము సంపాదించుకొనుటకై దానితోడ వచ్చిన చెలికత్తెలచేఁ జుట్టఁబడియుండు క్రూరపు నడవడిగల యామంథరను నచ్చటి వారది తప్పించుకొని పోవ యత్నించుచుండఁగా విడువక బలవంతముగాఁ బట్టుకొనఁగా నాగయ్యాళి ముండయిల్లు ప్రతిధ్వనియిచ్చునట్టులేడ్చెను. అది వగలమారిముండ యని తెలిసికొని,

చం. కినుకను బట్టి నేలఁ బడి•కీ కృ-నఁ డాఁచిన నద్దురాత్మ హా
యనుచును నేడ్చుచుండ సర•యంబుగ నీడ్చెను నేల దానినిన్
గని యట నున్న దాసులును•గాఢతరాగ్రహాయుక్తుఁడై నయా
తనిఁ గని మూల కొక్క-తెగ•డాఁగఁగ బోవుచుఁ గంపితాంగులై. ౧౯౧

తా త్ప ర్య ము.

కోపముతోఁబట్టుకొని తన్నినతన్నున కది కీకృ-ని నేలఁబడి యుఱువఁగా నా పాపాత్మురాలు హాయనియేడ్చుచుండ శీఘ్రముగ నేలఁబడఁదన్ని, భూమిమీఁదఁబడి పొరలునట్టు లెగసి మొగసి తన్నఁగా నచ్చటనున్న దాసికలు మిగులఁగోపించియున్న యాయనసుజూచి యొకతె పోయినమూలకు మఱియొకతె పోక డాఁగఁబోవుచు దేహము గడగడవడఁకుచుండ.

ఉ. ఒండొరుఁ జూచి యందఱు స•ముగ్రత నీతిరిబాట చూడఁగాఁ
జెండెడి మూలముట్టుగను•జెచ్చెర నిందఱుఁ, గోసలాత్మజన్
నిండుమతిన్ దయారతను•నిర్మలధర్మచరిత్రఁ గావు మీ
గండ మటంచు వేఁడఁ దగుఁ•గా యని పాఱిరి యామె యొద్దకున్ ౧౯౨

తా త్ప ర్య ము

ఒకరినొకరుచూచి యందఱును నీయన కోపము విధముచూచిన నీదాసికలం దఱు నిటువంటివారే- వీరు తేరకుతిని కూర్చుండి యిట్టికార్యములా చేయుచున్నారని యందఱను మొదలంట నిప్పుడే యాలస్యములేక నఱికివైచును- కావున మన మందఱము దయాస్వభావముగలది నిర్మలమైన ధర్మశీలయునగు కౌసల్యయొద్దకుఁ బోయి నిండుమనస్సుతో మా యీ గండమునుండి రక్షింపుమని ప్రార్థించుట యుక్తము- మఱియెవరు మనల రక్షింపఁ జాలరని యామె యొద్దకుఁ బరువెత్తిరి.

చం. మనుజవరేణ్యనందనుఁడు• మంథర మొఱ్ఱో యనంగ భూమిమీఁ
దను బడఁ దాఁచి యీడ్చుడుసు • దానిధరించినసొమ్ములున్ నివే
శనమును శారదాంబరము•చా ఁ బ్రొపరించెను, గూర్మిదాసికిన్
గనుకనిఁ గైక యడ్డ మరు•గన్ వెస నాపెను దిట్టఁ గ్రుద్ధుఁడై. ౧౯౩

తా త్ప ర్య ము.

శత్రుఘ్నుఁడు మంథర మొఱ్ఱోయనుచుండ భూమిమీఁదఁబడఁదన్ని బఱబఱ యీడ్వఁగా నది ధరించిన సొమ్ములు చెదరపడి యాయింటిని శరత్కాలమందలి యాకాశమువలెఁ గనఁబడఁజేసెను. తన ప్రేమకుఁ బాత్రురాలైన దానికి వచ్చిన దురవస్థఁజూచి దానిని రక్షించుటకై కైక యడ్డముపోఁగా నామెను కోపించినవాఁడై తిట్టెను.

ఉ. తిట్టియు దారుణోక్తులను • దిమ్ముచెడన్ వడిఁ దన్నఁబోయినన్
దొట్టినభీతిఁ గైకయు సు•తున్ శరణంబుఁ జొరంగ నాతఁడుం
బిట్టలుక వ్వహించినసు•మిత్రసుతుం గని సైఁప వయ్య యీ
కట్టెఁడి; నెల్లప్రాణులను • గాంత లవధ్యలు గారె తమ్ముఁడా. ౧౯ ౩౪

తా త్ప ర్య ము.

భయంకరములైన తీక్ష్ణవాక్యములఁదిట్టియు నంతతోఁబోక యామె తల దిమ్మవదలునట్లు తన్నఁబోఁగా మంథరదశే తనకును బట్టునని భయపడినదై భరతుని చాటునకుఁబోయి భరతా భరతా కాపాడుమని శరణుచొచ్చెను. అయనయు శరణాగత రక్షాధర్మపరుఁడు కావున మిగులఁగోపమున మండిపడుచున్న శత్రుఘ్నునిఁ జూచి యీ దుష్టురాలిని సహింపుము- చంపకుము- తమ్ముఁడా ప్రాణముగల యన్ని జాతులలోను స్త్రీలుచంపఁదగనివారుగదా.

చం. అనఘుఁడు మాతృఘాతకుఁడ•నంచును రాముఁడు నామొగంబునుం
గనుఁగొనఁ డన్న భీతి మెయిఁ • గల్గదయేనియు నీదురాత్మఁ గై
కను బలి పెట్టనే యిలకుఁ•గాలరఁ గుబ్జను జంప నక్కట మె
త్తన నతఁ డేల పల్కు మన•తో మొగమిచ్చి ధ్రువంబు చూడుమా. ౨౦ ౩౫

తా త్ప ర్య ము.

తమ్ముఁడా! దీనిదుష్టచేష్టలను విని యిన్నిదినములు సైఁచితివి. నీ వెంతో నాకంటె శాంతచిత్తుఁడవే- ఏలన- పాపరహితుఁడైన శ్రీరాముఁడు నేను దీనిని జంపినచో వీఁడు తల్లిని జంపినవాఁడు వీనిముఖముఁజూడరాదని నాముఖముఁజూడఁడే మోయనుభయము నాహృదయమున లేకుండెనేని నేనెప్పుడో దీనిని భూమికి బలిపెట్టియుందును. భయపడి యేడ్చుచున్న కుబ్జను జంపితిమావీరు స్త్రీహంతలువీరితో మాటలాడరాదనిమనయన్న మనతో మొగమిచ్చిమాటలాడఁడు నిజమాలోచింపుము.

తే. అనుఁడు భరతునిమాటల • నాలకించి, తోన కుబ్జను విడిచె శ•త్రుఘ్నుఁడదియుఁ
గాళ్ళపైఁ బడియేడ్వంగఁ గైక దేర్చె, నురులఁ జిక్కిన క్రౌంచినా•నొరలుదాని.

తా త్ప ర్య ము. ౧౩౬

ఈప్రకారము భరతుఁడు చెప్పగా నాయనమాటలనువిని సత్యమనినమ్మి శత్రుఘ్నుఁడు వెంటనే కుబ్జను వదలిపెట్టెను. ఉరులలోఁ జిక్కినలఁగిన క్రౌంచివలె

నుండు దానిని, తన కాళ్ళపైఁబడి యేడ్చుచు దానిని, గైక యేడువ కేల యేడ్చెదవు. వారిమేలునకై వారు సుఖపడవలయునని మనమాలోచించిచేసితిమి. వారి కంటిమాత్రము తోఁచినదికాదు. వారికది సరిపడకున్న మనమేమి చేయఁగలము. వారి ప్రారబ్ధబల మనుకొందము. నా కొడుకు రాజుగాక మెట్లుతప్పించుకొనఁగలఁడు. అందఱు చెప్పిన వినకుండునా వినక యేమిచేయఁగలఁడు. రాజులేకున్న నందఱుచెప్పుకుందురా! కావున భరతుఁడు రాజగునటకూరకుండుము. అవల వీరిపని విచారింతము. అని సమాధాన పఱిచెను.

-• ౭౯-వ సర్గము. రాజకర్తలు భరతునిఁ బట్టాభిషేకము చేసికొనఁ బ్రార్థించుట •-

సీ. పదియునాలవనాఁటి•యుదయంబునను రాజ,కర్తలు భరతునిఁ • గాంచి యనిరి
పరమగురుం డైన•నరపతి తనజ్యేష్ఠ,తనయు రాముని లక్ష్మ•ణుని వివాసి
తులఁ జేసి స్వర్గంబుఁ • దోడన తానేగె, రాజవు మాకీవు•రాజతనయ
క మ్మెల్ల దైవయో•గమ్మున నీయురా, జకరాజ్య మిందాఁక • వికలపడదు
తే. వలయునభిషేక స్వద్వస్తు•వులను గూర్చి,పౌరులును మిత్రులును వేచి•నారు వీర
పితృపితామహపాలితం•బగుల రాజ్య,మెల్ల వహియించి మ మ్మెల్ల •నేలుమనిన. ౧౩౭

తాత్పర్యము

పదియు నాలవనాఁటి యుదయమున సింహాసనమునకు రాజ నభిషేకము చేయు నధికారము గలవారు భరతునిఁజూచి మాకు గురువులలో శ్రేష్ఠుఁడైన మీ తండ్రి తనపెద్దకొడుకును శ్రీరాముని లక్ష్మణునితోడ దేశాంతరమునకుఁ బంపి వెంటనే తానుగూడ స్వర్గమునకుఁబోయెను. కావున రాజకుమారుఁడవైన నీవే మాకిప్డు రాజవుకమ్ము. దైవవశమున రాజ్య మరాజకమయ్యుఁ జెడక యిందాఁక మంచి దశయందే యున్నది. పౌరులు మంత్రులు పట్టాభిషేకమునకుఁ గావలసిన వస్తువులనెల్ల గూర్చి నీయాజ్ఞకు వేచియున్నారు. వీరి చూడుము. నీతండ్రితాతలు పాలించిన యసమాన రాజ్యమంతయు నీవు వహించి మమ్మెల్లఁ బాలింపుము! "రాజానం ప్రథమంవిందే, త్తతో భార్యాం తతోధన" మ్మని శాస్త్రము ప్రకారము రాజేకదా ముఖ్యరక్షకుఁడు.

కం. అర్థిని నభిషేకపుసప,దార్థములఁ బ్రదక్షిణించి • తతభక్తిని ద
న్నర్థించునెల్ల వారికిఁ, బార్థివసుతుఁ డిట్లు పలికెఁ • బరమప్రీతిన్. ౧౩౮

తాత్పర్యము.

రాజ్యకర్తలు (King-makers) చూపించిన యభిషేకవస్తువుల నెల్లఁ బ్రీతితో భక్తితోఁ బ్రదక్షిణము గావించి తన్నుఁ బ్రార్థించునెల్లవారికి మిగులఁ బ్రీతితో రాజకుమారుఁ డిట్లనియె.

సీ. లోకులారా వినుఁడు • మాకులమునయందు, జ్యేష్ఠుఁ డర్హుండు రా • జ్యేందిరకును
నన్నిట్లు పల్కఁగ • న్యాయమా మీకెల్ల, మాయన్న రాముని • మహిపుఁ జేసి
నేన వసించెదఁ • గాననంబులలోన, నీరేడువర్షంబు • లిది నిజంబు
మాయన్న శ్రీరాము • మరలించి తెచ్చెద, సంతనకట్టుఁడు • సకల సైన్య
తే. ములను గూర్పుండు కొంపోదు • మున్నుగాఁగ, నెల్లయభిషేకవస్తువు • లెల్లవార
లందు పట్టాభిషేక మ • రణ్యమునన, రామునకుఁ జేయువాఁడను • రాగ మెసఁగ. ౧౩౯

రాజ్యేందిరకున్=రాజ్యలక్ష్మికి, ఈరేడు వర్షంబులు=పదునాలుగేండ్లు, సంతన కట్టుఁడు = సిద్ధపడుఁడు.

తాత్పర్యము.

లోకులారా నాయభిప్రాయము వినుఁడు, మావంశమందు రాజ్యలక్ష్మిని వరింప నర్హుఁడు పెద్దవాఁడే. ఇది మీరెఱుఁగరా తెలిసి తెలిసి నన్నిట్లకార్యము చేయ ప్రేరింప మీకు న్యాయ్యమా? మాయన్న శ్రీరాముని రాజుగఁజేసి యాయనకు మాఱుగ నడవులలో నేనే పదునాలుగేండ్లు వసించెదను. ఇది నిజంబు ప్రయాణంబున కందఱు సిద్ధపడుఁడు. మాయన్న శ్రీరాముని మరలించి పురమునకుఁ దెచ్చెదను. సమస్త సైన్యములను సిద్ధముచేయుఁడు. అభిషేకవస్తువులనెల్ల నక్కడికే తీసికొనిపోదును. అరణ్యమందే యాయనకుఁ బట్టాభిషేకము చేసెదను.

కం. సవనాగ్ని రీతిఁ దెచ్చెద, నవనీపతిఁగాఁగఁ జేసి • యభిషేకమహో
త్సవమున తిమ్మెతనయాధవు, నవనీజనులార! నిశ్చ • యం బిది సుండీ. ౧౪౦

సవనాగ్ని=యజ్ఞమండలియగ్ని, చుండీ=చూడుండిసంగ్రహరూపము.

తాత్పర్యము.

ఊరికివెలుపల యజ్ఞముచేసి యింటికి మరల నాయగ్నిని దెచ్చినట్లు లడవి యందు మాయన్నకుఁ బట్టాభిషేక మహోత్సవము జరపి రాజును జేసి పట్టనమునకుఁ బిలిచికొని వచ్చెదను. ప్రజలారా యిది నిజముసుండీ.

ఉ. పేరునమాత్రెఁ దల్లి యగు • వేటఁడి కైక సకామఁ జేయఁగాఁ
గోరఁ జూఁడీ, ధరాధరముఁ • గూర్చి మదగ్రజునిందు నేన కాం
తార నివాసి నయ్యెదఁ, బ • థంబులఁ దీర్పఁగ మిట్టపల్లముల్
భూరికశిల్పివర్గములఁ • బుచ్చుఁడు పంపుఁడు దుర్గవేత్తలన్. ౧౪౧

వేటఁడి=వీటఁడి=అవివేకి, "వీటఁడినైన మానిసికి నెండి వివేకముగల్గ నేర్చునే" భార. ఉద్యోగ. సకామన్=కోరిక ఫలించినదానిఁగా, పథంబులన్ = మార్గములందు, మిట్టపల్లముల్=ప్రాయిక గ్రహణముచే వకారము రాలేదు. సంధి. సూ. ౪౦ సు. వ్యా. భూరిక స్వార్థంబున కప్రత్యయము, విశేషముగ శిల్పవర్గములన్ = శిల్పుల

బనులు చేయువారి సమూహములను, దుర్గవేత్తలన్=దుర్గములఁ గట్టుటకుఁ దెలిసిన వారిని.

తాత్పర్యము.

కన్నతల్లికుండవలసిన గుణములు లేకున్నను గడుపునఁ బుట్టిన దోషమునఁ దల్లియని చెప్పుకొనవలసిన నేను వివేకములేని కైకకోరిక కొనసాగఁ జేయుటకు గోరనుజుండు. ఇచ్చట మాయన్నకు భూభారముఁగూర్చి నేనేయడవియందుఁ బదు నాలుగు సంవత్సరము లుండెదను. కావున నాయన యున్నచోటికిఁ బోవుటకుఁ గాను త్రోవలు చక్కఁజేయింపుఁడు. మిట్టపల్లములు సమముగాఁ జేయుటకు విశేష ముగ శిల్పులను దుర్గవేత్తలను బంపుడు.

చం. అన విని వార లెల్లఁ బ్రమదాశ్రుతరంగితలోచనంబులన్
మనుజవరేణ్యపుత్త్రుఁ గని మానితవాక్కులఁ బల్కి, రన్నకున్
గొనకొని రాజ్య మీయ మదిఁ గూర్చితలం పది లెస్స,దాన నీ
కనయముఁ గూర్చుఁగాక నిరపాయినియై సిరి సంప్రమోదముల్.　　౧౯౭

ప్రమదాశ్రుతరంగితలోచనంబులన్ = సంతోషబాష్పములచే నిండిన కన్నులచే, మానితవాక్కులన్=శ్లాఘ్యమైన మాటలతో, అనయము = సర్వదా, నిరపాయినియై=ఎడఁబాయనిదై, సిరి=లక్ష్మి, సంప్రమోదముల్= అత్యధికమైన సంతోషములను.

ఏదైన శుభవార్త వినుటవలననో, గంధము పూలు ధరించుటవలననో గలుగు సంతోషము మోదము. తొలిచూలు కొడుకు పుట్టినాఁడనియో చిరకాలవష్టమైన ధనము లభించుటయో యిట్టివానివలనఁ గలుగునది ప్రమోదము. ఇవి క్షణకాల భంగురములు. తనకుఁగలిగిన సర్వస్వము స్వామికి సమర్పించుటచేఁ గలుగు శాశ్వత బ్రహ్మానందము సంప్రమోదము. ఇట్టిదానిని శ్రీ కలిగించునుగాక యనుటచే శ్రీ పురుషకారము సూచింపఁబడియె. అనయము నిరపాయిని యను శబ్దము లీయర్థ మును స్ఫురింపఁ జేసెడిని. "త్యాగేనైకేనా మృతత్వమానశుః" ఒక్కత్యాగము చేతనే మోక్షముకలదని శ్రుతిచెప్పుచున్నది. పితృదత్తమైన సంపూర్ణరాజ్యము భోగ మును, ధర్మరక్షణార్థమై నిండారు మనస్సుతో వదలుటకంటెఁ ద్యాగము మఱియెద్ది కలదు 'నలింగం ధర్మకారణ' మ్మని యుండుటచే మానసిక త్యాగము శ్రేష్ఠము కాని బాహ్యవేషధారణము ముఖ్యమైనదికాదు. అది సుకరము.

తాత్పర్యము.

ఆమాటలువిని వారందఱు సంతోషబాష్పములచే నిండిన కన్నులతో రాజ కుమారునిఁజూచి శ్లాఘ్యమైన వాక్కుల నిట్లనిరి. రాజనందనా! నీవు మీయన్నకు రాజ్యమీయవలెనను తలంపు మిగుల మేలైనది. ఇట్టి యుదారభావము నీకుండు టచే నీకు శాశ్వతముగా శ్రీదేవి యత్యధిక సంతోషములను శాశ్వత బ్రహ్మానంద మును గలిగించునుగాక.

కం. నరవర! నీయాజ్ఞప్తిని, వరశిల్పుల మార్గవిదులఁ ♦ బంచితి మిపుడే
గురుభక్తుల ననుచును నిర్భరముదమున వారు చనిరి ♦ పనులం దీర్పన్. ౧౫౪౩

నరవర=(1) మనుష్యులందు శ్రేష్ఠుఁడా (2) జీవులందు శ్రేష్ఠుఁడా, అనాయాసముగ స్వప్రయత్నముగ నయాచితముగ లభించిన యింతటిరాజ్యము శ్రీరామునకు భక్తితో సమర్పించువాఁడు నరవరుఁడగుట యేమివింత, ఆజ్ఞప్తి = ఆనతిని, వరశిల్పులన్=శిల్పులందు శ్రేష్ఠులైనవారిని, మార్గవిదులన్ = మార్గము దెలిసినవారిని, గురుభక్తులన్ = (1) గొప్ప భక్తిగలవారిని, (2) గురువులందు భక్తిగలవారిని, నిర్భరముదమునన్=విశేష సంతోషముతో.

గురుభక్తులగు మార్గవిదులే శ్రీరామదర్శనప్రాప్తి తమకేకాక తక్కినవారికిని గలుగుమార్గములు చక్కఁజేయువారని భావము. దానికి, నరవర = పురుషోత్తమ, ఆజ్ఞప్తి=ఆనతికావలయును, భగవత్ప్రేరితులైన గురుభక్తులే యీ కార్యము చేయఁగలవారు భక్తిలేనివారి నిట్టికార్యముల నియోగించినఁ గీడును గలుగవచ్చును.

తా త్ప ర్య ము.

రాజా! నీయానతిప్రకారము గురుభక్తుల మార్గవిదుల వరశిల్పుల నిపుడే పంపితిని. అని వారును పనులు చక్కఁజేయఁబోయిరి.

—♦ ౮౦-వ సర్గము. పౌరులు వనమార్గంబును జక్కఁబఱుచుట ♦—

సీ. అంతట స్థలజ్ఞులు ♦ యంత్రకుల్ ఖనకులు, సూత్రకర్మ చణులు ♦ శూరవరులుఁ
గమ్మరి వడ్రంగి ♦ కమ్మటీండ్రును, గూలి,వాండ్రును మేదర♦వాండ్రు బావి
త్రవ్వువారును బేలు♦దార్లును మార్గదర్శకులును లోనుగాఁ ♦ జతురులైన
పనివాండ్రు మున్నుగాఁ ♦ జనిరి సముద్రంబు, పున్నమరే పొంగి ♦ పొరలురీతి
తే. గాసిఁబడుదు మెయనక ప్ర♦యాసమనక, రామచంద్రునిఁజూచెడి♦ ప్రమదమునను
దమకుఁదామబయల్ దేఱి♦తరలిచనిరి,మూఁగిమెల్లరుఁ దమకోఱ♦ముట్లుకొనుచు.
౧౫౪౪

స్థలజ్ఞులు = భూమిలక్షణము దెలిసినవారు పోవలసిన స్థలము నెఱిఁగినవారు, యంత్రకుల్= 1 మృగములఁ బట్టువలలులోనగు యంత్రములుగలవారు, ఖనకులు = త్రవ్వువారు, సూత్రకర్మచణులు = సూత్రముచేఁ జేయు కార్యము సూత్రకర్మము, నేఁత, దానియందు నిపుణులు = సాలెవారు, 2 కొలతలు చూచుటకై వంకరలు లేకుండుటకై నూలుపట్టువారు, కమ్మరి=ఇనుపపనిచేయువాఁడు, వడ్రంగి = వడ్లపని చేయువాఁడు, ప్ర. వర్ధకి, కమ్మటీండ్రు = కమసాలవారు, బేలుదార్లు = గోడలు కట్టువారు, మార్గదర్శకులును = దోవచూపువారు, కోఱముట్లు = సాధనములు, తమకుఁదామ = ఒకరు చెప్పక పిలువక తమంతటఁదామే, శ్రీరామకార్యమునకుఁ బిలువకయేవచ్చి వారిచేనగుకార్యములు చేయువారుత్తములు, సాత్త్వికులు పిలిచిన

వచ్చిపనిచేయు రాజసులు మధ్యములు. పిలిచినను రానివారధములు తామసులు–
మూఁగి = గుంపుగూడి.

### తా త్ప ర్య ము.

అంతట స్థలజ్ఞానముగలవారు యంత్రములు గలవారు వలలగుంతలు త్రవ్వు వారు సాలెలు– నూలుపట్టువారు శూరులు కమ్మరులు వడ్రంగులు కమసాలులు కూలివాండ్రు చాఁపల బుట్టలవల్లు మేదరవాండ్రు బావులు త్రవ్వువారు జేలు దార్ల మార్గముచూపువారు మొదలగు నేర్పరులైన పనివాండ్రు పున్నమినాఁటి సముద్రము పొంగువిధమున ముందుగాఁ గూటికి నిళ్ళకు శ్రమపడుదుమొ యనక దేహమునకుఁ గష్టమనక శ్రీరామచంద్రునిఁ జూడవలయునను కోరికచేత నొకరిచేఁ బిలిపించుకొనక తమంతటఁ దామే తమ తమ పనిసాధనములు తీసికొని గుంపులై బయలుదేఱిపోయిరి.

దీనివలన నెట్టిహీన జాతివాఁడైనను భక్తిగలవాఁడయ్యేనేని వాని వాని స్వధర్మముచేతనే భగవద్దర్శన ప్రాప్తికి యోగ్యుఁడగుచున్నాఁడని యేర్పడుచున్నది.

నజాతిః కారణంలోకే, గుణ ఏవహికారణమ్మని శ్రీరామానుజసూక్తి.

భగవత్కార్యము చేయువలసివచ్చినపుడు మనల నెవరు పిలువలేదే మనమేల పోవలెననియుండుట దోషము అది భక్తుని లక్షణముగాదు.

ఉ. ముండ్లను తాలుఁ జెట్లు మును • ముట్టుగ నూడ్చుచుఁ, ద్రోవ కడ్డ మౌ
గండ్లను బూడ్చి లేనియెడ • తీర్మజసమూహము నాటి, గండ్రగొ
డ్డండ్లను గత్తులం బొదల • ధాళమెయిన్ విదళించి చక్కఁగా
బండ్లను బోవున ట్లడవి • బాటలు తీర్చుచుఁ బోవఁ గొందఱున్. ౧౫౪౫

మునుముట్టుగ = మొదలంట, నిశ్శేషముగ, ధాళమెయిన్ = బలముచే, తాయి, బహు. తాలు.

### తా త్ప ర్య ము.

పోవుబాటయందు నడచువారికి సంకటము గలిగించు ముండ్లను తాలను జెట్లను నిశ్శేషముగఁ దీసివైచుచుఁ ద్రోవ కడ్డమైన గుంతలను గండ్లను బూడ్చుచుఁ జెట్లు లేనియెడఁ జెట్లగుంపులను పొదలను గండ్రగొడ్డండ్లచేతను గత్తులచేతను నతికి వైచిబండ్లుపోవునట్లు లడవిలో బాటలు దీర్చుచుఁ గొందఱుపోయిరి.

తన శ్రేయస్సుమాత్రముగోరి పనిచేయు స్వార్థపరుఁడుత్తముఁడుగాఁడు. పరు లకును సుకరమైన మార్గమేర్పాటుచేయువాఁడే యుత్తముఁడని భావము.

సీ. కొందఱు చొరరాని • కుటిలకాననములఁ, దగులంగఁ జెట్టిరి • ధగధగ మనఁ
గొందఱు మట్టంబు • నొందించి రున్నతస్థలులఁ బల్లంబుల • సత్వరముగఁ
గొందఱు పెద పెద్ద•గుంటలు పూడ్చిరి, వంతెనల్ గట్టిరి • వలయుచోట
రాగొట్టునేలల • బాగుగఁ జదిపిరి, చెఱువుకట్టలఁ గొన్ని • నతికి రంధ్రఁ

తే. గొంది అరిగట్టివాఁగులు • కొండవంక, గముల భద్రము వలిచిరి•కడలినాఁగఁ
బెనుజలాశయముల నీరు • గననిచోట, మడుఁగులను ద్రవ్వి రెల్లరు•గడియలోన.
౧౯౪

కుటిల కాననములన్ = వంకరటింకరై దోవలు సరిగాలేని యడవులను, తగులంగఁ బెట్టిరి = కాల్చిరి, మట్టంబు = నేలతో సమము, ఉన్నతస్థలుల = ఎత్తు ప్రదేశములను, వదిపిరి = నలియఁగొట్టిరి, అరిగట్టి = అడ్డముగట్టి కడలినాఁగన్ = సముద్రమో యనునట్లు, జలాశయములన్=మడుఁగులను.

తా త్ప ర్య ము.

మనుష్యులు ప్రవేశించుటకు వల్లలేని వంకరటింకరదోవలుగల యడవులను గొందలు ధగధగమండఁదగులఁబెట్టిరి. కొందఱు పెద్దగుంతలఁబూడ్చిరి. వెళ్ళుదారిఁదఁ బెద్దవంకలమీఁద వంతెనలఁగట్టిరి. రాతిగొట్టు నేలలయందలి రాలను నలియఁ గొట్టి మెత్తగానుండఁజేసిరి. నీళ్ళులేని చెఱువులకట్టలను దెగఁగొట్టిరి కొందఱు చిన్న వంకలకు వాఁగులకు నడ్డముగట్టిరి. నీళ్ళులేనిచోటుల మడుఁగులు చెఱువులు నేర్పాటుచేసిరి.

సీ. గారపూఁతలతో ని • గారపుఁగుట్టిమ,తలములు పొసఁగించి • కొలఁకులందుఁ
బూలచెట్లను మఱి • మేలిప్వనంబుల పతీల ధ్వజములఁ • బరఁగఁజేసి
విడుదలపట్టుల • వివిధసుమంబులఁ, గై సేసి చందన • గంధవారిఁ
జల్లఁగనాసేన • చనుత్రోవ సురపథ,మోయన శోభిల్లె • నొప్పుమెఱసి

తే. యాజ్ఞ మేరకు నధికారు • లచటనచట, రుచిరతలముల భరతున • కుచితమైన
సన్నివేశాళిఁ గూర్చిర • శస్తతార, సొగసు చేసిరి మఱి పెక్కు • తెగలవాని.
౧౯౫

నిగారపు = శ్రేష్ఠములై, కుట్టిమతలములు = రాతికల్పనపు నేలలయందు, విడుదల పట్టులన్ = దిగుచోటులందు, కై సేసి = అలంకరించి, సురపథమో = దేవతలమార్గమో, సన్నివేశాళిన్ = ఉండుటకుఁదగిన వసతులను, డేరాలను, ప్రశస్తతారన్=మంచినక్షత్రమున, పెక్కు తెగలన్=అనేకవిధముల.

తా త్ప ర్య ము.

రాతికట్టడపు నేలలను గారపూఁతలతో నునుపుగానుండఁజేసిరి. కొలఁకుల యొడ్డులందుఁబూల చెట్లను మంచివనములను అందుఁ బతాకలను ధ్వజములను వ్యాపింపఁ జేసిరి. మనుష్యులు దిగిమెడి చోటులను బుష్పములతో నలంకరించి గంధపునీళ్ళు చల్లఁగా నాత్రోవ దేవమార్గమున్నట్లులుండెను. సురపథమనునది ముక్తజీవుఁడు పోవు దేవయానము— (అర్చిరాది మార్గమును సూచించుచున్నది. భగవంతుని సన్నిధికిఁ గొనుపోవునది యదియకదా. మీఁదఁజెప్పిన వన్నియుఁ శ్లేశములను బ్రతి

బంధముల నివారించుటగా నెఱుఁగవగు. అనఁగా మిట్టలు పల్లములు నేలసమముగాఁ జేసి యనఁగా మిట్టలు సమము చేయుట సంతోషాతిశయమున నుప్పొంగక మిట్ట పడక యుండుట. పల్లములు సమముచేయుటయనఁగా దుఃఖమునఁ గ్రుంగిపోక సమ బుద్ధియైయుండుట– సమబుద్ధియైయుండుట 'సమత్వం యోగ ఉచ్యతే' యనికదా భగ వద్గీత చెప్పుచున్నది. ఇవి ద్వంద్వముల కన్నిటికి నుపలక్షణగా నెఱుఁగునది. వంతె నల్ కట్టుటయనఁగాఁ దమ్ము ముంచు శక్తిగల విషయసుఖంబులందు దిగక వానిని స్పృశింపక పైపైననే దాటిపోవుట. తమమార్గమున సుఖప్రయాణము సేయ నీయక సంకటపెట్టువారిని బంధువులను గొట్టియైన మృదువు పఱచుట తాగొట్టు నేలలఁ జదువుట, మడుఁగులు త్రవ్వుట. పూలచెల్లించుట. విడుదల నేర్పాటు చేయుట యనునది భక్తిమార్గమునఁబోవు భాగవతులకు సాహాయ్యము చేయుట– ఇట్టులే తక్కినవి యూహించునది.

భరతుఁడు దిగుటకుఁ దగిన స్థలములని యధికారులు చెప్పినచోట డేరాలు గొట్టి పందిళ్ళు వేసి యనేకవిధముల వానిని మంచినక్షత్రమందు నలంకరించిరి.

సీ. మున్నిసుమును దుమ్ము • మొనసిన త్రోవలే, యొసఁగెను బరిఖల • నింద్రకీల
భాసురవీథులఁ • బ్రాసాదపంక్తులఁ,గమ్రసౌధములఁ బ్రా • కారములను
ధ్వజముల నంబర•తలముల నొరసెడి,వరవిమానకపోత • పాలికలను
నవ్యమైసురరాజ • నగరంబు దొరయుచు, నాజాహ్నవీతీర • మమరెఁ ద్రోవ

తే. చంద్రతారాసముత్కర • సహితమైన, తారకాపథనిభ మయి•తనరె నపుడు
శిల్పివరనిర్మితం బయి•చెలువు మీఱి,యంతనాందీముఖము రేయి•యందు నెలమి.
౧౨౪

## తాత్పర్యము.

పూర్వమిసుక దుమ్ముగానుండిన నేలలే యిపుడగడ్తలచేతను– ఇంద్రకీల పర్వతములవలెఁ బ్రకాశించు వీథులచేతను ధనికులు రాజులు దిగుటకుఁదగిన మేడలు గల యిండ్లచేతను ప్రాకారములచేతను, టెక్కెములచేతను నాకాశమును దగులు నెత్తైన శ్రేష్ఠములైన మేడంతస్తుల మేడలచేతను గొణిగెలయందలి గువ్వగూండ్ల చేతను మనోహరమై దేవతానగరముతో సమానముగను గంగానదీ తీరమువఱకుఁ ద్రోవయేర్పాటయ్యెను. అది చంద్రునితోడను నక్షత్రములతోడను గూడిన నాకా శముతో సమానమై వారి పనులందు శ్రేష్ఠులైన శిల్పులచే నేర్పాటు చేయఁబడి యందగించెను. గంగాతీరమువఱకు నీ విధమున యాత్రికులకు సౌకర్యమును గలి గించిరనుటచేఁ గాషీతకీ యుపనిషత్తునందుఁ జెప్పఁబడిన యతివాహకులు విరజానది వఱకుఁ జేయుకార్యముల స్ఫురింపఁజేయుచున్నది. అక్కడ నడవులందుఁ బనివాండ్లు పనిచేయుచుండ నిచ్చట నయోధ్యయందు శ్రీరామచంద్రమూర్తిని బిలుచుకొని వచ్చుటకై యారంభము సేయఁదలఁచిన దినమునకు ముందు రాత్రియందు భరతుని

పట్టాభిషేకము కొఱకు వసిష్ఠుని యాజ్ఞానుసారముచేయు శుభకార్యమునకు ముందటి రాత్రియందు దుఃఖశాంతికై చేసిన శుభకార్యము కలుగునని యథార్థ భావార్థము.

## ౮౧-వ సర్గము.

సీ. సూతులు మాగధుల్ • స్తోత్రపాఠంబుల, శ్వ శ్రేయసోక్తులఁ • జదువు చుండ
యామదుందుభులు కో•ణాభిహతంబులై, మొరయ శంఖంబుల • మ్రోఁతలెస గ
భరతుండు మేల్కాని • పరమదుఃఖితుఁ డయి, నరపతి నేఁ గాను • నా కివేల
చాలింపుఁ డని చెప్పి • శత్రుఘ్నుఁ గనుఁగొని, కంటివే తమ్ముఁడా • కైక యెంత
తే. జగములకు నెల్ల నపకృతి • సలిపి నన్నుఁ, బ్రబలదుఃఖంబులకు నెల్లఁ • బాత్రుఁ జేసి
దశరథుం డేగె నదిఁ గర్ణ • ధారహీన,తరి యనన్ రాజ్యలక్ష్మియుఁ • దల్లడిల్లె. ౧౦౪

శ్వశ్శ్రేయోసూక్తులన్ = శుభము కలిగించుమాటలను, యామదుందుభులు = జాముజామునకుఁ గొట్టబడినగారాలు, కోణాభిహతంబులై = వాగించెడి కఱ్ఱలచేతఁ గొట్టఁబడినవై, అపకృతి = అపకారము, నది = ఏటియందు. కర్ణధారహీన = ఓడ నడపువాఁడులేని, తరి = పడవ, రాజ్యలక్ష్మియు = పెద్దరాజున్నప్పుడే పెద్దకొడుకును రాజుచేసి విచ్ఛేదములేక యేలఁబడు రాజ్యలక్ష్మి.

### తాత్పర్యము

సూతులు మాగధులు మంగళకరములైన మాటలచే స్తోత్రపాఠంబులఁ జదువుచుండఁగా, జాముజామునఁ గొట్టు నగారాలు వాగించుకోడువులచేఁ గొట్టఁబడి ధ్వనించుచుండ, శంఖముల మ్రోఁతలధికముగాఁగ భరతుఁడు మేలుకొని మిగుల దుఃఖించి వారినిజూచి రాజును నేనుగాను. రాజునకుండవలసిన విధియున్నియు నాకేల చాలింపుఁడనిచెప్పి శత్రుఘ్నునిఁజూచి తమ్ముఁడా! చూచితివా కైక లోకమున కంతయు నెంతయపకారము చేసెనో నన్నెంత బలిష్ఠదుఃఖమునకుఁ బాత్రునిఁ జేసెనో రాజుమరణించుటచే నడపువాఁడు లేనియోడ యేటినీళ్ళలోఁ గదలుచున్నట్లు రాజ లక్ష్మియు రాజులేక తల్లడిల్లుచున్నది.

కం. మన కెల్లరకును దిక్కగు, నసఘుని శ్రీరాము వనికి • న్యాయేతర నై
పనిచెను నాతల్లియ యే, మని యేడ్చెద నయ్యయిట్టి • యాగడమునకున్. ౧౦౫

### తాత్పర్యము.

మనకందఱకు రక్షకుఁడగు పుణ్యాత్ముని శ్రీరామచంద్రమూర్తిని న్యాయము తప్పియడవులకు మఱియెవ్వరుగాదు నాతల్లియేపంపెను. ఇటువంటి దుష్కార్యములకు నేనేమని యేడ్తునయ్యా.

సీ. అని యేడ్వ శుద్ధాంత • జనములు పలవించు, చుండ వసిష్ఠుఁ డ • త్యుత్తమార్ఘ
రత్నమయం బయి • రాజిల్లుకొల్వుకూ,టంబును శిష్యగ • ణంబు గొల్వఁ

జొచ్చి కాంచనమయ • సుఖదపీఠంబున, నాసీనుఁడై సేవ • కాళిఁ జూచి
ద్విజుల నమాత్యులఁ • బెద్దలఁ బిలుఁ డాల్య,యిక ముందు గలదు భూ • మీశసుతుల
తే. భరతశత్రుఘ్నులను హిత • వరుల విజయు, నలసుమంత్రునితో ముఖ • ననఁగ వారు
పిలువ హాలహాలశబ్దంబు • బలియ వచ్చి, రంద అశ్వరథాదివా • హనము లెక్కి. ౧౯౧

శుద్ధాంత జనములు=అంతఃపురమున నున్న వారువారు, పలవించుచుండన్=ఏడ్చుచుండఁగా, అత్యుత్తమార్ఘ్య రత్నమయంబయి = మిక్కిలి శ్రేష్ఠములై వెలగల రత్నములచే నిండినదయి, కాంచనమయి = బంగారుతోఁ జేయఁబడిన, సుఖద=సుఖమునిచ్చు, పీఠంబునన్=పీటయందు, ద్విజులన్=బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులను, అత్యయికము=శీఘ్రముగఁ జేయవలసిన యవశ్యకార్యము, విజయుఁడు సుమంత్రుఁడు మంత్రులు అశ్వరథాది వాహనములు=గుఱ్ఱములు రథములు మొదలగు వాహనముల నెక్కి.

### తాత్పర్యము.

ఇక్కడ నింటియందు భరతుఁడిట్లు శేడ్వఁగా నంతఃపురమున వారును నేడ్చుచుండిరి. అక్కడ వసిష్ఠుఁడు మిక్కిలి యుత్తమమై వెలగల రత్నములచే నిండియున్న కొలువుకూటమునందు శిష్యులతోడఁ బ్రవేశించి బంగారుపీటయందు సుఖముగఁ గూర్చుండి సేవకులనందఱఁ జూచి మీరు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ప్రముఖులను అమాత్యులను పెద్దలను రాజకుమారులను భరత శత్రుఘ్నులను మంత్రులగు విజయ సుమంత్రాదులను నవశ్యము చేయవలసినకార్యము గలదని పిలుచుకొని రండనఁగా వారుపోయి యట్లే యందఱకుఁ దెలియఁజెప్పఁగా వారెల్లరు హాలహాల శబ్దములతో గుఱ్ఱములను దేరులను వారివారి కిష్టమైన యితరవాహనముల నెక్కి వచ్చిరి.

కం. వచ్చెడిభరతునిఁ గనుచు వి,యచ్చరవిభు నాకవాసు • లట్టుల రామ్రై
వచ్చి దశస్యందను మును, వచ్చుపుమతిఁ గొలుచునట్టు • లందఱుఁ గొలువన్. ౧౯౨

వియచ్చరవిభున్=వియత్+చర+విభున్ = ఇంద్రుని, నాకవాసులు = స్వర్గమున నుండువారు.

### తాత్పర్యము.

ఇట్లువచ్చి సభకు వచ్చుచున్న భరతున కెదురుగ నింద్రున కెదురుగఁబోవు దేవతలవలెఁబోయి తోడితెచ్చి పూర్వము దశరథు నెట్లుగొలిచిరో యట్లే గొలిచిరి.

కం. తిమినాగసంవృతం బగు, స్తిమితోదకరత్న శంఖ • సికతాహ్రద మ
ట్లమరె సభ భరతుచేఁ బూ,ర్వము దశరథుచేతఁబోలె • రాజ దలిర్పన్. ౧౯౩

తిమి=తిమియను చేపలతోను,నాగ=పాములతోను సంవృతము = చుట్టఁబడినది, స్తిమిత+ఉదక=కదలని నీరుగల, రత్నశంఖసికతా = రత్నములు: శంఖములు,

ఇసుకగల, హ్రదము=మడుఁగు, తిమినాగములకుసాటి భరతశత్రుఘ్నులు, స్తిమితోదకమునకు వసిష్ఠుఁడు రత్నశంఖసికతాదులకు వివిధయోగ్యతలుగల సభ్యులు సాటియగుదురు.

పూర్వము దశరథునిచేవలె నిప్పుడు భరతునిచేఁ బ్రకాశించు సభ తిమినాగములచేతను స్తిమితోదకముచేతను రత్నములతో శంఖములతో నిసుకతోఁ గూడిన పెద్ద మడుఁగువలె నుండెను.

—• ౮౨-వ సర్గము వసిష్ఠుఁడు భరతునిఁ బట్టాభిషేకము చేసికొమ్మని చెప్పుట •—

సీ. ఆర్యజనాకీర్ణ • మైనయాసభలోన, నర్హాసనంబుల • నందఱకును
నియమించి కూర్చుండ • నయమున వచియించి, భరతుఁ డున్నంత స • భాస్థలంబు
వస్త్రాంగరాగప్ర • భావిభాసిత మయి, శారదసంపూర్ణ • చంద్రకలిత
యామినియును బోల • నలరి వసిష్ఠుఁడు, లేచి యెల్లరఁ బాఱఁ • జూచి కైక

తే. తనయుతో నిట్లు వచించె • ధర్మవిదుఁడు, మృదువుగా వత్స నీతండ్రి • పృథివియేలి
ధర్మపద్ధతి బహుధన • ధాన్యవతిని, ధరణి నిల్లను నీకిచ్చి • యరిగె దివికి ౧౬౪

ఆర్యజన=పెద్దమనుష్యులచే, ఆకీర్ణము = నిండినది. అర్హాసనంబులన్ = వారివారికిఁ దగిన యాసనములను, నయమునన్=మంచిమాటలతో, వస్త్ర = ధరించిన వస్త్రములయొక్కయు, అంగరాగ = గంధపుఁ బూఁతయొక్క, ప్రభా=కాంతిచే, విభాసితమై=ప్రకాశించినదియై, శారద సంపూర్ణచంద్రకలిత = శరత్కాలమునందలి (కార్తికమాసమునందలి) సంపూర్ణచంద్ర = నిండుచందురునితో, కలిత = కూడిన, యామినియుఁబోలెన్=రాత్రివలె, అలరి=సంతోషించి, పాఱఁజూచి = కలయఁజూచి, ధర్మవిదుఁడు=రాజవంశ ధర్మము తెలిసినవాఁడు, మృదువుగా=మెత్తని మాటలచే, వత్స=కుమారా

తాత్పర్యము.

పెద్దమనుష్యులచే నిండిన యాసభలో వచ్చినవారి నందఱను వారివారికిఁ దగిన స్థానంబులందుఁ గూర్చుండుఁడని మంచిమాటలతో భరతుఁడు చెప్పి తన యాసనమునఁ దానుండఁగా సభాప్రదేశము వస్త్రములయు గంధపుఁ బూఁతలయుఁ గాంతిచేఁ బ్రకాశించి శరత్కాలమునాఁటి నిండు చందురుఁడుగల రాత్రివలె నుండఁగా సంతోషించి రఘువంశధర్మము నెఱిఁగిన వసిష్ఠుఁడు లేచి యందఱను గలయఁజూచి భరతుతోడ నిట్లనియె కుమారా! నీతండ్రి రాజ్యపరిపాలనము ధర్మమార్గమునఁ గావించి విశేష ధనధాన్యములతోఁ గూడిన భూమిని నీకిచ్చి స్వర్గమునకుఁ బోయెను.

తే. సత్యధృతిరామచంద్రుండు • సత్పురుషుల, ధర్మపద్ధతిఁ దలపోసి • తండ్రియాజ్ఞ
నడువ నడవికి జనియెను • నళినవైరి, వెన్నెలను బాయ లేనట్టి • విధము దోఁప. ౧౬౫

సత్యధృతి=సత్యమునఁ బట్టుదలకలవాఁడు, శశివద్వైరి=చంద్రుఁడు, 'జీవతో వాక్యకరణాత్, ప్రత్యబ్దం భూరిభోజనాత్, గయాయాం పిండదానాచ్చ, త్రిభిః పుత్రస్యపుత్రతా' యని పుత్రలక్షణము. తండ్రి జీవించియుండు కాలమున నాయన మాటప్రకారము నడచుట, ఆయన మరణించినతరువాతఁ బ్రతిసంవత్సరము విశేషముగ నన్నదానము చేయుట, గయయందుఁ బిండప్రదానముచేయుట యీమూఁడు చేయువాఁడు పుత్రుఁడనఁబడును వానియందుఁ బుత్రశబ్దము సార్థకము అను ధర్మము తెలిసిన శ్రీరాముఁడు.

## తా త్ప ర్య ము.

సత్యమందు స్థిరబుద్ధిగల శ్రీరామచంద్రుఁడు సజ్జనుల ధర్మమార్గ మాలోచించి తండ్రియాజ్ఞనడుపఁ జంద్రుఁడు వెన్నెలను బాయలేని విధముగఁ బుత్రధర్మమును నెడఁబాయలేక యడవికిఁ బోయెను.

వెన్నెలను బాయలేని చంద్రునివలె ననుటచే శ్రీరామచంద్రుని జీవతో వాక్యకరణార్తను ధర్మమునుండి యెడఁబాయఁజేయ నీకు సాధ్యముగాదనియు, నీవా యనను బిలుచుకొని వచ్చుట పట్టాభిషేకము చేయుట యనునది వ్యర్థప్రయత్నమనియు, ఈపదునాలుగు సంవత్సరములు నీవు రాజైనను గాకున్నను రాజ్యపాలన భారము తప్పదనియు,వసిష్ఠునభిప్రాయమనియు నుపమానబలముచే స్ఫురించుచున్నవి.

చం. జనకసహోదరప్రదము♦తొమ్మెతల మెల్ల నకంటకంబుగాఁ
　గొనుము నిజాభిషేకమును ♦ గొబ్బునఁ గైకొను మంత్రులెల్లరున్
　ఘనముదితాత్ము లీధరణి ♦ నాల్గుచెఱంగుల నున్న తేండ్లు నీ
　కొనరిన రక్తిఁ గూర్తురు స♦ముత్సుకులై బహుళంపుఁ గానికల్. ౧౫౨

జనకసహోదరప్రదము = తండ్రిచేత నన్నచేత నీయఁబడినది, అకంటకంబుగాన్=శత్రువులు లేకుండ, ఘనముదితాత్ములు=మిక్కిలి సంతోషించిన వారు, నాల్గుచెఱుంగులన్=నాలుగుదిక్కులందు.

## తా త్ప ర్య ము

నీకు రాజ్యము నీకంటెఁ బెద్దవారగు నీతండ్రి, అన్న మనఃపూర్తిగా నిచ్చినదే కాని యన్యాయార్జితముకాదు. నేనీరాజ్యమును గైకొన్న న్యాయమైన ప్రభువుగాఁ డని యెవరైన నీతో విరోధింతురను భయము నీకక్కఱలేదు. తిరస్కరించువాఁడు లేకయె నీవు పట్టాభిషేకము చేసికొనవచ్చును. ఈవిషయమునమంత్రులందఱు సంతోషించువారే. మంత్రులేకాదు. నాలుగుదిక్కుల నీయేలుబడికి లోపడిన రాజులందఱు నిన్ను రాజుగా నంగీకరించి నీకుఁ బ్రీతితో విస్తారముగఁ గానుక లర్పింతురు. సర్వజన సమ్మతివిషయమై నీవు సందేహింపఁ బనిలేదు.

రాజకర్తలు దీనికి ముందే యీవిషయము ప్రస్తావించిరే మరల నిదియేలయని సందేహింపఁ బనిలేదు అది రాజకర్తలకు నుద్యోగులకు భరతునకు భరతునింట జరి

గిన సంభాషణమేకాని జరుగవలసిన క్రమపద్ధతి ననుసరించి జరగిన వ్యవహారము కాదు. బహిరంగమున విషయము పరిష్కారము కావలయునని యీసభ గూర్పఁబడెను.

చం. అన విని భూరిశోకమున • నాత్మ నిజాన్వయధర్మ మెంచుచున్
ఘను రఘురాముని దలఁచి • గద్గదపాటున నక్కుమారుఁ డి
ట్లని కలహంసనాదమున • నా గురువర్యుని గర్హలాడె ఛీ
యని గురు వంచు నిండుసభ • యంచును గొంకక యారటంబునన్. ౧౦౯౭

భూరిశోకమునన్=గొప్పవ్యసనముచే, నిజాన్వయధర్మము=జ్యేష్ఠుఁడే రాజ్యార్హుఁడను తమవంశ ధర్మమును, ఎంచుచున్=తలంచుచు, కలహంసనాదమునన్=కలహంస స్వరమువంటి స్వరముతో, గర్హలాడెన్=నిందించెను. అరటంబునన్=పరితాపముతో, గొంకక=సందేహింపక, భూరిశోకమునన్ = తండ్రిచచ్చెనని శోకమునొందెను. శ్రీరామచంద్రునిమాఱు నీవు పట్టాభిషేకము చేసికొమ్మనుటచే నెక్కువగ శోకించెను. వసిష్ఠునంతటివాఁడుకూడ నన్నీ యధర్మకార్యమునఁ బ్రేరేంపవచ్చునా యని యధికశోకము, నిజాన్వయధర్మమెంచుచున్=వసిష్ఠుఁడు ధర్మమెంచక కక్కుర్తిపడిమ నాపద్ధర్మము నెంచెనని భావము.

ఘనుఁడగు రాముఁడనుటచే ఘనుఁడు రాముఁడుండఁ నధముఁడనగు నాకు రాజ్యమిచ్చెద ననుచున్నారే మీరెంత మతిహీనులని భరతుఁడెంచెను. అకుమారుఁడు =అబాలుఁడు. బాలునకున్న వివేకము వసిష్ఠునకు లేదాయెఁగదా కుమారుఁడనిన నాకుమారుఁడు కుమారుఁడుగాని యందఱు కుమారులా కు + కుమారుఁడు=కుత్సిత పాపమును జంపువాఁడు కుమారుఁడు ఆశబ్దము భరతునందుఁగదా సార్థకమ్మని కవి యాశ్చర్యపడుచున్నాఁడు. "కుపాపేత్సే కత్సితాయా" మ్మని నానార. సుఖానుభవ యోగ్యకాలమున నయాచితము, నప్రయత్నలబ్ధమైన గొప్పరాజ్యము వచ్చినను ధర్మలోపభయమున వలదనుచున్నాఁడే పిఁడెక్కడిపిల్లవాఁడని యాయన జితేంద్రియత్వమునకుఁ గవి యాశ్చర్యపడుచున్నాఁడు.

గురువర్యునిన్=గురువర్యుఁడయ్యు నింత యధర్మమై క్రూరమైన కార్యమందు బాలుని నన్నుఁ బ్రేరేంపవచ్చునా. గురువంచున్. అష్టానేత్యాన్యవ్రతఘ్నాని హ్యాపోమూలం ఘృతంపయః।హవిర్బ్రాహ్మణ కార్యంచ గురోర్వచన మౌషధ।మ్మనునట్లు గురువాక్యము వినిన వ్రతభంగము లేదను న్యాయమును నాదరించి నిండుసభయందు గురువునం దేదేని దోషముండిన నీకిది సరియైన నడతగాదని రహస్యముగఁ జెప్పవలయునుగాని నలుగురిలో నవమానింపఁగాదు అను శాస్త్రమునుగూడఁ దలంపక, ఛీ యని గర్హలాడెన్=ఛీయని నిందించెను. భరతుఁడు వసిష్ఠుని నిందింపఁ గారణము లేమనః-వసిష్ఠుఁడు=పురోహితుఁడు ముందు హితమెంచువాఁడు. అట్టివాఁడు తనకు హితమైనదాని బోధింపక ప్రియములాడుచున్నాఁడు. కావున నాయన పురోహితుఁడు

కాఁడు. (2) ఆచార్యుఁడు=ఆచార్యుఁడగువాఁడు శిష్యులను శాస్త్రీయమైన సదాచారమున నిలుపువాఁడు అట్టివాఁ డశాస్త్రీయమైన దురాచారమందుండఁ బ్రేరించుచున్నాఁడు. ఇట్టివాఁ డెట్లాచార్యుఁడగును. కావున నాయన గర్హ్యుఁడే. రహస్యముగ నిందింపరాదా యనిన నిండుసభలోఁ గూర్చుండఁబెట్టి ప్రశ్నించినపుడు బహిరంగముగఁ బ్రత్యుత్తరమీయక రహస్యముగఁ జెప్పెదను లెమ్మనరాదు. ప్రత్యుత్తర మీయకుండిన నది యంగీకారసూచక మగును.

కావునఁ బ్రత్యుత్తరమీయక తప్పదయ్యెను. గర్హించుటకు మఱియొక కారణ మేమన నలుగురు తనప్రభుత్వము నంగీకరింపరేమో యను భయముచే వలదను చున్నానని యాశయము నాకక్కఱలేదని నానిరాకరణమునకు నన్యథార్థకల్పనము చేసెను. ఇది కేవల మసహ్యము.

చం. గురుకులవాసి నై శ్రుతు లకుంఠితరీతిని నభ్యసించి యె
ల్లరు మతిమంతుఁ డంచనఁ గెలంగెడి ధర్మరతాత్మరాజ్యమే
పురుషుఁడు నావలెం గొనఁగఁ బూనును? బంక్తిరథేంద్రుపట్టినై
గురుఁ డగురామచంద్రుసిరిఁ గోరఁగ నంతటిపాపజాతినే ?            ౧౧

గురుకులవాసినై=ఇక్కడ కులమనఁగా నిల్లు, విద్యాభ్యాసము నిమిత్తమైగురు సేవచేయుచు గురునింటనే యున్నవాఁడనై, శ్రుతులు = వేదములు, అకుంఠితరీతిన్ = ఏమిలోపము లేనట్లు, మతిమంతుఁడు=శాస్త్రార్థములను జక్కఁగ గ్రహించినవాఁడు, ధర్మరతాత్మన్=అర్థము దెలిసికొనుటయేగాక యందుఁ జెప్పఁబడిన ధర్మకార్యముల యనుష్ఠానమందు నభిలాషకలవానియొక్క, నావలెన్ = శాస్త్రబద్ధుఁడగు నావలె, పట్టి=కుమారుఁడు, గురుఁడు=పెద్దవాఁడు, పాపజాతినే=పాపపుజాతియందుఁ బుట్టినవాఁడనా! పాపాత్మునకుఁ బుట్టినాఁడనా ; పాపపురీతిఁ బుట్టినాఁడనా !

తాత్పర్యము.

గురుకులవాసముచేసి కొఱంతలేకుండ వేదములెల్ల నభ్యసించి యందఱచేత బుద్ధిమంతుఁ డనిపించుకొని ధర్మాచరణమందుఁ బ్రీతిగలవాస రాజ్యమును నావలె శాస్త్రబద్ధుఁడగువాఁ డెవ్వఁడు గ్రహింపఁబూనును. దశరథుని కుమారుఁడనై యన్నయగు శ్రీరామచంద్రుని లక్ష్మిని నేను గోరుటకు నంతటి నీచజన్ముఁడ నని తలఁచితివా ? నేనే పాపాత్ముఁడనని తలఁచితివా ? పాపాత్ముఁడగువాని కొడుకనని తలంచితివా ? నే నెట్టివాఁడనని నీవీయధర్మము నాకుపదేశింప వచ్చితివి !

కం. పుట్టియు దశరథునకు నే, నెట్టులు హరియింతు రాజ్య మీరాజ్యమునున్
అట్టులె నేనును రాముని, వి ట్టగుటను నీవ చెప్పు మీ ధర్మగతిన్.            ౧౨

తాత్పర్యము.

దశదిశలందుఁ దనరథమువలెఁ దనకీర్తిని వ్యాపింపఁజేసి శ్రీరామునితోడఁ బ్రాణములు విడిచిన దశరథుని కుమారుఁడనై శ్రీరాముని రాజ్యము నేనెట్లుహరిం

తును ! ఈరాజ్యము, రాజ్యమువలె నేను రెండు శ్రీరామచంద్రమూర్తివే, వాస్తవ మిట్లున్న కారణముచే ధర్మమాలోచించి నీవే చెప్పుము.

అన్యయుష్మదస్మచ్ఛార్యంబులందుత్తరోత్తరంబు బలీయంబను సూత్రప్రకారము (సం. వ్యా. కారక. సూ. ౮౨) ఈరాజ్యము నేను రాముని వారమని యుండ వలెను. రామునివి యనుట సరిగాదని యాక్షేపింపరాదు. వీలన భరతు నభి ప్రాయమున రాజ్యమెట్లు శ్రీరామునిసొత్తో నేను వాచ్యమైన యీదేహము జీవుఁడు నట్టిదే- పారతంత్ర్యమందు రెండును సమానములే. స్వవినియోగమందు దానికెట్లు స్వాతంత్ర్యములేదో నాకు నట్లే లేదు. కావున నేను నచేతనమువంటి వాఁడనే, తన పారతంత్ర్యము సూచింప 'రామునివి' యని చెప్పెను. అహంశబ్దవాచ్యుఁడు కేవల ప్రత్యగాత్మయే కాదు. దేహవిశిష్టాత్మ కావున దేహము ఆత్మ రెండును భగవత్పర తంత్రములే- పారతంత్ర్యమందు రెండును సమానములే- కావున రాజ్యమెట్లు శ్రీరాముని సొత్తో యట్లులే నేను శ్రీరాముని సొత్తునే- నాసొత్తు నేను గాను- కావునఁ దన సొత్తులను స్వామి యపేక్షింపవలయునుగాని సొత్తులు తమలోఁ దాము నొకరి నొకరపేక్షించునా ! కావున రాముని సొత్తులగు నేను రాజ్యము మా యిరు వురిలో నొకరి నొకరు నపేక్షించుట యుక్తము కాదు, అట్లొకరి నొక రపేక్షింప వచ్చునేని రాజ్యమేల నన్నపేక్షింపరాదు. కావున మమ్మిద్దఱను శ్రీరాముఁడే యపేక్షింప స్వతంత్రుఁడు కావున నేను రాజ్యము రాముని సొత్తులమగుటచే నా స్వభావమునకుఁ దగినట్టి ధర్మమును (అనఁగా రక్షకుఁడు వీఁడు రక్ష్యమిది యను ధర్మమును) నాకు (లోకములో నుండు నెవరికో గాదు. లోకములో ననేకులు తండ్రిని నన్నును వధించికూడ రాజ్యమేలుదురు అట్టివాఁడను నేను గాను) చెప్పుమిా నా స్వరూపమాలోచించి చెప్పుమా యని ప్రార్థించెదను. నీవు సామాన్యధర్మము నాలోచించి చెప్పితివి. విశేషధర్మము నాలోచింపవైతివి. ఒకరి ధర్మము మఱి యొకరికిఁ జెప్పరాదు. కావున నా ధర్మము నాకుఁ జెప్పుము. అయ్యా ! ఒక స్వామికే యగు సొత్తొకదాని నొకటి రక్షింపఁ జాలదంటివే. ఒకని సొత్తయిన పెట్టె వాని సొత్తయిన రత్నమును రక్షించుట లేదా. అట్టులే రాజ్యమును నిన్ను రక్షించు నందువా? పెట్టెరత్నమును రక్షించుట స్వామి ప్రేరణము చేతనే కాని స్వయ ముగాఁ గాదు. స్వామి తాను ధరించిన రత్నమును దాను ధరింప నొల్లనప్పుడు పెట్టెలోనుంచి బీగము వేసి చెవిని దన స్వాధీన ముందుంచుకొనును.

అంతేకాని పెట్టె తానై స్వతంత్రించి తనలోనికి రత్నమును దీసికొని మూఁత బిగించుకొనునా. అట్టులే రాజ్యము నేను శ్రీరామచంద్రునివారమే. మేమిరు వురము ఆయన వినియమనము క్రిందనుండువారము. ఆయన యెట్లు చెప్పిన నట్లు జరగవలయును కాఁబట్టే యీవిషయము శ్రీరామచంద్రుని సన్నిధిలోఁ జెప్పి పరిష్కరించు కొందము పదుండు- మన మెంత ప్రార్థించినను నిపుడు సమయము

కాదని నా స్వాధీనపతిచెనేని యాయన శక్తిమీఁద నాయనకుఁ బరతంత్రుఁడనై యాయన యాజ్ఞకుఁ బద్ధుఁడనై యాయన వచ్చువంత దాఁకఁ బెట్టి రత్నమును రక్షించినట్లు నేను రక్షించెదను కాని యాయన యాజ్ఞలేక నేను స్వతంత్రించి రక్షింపను. కావున నాయన సన్నిధానమునకుఁ బోయి రాజ్యమును మనలను గూడ గ్రహింపుమని ప్రార్థింపవలెను. కైకేయీ వర నిర్బంధముచే నాకు రాజ్యము వచ్చినను నాదికాదు. బలాత్కార కృత్యములనెల్ల నకృత్యములుగాఁగదా మనువు విధించెను. కావున కైకేయీ నిర్బంధముచే దశరథుఁడు నాకిచ్చియు నీయని వాఁడే. శాస్త్రమునకు వంశాచారమునకు విరోధముగఁ దానమాలుచేయు నధికారము దశరథునకు లేదు. కావున శ్రీరామా ! యీ రాజ్యము నీ సొత్తే కాని నాది కాదని యాయనకుఁ దెలియఁ జెప్పవలెను.

ఉ. ఓజమునన్ దిలీపనహు • షోపముఁ డైనరఘూత్తముండు దా
నాజవిధాన రాజ్యరమ • నందఁగ నగ్రజుఁడు పెద్ద యాట చే
భూజనశ స్తధర్మగుణ • పూతుఁడు గావుట శ్రేష్ఠుఁ డౌట నే
యోజనచేత నన్ను ధర • నూను మ టంటివి చెప్పుమా మునీ ! ౧౯౦

ఓజమునన్ = దేహబుద్ధి బలములందు, రూ. ఓజస్సు, దిలీపనహుషోపముఁడు=దిలీపునకు నహుషునకు సమానుఁడు, దిలీపుఁడు సూర్యవంశపురాజు నహుషుఁడు చంద్రవంశపురాజు ఉపలక్షణచే రెండువంశములందు శ్రీరామచంద్రుని మించిన వాఁడు లేఁడని భావము. ఆజవిధానన్ = దశరథునివలె రాజ్యరమ = రాజ్యలక్ష్మి, భూజన=భూమియందలి సమస్త జనులచేత, శస్త = కొనయాడఁబడిన, ధర్మగుణ=ధర్మగుణముచే, పూతుఁడు=పవిత్రుఁడైనవాఁడు, యోజన=ఆలోచన.

తాత్పర్యము.

దేహబల మనోబలములచే దిలీపునకు నహుషునకు సమానుఁడైన శ్రీరామచంద్రుఁడు దశరథునివలె రాజ్యలక్ష్మిఁ బొందుటకుఁ బుట్టువుచేఁ బెద్దవాఁడును సర్వజనులచే శ్లాఘింపఁబడిన పవిత్రగుణములచే శ్రేష్ఠుఁడు కావున నగ్రజుఁడు. ధర్మమిట్లుండ నేమి యాలోచించి నన్ను రాజ్యము గ్రహింపు మంటివి.

కం. జ్యేష్ఠుఁడు ప్రాయంబునఁ గడు, శ్రేష్ఠుఁడు గుణములను బట్టి • సీ కేశురమన్
నిష్ఠురతం గాంక్షింపఁ గ,నిష్ఠుఁడ నై యంత నేను • నీచాత్ముఁడనే! ౧౯౧

తాత్పర్యము.

వయస్సునందుఁ బెద్దవాఁడు గుణములను బట్టి శ్రేష్ఠుఁడు అటువంటి శ్రీరామచంద్రుని లక్ష్మినిఁ రెండు విషయములఁజిన్నవాఁడనగు నే నాశించు నంతటి నీచపు మనస్సుగలవానిఁగాఁ దలఁచితివా.

కం. కలుషాత్మక సేవిత మై, తలఁగక నిరయము ఘటించు • దారుణపాపం
బిల నేను జలిపి యిక్ష్వాకులవంశమ్మున నకీర్తిఁ • గూర్తున కాదే. ౧౯౨

తా త్ప ర్య ము.

పాపాత్ము లాచరింపఁ దగినదియుఁ దప్పక నరకము గలిగించునదియునగు ఘోరపాపము నేను జేసితినేని యిక్ష్వాకుల వంశమున కంతయు నపకీర్తి కలిగించిన వాఁడ నగుదును గదా.

ఉ. కన్నది చేసినట్టియవ • కార్యము నాకు రుచింప దేమి మా
యన్న వనాంతరస్థునకు • నంజలి చేసెద నింద యుండి, వి
ద్వన్నుత ! యాలఁ డేలఁగల • వాఁడు సుమీ భువనత్రయంబు, నేఁ
గ్రన్నన రామున్ తోవఁ జనఁ • గా మదిఁ బూనితి మాట లేటికిన్. ౧౯-౩

తా త్ప ర్య ము.

మునీంద్రా వేయిమాటలతో నేమిపని- నన్నుఁ గనుట తప్పఁ దల్లియం దుండవలసిన గుణములు లేనిదగు వాఁడుది చేసిన దుష్కార్యము నాకుఁ గొంచెమైన నిష్టమైనదికాదు. వినరాని మాట నిప్పుడు వింటిని గావున నా పాపము పోవఁ బ్రాయశ్చిత్తముగా నిందుండియే నమస్కరించెదను. (సర్వపాపములకుఁ బ్రాయశ్చిత్తము శరణాగతియే. అది యిందుండియే యిప్పుడు చేసి యావలఁ బ్రత్యక్షముగఁ జేసెదను.) జ్ఞానులచే స్తోత్రముచేయఁబడిన వాఁడా! మూఁడు లోకము లాయనయే యేలునుగాక. ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తి పోయినత్రోవ నేను బోయెదను.

కం. అన విని యెల్లసదస్యులుఁ, గనులను బ్రమదాశ్రు లురల • తన్మొతపయానా
థునిపై నిలిపిరి చిత్తం,బనంతర మిటు వనఁ దొడఁగె • నానృపసుతుఁడున్. ౧౯-౪

సదస్యులు=సభ్యులు, ప్రమదాశ్రులు = సంతోష బాష్పములు, ఉరలన్ = రాలఁగా, తన్మొతపయానాథునిపైన్=శ్రీరామునిపై.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము భరతుఁడు చెప్పఁగా సభవారందఱు శ్రీరామచంద్రుని మరలఁ జూడఁగలము గదా యని కన్నులనుండి సంతోష బాష్పములు రాలఁగా శ్రీరాముని మీఁద మనస్సులు నిలిపి యెప్పుడెపుడు పోదమా యని యాలోచించు చుండిరి. ఆవల మఱియు భరతుఁడిట్లనెను.

మ. వినుఁడీ సభ్యులు! రామచంద్రుఁ బురికిన్ • విచ్చేయఁగా వేఁడువాఁ
డను నే నేగతి నైన, నాయనయు రాఁ • డా యార్య సౌమిత్రితో
డ్కని ఘోరాటవిలో వసించెదను జుం • డీ, రండు నాతోడ మీ
రును, నెక్కైన రఘూత్తముండు చనుదేఁ • రుం జేయుదుం దద్విధిన్. ౧౯-౫

సభ్యులు=సభ్యులారా ! మధ్యమ పురుష బహువచన యోగంబున నార గాగమంబు విభాషనగు- సు వ్యా- తత్సమ ౭౭ సూ. విచ్చేయఁగాన్ = విజయము+చేయు = విచ్చేయు, వచ్చునట్లుగా, ఘోరాటవిలోన్ = భయంకరమైన యరణ్యమందు, చనుదేరున్ = వచ్చునో, తద్విధిన్ = ఆ యేర్పాటును.

తా త్ప ర్య ము.

సభ్యులారా! వినుండు- పట్టణమునకు రమ్మని శ్రీరామచంద్రుని నే యే విధముల వేడవచ్చునో యన్ని విధముల వేఁడెదను. ఆయన రాఁడాయెనా లక్ష్మణుని వలె నేనుగూడ నాయన సేవ చేయుచు భయంకరమైన యడవులందే యుందును. మీరు నాతోడరండు. ఎట్లుచేసిన శ్రీరామచంద్రుఁడు వచ్చునో యట్లుచేసెదను.

ఉ. పంచితి మున్నె యెల్లపని • వాండ్రను త్రోవలు చక్కఁజేయఁగా,
నెంచితిఁ బోవఁ దూర్ణముగ • నే నని చెంత సుమంత్రుఁ జూచి నీ
వంచితరీతినై మనబ•లావళి సిద్ధపడంగ మాత్ర నా
యంచినయట్లు చేయు మన • నాతఁడు నర్మిలి నట్లు సేయఁగన్. ౧౯౬౬

అర్మిలిన్ = ప్రేమతో.

తా త్ప ర్య ము.

త్రోవలు చక్కఁజేయుటకై పనివాండ్రనందఱను నింతకుముందే పంపితిని- నేనును శీఘ్రముగఁ బోవఁదలంచితిని. అని సమీపమునను్న సుమంత్రుఁజూచి మన సేనల నన్నిటిని దగినరీతి ప్రయాణమునకై సిద్ధపడఁజేయుము- అనఁగా నాయనయు నట్లు చేసెను.

శా. సేనానాయకులుఁ బురీజనములున్ • శ్రీరాముఁ దోడ్తేర భూ
మీనాథాత్మభవుండు దాను జనఁగా • మేకొంట విన్నంతలో
నానందంబున నింట నింటఁ దమి యో • ధాబ్జాక్షులున్ భర్తలన్
వే నిండారుప్రయత్నముల్ సలుపఁగాఁ • ద్రేరించి రాయాత్రకున్. ౧౯౬౭

మేకొంటన్ = అంగీకరించుట, తమిన్ = సంతోషముతో, యోధాబ్జాక్షులు=యుద్ధభటులు భార్యలు, నిండారు ప్రయత్నములు=పూర్ణప్రయత్నములు.

తా త్ప ర్య ము.

సేనానాయకులతోఁ బట్టణ వాసులతోఁ భరతుఁడు శ్రీరామచంద్రునిఁ బిలుచుకొని వచ్చుటకై యంగీకరించెనని వార్తవిన్నతోడనే సంతోషముతో సేనాభటుల భార్యలు పౌరుల భార్యలు నందఱు భర్త లిండ్లకు రాఁగానే యేమీ యాలస్యము పోదము పదండు ప్రయాణమునకుఁ గావలసిన యత్నములు పూర్ణముగాఁ జేయుఁడు మీ రాకకై కాచియున్నాము కావలసిన పదార్థములన్ని మూటలు గట్టి సిద్ధముగా నుంచితిమని తీవరింపసాగిరి.

పురుషులు రాజాజ్ఞకు నెట్లు బద్ధులో స్త్రీలు భర్తల యాజ్ఞ కట్లు బద్ధులేయైనను రాజాజ్ఞయగు వఱకు భర్తలుపేక్షించుటచే స్త్రీలేమియుఁ జేయఁ జాలకయుండిరి. ఆ ప్రతిబంధము తీఱిపోఁగానే వారి వారి పురుషులను వారు వారు తీవరింపసాగిరి. భగవత్కార్యములందు స్త్రీలట్లే చేయవలయును. పురుషులను నయ ప్రియములతో బలాత్కరించియైన వారిచే భగవత్కార్యములు చేయింపవలెను.

మగవారేయూరకున్నా రే- లేనిపెత్తనము మనకేలలేయని యుత్తమస్త్రీలూరకుండ రాదు. స్త్రీల యందు రసోద్రేకము మెండు. ఏరసమైనను వారియందు విపరీతము గానే యుద్రేకించును. ఇచట వారి యదృష్టము కొలఁది గోపికలయందు శృంగార రసమువలెఁ గరుణ కరుణారసములు మిశ్రములై యయోధ్యాపుర స్త్రీలకుఁ బురుషు లకు ముక్తి కారణములైనవి.

ఉ. కొందఱు ఘోటకంబులను • గొందఱు కోడెలబండ్ల నెండియుం
 గొందఱు స్యందనంబులను • గొబ్బున సిద్ధపడంగఁ గైకయీ
 నందనుఁడున్ సుమంత్రుఁ గని • నాయరదంబును సజ్జితంబుగాఁ
 బొందుగఁ జేయు మన్న విని • పొంగుచు నాతఁ డొనర్చె నాగతిన్. ౨౬-౨౮

ఘోటకంబులన్=గుఱ్ఱములను, స్యందనంబులను=రథములను, గొబ్బునన్ = త్వరగా, సజ్జితంబుగాన్=సిద్ధముగా.

తా త్ప ర్య ము.

కొందఱు గుఱ్ఱముల మీఁదను, గొందఱు కోడెలబండ్లమీఁదను గొందఱు తేర్లమీఁదను బోవుటకు సిద్ధపడఁగా భరతుఁడు సుమంత్రుఁగని నారథమును సిద్ధముచేసి తెమ్మనఁగా నతఁడును సంతోషముతో నట్లు చేసెను.

మ. భరతుం డంత సుమంత్రుఁ జూచి ధ్వజినీ • వారంబుతో సాగుమీ
 త్వరతో లోకహితార్థినై రఘుపతిన్ • వాంఛింతుఁ దోడ్తేర;నా
 వరుసం దెల్పె బలప్రధాననగరీ • వాస్తవ్యమిత్రాళికిన్
 వరవిప్రాదికజాతు లుష్ట్రఖరస • ద్వాహాదులం బోవఁగన్. ౨౯-౩౨

ధ్వజినీ వారంబుతోన్ = సేనాసమూహముతో, సాగుమీ = ప్రయాణము చేయుము, లోకహితార్థినై=లోకము మేలుకోరిన వాఁడనై, వాంఛింతున్ = కోరెదను, తోడ్తేరన్ = పిలుచుకొని వచ్చుటకు, వరుసన్ = క్రమముగా, బల= సేనకు, ప్రధాన = మంత్రులకు, నగరీవాస్తవ్య, పౌరులకు, మిత్రాళికిన్ = స్నేహి తులకు, వర = గొప్పవారగు, విప్రాదిక జాతులు=బ్రాహ్మణులు మొదలు గాఁగల జాతులు, ఉష్ట్ర = ఒంటెలు, ఖర=కంచరగాడిదలు, సద్వాహాదులన్ = మంచి వాహనముల మీఁద.

తా త్ప ర్య ము.

అంతట భరతుఁడు సుమంత్రుఁజూచి నీవు త్వరతో సేనాసమూహముతోఁ బయనింపుము. లోకము మేలు గోరిన వాఁడనై శ్రీరామునిఁ బిలుచుకొని వచ్చుటకుఁ గోరుచున్నాను. అనఁగా నతఁడు సేవకులకుఁ బ్రధానులకుఁ బురజనులకు స్నేహితులకు బ్రాహ్మణాది జాతులకు నొంటెలమీఁద మంచి వాహనముల మీఁదఁ బోవఁ జెప్పెను.

—• ౮౩-వ సర్గము. భరతుండు శ్రీరాముం దోడి తేరం బ్రయాణ మగుట •—

సీ. అవల వేవినం గైక • యాత్మభవుం డుత్తమస్యందనము నెక్కి • మంత్రిగురులు
మున్నుగాం జనంగ న • త్యున్నతనాగముల్, నదువ వెన్నంటుచు • నవసహస్ర
మాయుధీయులునొక్క • యఱువదివేవురు నూఱువేల్ గుఱ్ఱముల్ • మీఁదరాఁగఁ
గైక సుమిత్రయుం • గౌసల్యతోడరా, యానంబులను హర్ష • మారఁ జనియె

తే. జానకీనాథు లక్ష్మణ • సహితుఁ గనఁగ
నుత్సుకత వారికథ లెల్ల • నుల్లమలర
నొండొరులు ముచ్చటించె జ • నోత్కరంబు
లెచట నున్నాఁడొ శ్రీరాముఁ • డేమొ యనుచు. ౧౯౦

వేవినన్=ఉదయము కాఁగా, ఉత్తమస్యందనము=శ్రేష్ఠమైనరథము, అత్యున్నత నాగముల్=ఎత్తైన యేనుఁగులు, ఆయుధీయులు=ఆయుధములచే జీవించువారు, యానంబులను = వాహనములమీఁద, ఉత్సుకతన్ = సంతోషముతో, జనోత్కరములు=జనుల సమూహములు.

తాత్పర్యము.

అవలఁ దెల్లవాఱఁగా భరతుఁడు శ్రేష్ఠమైన రథమునెక్కి ముందుగా మంత్రులు, గురువులు పోఁగా వెనుకప్రక్క నెత్తైన యేనుఁగులు తొమ్మిదివేలు రాఁగా నాయుధములు ధరించినవా రఱువదివేలు నూఱువేలు గుఱ్ఱములు రాఁగా కౌసల్యయు సుమిత్రయుం దోడరాఁ బశ్చాత్తప్త రాలైన కైక సంతోషముతో వాహనముల మీఁద రాఁగా లక్ష్మణునితోడనుండు జానకీనాథుని జూడఁజనియె. ప్రజను శ్రీరామచంద్రుఁ డెక్కడనున్నాఁడో యేమిచేయుచున్నాఁడో యని సీతారామలక్ష్మణుల కథలే యొకరికొకరు చెప్పుచుండిరి.

౧౯౩౬-వ పద్య వ్యాఖ్యానమందుఁ జెప్పినట్లు కైక కింతవఱకు మంత్రులు లోకులు చెప్పి భరతుఁడు రాజ్యమంగీకరించునని యాశయుండెను. ఆయాశ భగ్నమైనది. ప్రజలందఱు ఆబాలగోపాలము శ్రీరామునందే పక్షపాతము వహించియున్నారని స్పష్టపడెను. కావునఁ దాను జేసినది దుష్టకార్యమనియు నింకను మూర్ఖత వహించిన దనకు గీడే కలుగుననియుఁ దనకోరిక నెఱవేఱదనియుఁ దోఁచి సుముఖ యయ్యెను.

సీ. ఎన్నండొకో యంబు • ధ్యున్నిలు స్థిరసత్త్వ, నాజానుబాహు మ • హావ్రతస్థు
లోకసంభావితైక • శోకనాశనదక్షుఁ, గాంచుట యాతనిఁ • గనుటమాత్ర
చాలఁగా మన • స్తాపంబు లెల్లను, విరియింపఁ జీకటిఁ • దనణేయట్లు
టంచు నీరీతి భా • షించుచుఁ బౌరులు, సీతేశుకథ లెల్లఁ • జెప్పికొనుచుఁ

తే. గోమటులు రత్నకారులుఁ • గుమ్మరులును, గమ్మరులు గమసాలులుఁ • గంబళికులు
గందవొడివారు బేల్దార్ల • గములు నెమిలి,విసనకఱ్ఱలవాండ్రును • బెజ్జగాండ్రు. ౧౯౭౧

అంబుభృత్ =నీళ్ళనుధరించిన మేఘమువంటి, నీలున్=నల్లనివానిని,జలమును ధరించిన నల్లనిమేఘమే వర్షముకురియునది. శరత్కాలమందలి తెల్లమేఘ మేమి యియ్యఁగలదు ? అట్లులే శ్రీరామచంద్రుఁడు కోరినవారి కోరిక లవారికి నీయఁ గలఁడని భావము. దూరమునందున్నను 'ఘర్మాభితప్తః పర్జనమ్' ఎండ వేఁడిమికిఁ దపించినవాఁడు మేఘమును వలె నన్నట్లు విడువసాధ్యముకాని సౌందర్యము కల వాఁడు. మేఘశ్యామున్ = మేఘమును జూచినంతమాత్రముననే కర్షకు లెట్లు సంతోషింతురో యట్లు శ్రీరామచంద్రుని జూచినంత మాత్రముచేతనే భక్తులు సంతోషింతురనుట.

స్థిరసత్త్వున్ = సత్త్వగుణమందు స్థిరుఁడైనవానిని. (2) స్థిరవ్యవసాయుని, "ద్రవ్యేషు వ్యవసాయేషు సత్త్వమస్త్రీతు జంతుషు" అని యమరుఁడు. (3) తన యందు స్థిరముగా నెలకొన్న సత్త్వగుణము గలవానిని ఆజానుబాహున్ = ఆయతాశ్చ సువృత్తాశ్చ యన్నట్లు మోఁకాటిదనుక చేతులుగలవానిని (2) తనసౌందర్య మనుభవింపవలె నన్నచో నట్లే కానిమ్మనునట్టి యౌదార్యము గలవానిని (3) తన సౌందర్యానుభవమును జనులకిచ్చుటకుఁ దగిన సామర్థ్యము కలవానిని ఇట్టి యౌదార్య సామర్థ్యములు గొప్పభుజములు కలవానికిఁగదా కలుగును. మహావ్రతస్థున్=తనయాప్తులు చెప్పినను త్రోసివేయనంతటి దృఢమైన సత్యశరణాగత రక్షణాది వ్రతముల దీక్షపట్టినవానిని, లోకసంఘాత=జనసమూహమునకు, ఏక=ఒకఁడే యగు. శోకనాశన = శోకమును నాశముచేయుటయందు, దక్షున్ = సమర్థుఁడైన వానిని, లోకుల ప్రధానదుఃఖము జననమరణ సంసారరూపక దుఃఖమే. దానిని నాశముఁ జేయఁగలవాఁడు శ్రీరాముఁడొక్కఁడే యని భావము. ఇంతటి మహాత్ముని నెన్నఁడు చూతుమోకదా, చూచినంత మాత్రముచేతనే రాఁగలలాభమేమి యందువా ? ఆయన ముఖచంద్రునిఁ జూచితిమేని కైకేయివలన మనకు జనించిన దుఃఖాంధకారమంతయు నొక్కసారిగ సమూలము నశించును అనిభావము. మనస్తాపంబులు=మనస్సులోని దుఃఖములు, విరియింపన్ = నశింపఁజేయుటకు, ఆతనిఁ గనుటమాత్రము చాలును. మన మాయనను సమీపించినపుడాయన మనలఁ జూచి చిఱునవ్వు మొగముతో నుండనువలదు. మనలను గటాక్షించి యొకప్రియమైన పలుకు పలుకనువలదు, దానికై మనము ప్రయత్నింపనువలదు. మమ్మురక్షింపుమని యాయన కాళ్ళమీఁదఁ బడనువలదు. ఆమాట మనమననువలదు. మన మాయనను దూరమునుండి దర్శించితిమేని మనదుఃఖము లన్నియు దమంతటఁ దామే

పటాపంచలగును అని భావము. ఎట్లన, తరణి=సూర్యుఁడు చీఁకటిని విరియించినట్లు సూర్యదర్శనము కాఁగానే చీఁకట్లన్నియు నెంతమారమున నున్నను దమంతటఁదామే మాయమైపోవునుగదా. ఇట్లుచెప్పుటచే సర్వధర్మములవదలి నన్నొకనినే శరణుపొందుము. ఏడువకుమనిన కృష్ణునికంటె శ్రీరాముఁడే కరుణాళుఁడని సులభుఁడని భావము. ౧౯౭౩ లోని చివరి అనుదానితో నన్వయము.

రత్నకారులు=రత్నములు సానపెట్టువారు, కమసాలులు. కంసాలులనుట తప్పు, ఆంధ్రంబున బిందువు పరుసవర్ణంబులకు ముందుండునుగాని తక్కినవర్ణములకు మొందుండదు. కంబళికులు = కంబళ్లు నేయువారు, బెజ్జగాండ్రు = రంధ్రములు వేయువారు.

తాత్పర్యము

మేఘశ్యాముఁడును, స్థిరమైనవ్యవసాయము గలవాఁడును. మోఁకాలివంటు చేతులుగలవాఁడును, గొప్పవగు సత్యశరణాగత రక్షణములందు స్థిరముగ నుండువాఁడును. లోకసమూహముల ముఖ్యదుఃఖమును నాశముచేయుటయందు దొక్కఁడేనైన వాఁడును నగు శ్రీరామచంద్రునిఁ గాంచుట యెన్నఁడోకదా (ఇట్టి యుత్కంఠ లేక భగవద్దర్శనప్రాప్తి లేదు. ఎప్పుడెప్పుడని యేకారవలెను ఇట్టి తహతహపాటే పరమభక్తిలక్షణము) సూర్యునిఁ జూచినఁ జీఁకటి నశించునట్లు మన మనస్సునందలి దుఃఖములన్నియు నశించుటకు నతని దర్శనముమాత్రము చాలును అని యీరీతి శ్రీరామచంద్రమూర్తి కథలు చెప్పుచుఁ గోమటులు, రత్నములు సానపెట్టువారు, కుమ్మరులు, కమ్మరులు, కమసాలులు, కంబళ్ళునేయువారు, గంధపొడి చేయువారు బేల్దారులు. నెమలియీఁకలతో విసనకఱ్ఱలు కట్టువారు బెజ్జములు వేయువారు.

తే. సాలెలును అంపగాండ్రును•జాకులుఁ దిల,యంటువాండ్రునొడల్ పట్టు•నట్టివారుఁ
  గుఱ్ఱపుంబనివారును • గొల్లవారు, వెజ్జ లీడిగవాండ్రును•బెస్తవాండ్రు. ౧౯౭౨

సాలెలును=వస్త్రములు నేయువారు. చేలలు నేయువారు సాలెలు, చాకులు =చాకలవాండ్రు, ఒడల్=దేహము, వెజ్జలు=వైద్యులు.

తాత్పర్యము.

సాలెవాండ్రు, అంపగాండ్రు, చాకలవాండ్రు, తలంటువాండ్రు, నొప్పులు వోవ దేహము పిసుకు శెట్టులు, గుఱ్ఱలుకట్టువారు, గొల్లవారు, వైద్యులు, కల్లుగీయు నీడిగవాండ్రు, బెస్తవాండ్రు.

కం. చేడెలతో నట్టువులును, శాడబులును వారివారి • వాహనములపై
  వేడుక శుద్ధాంబరములతోడ విలేపనము లాది • తోఁ జని రంతన్. ౧౯౭౩

తాత్పర్యము.

తమ స్త్రీలతోడ నట్టువ వాండ్రు. బ్రాహ్మణులు. వారి వారి వాహనముల మీఁద సంతోషముతోఁ బెద్దల యొద్దకుఁ బెరుమాళ్ళ యొద్దకు మాసినగుడ్డలు

కట్టుకొని మలినదేహములతోఁ బోరాదు కావునఁ బరిశుద్ధ వస్త్రములు కట్టుకొని గంధపుఁబూఁతతోడఁ బోయిరి.

పై మూఁడు పద్యములు ౧౯౭౫–౧౯౭౭ వఱకుఁగల పద్యము లానాఁడెట్టి పనివాండ్రుండిరో వారి నాగరకత యెట్టిదో తెలుపుచున్నవి. ఆబాలగోపాలము శ్రీరామచంద్రునందుఁ బ్రజలకుఁగల భక్తియుఁ దెలుపుచున్నవి.

చం. చని చని కొంతదూర మిటు • సాశ్వసనాగసయానపాళు లై
జనములు రామమిత్రగుహ • సంపరిపాలితశృంగిబేరముం
గనుఁగొని జాహ్నవీతటిని • గౌతుక మారఁగ రమ్యదేశమం
దును విడిసెం జమూతతియుఁ • దూర్ణము యచ్చట నిల్వఁ బ్రీతినై. ౧౯౭౮

సాశ్వ = గుఱ్ఱములతోడి వారు, సనాగ = ఏనుఁగులతోడివారు, సయాన పాళులు = వాహనసమూహములతోఁ గూడినవారునై. రామమిత్ర = రామునకు స్నేహితుఁడైన, గుహ=గుహునిచే, సంపరిపాలిత = మిక్కిలి చక్కఁగా రక్షింపఁ బడుచున్న, పాలితముగాక, పరిపాలితముగాక. రామమిత్ర సంపరిపాలిత మనుటచే, శ్రీరాముని మీఁదికి నాయన విరోధులెవ్వరైన నెప్పుడైన నొంటరిగానో సేనతోనో వచ్చెదరేమో యని మిగుల జాగ్రత్తతో గుహుఁడు సన్నాహపడియున్నాఁడని తెలియవలయును, తన్నుఁగలసిన వానిని రక్షించువాఁడుగదా మిత్రుఁడు. జాహ్నవీత టిని=గంగాతీరమందు, కౌతుకము = సంతోషము, రమ్యదేశమందు = మనోహర ప్రదేశమందు, చమూతతియున్ = సేనాసమూహము, విడిసెన్ = దిగెను.

తాత్పర్యము

జనులందఱు వారి వారి గుఱ్ఱములు నేనుఁగులు ఇతర వాహనములు గల వారై కొంతదూరము పోయి పోయి శ్రీరామచంద్రుని మిత్రుఁడగు గుహుఁడు చక్కఁగా హెచ్చరికతోఁ బాలించు శృంగిబేరపురమును జూచిరి. ఇప్పుడు దీని సంగ్రూర్ అందురు. సేనయు గంగాతీరమందు రమ్యమైన ప్రదేశమందు దిగెను.

మ. భరతుం డంతట వారిఁ గాంచి తరియిం • పన్ వచ్చు రేపిన్నదిన్
వరగంగోదకపాళిఁ దండ్రికి నివా • పం బే నిటం గూర్చెదన్
సరగన్ మీరలు స్వోచితస్థలములన్ • సంప్రీతినిల్వుండు నా
నరుసం బారఁగ వారు నిల్చిరి యథా•ర్హస్థానసంస్థాయు లై. ౧౯౭౯

తరియింపన్ వచ్చున్ = దాఁటవచ్చును, వరగంగోదకపాళిన్ =దివ్యములైన గంగా జలముచే, నివాపము = తర్పణము, పుణ్యతీర్థములకుఁ బుణ్యక్షేత్రములకుఁ బోయినపుడు తీర్థోపవాసము క్షేత్రోపవాసముచేసి తర్పణముచేయవలయును గావున నట్లు చేయఁదలఁచినవాఁడై, స్వోచితస్థలములన్ = వర్ణాశ్రమాచార ప్రకారము వారికిఁ వారికిఁ దగిన స్థలములందు, అరుసము=హర్షము, యథార్హ=యోగ్యతకుఁదగిన స్థాన=ప్రదేశములందు, సంస్థాయులై = ఉన్నవారై.

### తాత్పర్యము.

భరతుఁడు వారినందఱనుజూచి యీ నదిని రేపు దాటవచ్చును. నేను గంగాజలములచేఁ దండ్రికిఁ దర్పణముచేయవలసియున్నది. మీరును వెంటనే మీమీ మీకుఁ దగిన స్థలములందు నిలువుండని చెప్పఁగా వారును వారి వారి వర్ణాశ్రమాచార పద్ధతి ననుసరించి వారికి వారికి బాగని తోఁచిన చోటులనుండిన వారైరి.

—♦ ౮౪-వ సర్గము. గుహుఁడు భరతురాకఁ గని సందేహించుట ♦—

ఉ. అంత నిషాదనేత గుహుఁ ♦ డాధ్వజినీచయ మెల్లఁ గాంచి యే
కాంతరయంబునం దనహి ♦ తాఖిల నెల్లరఁ జూచి కంటిరే
యంతయు గానరాదు మతి ♦ నైన గణింపఁగ వట్టిసేన యీ
పొంతలఁ జేరె సాగరము ♦ పోలికఁ జూడ్కికి వ్రేఁగు గొల్పెడిన్. ౧-౨

నిషాదనేత = బోయిరాజు. ధ్వజినీచయములు = సేనా సమూహములు, ఏకాంతరయంబునన్ = మిగుల వేగముతో, పొంతలన్=సమీపమందు. సాగరము పోలికన్=సముద్రమువలె వ్రేఁగు=భారము.

### తాత్పర్యము.

భరతుఁడిట్లు సేనలతో వచ్చుచుండ బోయ రాజగు గుహుఁడా సేనాసమూహమునుజూచి మిక్కిలి వేగముతోఁ దన స్నేహితులనందఱఁజూచి చూచితిరిక దా యీ సైన్యము దుద తెలియరాలేదు. ఇంతయని మనసుచేనైన లెక్కింప రాక యున్నది. ఇంతటి సేన మన ప్రాంతమునకుఁ జేరవచ్చుచున్నది. చూచుటకు సముద్రమువలె భారము తోఁచుచున్నది.

తే. ఖలుఁడు దుర్బుద్ధి భరతుండు♦బలము లెల్లఁ, గొలువ వచ్చె నిజం బదె♦కోవిదార
కేతనమ్ము రథమ్మున ♦ రీతి మెఱసె మీని బాటలు చూడంగ♦మేలుకోఁడె. ౩

ఖలుఁడు=దుష్టుఁడు, దుర్బుద్ధి=చెడ్డబుద్ధిగలవాఁడు, భరతుఁడని నీకెట్లు తెలిసె నందురా, కోవిదార కేతనము = కాంచనపు ధ్వజము, శూరులు వారి వారి గుణములను దెలుపు ధ్వజములను వారు వారు ధరింతురు. తమ పరాక్రమమును దెలుపుటకు సింహమును, బలమును దెలుపుటకు నేనుఁగును, రోషము తెలుపుటకుఁ బామును, ధ్వజపటములందు వ్రాయింతురు ఇక్ష్వాకులు వంశపరంపరగాఁ గోవిదార ధ్వజమునే ధరింతురు. భరతుఁడు ఖలుఁడు దుర్బుద్ధి యనుటచే నతఁడు శ్రీరామచంద్రుని మీఁదికి యుద్ధమునకై సేనతోఁ బోవుచున్నాఁడని గుహుఁ డభిప్రాయ పడినట్లు సూచితము.

### తాత్పర్యము.

దురాలోచనగల దుష్టుఁడు భరతుఁడు సేనల నన్నిటిని దీసికొని వచ్చినవాఁడు కోవిదార ధ్వజమే వాఁడు భరతుఁడని తెలుపుచున్నది. ఈ ధ్వజము ధరింపఁ గలవాఁడు దశరథుఁడాచచ్చెను. శ్రీరామచంద్రుఁడా యరణ్యమందుండెను.

ఇఁక భరతుఁడుగాక వీఁడు వేఱొకరుఁ డెట్లగును. వీని మార్గము సౌమ్యముగాఁ గాన రాలేదు. విరుద్ధముగాఁ గానవచ్చుచున్నది. అన్న మీఁద భక్తితోఁబోవు చున్నాఁడేమో యందురా ఇంతసేన యేల !

ఉ. కట్టునో చంపునో మనలఁ • గైకతనూజుఁడు తండ్రిచేత దా
నెట్టఁగఁ జేసి రామవిభు • నిర్జనభూమిఁ దకీయసంపదన్
నెట్టన క్రూరుఁడై కొనియు • నేఁ డిదె కంటిరె సేనతోడ లోఁ
బుట్టినకింక రాముఁ బోరి • పుచ్చఁగఁ బోయెడు నొండెఁ జూడఁగన్. ౯=౭౮

నిర్జనభూమిన్ = జనములు లేని ప్రదేశమునందుండ. కింకన్=కోపముచే, పోరిఁ బుచ్చఁగన్ = చంపఁగ.

తాత్పర్యము.

మనము శ్రీరామచంద్రుని మిత్రులమగుటచే భరతుఁడు మనలను గట్టునో చంపునో తెలియదు. వీఁడు ఖలుఁడు దుర్బుద్ధి యని నీకెట్లు తెలియునందురా శ్రీరామచంద్రుని నడవులంబడ బలాత్కారముగఁద్రోచి యాయన సంపత్తు నంతయు హరించియు నంతతో సంతోషింపక క్రూరుఁడై యాయనఁ జంపుటకై సకల సేనలతోఁ గోపోద్రేకము గలవాఁడై పోవుచున్నాఁడు. అటుగాక యూరక చూడఁబోవు వానికీ సేనయేల ? కావున వీని యుద్దేశము వేఱుగానున్నది. అది సౌమ్యముగాదు.

ఉ రాముఁడు నాదుభర్త రఘు•రాముఁడు నాచెలి గాన నెట్టులే
నోమెద రామచంద్రుని; ర•యోద్ధతి మీరలు గాంగతీరమున్
దీమస మారఁ గాపుఁడు వి•నిద్రత సేనలతోడ నావలం
దామిషమూలపక్వసుఫ • లాదుల నింపుఁడు పెంపు మీఱఁగన్. (౯ ౭౯

ఓమెదన్=రక్షించెదను. రయోద్ధతిన్ = వేగాతిశయముచే. గంగతీరమున్ =గంగాసంబంధమైన గట్టును, దీమసమారన్ = నిండుధైర్యముతో, వినిద్రత = హెచ్చరికతో, ఆమిష = మాంసము, మూల=వేళ్లు, పక్వ = పండిన, సుఫలాదు లన్ = మంచి పండ్లను.

తాత్పర్యము

ఇప్పుడు మనము చేయవలసిన దేమనెదరా. భరతుఁడు గంగదాఁటి పోకుండఁ జేయుట మన పని. శ్రీరామచంద్రుఁడు నాభర్త- శ్రీరామచంద్రుఁడు నా మిత్రుఁడు గావున నాయనను నే నెట్టులైన భరతుని బారిఁ బడకుండ రక్షించె దను, కాఁబట్టి మీరతి శీఘ్రముగాఁబోయి మీరు గంగయొడ్డకు రాకుండ హెచ్చరి కతో ధీరులై కాపాడవలయును. దానికై మీరు మనకుఁగల పడవల నన్నిటిని సిద్ధముచేసి వాని యందు మోఁచినంత మాంసము వేళ్లు పండ్లు నింపుఁడు. ఎన్ని దినములు యుద్ధముచేయవలసి వచ్చునో యేమో శ్రీరామచంద్రమూర్తి నిన్నుఁ

గోరలేదుగదా. నీవేల బల వద్విరోధమునకై కాలు ద్రవ్వెదవందురా! అట్లనుట ధర్మముగాదు. కోరినను గోరకున్నను భర్తనుగాచుట భృత్యుని కార్యము అట్టులే మిత్రసంరక్షణము కావున నా కార్యము నేను జేయకుండుట వలనఁ గృత్యాకరణ దోషము అకృత్య కరణ దోషము రెండును లభించును. నా భృత్యమిత్ర కార్యము నేను నిర్వహించుటయందు నెదుటివాని బలా బలములు నేను విచారింపవలసిన పని లేదు. తన స్వామికై తన సర్వస్వముగోలు పోవుట శ్లాఘ్యమే కాని నింద్యముగాదు.

కం. నావల నేనూటిని గొని, నావకు నావకును నూ ఱ • వంతబలాఢ్యుల్
 కైవర్తకు లుండుఁదు నది, రేవుల నన్నిటను మీ ర•రీణశ్రద్ధన్. ౧౮౦

అరీణ శ్రద్ధన్=చక్కని శ్రద్ధతో, కైవర్తకులు=బెస్తలు.

తాత్పర్యము.

ఐదునూర్ల నావలను సిద్ధముచేయుఁదు ఒక్కొక్క నావలో నూఱుగురు మంచి బలవంతులు బెస్తలుండుఁదు. ఈ ప్రకారమన్ని రేవులయందును జక్కని శ్రద్ధతో నుందుఁదు.

కం. రామునెడఁ బ్రీతుఁ డేనియు, సేమంబున దాఁటుఁగాక • చిటమట పడినన్
 భూమీశనందనుఁడు దా, నేమాడ్కిం జనునొ చూప • నే యొక చేయిన్. ౧౮౧

తాత్పర్యము.

శ్రీరామునియెడ భరతుఁడు ప్రీతిగల వాఁడాయెనా సుఖముగా గంగ దాఁటింతము. అటుగాక కోపించినవాఁడాయెనా గంగయెట్లు దాఁటునో చూతము గాక. నా చేతనైనంత నేను జేయక విడుతునా. ఇందఱను గంగపాలు చేయనా!

—• గుహుఁడు భరతునిఁ జూడ వచ్చుట •—

చం. అని మధుమాంసభక్ష్యము లు•పాయనముం గొని వేగ వచ్చునీ
 రని గుహుఁ గాంచి సూతుఁడు ని•రూఢజవంబున నేగి కైకయీ
 తనయునిఁ గాంచి రాఘవహి•త ప్రవరుండు గుహుండు వచ్చె నీ
 యనకు సువేద్యముల్ సకల• మైనపథంబులు దండకాటవిన్. ౧౮౩

మధుమాంస భక్ష్యములు = తేనెమాంసము మొదలగు తినుపదార్థములు, ఉపాయనము = కానుక, నిరూఢ జవంబునన్ = అతివేగమున, రాఘవహిత ప్రవరుండు = శ్రీరాముని ముఖ్యస్నేహితుఁడు, సువేద్యముల్ = చక్కఁగా దెలిసినవి, పథంబులు=మార్గములు. ఉపాయనముంగొనివచ్చి యనుటచే గొప్పవారియొద్దకుఁ బోవునపుడు రిక్తహస్తములఁ బోరాదని సూచన.

శ్లో॥ ధర్మమర్థంచ కామంచ త్రితయం యేభికాంక్షతి
 రిక్తపాణిర్న పశ్యేత, రాజానం దైవతం గురుమ్.

ధర్మార్థ కామములఁ గోరువాఁడు రాజును దేవుని గురువును జూడఁబోయి నపుడు రిక్త చేతులఁబోరాదు. గర్భిణి స్త్రీలను బసిబాలురను జూడఁబోయినపుడును రిక్త హస్తములఁ బోరాదు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము తన స్నేహితుల కందఱకుఁజెప్పి తాను భరతుని మనస్సు దెలియఁగోరి తేనె మాంసము పిండివంటలులోనైనవి గానుకలు తీసికొని భరతు నొద్దకు వచ్చుచుండఁగా సుమంత్రుఁడు చూచి యతి శీఘ్రముగాఁబోయి శ్రీరామ చంద్రుని ముఖ్యస్నేహితుఁడు గుహుఁడు వచ్చుచున్నాఁడు. ఈయనకు దండకా రణ్యములోని సకల మార్గములు చక్కఁగా దెలియును

చం. దరిసెన మిమ్మవశ్యముగ • దాశరథీ మన రామలక్ష్మణుల్
ధరణిజయుం జరించెడిత • లంబు నెఱుంగు నిజంబు నాఁగ నా
భరతుఁడు తోడి తెమ్మనుడు • బంధుజనాన్వితు బోయనాయకున్
బరువడిఁ దోడి తేర నృప • వర్యుఁడు సత్కృతిఁ దన్పె నాతఁడున్. ౧౮౩

దరిసెనము = దర్శనము, తలంబు = స్థలము- నాఁగన్ = అనఁగా, బంధు జనాన్వితున్ = చుట్టములతోఁగూడిన వానిని, పరువడిన్ = క్రమముగా, నొకరి వెంట నొకరిని, సత్కృతిన్=సత్కారము, గౌరవము.

తా త్ప ర్య ము.

భరతా! యీ గుహునకు నీవు తప్పకదర్శనమిమ్ము. మన సీతారామ లక్ష్మ ణులుండుచోటు వాస్తవముగ నీతఁ డెఱుఁగును. సరియైన స్థలము దోవ తెలియక యెక్కడకని యే మార్గమునని మనము వెదకుచుఁ బోవుదము అని చెప్పఁగా భరతుఁడు పిలుచుకొని రమ్మనెను. సుమంత్రుఁడునుబోయి చుట్టములతోడ గుహుని వరుసగాఁ బిలుచుకొనివచ్చి వారి నందఱఁ దెలుపఁగా వారి నందఱను భరతుఁడు గౌరవించెను.

మ. రమణీయం బగుదేశ మియ్యది వరా • రామంబునా నొప్పెడిన్
సుముదం బారఁగ నిందు నిల్వఁ దగదే • చూడంగ మీయిల్లె కా
కమలాక్షా! మము మోపగింపఁ దగునా • కారా దొకో యుష్మదా
గమవార్తన్ మునుమున్న పంప, నిట నే • డక్కన్నిల్వఁ బ్రార్థించెదన్. ౧౮౪

ఇయ్యది = నేనుండెడి యీ యరణ్య ప్రదేశము, ఆరామము = తోఁట, సముదంబు = మిక్కిలి సంతోషము, ఆరఁగన్ = అభివృద్ధికాఁగా, యుష్మదాగమ వార్తన్=నీవు వచ్చు సమాచారమును.

తా త్ప ర్య ము.

అంతట గుహుండిట్లనియె. రాజకుమారా! కమలములవంటి కన్నులుగల వాఁడా. నేనుండు నీ యరణ్య ప్రదేశము మనోహరమై తోఁటవలెనుండునుగాని భయంకరమైన యడవిగానుండదు. కావున నిందు నిలువుము. ఇదియును మీయిల్లే కదా. ముందు మీరు వచ్చువార్త చెప్పి పంపరాదా? చెప్పకుండఁ దటాలున వచ్చి మమ్ము మోసగింపవలెనా. నీ విచ్చటనే నిల్వఁ బ్రార్థించెదను.

అంతగుంపు ముందువచ్చి బాటలు వేయఁగా గుహునికిఁ దెలియక కాదీ మాట చెప్పుట- కావలసిన పదార్థములు సిద్ధము చేయుమని ప్రత్యేక దూతలఁ బంపలేదని భావము.

కం. కలవు ఫలమూలములు కొ,ల్లలుగా వివిధంబు లగుప•లములు నిషాదుల్
వలనుగ శుష్కా-ర్ద్రింబులు, వలసినయంతేయును దేఁగ•వలఁతు లధీశా. ౧౮౪౭

పలములు=మాంసములు, శుష్కా-ర్ద్రింబులు = ఎండినవి పచ్చివి, వలఁతులు =సమర్థులు, అధీశా=ప్రభూ.

తా త్ప ర్య ము

రాజా! యిచ్చటఁ బండ్లు వేళ్లు కొల్లలుగానున్నవి. అనేక విధములయిన మాంసములు గలవు. ఈ మాబోయ లెండినవి కాని పచ్చివికాని కావలయునంత తెచ్చుటకు సమర్థులు.

కం. కావున నీ సేనలతో, నీవును నేఁ డింద యుండి•నిశ గడపి యిటన్
వేవినఁ జనంగ నగు ధా,త్రీవర నా ప్రార్థనంబు • దీర్పు మటన్నన్. ౧౮౪౮

తా త్ప ర్య ము.

కాఁబట్టి నీ సేనలతో నీవును నేఁడంతయు నిందే యుండి రాత్రియిందే గడపి యుదయమైన పిమ్మటఁ బోవవచ్చును. నా ప్రార్థనము సఫలము చేయుము అని ప్రార్థింపఁగా.

—• ౮౫-వ సర్గముఁ గుహుఁడు భరతునుద్దేశంబు సందేహించి యడుగుట •—

సీ. భరతుండు సంప్రీతి•బల్కు- మద్గురుసఖా! యింతసేన నొకండు • వెలమిగార
వింప నెంచితివి నీ•వివిధకామంబులు, నిత్య మభ్యుదయ మై • నెగడుఁ గాక
యన్నరసము కంకు•నాదరణరసంబు, నీ పల్కు-ల • మెచ్చు వచ్చె
గంగ దాఁటఁగరాదు•గహన మీదేశంబు, మాను భరద్వాజ•మౌనియాశ్ర

ఆ. మంబు దెరువు దెల్పు•మా యన గుహుఁడనుఁ, బ్రకట శౌర్యుఁడైన•రామభద్రు
నందు దుష్టబుద్ధిఁ • జెంద వేనియు దాశ, వీరవరులఁ బుత్తు•వెంట వత్తు. ౧౮౪౯

మద్గురు సఖా = నాగురువగు శ్రీరామచంద్రునకు స్నేహితుఁడా, అనుటచే నీవును నాకు గురువు వంటివాఁడవే యని యన్నయుందుఁ దనకు సదభిప్రాయము సూచించెనని భావము. గురువు = అన్న, ఎలమిన్ = సంతోషముతో, అభ్యుదయమై=అభివృద్ధిచెంది, గహనము = చొరరానిది, దాశవీరవరులన్=వీరులగు బోయలందు శ్రేష్ఠులను, ప్రుత్తున్=పంపుమును.

## తాత్పర్యము.

గుహునకు చెప్పిన మాటలు విని భరతుఁడు సంతోషముతో నిట్లనియె :— మా యన్నగారికి నీవు స్నేహితుఁడ వవుటచే నీవు నాకు నన్నవంటి పూజ్యుఁడవే ఇంత సేనను నీవొకఁడవే గౌరవింప నెంచితివి. నీ పలువిధములయిన కోరికలన్నియు సఫలములై యభివృద్ధి గాంచునుగాక. అన్నరసమునకంటె నాదరణ రసము శ్రేష్ఠమని సామెత కలదు గదా కావున నీ మాటలకు మెచ్చుకొంటిమి. గంగ దాట మాకు సాధ్యపడదు. అడవియో చొరరానిది. కావున భరద్వాజమహామునియుండు నాశ్రమమునకుఁబోవుమార్గము తెలుపఁ గోరెదనని గుహుఁడును బ్రసిద్ధ శౌర్యుఁడైన శ్రీరామభద్రునందు నీకు దురభిప్రాయము లేదేని నీ వెంట బెస్తవాండ్రలోఁ బ్రముఖులుగానుండు వారిని బంపెదను. నేను వచ్చెదను. ప్రసిద్ధశౌర్యుఁడనుటచే నీ వింతసేనతోఁ బోయినను నీ వలన నాయన కేభయము లేదని భావము.

ఉ. కారణ మేమి యిట్టు బలఁ•గంబులతోఁ జన రాముమీఁదికిన్?
 దోరపుసందియంబు మదిఁ•దోఁచె,ననన్ మినువోలె నిర్మలుం
 డౌరమణుండు పల్కె నక•టా నను నీవు నచించినట్టియా
 క్రూరపుఁగాల మెన్నఁటికిఁ•గూడకయుండెడుఁ గాక మిత్రమా. ౧౫౮

బలఁగంబులతోన్ = సేనలతో, తోరపు సందియంబు = గొప్ప సందేహము, మినువోలెన్ = ఆకాశమువలె, క్రూరపుఁగాలము=నిర్దయమైన కాలము.

## తాత్పర్యము

ఇంతసేనతో శ్రీరామచంద్రుని మీఁదికిఁ బోవఁగారణమేమి? మంచి యభిప్రాయముతోఁ బోయెదవందువా! ఈ సేనయేల? కావున నా మదిలో గొప్పసందేహముదయించెను. అని చెప్పఁగా నన్ని పదార్థముల సంపర్కము గలిగియు వాని దోష మంటని యాకాశమువలె నిర్మలుఁడైన భరతుండిట్లు చెప్పెను. ఓ మిత్రుఁడా! నీవు సందేహించిన పాపపుఁగాల మేనాటికిని రాకయుండునుగాక.

అది కలికాల పురుషుల ప్రవర్తనముకదా. ఇప్పుడెట్లు వచ్చును.

ద్వి. కడు సూక్ష్మమగుచు నాకాశంబదెల్ల, మొదల నుండియు దేనినెట్లంట కుండు।
 నట్టులు సర్వదేహంబు లందున్న, యట్టియాత్మయు దేనినంటకయుండు॥
 భ. గీ. ౧౩-౩౨.

ఆకాశమువలె నిర్మలుఁడనుటచే నెవరైన నాకాశమును మలినకీచేయవలయు నని యత్నించిన వారి చేతులు మలినకియగునుగాని యాకాశము మలినకిగాదు. అద్ద మును మలినకిచేయవలయునని బూడిదపూసి రుద్దిన వాని చేతులు మలినకి యగును గాని యద్దమునకుఁ బ్రకాశ మెచ్చును.

మ. అనుమానింపకు మయ్య నాయెడల మా॰యన్నన్ రాఘవోత్తంసునిన్
జనకాభున్ రఘురాముఁ దోడుకొని రా॰సన్నాహినై పోయెదన్
జనునే నీమది వేఱుగాఁ దలఁపఁ? నే॰ సత్యంబ యంటిం జుమీ,
యనుడున్ నిర్భరసం ప్రమోదభరితుం॰డై బోయఱే డిట్లనున్.        ౧౮౯

జనకాభున్ = తండ్రితోసమానుని, సన్నాహినై పోవుచున్నాను. శ్రీరామ చంద్రునకుఁ బట్టాభిషేకము చేయుటకొఱకు సేనలను బిలుచుకొని పోవుచున్నాను గాని యుద్ధమునకుఁగాదు. నిర్భర=అతిశయమై భరింపరాని, ప్రమోద = సంతోష ముచే, భరితుండై=నిండినవాఁడై, ఱేఁడు=రాజు.

తాత్పర్యము.

నా యెడల సందేహింపవలదు. నాతండ్రితో సమానుఁడైన మాయన్న యగు శ్రీరామచంద్రునిఁ బిలుచుకొని వచ్చుటకై సేనలతో సర్వప్రయత్నములతోఁ బోవుచున్నాను. నీ మనస్సున వేఱుగాఁ దలంపకు- నేను సత్యమును జెప్పుచు న్నాను. అని చెప్పఁగా గుహుఁడు మిక్కిలి సంతోషించి యిట్లనెను.

ఉ. ధన్యుఁడ వీవ యోభరత॰ధారిణిలోఁ గన రాదు నిన్నుఁ బోల్
మాన్యు లయత్న లబ్ధ మగు॰ తమ్మెతలమెల్లఁ బరిత్యజింప సౌ
జన్యము పేర్మిఁ జూచెదు య॰శంబు ధ్రువంబు జగంబునందుఁ బ
ర్జన్యనిభున్ రఘూత్తమునిఁ॰గ్రమ్మఱఁపం దలఁ గొంటి గావునన్.        ౧౯౦

తాత్పర్యము.

భరతా! మేలు మేలు నీజన్మము సార్థకము. నీవంటి పూజ్యులు లోకమందు లేరు. లోకములో రాజులుకొందఱు తండ్రులను నన్నలను జంపియైన రాజ్య మప హరింపఁ గోరుచుండఁగా నీ ప్రయత్నము లేకయే లభించిన రాజ్యమంతయుఁ గేవ లము మంచివాఁడవగుట చేతనే వదలుకొనఁ జూచుచున్నావు. చేతికి వచ్చిన దివ్యఫలము నోరఁ బెట్టుకొనక యెవఁడు మఱియొకనికిచ్చును. ఇంద్రునితో సమా నుఁడైన శ్రీరామచంద్రునిఁ మరలఁ బిలుచుకొని వచ్చుటకు నాశపడితివి. కావున నీ కీర్తిలోకమున శాశ్వతమై యుండును.

మ. అని సల్లాపము లాడు చుండ రవి పా॰యం బోయె నస్తాద్రి, యా
మినియున్ వర్ధిలె, సేన దీర్ప గుహుఁడున్॰మిత్రాన్వయుం డర్థిఁ ద
మ్మునితోఁ గ్రమ్మఱఁ బోయె శయ్యకు గుణాం॰భోరాశి యాగర్భభా
గ్యనివేశుం డగుధర్మమూర్తి పొగిలెం॰గాకుత్స్థచింతావ్యథన్.        ౧౯౧

సల్లాపములు = మంచిమాటలు = అస్త్రాది=ప్రొద్దుగ్రుంకుకొండ, యామిని =రాత్రి, మిత్రాన్వయుండు = సూర్యవంశమునఁ బుట్టినవాఁడు, అర్థిన్ = కోరికతో, క్రమ్మఱఁబోయె నెయ్యకనుటచే గుహుఁడు వచ్చునప్పటికి భరతుఁడు పండుకొనఁ బోవుచుండెనని ద్యోతకము. ఈ కారణము చేతనే సుమంత్రుఁడిది సమయము కాదని చెప్పక దర్శన మిమ్మని భరతునకుఁ జెప్పెను. గుణాంభోరాశి=ధైర్యాది సద్గుణములను ముత్యములకు సముద్రము వంటివాఁడు, అగర్భభాగ్యనివేశుండు = తల్లిగర్భములోనున్నది మొదలు ఐశ్వర్యమునకు స్థానమైనవాఁడు, ధర్మమూర్తి = ఇట్టిపాపమునకుఁ గారణమైన పాపమేదియు లేనివాఁడు, కాకుత్స్థవ్యథా చింతన్ = శ్రీరాముని విషయమైన చింతయనెడు బాధచే, పొగిలెన్=దుఃఖించెను.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము ముచ్చటలాడుచుండఁగా సూర్యుఁడు పడమటి కొండకుఁ బోయెను. రాత్రి వృద్ధిపొందెను. మరలఁ దమ్మునితోడఁ బండుకొనఁబోయెను. పోయి పండుకొనెనే కాని నిద్రపోయినవాఁడు కాఁడు. ధైర్యాది సద్గుణములనెడి రత్నములకు సముద్రుని వంటి వాఁడును అగర్భ శ్రీమంతుఁడును ధర్మమూర్తియయ్యు శ్రీరామచింతవలనఁ గలిగిన బాధచే దుఃఖించుచుండెను.

కం. వనవహ్నితప్తవృక్షం,బును గోటరవహ్ని లోనఁ◆బొగిలి పొగిలి కా
ల్చినవిధమున సంతాపం, బనఘాత్మకుహృదయ మంత◆కంతకు నేర్చెన్. ౧౯౨

వనవహ్నితప్త వృక్షంబును=కాఱుచిచ్చుచే వెలుపలఁ దపింపఁ జేయఁబడిన చెట్టును, కోటరవహ్ని = చెట్లబొరియలోనుండునగ్ని, లోనన్ = లోపల, పొగిలి పొగిలి=కుమిలి కుమిలి, అనఘాత్ముని హృదయము పాపములేని భరతుని హృదయము, ఏర్చెన్=కాల్చెను.

తా త్ప ర్య ము.

కాఱు చిచ్చు సెగచే వెలుపల దహింపఁబడు చెట్టును ఆచెట్టు తొఱ్ఱలో నుండు నగ్ని కుమిలి కుమిలి లోలోపలనే కాల్చు విధాన సంతాప మాపుణ్యాత్ము హృదయము నంతకంతకుఁ గాల్చెను. ఆ సంతాపముచే దేహముకూడ మంచు నంట్లుండెను.

కం. రవికిరణతప్తహిమగిరి, యవిరళముగ మంచుఁ గార్చు◆నట్టివిధమునన్
బ్రవితతశోకానలసం,భవ మగు చెమ్మటలు గార్చె◆భరతుఁడు మేనన్. ౧౯౩

రవికిరణతప్త=సూర్యకిరణములచేఁ దాపమునొందునట్లు చేయఁబడిన, హిమగిరి = మంచుఁగొండ, మంచున్ = మంచునీళ్ళను, ప్రవితతశోకానల సంభవము = విస్తారమైన శోకాగ్నిచేఁబుట్టిన, చెమ్మటలు=చెమట నీళ్ళను, మేనన్=శరీరమునందు,

తాత్పర్యము.

సూర్యకిరణముల వేడిమికి హిమవత్పర్వతము విస్తారముగ మంచునీళ్ళు కార్చునట్లు విస్తార శోకమనెడి యగ్నివలనఁ బుట్టిన చెమటలను భరతుఁడు దేహమునఁ గార్చెను.

సీ. ధ్యాననిర్దరశిలా♦తతులవినిశ్వాస,ధాతువులను దైన్య♦తరుచయముల
దుఃఖసారంగసం♦దోహములను బ్రమో, హోవంతమృగముల♦నసహనీయ
సంతాపకీచకా♦వధుల సమాక్రాంత,మగుశోకగిరితల♦మందుఁ బడిన
భరతుండు దీర్ఘని♦శ్వాసముల్ పుచ్చుచు, దుర్మనుండై దిక్కు♦దోఁప కేడ్చు

ఆ. చుండె శమము లేక♦యొల్లఁ బోవుచు భ్రష్ట,యూథ మైనవృషభ♦మో యనంగ
గుహుఁడు వరిసిఁ జూచి♦కుతలపాటున నూఱ,డించుచుండె రాము♦నెంచుకొనుచు.
౧౯౨౮

ధ్యాన = శ్రీరామునిఁ గూర్చిన ధ్యానమనెడి, నిర్దర = పగుళ్లులేని గొప్పనైన, శిలాతతులన్ = రాలసమూహముచే పర్వతమున రాలెక్కువగా నున్నట్లు భరతుని చింతయందు శ్రీరామధ్యాన మెక్కువ కాన ధ్యానము శిలాతతులుగా రూపింపఁ బడినది. ధ్యాయతీవబకః, ధ్యాయతీవ పృథివీ ధ్యాయంతీవ పర్వతా యన్నట్లు పర్వతమువలె కదలక మెదలక తదేక ధ్యాన నిష్ఠుఁడై యుండెనని భావము.

తైలధారావత్ సంతతః అవిచ్ఛిన్న ప్రత్యయో ధ్యానం ॥
శంకర భాష్యము. భ. గీ. ౧౩-౨౪.

వినిశ్వాస = పలువిధములగు నిట్టూర్పులనెడి ధాతువులను = గైరికాదిధాతువులచేతను, కొండలో ధాతువులు (Ores) పెక్కువిధములున్నట్లు లీతని నిట్టూర్పులును పెక్కువిధములని దీనినిబట్టి రూపణము. దైన్యతరుచయములన్ = ఆయాయింద్రియ మాయాకార్యము చేయక యుండుట యనెడి తరుచయములన్ = వృక్షపంక్తులచేత; దైన్యమునను దరువులను నజ్ఞానముండునుగాన రూపణము-దుఃఖసారంగసందోహములను = దుఃఖమనెడి వేళ్ళగుంపులచేతను, మృగములు = పులులు తోడేళ్ళు లోనగు క్రూరమృగములు ఇవియును బ్రమోహములును బ్రాణాంతకములుగాన నీ రూపణము యుక్తము- అసహనీయ = ఓర్వరాని. సంతాప = మిక్కిలి తాపములనెడి, కీచక=వెదుళ్ళచేతను, గాలిలోపల దూతి వెలువడునప్పుడు ధ్వనిపుట్టు వెదుళ్ళు కీచకములనఁబడును. ఓషధులను=మందుతీఁగలచేతను, సమాక్రాంతము=బాగుగఁ జుట్టుకొనఁబడినది, శోకగిరితలమందున్ = శోకమనెడి పర్వతమందు, దీర్ఘనిశ్వాసముల్ = అధికచింతచేఁ గలిగిన నిట్టూర్పులు, దుర్మనుండై = శోకముతోఁగూడిన మనస్సుగలవాఁడై, శమము = శాంతి, ఒల్లఁ బోవుచున్ =

మూర్ఛపోవుచు, భ్రష్టయూథము = తనమందనుండి తప్పిపోయినది, వృషభ మో యనంగన్=ఎద్దోయనునట్లు, కుతిలపాటునన్ = భరతునిఁ దుఃఖము బాధఁగలిగిన దుఃఖముచే.

## తాత్పర్యము

శ్రీరామధ్యాన మనెడి పెద్ద గండశైలములచేతను నిట్టూర్పు ధాతువుల చేతను దీనత్వమనెడి చెట్ల సమూహములచేతను, దుఃఖమనెడి జింకలగుంపు చేతను బ్రమోహమనెడి యంతములేని క్రూరమృగములచే, సహింపరాని సంతాపమనెడి వెదుళ్ళు, ఓషధులచే, ఆక్రమింపఁబడిన శోకమనెడి కొండ ప్రదేశమందుఁబడిన భరతుండు నిట్టూర్పులు పుచ్చుచు శోకముతోఁగూడిన మనస్సుగలవాఁడై దిక్కు తెలియక శాంతిలేక మూర్ఛ పోవుచు మందనుండి చీలిపోయిన యెద్దువలె నేడ్చుచుండెను. ఆయనను జూచి గుహుఁడు దుఃఖపడుచు శ్రీరాముఁ దలంచుకొనుచు నూఱడించుచుండెను.

—• ౮౬వ సర్గము. గుహుఁడు భరతునకు లక్ష్మణవృత్తాంతముఁ దెలుపుట •—

తే. అవల నిషాదపతియు మ•హానుభావుఁడైనలక్ష్మణుఁ గూర్చియి•ట్లాడఁ దొడఁగె
శరశరాసనకరవాల•కరు వినిద్రు, భ్రాతృరక్షణపరు నిట్లు•పలికినాఁడ. ౧

పామరు లిరువురు చేరిరేని పామర కథలచేఁ బ్రొద్దు పుచ్చుదురు. భక్తులిరువురు చేరిరేని భగవత్కథలందు భాగవత కథలందుఁ బ్రొద్దులు పుచ్చుదురు. గుహుఁడును భరతుఁడిరువురు శ్రీరామ భక్తులు. భక్తులగు వారికి భగవత్కథలు చెప్పినవే యెన్నిమార్లు చెప్పినను విసుఁగు వేసటయుండదు. ప్రియుల కథలు ప్రియుల కెట్లో భగవత్కథలు భాగవతులకట్లే. కావునఁ బరమ భాగవతోత్తముఁడైన లక్ష్మణు కైంకర్య చరిత్రము భరతునకు గుహుఁడు చెప్పుచున్నాఁడు. భగవద్విషయోపదేశమందుఁ గ్రొత్త ప్రాఁత భేదములేదు. వినువా రాదరములో విననఁ జాలుదు.

సతాం ప్రసంగేమమ వీర్యసంవిదో। భవంతిహృత్కర్ణ రసాయనాః కథాః॥
అని భాగవతము.

అవలన్ = భరతుని మనస్థితి తెలిసి యాయన విషయమైనసందేహము దొలఁగిన పిమ్మట, నిషాదాధిపతి = బోయనాయకుఁడైన గుహుఁడు, ఇంటికిఁ బోయినవాఁడు భరతుఁడు పిలుపించుటచే మరల వచ్చెను.

మహానుభావుఁడైన = అడవిలోనుండు పక్షిమృగముల వృత్తాంతము దప్ప వేఱొకటి తెలియనివాఁడు గుహుఁడు, లక్ష్మణుఁడో భక్తియందు మహామహిమ గలవాఁడు, అట్టివాఁ డిట్టివానిచరిత్ర చెప్పఁబూనుట మహాసాహసము. అయినను భక్తులు తమకుఁ దెలిసినది యల్పమైనను తమ సంతోషముకొఱకై కూడ భగవద్భాగవత

కథలు చెప్పుదురు. అడవి మనుష్యుఁడవు పామరుఁడవు నీకేమి తెలియునని భక్తులనరాదు. సంతోషముగ వినవలయును. దానిచేఁ జెప్పెడు వానికి నుత్సాహము మెండగును. లక్ష్మణ శబ్దము గుఱుతునకు- నామధేయమునకు- సంపదకు- లక్ష్మణునకుఁ బేరు- "చిహ్ననామ్నాస్సు లక్ష్మీశ్చ సౌమిత్రౌ" । నానా. ర. కైంకర్యమే లక్షణముగాఁ గలవాఁడు కావున లక్ష్మణుఁడు ఆయన యందుండు మహానుభావత యదియే- అట్టి మహానుభావముగల లక్ష్మణుఁగూర్చి యిట్లు చెప్పఁదొడఁగె- శరశరాస నశరవాలధరున్ = బాణము- విల్లు- కత్తి వీనిని జేతియందుఁ గలవానిని- ఉన్నవి రెండు చేతులేకదా మూఁడువస్తువు లెట్లు ధరించెననరాదు. బాణము సంధించిన విల్లొకచేతను కత్తి యొకచేతను ధరించెనని భావము. వినిద్రున్ = నిద్రలేని వానిని- నిద్రపోక యాయుధములు ధరించి యేమి చేసెనన, భ్రాతృ రక్షణపరున్ = అన్నను రక్షించుట యందాసక్తి గలవానిని- గుహుఁడు సామంతరాజు- అడవిమనుష్యుఁడు అట్టివాఁడు మహారాజ యనక భరతా యని సంబోధించెను. దీనివలన నేకదేవతా భక్తులు పరస్పరము సౌహృదము- సౌభ్రాత్రము గలవారై యుండవలెనుగాని విద్యాధన జాతి మదములచే నేనెక్కువ వాఁడు తక్కువ యని తలఁపరాదని భావము. పూజ్యత భక్తికిఁగాని వ్యక్తికిఁగాదు.

## తాత్పర్యము

భరతుచర్య విషయమై దృఢనిశ్చయముగల గుహుఁడు శ్రీరామ కైంకర్యమను మహా మహిమగల సార్థకనామధేయుఁడైన లక్ష్మణుని గుఱించి చెప్పఁ బ్రారంభించెను. భరతా! యన్నను రక్షింపవలయునను తలంపుతో బాణము సంధించిన విల్లొకచేతను కత్తి యొకచేతను బట్టుకొని నిద్రలేకయున్న లక్ష్మణునితో నేనిట్లంటిని.

తే. తండ్రి! నీకొఱకై సుఖ•దంబు మేలి,శయన ముపకల్పితం బయ్యె•సౌఖ్య మమర
నందుఁ జని నిద్దురింపు ప్ర•యాసమఱఁగ, విశ్వసింపుము నామాట•విభుకుమార.
ఎ౯౭

సుఖదంబు = సుఖము నిచ్చునది, మేలిశయనము = శ్రేష్ఠమైన పడక, ఉపకల్పితము = బాగుగ నేర్పాటు చేయబడినది, అఱఁగన్ = తొలఁగింపఁగా, విశ్వసింపుము=నమ్ముము.

## తాత్పర్యము.

తండ్రీ! రాజకుమారా! సుకుమారా! కుమారా! నీ నిమిత్తము సుఖము కలిగించు మంచి పడుక చక్కఁగ నేర్పాటు చేయఁబడినది. దానియందు సుఖముగ నిదురింపుము. చాలఁ బ్రయాస పడినాఁడవు. నిద్దురపోయి లేచితివేని శ్రమము దీఱును. మీ యన్నను దాసుఁడనగు నేను రక్షించెదను. నా మాట నమ్ముము.

ఉ. మానితరాజపుత్ర! సుకు•మారుఁడ వీ విట నున్న వారలో
కానలయంద త్రిమ్మరెడి • కర్కశదేహులు గాన జానకీ
జానిని జాగరూకత ని•శాసమయంబున నప్రమత్తతన్
బూనికఁ గాచుచుండుదుము • పొమ్ము శయింపు యథాసుఖంబుగన్. ౯౭

నేను మేల్కొనక యున్న శ్రీరామున కేమైన నపాయమువచ్చిన నేమి చేయవలయు నందువేమొ.

మానితరాజపుత్ర = గౌరవింపఁబడు రాజకుమారా, నీవు రాజపుత్రుఁడవగు కారణముచేతనే గౌరవింపఁబడఁ దగినవాఁడవు- అదియునుగాక సుకుమారుఁడవు- త్రిమ్మరెడి=తిరిగెడి, కర్కశదేహులు=ఎంతకష్టమైన నోరువఁగల కఠినదేహములు గలవారు, జానకీజానిని = జానకినిజాయ (భార్య)గాఁ గలవానిని, బహువ్రీహిసమాసాంతమున జాయ జానియగు- సు. వ్యా. సమా ౬౯ సూ. శ్రీరాముని- జాగరూకతన్ = హెచ్చరికతో, నిశాసమయంబునన్ = రాత్రికాలమందు, అప్రమత్తులై =ప్రమాద పడనివారై.

తా త్ప ర్య ము.

పూజ్యుఁడవైన రాజకుమారా! నీవు సుకుమారుఁడవు. ఇక్కడ నున్నవారో యడవులయందే తిరుగ నభ్యాసపడిన కఠినదేహులు. కావున శ్రీరాముని రాత్రి యంతయు హెచ్చరిక గలవారమై ప్రయత్నముతో గాచుచుండెదము. నీవుపోయి సుఖముగ శయనింపుము. శ్రీరామున కేమో యను భయము లేదు.

ఉ. ఏమన రాము కంటెఁ బ్రియుఁ • డెవ్వఁడు నెందును లేఁడు నాకు, నీ
భూమిని సత్య మిద్ది యన•పోహము సత్యము పైఁ బ్రమాణ మౌ
నీమహితాత్మసత్కృపఁగ•దే మహనీయయశంబు గేవలం
బౌమహితార్థమున్ విపులమైన•సుధర్మముఁ గందు నాయనా! ౯౮

మాయన్న నిమిత్తమై నీవింత శ్రమపడ నేల యందువా? అనపోహము = అసత్యముగాదు, కేవలం బౌమహితార్థమున్ = కేవలము గొప్ప ప్రయోజనము= మోక్షము.

తా త్ప ర్య ము.

శ్రీరాముని నిమిత్తమై నీకీశ్రమ మేల? పండుకొమ్మనెదవా? విను. శ్రీరామునకంటె నెక్కువ ప్రీతి పాత్రుఁడు నాకెచ్చట నెవ్వఁడు లేఁడు. ఆయన యందు నాకంతటి యనన్యభక్తి కలదు. ఇది యపోహముగాదు. సత్యముపైఁ బ్రమాణముచేసి చెప్పెదను. ఈ మహానుభావు దయచేఁగదా గొప్పకీర్తి యసమాన మైన గొప్ప ప్రయోజనము విస్తారమైన మంచి ధర్మఫలము గానఁగలను. అట్టివాని నేను పేక్షింతునా?

ఉ. జ్ఞాతులు నేను నల్గడల•సజ్యశరాసనముల్ ధరించి సం
ప్రీతిగఁ గూర్కు మామకసు•హృత్తమునిన్ సహదారు నప్రమా
దాతతరీతిఁ గాతుఁ జతు•రంగబలంబు లెదిర్చి నేనియున్
ఖ్యాతిగ; నాయెఱుంగని దో•కండును లేడు వనాంతరంబునన్. ౧౯౯౯

జ్ఞాతులు = బంధువులు, నల్గడలన్ = నాలుగు దిక్కులయందు, సజ్యశరాసనముల్ = ఎక్కుపెట్టిన విండ్లు. మామక = నా, సుహృత్తమునిన్ = మిత్రులయందు శ్రేష్ఠుఁడగు వానిని, సహదారున్ = భార్యతోఁ గూడినవానిని, అప్రమాదాతతరీతిన్ = విస్తారమైన హెచ్చరికతో. కాతున్ = రక్షింతును, వనాంతరంబునన్ = అడవిలోపల.

తా త్ప ర్య ము.

భార్యతోడ నిదురించు నా ప్రియమిత్రుని నేను నాబంధువులు నెక్కుపెట్టిన విండ్లతో నాలుగు ప్రక్కల మిగుల హెచ్చరికతోఁ జతురంగబలములతో నెవఁడైన నెదురించినను నిద్రాభంగము కాకుండ రక్షింపఁగలను. ఈ యరణ్యమునందు నాకుఁ దెలియనట్టివ్వరును రాలేరు.

ఉ. జంకకు మన్న లక్ష్మణుఁడు•సన్నుత ధర్మపథంబు నెంచి ని
శ్శంక మనీష మాకుఁ గడు•జాలి వచింపఁ దొడంగె, ధర్మమా
పంకజనేత్రుఁ డైనఘను•వర్యుఁడు సీతయు గొడ్డునేలపైఁ
గొంకక పవ్వళింపఁగను•కూర్కుట నేఁ వది యెట్లు సాధ్యమా! ౨౦౦౦

జంకకుము=సందేహింపకుము, సన్నుత = సజ్జనులచే స్తోత్రము చేయఁబడు, ధర్మపథంబు = ధర్మమార్గము, ఎంచి = తలంచి, నిశ్శంక మనీషన్ = సందేహము లేని బుద్ధితో, జాలి = వ్యసనముతో, మాకున్ = నాకు నాతోడివారికి. తొడంగెన్ = ప్రారంభించెను, పంకజ నేత్రుఁడు = కమలములవంటి కన్నులు గలవాఁడు, గొడ్డు నేలపై =కటిక నేలమీఁద.

తా త్ప ర్య ము.

సందేహింపకుమని చెప్పఁగా సజ్జనులు మెచ్చు ధర్మ మార్గము ననుసరించి సందేహములేని మనస్సుగలవాఁడై మిక్కిలి దుఃఖముతో లక్ష్మణుఁడిట్లు చెప్ప నారంభించెను. అయ్యా! మిత్రమా కమలములవంటి కన్నులుగల శ్రీరామచంద్రుఁడు సీతయు నుత్త నేలపైఁ గొంకులేక పవ్వళింపఁగా నేను సుఖముగా నిదురించుట ధర్మమా నీవు ధర్మమనినను నేను ప్రయత్నించినను నాకది సాధ్యపడునా!

ఉ. కంటికి నిద్ర వచ్చునే? సు•ఖం బగునే బ్రదుకైనఁ? మానసం
బంటునె భోగముల్? ప్రియహి•తా! దితిజామరకోటి నేనియున్
గెంటఁగఁ జాలుఁ గంటుగొనఁ•గేలిగ నట్టిమహాత్ముఁ డిందు వా
ల్గంటియుఁ దాను జీర్ణతృణ•కల్పితశయ్యఁ బరుండి యుండఁగన్. ౨౦౦౧

ప్రియహితా = మిక్కిలి ప్రీతిగల మిత్రుఁడా, దితిజామరకోటి = దైత్యులయు దేవతలయు సమూహములను, కంటుకొనన్ = విరోధించెనేని, కేలిగన్ = ఆటవలె నవలీలగ, గెంటఁగఁజాలున్ = తఱుమఁగొట్టఁగలఁడు, వాల్గంటి = స్త్రీ, జీర్ణతృణ కల్పితశయ్యన్=చివికిన గడ్డిచే నేర్పఱచిన పడుకమీఁద, పరుండి=పండుకొని

తా త్ప ర్య ము.

ప్రియ మిత్రుఁడా! దేవదానవసంఘములనైనను విరోధించెనేని యవలీలగ నాటవలెఁ దఱుమఁగొట్టగల మహాసమర్థుఁడు తాను దన భార్యతోఁ జివికినగడ్డి పడుకమీఁదఁ బండుకొనఁగా నాకెట్లు కంటికి నిద్రవచ్చును. బ్రదుకైన నెట్లు సుఖం బగును. భోగముగము లు మనస్సునకైన రుచించునా?

చం. తపమునఁ గ్లేశపాటున వెతం గని యొక్కని నాత్మతుల్యు నా
యపరిమితప్రతాపుని వనాంతరవీథులఁ ద్రోచి యాజి దాఁ
గృపణతఁ బెద్దకాలము మహిన్ మని యుండుట కల్ల; మిత్రమా!
విపుల యనాథయై చెడెడు వేగమ సత్యము చూచు చుండుమీ. ౨౦౦౨

తపమునన్ = ఉపవాసాది వ్రతములను, క్లేశపాటున = యజ్ఞాది శ్రమముల యొక్క, వెతన్=బాధచేత, ఆత్మతుల్యున్=గుణములందుఁ దనతో సమానుని, ఒక్కని = ముఖ్యుని, అపరిమిత ప్రతాపుని = పరిమితిలేని ప్రతాపము గలవానిని, ఆజి=దశరథుఁడు, కృపణతన్=దీనత్వముచే, మని=బ్రదికి, కల్ల=అబద్ధము, విపుల = భూమి, అనాథయై=దిక్కులేనిదై.

తా త్ప ర్య ము

ఉపవాసాది వ్రతములచేతను యాగాదులవలని వెతలచేతను, లేకలేక తన వంటివాని నొక్క కుమారుని, మితిచెప్పరాని పరాక్రమము గలవానిని, గాంచి కడపట నతని నడవులపాలుచేసిన దశరథుఁడు దుఃఖమున దీనుఁడై చాలఁగాలము భూమిమీఁద బ్రతికియుండుట యసత్యము. కావున భూమి దిక్కులేనిదై త్వరలోనే చెడును. నామాట సత్యము. చూచుచుండుము.

కం. ఏడిచి యేడిచి హాయని, చేడెలు గాసిల్లి సొమ్మసిలి పడ ధరపై
నేడుపురొద లే కానృపుని డెల్లను నుండుఁ గాదె విగతధ్వని యై. ౨౦౦౩

విగతధ్వని = ధ్వనిలేనిది.

తా త్ప ర్య ము.

హాయని స్త్రీలందఱు నేడిచి యేడిచి గాసిపడి మూర్ఛపోయి భూమిమీఁదఁ బడఁగా నేడుపుధ్వనియైన లేక రాజగృహము పాడుపడినట్లు ధ్వనిలేక యుండునుగదా.

కం. వనితామణి కౌసల్యయు, జననాథాగ్రణియు నాదు జననియు నీరే
యిని నైన నెల్లవారును, మని యుండుదురా యటంచు మది శంకింతున్.
౨౦౦౪

తా త్ప ర్య ము.

వనితారత్నమైన కౌసల్యయు, రాజు, నాతల్లిసుమిత్ర తక్కినవారీ రాత్రినైన బ్రతికియుందురా యని నేను సందేహించుచున్నాను.

కం. మనిన మనవచ్చుఁ జామి నా,జనయిత్రి మనంబు నిల్పి • శత్రుఘ్నునిపై
మన నేరదు దుఃఖంబున, జనసుత వీరసువు రాము•జనని క్షీణంబున్. ౨౦౦౫

తా త్ప ర్య ము.

కడగొట్టుకొడుకు శత్రుఘ్నుని మీఁది ప్రేమచే సతఁడైన నున్నాఁడుకదా యని నాతల్లి సుమిత్రాదేవి బ్రదికిన బ్రదుకునేమోకాని వీరునిగన్న తల్లియని ప్రసిద్ధిగన్న కౌసల్యాదేవి యొక్క క్షీణమైన నీక జీవింపదని దుఃఖించెనను.

శా. ఖించెన్ ఖించె గతించె సర్వమును భూ • మీనాథుఁ డీరామునిన్
గ్రించుం డై ధరణీశుఁ జేయకయె తాఁ • గీడొందు నిక్కంబు, దా
నంచుం జేరి భజించి యానృపతి ని • ర్యాణంబునం బైతృకో
దంచత్కార్యము లెల్లఁ దీర్చెదరు సి•ద్ధార్థుల్ దదాత్మోద్భవుల్ ౨౦౦౬

ఈల్గున్ = చచ్చును, అంచున్ = సమీపమందు, నిర్యాణంబునన్ = మరణంబున, పైతృకోదంచత్కార్యములు = చచ్చినవారికిఁ జేయవలసిన యౌర్ధ్వదైహిక క్రియలు, సిద్ధార్థుల్ = కృతార్థులు, తదాత్మోద్భవుల్=అతని కొడుకులు భరత శత్రుఘ్నులు. తా త్ప ర్య ము.

"సర్వము ఖించిపోయెను. ఇప్పుడు చేయఁదగిన దేదియులేదు. ఏమి ఖించిన దందువా? రాజు శ్రీరాముని రాజుగఁ జేయనెంచెను. అట్లు చేయుటకు ముందే చచ్చును. రాజు మరణించిన సమయమున నతని కొడుకులు భరత శత్రుఘ్నులు సమీపమున నుండి కొడుకులు చేయవలసిన యౌర్ధ్వలోక క్రియలు దీర్చి కృతార్థులయ్యెదరు. మా కాభాగ్యముకూడ లేదు. మమ్మాయన కొడుకులుగ నెంచిన నిట్లడవులపాలు సేయునా? మా కాయనకు నీళ్ళువిడుచు భాగ్యముకూడ లేకపోవునా? మేమాయనకుఁ గొడుకులమని యెట్లుచెప్పుదును?

సీ. అక్కటా తండ్రికి • నౌర్ధ్వదైహికముల, భరతశత్రుఘ్నులు • పరఁగఁ దీర్చి
రమ్యచత్వరముల • రమణీయపథములఁ, బ్రాసాదహర్మ్యాది•భవనములను
వారముఖ్యలచేత • వారణవాజుల, నవ్యతౌర్యత్రిక•నాదములను
హృష్టపుష్ట ప్రజా•బృందములను సర్వకల్యాణసంపూర్ణ•కలనములను

తే. నిష్కుటారామచయముల•నిత్యవరస, మాజమహముల నొప్పి పే•రోజ నాదు
తండ్రియేలెడియారాజ•ధానియందు, సంచరింతురు వారలు•సమ్మదమున. ౨౦౦౭

అక్కటా = అయ్యో! ఔర్ధ్వదైహికములన్ = మరణించినవారి కూర్ధ్వలోకముల సుఖము కలుటకై చేయు పితృకార్యములు, రమ్యచత్వరములన్ = మనోహరములైన ముంగిళ్ళచేతను, రమణీయపథములన్ =అందమైన బాటలచేతను,

ప్రాసాద=దేవాలయములు, రాజులయిండ్లు, హర్మ్య = ధనికులయిండ్లు, "హర్మ్యాది ధనినాంవాసః ప్రాసాదో దేవభూభుజా" మ్మని యమరుఁడు. వారముఖ్యల=వారస్త్రీలయందు ముఖ్యలగు వారియొక్కయు, తృతీయాసప్తములకుఁ బ్రాయికంబుగ జడంబువకు ద్వితీయ బహుళంబుగనగు. సు వ్యా. కారక ౧౭ సూ. నామైకదేశే నామగ్రహణమ్మని వారస్త్రీ వార యని చెప్పఁబడియె ఇట్టులే సత్యభామను భామ యని కాని సత్యయని కాని భీమసేనుని భీముఁడని ప్రయోగములు కలవు. నవ్య తౌర్యత్రిక నాదముల = మనోహరములగు నృత్తగీత వాద్యముల యొక్కయు. ఈ మూఁటికిఁ దౌర్యత్రికమని పేరు. హృష్టపుష్ట ప్రజాబృందములన్ =సంతోషము తోడి పుష్టిగల జనుల సమూహములచేతను, సర్వకల్యాణ సంపూర్ణ కలనములను = పుత్రజన్మాదులగు శుభకార్యముల యొక్కయుఁ బూర్ణముగ నిండియుండుటను. నిష్కుటారామ చయములన్ = ఇంటికి చేరిన తోఁటల సమూహములచేతను, నిత్య వరసమాజ మహములన్ = ఎడఁతెగక జరుగు గొప్ప సభల యుత్సవములచేతను, పేరోజన్=గొప్ప కాంతిచే.

తా త్ప ర్య ము.

అయోధ్య తండ్రికి నూర్ధ్వలోక క్రియలుదీర్చి భరతశత్రుఘ్నులు నందము లైన ముంగిళ్ళచేతను మనోహరములైన బాటలచేతను ప్రాసాదములు హర్మ్యములు మొదలైన యిండ్లచేతను నుత్తమ వేశ్యలచేతను రథములు నేనుఁగులు గుఱ్ఱములు వీనిచేతను శ్రవ్యములైన నృత్యగీత వాద్యములను మూఁడు విధములైన వాద్య ధ్వనులచేతను సంతోషించినట్టియుఁ బుష్టిగలట్టియు జనుల సమూహముచేతను, అన్నివిధములైన శుభకార్యములు పూర్ణముగాఁ గూడియుండుటచేతను, ఇండ్లకుఁ జేరిన తోఁటల గుంపులచేతను, ఎల్లప్పుడు జరగు గొప్ప సభలయుత్సవములచేతను నొప్పు గొప్పకాంతిచే రాజిల్లు నాతండ్రి యేలు రాజధానియందు సంతోషముతో సంచరింతురు.

"గృహారామస్తు నిష్కుటః" ఇంటినానుకొనియుండు తోఁట–నిష్కుటము.

ఆరామస్స్యా దుపవనం కృత్రిమం వనమేవయత్. అమరుఁడు.

మనుష్యులు వేసి పెంచినతోఁట యారామము.

కం. తన ప్రతినఁ దీర్చి క్షేమం,బున వర్తిలురాముతోడఁ • బురికిన్ మరలన్
జనఁ గలమే మేమును నా,యనుఁగఁజెలీ! యంతపుణ్య•మా మాకు నికన్. ౨౦౮

ప్రతిన=ప్రతిజ్ఞ. తా త్ప ర్య ము.

పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయుదుననిన తన్నప్రతిజ్ఞ దీర్చి సుఖముగానుండు శ్రీరామచంద్రమూర్తితో నయోధ్యానగరమునకు మరల మేము పోఁగలమా, ప్రియమిత్రమా! యింక మాకును నంతపుణ్యమా.

కం. అని యీరీతి సుమిత్రా,తనయుండు మహాత్ముఁ డార్తిఁ ♦ దరలుచుఁ బరిదే
వన మొనరించుచు నుండఁగఁ, జనియెన్ రేయెల్ల నేమి♦ సంభాషింతున్. ౨౦౦౯

తరలుచున్=సంకటపడుచు, పరిదేవనము=రోదనము.

ఈ ప్రకారముగా గొప్పమనస్సుగల లక్ష్మణుఁడు శోకముతో సంకటపడుచు రోదనము చేయుచుండఁగా రాత్రియంతయుఁ గడచిపోయెను. నేనేమని చెప్పఁగలను. గుహుని కున్నదున్నట్టు చెప్పుటకుఁ దెలియునే కాని యెక్కువ లూహించి వర్ణించి చెప్పు బుద్ధి చమత్కారము గలవాఁడు కాఁడు కావున లక్ష్మణువాక్యములు చెప్పి యింతకెక్కువ నేనేమి చెప్పఁగల ననెను. రాత్రిపోయెనే కాని లక్ష్మణు శోకము పోలేదు.

కం. ఖరకరుఁడు దోఁప జడలన్, ధరియింపఁగఁ జేసి యన్న♦దమ్ముల నేనే
తరియింపఁ జేసితిని నీ,సురతటినిన్ సీతతోడ ♦ సుఖ మేపారన్. ౨౦౧౦

ఖరకరుఁడు = సూర్యుఁడు, తోఁపన్ = ఉదయింపఁగా తరియింపఁ జేసితిని = దాఁటించితిని, సురతటినిన్=గంగను.

తా త్ప ర్య ము.

సూర్యుఁ డుదయింపఁగనే యన్నదమ్ముల నిరువుర జడలు ధరియింపఁ జేసి సీత తోడ రామ లక్ష్మణులను యథాసుఖముగ నేనే గంగ దాఁటించితిని.

కం. కుంజరయూథపతుల్యులు, కొంజక జడలను ధరించి♦కొని వల్కలముల్
రంజిలుచుఁ గట్టి భూసుత,యుం జనుదేరంగఁ జనిరి ♦ యుగ్రాయుధులై. ౨౦౧౧

కుంజర యూథపతుల్యులు = ఏనుఁగు గుంపులలో నధిపతితో సమానులు, కొంకక=జంకక, వల్కలముల్=నారచీరలను, ఉగ్రాయుధులై = భయంకరములైన యాయుధముల ధరించినవారై.

తా త్ప ర్య ము.

ఏనుఁగు మందలలోని పెద్దఏనుఁగులతో సమానులగు శ్రీరామలక్ష్మణులు జంకక జడలుధరించి నారచీరలు గట్టి సంతోషించుచు తమతోడ సీతాదేవిరాఁగ నాయుధములు ధరించి గంగ దాఁటిపోయిరి.

—♦ ౮౭-వ సర్గము. గుహునిపల్కులు విని భరతుండు దుఃఖించుట ♦—

సీ. అనవుడుఁ గైకయీ♦తనయుఁ డాయప్రియ,ముల విని యాధ్యాన♦మున మునింగి
సింహాసంహననుఁ డ♦క్షీణబలాఢ్యుండు, సుకుమారమూర్తి యు♦స్సురు మటంచుఁ
జొక్కి మూర్ఛిల్లివాలెఁ ♦ బొడువఁ దోత్రంబునఁ,బడియెడి యేనుఁగు♦పగిదివంత
సరసన యుండెడి♦శత్రుఘ్నుఁ డాతనిఁ, గౌఁగిటఁ బట్టి దుః♦ఖమునఁ జొగిలె

తే. భర్తృశోకార్దితలు నుప♦వాసకృశలు
భరతుతల్లులు నందఱు ♦ సరగ వచ్చి

పుడమిఁ బడియున్నసద్గుణిఁ • గొడుకుఁ జూచి
యేడ్వఁగాఁ, గ్రుచ్చి కౌసల్య • హితము దోఁప. ౨౦౧౨

అప్రియములు=అనిష్టవాక్యములు, సింహసంహననుఁడు = అవయవస్ఫూర్తి గలవాఁడు, అక్షీణబలాఢ్యుండు=తఱుఁగని బలసంపదగలవాఁడు, తోత్త్రంబునన్ = అంకుశమున, సరసన=సమీపమందే, భర్తృశోకార్తిలు=మగఁడుచచ్చిన శోకంబున బాధపడుచుండువారు, ఉపవాసకృశలు = ఉపవాసములచే శుష్కించినవారు, సద్గుణిన్=మంచి గుణములు గలవానిని.

తా త్ప ర్య ము.

అని చెప్పఁగా నాయనిష్టవాక్యముల విని యూదింతయుందే మునిఁగినవాఁడై సింహసంహననుఁడు తఱుఁగని బలమే సంపదగాఁ గలవాఁడు కోమలదేహము గలవాఁడునగు భరతుఁ డుస్సురని యూర్చి శోకించి మూర్ఛపోయి యంకుశమునఁ బొడువఁగా నేలఁబడు నేనుఁగువలె నేలఁబడెను. అప్పుడు సమీపమందే ప్రక్కన యుండెడి శత్రుఘ్నుఁ డాయనను బట్టుకొని దుఃఖముచేఁ జొక్కిపోయెను. భరతుఁడు నేలఁబడినాఁడనివిని మగఁడుచచ్చెనని యేడ్చుచు నాహారములేక శుష్కించియుండు భరతుని తల్లులందఱు తొందరగావచ్చి నేలఁబడియున్న సుగుణవంతుఁడైన కొడుకును జూచి యేడ్చుచుండగాఁ గౌసల్య హితమెంచినదై.

కం. కడుపారఁ గన్నబిడ్డను, గడుఁ బ్రేమ గలట్టితల్లి • కౌఁగిటఁ గొనున
ట్లుడిఁ కెడిభరతుఁ దపోవతి, యడలుచు ని ట్లనియె శోక• మూరట పెట్టన్. ౨౦౧౩

తా త్ప ర్య ము.

కడుపారఁ గన్నబిడ్డను మిగులఁ బ్రేమగలతల్లి కౌఁగిలించుకొనునట్లు దుఃఖించుచున్న భరతుని గౌఁగిలించి దుఃఖముచేఁ దపించు కౌసల్య సంకటపడుచు శోకము బాధింపఁగా నిట్లనియె.

ప్రేమగలతల్లి యనుటచేఁ గైక కన్నతల్లియైనను బ్రేమగలదిగాదు గావున నామెను దన్నుఁ దాఁకవలదని భరతుఁడు నిషేధించుటచే నామె దాఁకలేదు. ఇంతటి కష్టముఁ దెచ్చిపెట్టిన కాముక ప్రేమగలతల్లి యగునా? తల్లియైనసగునా?

చం. తనువున వ్యాధి లేదు గద • తండ్రి! వచింపు, భవద్వశంబ యీ
యనఘకులంబు జీవితము • ప్రాణము లన్నను నీవ మాకు, నీ
జనకుఁడు స్వర్గ మేగ రఘు•చంద్రుఁడు కానకుఁ బోవ దీన నై
నినుఁ గని కాదె ప్రాణములు • నిల్పినదానను మేనఁ బ్రతికా. ౨౦౧౪

తనువునన్=దేహమునందు, వ్యాధి=రోగము,

తా త్ప ర్య ము.

తండ్రీ! నీకు దేహమునందు శ్రీరామ విరహవేదనచేఁగల రోగములేదుగద. నిష్పాపమైన యీ వంశము నీ స్వాధీనమందున్నది. నీవును మరణించితివా

శత్రుఘ్నుఁడును మరణించును. ఈవార్త శ్రీరామలక్ష్మణులు వినిరా వారక్కడనే చత్తురు. కావున నీతో వంశము నిలిచియున్నది. మాకో జీవితమున్నను ప్రాణమున్నను నీవే. నిన్నుఁజూచెనా నీదుఃఖము సహింపలేక శ్రీరామచంద్రుఁడు మరలి పురంబునకువచ్చును. ఆయన వచ్చిన మేము బ్రదుకుదుము. నీవు మరణించితివా యీయనరాఁడు. నీవు నాయనలేక మేము బ్రదుకఁగలమా చచ్చినవారమే. తండ్రి స్వర్గమునకుఁ బోయినను శ్రీరామచంద్రుఁ డడవులకుఁ బోయినను నీవు శ్రీరాముని మనిఁ బిలుచుకొనివత్తువను నాశతో నిన్నుఁజూచిగదా ప్రాణములు బిగఁబట్టుకొని యున్నాను.

ఉ. అక్కట యేకపుత్రనయి • యారట మొందెడినాదుపుత్రకుం
డొక్కట నాలితోడ విపి • నోర్వికి నేగెడిచోట వింటి వే
మొక్కొ సుమిత్రపట్టియెడ • నొండు ప్రియేతరవార్తఁ దండ్రి ! నీ
విక్కరణిం దపింప నిను • నెవ్వరు దేర్చెడివారు నాయనా ! ౨౦౧౫

ఏకపుత్రను = ఒంటికొడుకుగలదానను, ఆరటమొందెడి = తపించెడి, విపినోర్వికిన్ = అడవిప్రదేశమునకు.

తాత్పర్యము.

తండ్రీ ! యొంటికొడుకును గలదాననై యేడ్చుచుండు నాకొడు కడవికి భార్యతోడఁ బోయినచోట నాయనవిషయమైకాని లక్ష్మణువిషయమైకాని యశుభవార్త యేమైన వింటివా. ఏల యిట్లు లేడ్చుచున్నావు. శ్రీరామచంద్రునొద్దకుఁ బోవుచున్నాముగదా. మమ్ము సమాధానపఱుప వలసినవాఁడవు నీవే యిట్లు లేడ్చుచుండిన నిన్నెవ్వ రూ రార్చువారు.

కం. అని యేడ్వనొక్కముహూర్తం,బునకుం దెలి వొంది మిగులఁ • బొగులుచుఁ గౌస
ల్యను నూరార్చుచు గుహునిం, గని భరతుం డిట్టు లనియెఁ • గళవళపడుచున్. ౨౦౧౬

తాత్పర్యము.

అని యేడ్చుచుండఁగా గాఢమూర్ఛ మునిఁగిన భరతుఁడు ముహూర్తకాలమున స్మృతివచ్చినవాఁడై లేచి మిగులదుఃఖపడుచుఁ గౌసల్యను దల్లీ! నీవనుకొన్నది యేది కాదు. భయపడకుమని యూరార్చుచు గుహునిఁజూచి యిట్లనియెను.

—• భరతుఁడు గుహుని సీతారాముల నిద్రాహారవిషయంబు లడుగుట •—

సీ. మాయన్న యానాఁటి• రేయిదా నెక్కడ, నవనిపైఁ బవళించె • నయ్య చెపుమ
వరసుకుమారి మా• వదినె యెచ్చటఁ బండె,నుండె నెచ్చట లక్ష్మ•ణుండు సఖుఁడ
దేని భుజించిరి • దేనిపై శయనించి, రంతయుఁ జెప్పుమా • యనిన గుహుఁడు
రామునిచరిత స•ర్వంబును జెప్పంగఁ, గడఁగెను బహువిధ•క్రమఫలము

ఆ. అతులభక్ష్యములను • నన్న పానాదులఁ, గొనుచు నేను బోవఁ • గూర్మి మీఱ
నాదరించెఁగాని • యంటఁ డొక్కటియును, క్షత్రధర్మ మాత్మ • సంస్మరించి. ౨౦౧౭

బహువిధ క్రమఫలములు = అనేకవిధములైన మనోహరములైన పండ్లు, అతులభక్ష్యములను=అసమానములైన తినుపదార్థములను, క్షత్రధర్మము = క్షత్రియులకు దానాధికారమేకాని ప్రతిగ్రహాధికారము లేకుండుట యోచించి ఈవిషయమే సీతాదేవి రావణుతో నిట్లుచెప్పఁగలదు. "ఇచ్చునేకాని యొరులచే బుచ్చుకొనఁడు, సత్యమాడునకాని యసత్యమాడఁ, డెట్టివేళల నివియచూ దిట్టమైన రామచంద్రుని వ్రతములు బ్రహ్మతేజ ॥ ఇది యాత్మార్థ విషయ మని యెఱుంగునది. ఆతిథ్యము గ్రహించుట దోషముగాదు గాని యాదినమున శ్రీరామచంద్రుఁడు తీర్థోపవాసము గావించెను. ఆకారణమునఁ దీసికొనలేదు గుహుఁడు తెచ్చియిచ్చినది యాతిథ్యముకాదు. ఇంటికివచ్చినవాఁ డతిథి. శ్రీరామచంద్రుఁడు గుహునింటికిఁ బోలేదు. కానుకలందవమా శ్రీరాముఁడు రాజుగాఁడు. ఈవిషయమున వాల్మీకియు "స్వధర్మము క్షాత్రము గారవించెదున్" అని చెప్పెను.

ఈ విషయమున భారతమున నర్జునుఁ డంగారపర్ణుతోఁ జెప్పిన వాక్యములు చూడుఁడు.

ఎంతమిత్రులయిన నెవ్వఁడు నొరులచే
విద్యయును శుభంబు విత్తచయముఁ గొనఁగనొల్ల. భార. ఆది. ౭.

తాత్పర్యము.

మిత్రుఁడా ! యానాఁటిరాత్రి మాయన్న భూమిమీఁద నెక్కడఁబరుండెను. మిగుల సుకుమారి మావదిన సీతాదేవి యెచ్చటఁబవ్వళించెను. లక్ష్మణుఁ డెచ్చట నుండి కావలికాచుచుండెను. వారు దేనిని భుజించిరి. దేనిపైఁ బండుకొనిరి. చెప్పవయ్యా! యనిన గుహుఁడు శ్రీరాముని చరిత్ర మచ్చోట జరిగినది సర్వము చెప్పఁ దొడంగెను. అనేకవిధములైన కమ్మనిపండ్లు, అన్నము, పానీయములు నేను దీసికొని పోయితిని గాని దయతో మంచిమాటలచే నాదరించెనుగాని క్షత్రియధర్మము దలపోసి యొక్కటినైన వ్రేలుపైచి యంగీకారసూచకముగ దాఁకినవాఁడైనను గాఁడు.

కం. ఇచ్చుట యుచితము మాకుం, బుచ్చుకొనుట తగ దటంచుఁ • బుణ్యాత్ముఁడు దా
మచ్చిక వచించి మరలం, బుచ్చెను నాయిడినవస్తు • వుల నెల్ల నృపా. ౨౦౧౮

తాత్పర్యము.

అయ్యా! మిత్రమా! క్షత్రియులమైన మాకు స్వార్జిత ముత్తమముగాని దత్తము గాదు. నీవు తెచ్చియిచ్చినది యాతిథ్యముగాదు, కానుకగాదు. కావున నేను దీసికోరాదు. అని స్వధర్మమును పుణ్యకార్యమందు మనస్సుగలవాఁడు ప్రేమతో మంచిమాటలుచెప్పి నేనుదెచ్చియిచ్చిన వస్తువులనన్నిటిని మరల వెనుకకంబంపెను.

రాజుల కీపద్యమునఁ జెప్పఁబడినదే ధర్మమేని శ్రీరాముఁడు భరద్వాజుఁ డిచ్చినదాని నెట్లుపుచ్చుకొనె నని యాక్షేపము.

సమాధానము. బ్రాహ్మణులు మధుపర్కాదులచే రాజులఁ బూజింపవలసి నట్లు శాస్త్రముండుటచేతను అట్టి ఋషియిచ్చినదాని నంగీకరించుట శ్రీరామునకే శ్రేయస్కరము గావున ఋషిపూజ నంగీకరించెను. (ఏలనఁ బ్రతిగృహీత పాపదాత యొక్క పాపమును బుణ్యదాతయొక్క పుణ్యమును స్వీకరించుచున్నాఁడు. కావున ఋషిపూజ గ్రహించుటవలన శ్రీరామునకే శ్రేయస్కరము) గాని గుహుఁడు బోయజాతి యగుటచేతను వానికి శాస్త్రీయ రాజపూజ శాస్త్రవిహితము గాకుండు టను కోసలరాష్ట్రమునకుఁ జేరని రాజగుటచేతను వాఁడిచ్చినదానిని బన్నని తలఁ చుటకైనను గ్రహింపఁగూడమిచేత వాఁడిచ్చినవానిని శ్రీరామచంద్రమూర్తి గ్రహింపలేదు. గుహుఁడు బోయజాతివాఁడైనను భగవద్భక్తాగ్రేసరుఁడు గాన శబ ర్యాదులకువలె నితనికిఁ బూజాధికారమున్నను శ్రీరాముఁడిపుడు వ్రతనియమముఁ బూనియున్నాఁడు గాన వాఁడిచ్చిన దేదియు గ్రహింపలేదు. ఋషులిచ్చినను గ్రహించి యుండఁడని తిలకవ్యాఖ్యానము.

గుహుఁడు భక్తాగ్రేసరుఁడు శబర్యాదులవలన గ్రహించిన ట్లితనివలనను బూజ గ్రహింపవచ్చును. తల్లిదండ్రులను బ్రియమిత్రులను వదలి వచ్చినవాఁ డగు టను శ్రీరాముఁడు మిగుల మిక్కిలి దుఃఖించుచున్నవాఁ డగుటను అది పుణ్యనదీ తీరమగుటచేత నచట క్షేత్రోపవాసము చేయవలసి యుండుటఁబట్టియు గుహుఁడు సమర్పించినవానిని శ్రీరాముఁడు గ్రహింపఁడయ్యెనని గోవిందరాజీయము.

మెచ్చికవచించి యనుటచేత నింత యభిప్రాయము స్పష్టపడుచున్నది యని యీవ్యాఖ్యానమందే కలదు. అగస్త్యునిచే విల్లు బాణములు గ్రహించినవిషయము అరణ్యకాండము ౨౦౩ పద్యవ్యాఖ్యయందుఁ జూడుఁడు.

ఉ. ఆవల లక్ష్మణుండు విమ • లాంబువులం గొని తేర సీతతోఁ
  ద్రావి యుపాస ముండె మఱి • దక్కిననీరము నీయఁ దమ్ముఁడున్
  ద్రావెను మువ్వు రంతట య • థావిధి మౌనముతోడ సాంధ్యపూ
  జావిధిఁ దీర్చ లక్ష్మణుఁడు • చయ్యన దర్భలశయ్యఁ గూర్చినన్. ౨౦౧౯

తాత్పర్యము.

నేనుదెచ్చిన వన్నియు మరలఁ బంపినతరువాత లక్ష్మణుఁడు నిర్మలజలములను దీసికొనిరాగా సీతతోడ వానిఁద్రావి యుపవసించెను. తాను ద్రావఁగా మిగిలిన నీరము లక్ష్మణున కీయఁగా నాయన ద్రావెను. అంతట నామువ్వురు సంధ్యాకాల మునఁ జేయవలసిన దేవపూజాదులనఁగా సంధ్యావందనము మౌనమువహించి గావిం చిరి. ఆవల లక్ష్మణుఁడు దర్భలచేఁ బడుక కుదిర్చెను.

ఒకులు త్రావఁగఁ దక్క-నీరమున్" అని యొకరు త్రావఁగా మిగిలిననీళ్లు మఱి యొకరు త్రావరాదని ముందు నిషేధవాక్యము కలదుగదా (చూ ప. ౬౪౧) ఎట్లు శ్రీరామునుచ్ఛిష్టము లక్ష్మణుఁడు పరిగ్రహించె ననరాదు. పురుషులు దేవోచ్ఛిష్టము, గురూచ్ఛిష్టము, జ్యేష్ఠభ్రాత యుచ్ఛిష్టము. స్త్రీలు భర్త యుచ్ఛిష్టమును గ్రహించుట దోషముగాదు "పితుర్జ్యేష్ఠస్యచ భ్రాతురుచ్ఛిష్టం భోక్తవ్య"మనికలదు.

ఇందు సీతయు సంధ్యవార్చినట్లున్నది. ఈ ప్రకారమే సుందరకాండమందు హనుమంతుఁడు సీతాదేవినిగుఱించి యిట్లనుకొనెను. "కం. సంధ్యాకాలంబునఁదా। సంధ్యావందనముఁ జలుపఁ జనుదెంచును ని। ర్వంధ్యోదక యీనది కడ। కుం ధ్యాన మొనర్చికొంచుఁ గూర్చి హృదీశున్. సుంద. ౪౨౩". కావునఁ బూర్వయుగముల స్త్రీలకు సంధ్యావందనాధికారము గలదు. స్మృతికర్తలు దానిని గలియుగమున నిషేధించిరి. యజ్ఞోపవీతము ప్రతినిధి మంగళసూత్రధారణము వైదికముగాదనియు స్మార్తమనియు విజ్ఞులు చెప్పిరి.

౧౩౧౭-వ పద్యమున ముందు సంధ్యవార్చి యావల నీళ్ళు త్రావినట్లున్నది. ఇచ్చట నీళ్ళుత్రావి సంధ్యవార్చిరని యున్నది. ఇందేదిసత్యమని యాక్షేపము.

సమాధానము. అచ్చటఁ గథాక్రమము వరుసఁగ జెప్పఁబడినది కావున నదియె సత్యము. ఇచ్చట వరుస వివక్షింపక భరతుఁ డడిగినప్రశ్నల కుత్తరము చెప్పుటయందు దేనిభుజించిరి యనుప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరమిచ్చి యావలఁ దక్క-నవిషయము చెప్పెను. ఇచ్చటఁ గ్రమ మవివక్షితము కావున నిందుఁ గథాక్రమము సరిగాలేదు. కావునఁ దినినయాహారమును జెప్పి యావలఁ దక్క-నకథను జెప్పెను. కావునఁ బూర్వోత్తర విరోధము లేదు.

తాత్పర్యము.

కం. ఆపడుకయందు రాముఁడు, తన్మైత్రీయుక్తి నుండ • సౌమిత్రియుఁ ద
చ్ఛ్రీపాదంబులఁ గడిగియు, దాపున నిలఁబడక కొంత • దవ్వుగఁ జనియెన్.
౨౦.౨౦

ఆ పడుకయందు శ్రీరామచంద్రుఁడు సీతతోడఁ బండుకొనెను. లక్ష్మణుఁడు శ్రీరాముని పాదములఁగడగి సీతచేత నీరుంచి సమీపమున నుండక కొంచెము దూరము పోయి నిలిచియుండెను.

ఆర్ద్రిపాదంబులఁ బండుకొనరాదను నిషేధమునకుఁ దడికాళ్ళతో నీరు దుడుచుకొనక పండుకోరాదని యర్థము. భోజనము తడికాళ్ళతోనే చేయవలయును.

—• శ్రీరాముఁడు పరుండినస్థలమును గుహుఁడు భరతునకుఁ జూపుట •—

కం. ఆరేయి రాముఁడును సీ; తారమణియుఁ బండినట్టి•దర్భ లివే యా
గారతరుపుమూలం బిదే, కూరిమిఁ గను మిందు నిద్రఁ • గూరిరి వారల్. ౨౦.౨౧

తా త్ప ర్య ము.

ఆ రాత్రి శ్రీరాముఁడు సీతయుఁ బండుకొనిన దర్భలివే చూడుము. వారు దిగిన గారచెట్టు మొదలిదే. ఇచ్చటనే వారు నిద్రించిరి. ప్రేమతోఁ జూడుము.

ఉ. సారతలాంగుళిత్రముల • శాతకలంబక దంబపూర్ణతూ
ణీరములన్ మహాధనువు • నిర్భరవృత్తి ధరించి చుట్టు సం
చారము జేసి కాచె రఘు•సత్తము లక్ష్మణుఁ డెల్ల రేయి య
వ్వీరుని వెంట నంటితిని • విల్లును బాణము లూని నేనునన్. ౨౦.౨౨

సారతలాంగుళిత్రములు=చర్మముతోఁ జేయఁబడి గట్టివియగు నఱచేతినిఁ వ్రేళ్లను రక్షించు హస్తకవచములను (gloves)శాత=పదునైన, కలంబ=బాణములయొక్క, కదంబ=సమూహముచే, పూర్ణ=నిండిన. తూణీరములన్=పొదులను, మహాధనువు=గొప్పవిల్లు,అస్త్రెత్రాడు లాగునప్పుడు వ్రేళ్ళను వింటినడుమును గట్టిగఁ బట్టుకొన్నప్పు డఱచేతులను గాయపడకుండుటకై తొడుగుకొను చర్మముతోఁ జేయఁబడిన తిత్తులు. మహాశూరులు రెండుచేతుల సవ్యాపసవ్యముగ బాణములు ప్రయోగింతురు గావున వారికి రెండుభుజములమీఁద రెండమ్ముల పొదులుండును. ఈ కారణముచేతనే యర్జునునకు సవ్యసాచియనిపేరు. ఆ కాలమునకు నాయనయొకఁడే సవ్యసాచి. శ్రీరామ లక్ష్మణు లిరువురు సవ్యసాచులే. నిర్భరవృత్తిన్ = అతిశయమైన యుపాయముచే, మిక్కిలి పూనికతో, చుట్టు=శ్రీసీతారాముల చుట్టు తిరుగుచు.

తా త్ప ర్య ము.

అస్త్రెత్రాటిదెబ్బ తగులకుండునట్లు వ్రేళ్ళు రాపెక్కకుండునట్లు తోలి కవచములను జేతికిఁ దొడిగికొని పదునైన బాణసమూహములచే నిండినపొదులను పెద్ద వింటిని మిగుల హెచ్చరికతో ధరించి శ్రీసీతారాములచుట్టు రాత్రియంతయుఁ దిరుగుచు రక్షించుచుండెను. నేనో విల్లును బాణములు ధరించి యాయన వెనుకనే పోవుచుంటిని. నీవేల విల్లుబాణములు ధరించితివి? ఆయనకు నీసాహాయ్యము కావలయునా? ఆయన వీరుఁడని నీవే చెప్పితివికదా? యందువేమో. నీవలె శ్రీరామచంద్రునకు లక్ష్మణుఁడును సవతితోడుకే, ఒకసవతితోడుకు శ్రీరాముని నాయువెపలఁ గొట్టెను. ఈతమ్ముఁడేమిచేయ వెంబడించినాఁడో? ఆయన యేదైన శ్రీరామునిపై బాణము ప్రయోగింపఁ బ్రయత్నించెనా వెంటనే యాయనతల దీయుటకై విల్లు బాణముల ధరించి వెనుకవైపుగాఁ బోయితిని.

కం. కునుకక తెప్పన్ వ్రాల్పక, వెనుకొని యాత్మీయు లెల్ల • ధృతకార్ముకులై
చనుదెంచిరి నావెంటన, యనఘా కాచితిమి యిట్లు • లాహరినిభునిన్. ౨౦.౨౩

కునుకక=తూఁగిపడక, ఆత్మీయులు=నాకుఁగావలసినవారు, ధృతకార్ముకులై= ధరింపఁబడిన విండ్లుకలవారై, హరినిభునిన్ = ఇంద్రునితో నుపేంద్రునితో సమా

నని, వారినిభుఁడైన శ్రీరాముని నెవ్వరేమి చేయఁజాలరని నేనెఱుఁగుదును. అయి
నను నాదాసకృత్యము నేను నిర్వహింపవలె గదా యని తిరిగితిని.

తాత్పర్యము.

తూఁగక చెప్పువాల్పరి నావారందఱు విల్లుధరించి నావెంట వెనుకప్రక్కగ
రాఁగా మేమందఱ మాయింద్రుని నుపేంద్రుని సమానుఁడైన శ్రీరామచంద్రుని
గాచితిమి.

—♦౮౮-వ సర్గము. శ్రీరాముఁడు పరుండిన స్థలముం జూచి భరతుఁడు పరితపించుట.♦—

కం. అని గుహుఁడు పల్క సర్వం బును విని భరతుండు మంత్రి♦ముఖ్యులతోడన్
జని యింగుదిమూలమున రా,మునిశయ్యను జూచి యనిమొ♦మునుఁగుచుఁ జింతన్. ౨౦౨౮

తాత్పర్యము.

ఈ ప్రకారము గుహుఁడు చెప్పఁగా సర్వము విని భరతుఁడు ముఖ్యమిత్రులతో
గారచెట్టు మొదటనున్న శ్రీరాముని పడుకనుజూచి చింతలోమునిఁగి యిట్లనియెను.

ఉ. కంటిరె తల్లులార ! రఘు♦కాంతుఁడు నాఁటిత్రియామ నిందు నీ
కంటకదర్భశయ్యపయిఁ ♦ గన్ను మొగిడ్చి శయించె, నల్లదే
కంటిరె నల్గి యున్న యది ♦ కాయమురాపిడిగుర్తు లల్ల నే
యంటినఁ గందు మే నట కు♦శాస్తరణం బఁట! యేమిచెప్పుదున్. ౨౦౨౯

నాఁటి = ఈ గంగాతీరము చేరిననాఁటి, త్రియామయందు = రాత్రియందు,
ఇందున్ = ఈ స్థలమందు,నీకంటకదర్భశయ్యపయిన్ = ముండ్లవలెనున్న యీదర్భల
పడుకమీఁద, శయించెన్ = పండుకొనెను, కుశాస్తరణము=దర్భశయ్య, విషమాలం
కారము.

తాత్పర్యము.

తల్లులారా చూచితిరా ! ఆనాఁటిరాత్రి శ్రీరామచంద్రుఁ డీ ముండ్లవంటి
దర్భశయ్యమీఁదఁ గన్నులుమూసికొని యీప్రదేశమున నిదురించెనఁట. అదిగోఁ
జూచితిరా దేహము రాచుకొనుటచే నలిగిన గుర్తులు. తాఁకిన గందు దేహమఁట
యీ దర్భలమీఁదఁ బండుకొనుటయఁట ! నేనేమని యీవిపరీతమును జెప్పుదును.

చం. అతులయశస్వి యై దశర♦థావనినాథతనూజుఁ డై జగ
త్స్తుతమతి యై కులీనుఁ డయి ♦ దుర్భరవిక్రమశాలి యై జగ
త్పతి యగు రాముఁ డాయతన♦తల్పవరంబులఁ బండు నాథుఁ డీ
క్షితిఁ గుశతల్పసీమ నెటు ♦ చేర్చెనో మే నెటు నిద్రఁ గూరెనో. ౨౦౩౦

అతులయశస్వియై = అసమానమైన కీర్తిగలవాఁడై, జగత్ =ప్రపంచముచే,
స్తుత=పొగడఁబడిన, మతియై=మనస్సుగలవాఁడై, కులీనుఁడయి = గొప్పవంశమునఁ

బుట్టినవాఁడై, దుర్ధరవిక్రమశాలియై=శత్రువులకు సహింపరాని యధికమైన విక్రమముచేఁ బ్రకాశించువాఁడై, జగత్పతి = ప్రపంచమును బాలించువాఁడైన శ్రీరాముఁడు, అజినతల్పవరంబులన్=పరుపుచేయఁబడిన శ్రేష్ఠములైన చర్మపుఁ బానుపులందు, కుశతల్పసీమన్=దర్భలచేఁ జేయఁబడిన పరుపులయందు, మేను = దేహము. ఇందుఁ జెప్పఁబడిన గుణములలో నొకటియున్నను నిట్టి కఠినశయ్యపైఁ బరుండఁ దగఁడు. అట్టుండ నన్నియుఁ గలవాఁ డిట్టిశయ్యపైఁ బరుండ నర్హుఁడా.

తాత్పర్యము.

అసమానమైన కీర్తిగలవాఁడును, దశరథునివంటి మహారాజునకుఁ గుమారుఁడైనవాఁడును, ప్రపంచమంతయు స్తోత్రముచేయు మనస్సుగలవాఁడును, సద్వంశమునఁ బుట్టినవాఁడును, విశేషపరాక్రమముచేఁ బ్రకాశించువాఁడును, జగమంతయుఁ బాలించువాఁడును నగు శ్రీరాముఁడు మృదువైన కృష్ణాజినముల శయ్యయందుఁ బరుండువాఁడు సర్వజనగర్హ్యుఁడు, కేవల నిఋషేదకుమారుఁడు నలువురచేత బుద్ధిలేదనిపించుకొన్నవాఁడు, నీచవంశమునఁ బుట్టినవాఁడు, కేవల నీచసేవకుఁడు, గుండ్లలో ముండ్లలోఁ బండుకొనుటకు వాడుకపడినవాఁడు నగువాఁడు పండుకొన వలసిన యీ దర్భలశయ్యమీఁద దేహమెట్లు చేర్చెనో! పండుకొనెనను కో నిద్రయెట్లు వచ్చెనోకదా!

సీ. ప్రాసాదతలముల నుప్పరిగల విహరించు,నట్టితఁ డుండెనే • చెట్టునీడ
హైమతలాలి నుద్యానంబులం దుండు,ఘనుఁడు చరించెనే • కటికినేల
మలయానిలముపీవఁ • దలిరుఁ బాన్పులఁ బండు,ధన్యుఁడు కూర్కెనే•దర్భశయ్య
మంగళధ్వనులు చెలంగ మేల్కనునృప,వరుఁడు మేల్కనియెనే • వాశితములఁ
తే. ప్రోదిచిలుకలపలుకుల • మోదమునను, వినెడుపతి యెట్లు వినియెనో•వికటసత్త్వ
పరుషరవముల వేనవేల్ • ప్రజలుగొల్వ,నుండునతఁ డెట్టులుండెనో•యొంటినిచట ౨౦.౨౭

ప్రాసాదతలములన్ = రాజులయిండ్ల యందు, ఉప్పరిగలన్ = (ఉపరిగృహము) మేడలమీఁద, హైమతలాళిన్ = బంగారుమయమైన ప్రదేశములయందు, కటికనేలన్=కఠినభూమియందు. తలిరుఁబాన్పులన్=చిగుళ్ళతోఁ జేయఁబడిన పాన్పునందు వాశితములన్=పక్షులకూఁతలచేత, ప్రోదిచిలుకల = పెంపుడుచిలుకల, వికట = భయంకరములైన, సత్త్వ=మృగముల, పరుషరవములన్=చెవులకు వెగటైన ధ్వనులను, వేనవేల్=వేలువేలు.

తాత్పర్యము.

రాజుల యిండ్లయందలి మేడలమీఁదఁ దిరుగునట్టిరాజు చెట్టునీడయందా పరుండెను. ఉద్యానవనములందు బంగారుమయమైన ప్రదేశములనుండు గొప్పవాఁడు కఠినభూమిపైఁ దిరిగెనా? మలయపర్వతమునుండు వచ్చు చల్లని కమ్మనిగాలి

విసరఁగాఁ జిగుళ్ళ పాన్పులపైఁ బండుకొనుభాగ్యశాలి దర్భశయ్యలమీఁదనా పరుండెను ? మంగళవాద్యధ్వనులు మ్రోయఁగా నిద్రమేల్కొను రాజశ్రేష్ఠుఁడు నక్కయీలల ధ్వనిచే మేలుకొనెనా ? పెంపుడుచిలుకల పలుకులు సంతోషముతో వినువాఁడు భయంకరమృగముల కఠినధ్వనుల నెట్లు వినెనో ? వేలకొలఁదులు జనులు సేవింపఁగా నుండు ప్రభు వొంటిగా నిచట నెట్లులుండెనో ?

సీ. మొరసురానేలయే • వరహైమరజత,ప్రాసాదమూయెనా • రామ నీకుఁ
గఱకుదర్భలప్రోవు • నెఱిమించుమెత్తని. పానుపు లాయెనా • భ్రాత నీకు
గారవృక్షముకొమ్మ•లా రాణఁ బట్టిన,నల్లినచందువా • యన్న నీకు
హోరనుగాలియే • యువిదలు వీచెడి,వింజామరలగాలి • విభుఁడ నీకు

తే. వందిమాగధనుతిగీత•వాద్యరవము; పరుషకాకనినాదమే • పరమపురుష
కనకభూషణరాజని•స్వనము లకట, ఝిల్లికాగణరావమా • శ్రీయుతాంగ.
౨౦౨౮

రామచంద్రప్రభూ! మొరసురానేల=గులకరాలుగలనేలయే నీకు, వరహైమ రాజతప్రాసాదమూయెనా=శ్రేష్ఠమైన బంగారు వెండిచేఁగట్టఁబడిన రాజభవనమా యెనా, కఱకుదర్భలప్రోవు=అకురాయివలెనుండి దేహము వాఁతలుపడ గీచుకొను దర్భలరాశి, రాణన్=అందమున, చందువా=మేలుకట్టు, పరుషకాకనినాదమే = కఠినమైన కాకికూఁతలా, కనకభూషణరాజినిస్వనములు=బంగారుసొమ్ముల సమూహముల జిలిబిలి ధ్వనులు, ఝిల్లికాగణనాదమా = ఈలపురుగులకూఁతయా, శ్రీయుతాంగ=కాంతితోఁగూడిన దేహముగలవాఁడా.

తా త్ప ర్య ము.

గులకలరాలనేల నీకు హా! రామచంద్రప్రభూ ! బంగారు వెండిమయమైన మేడయూయెనా ? ఒఱసుకొనిన వాఁతలుపడఁజేయు దర్భలరాశి యన్నా ! నీకు సందమైన మెత్తని హంసతూలికాతల్పమూయెనా ? గార చెట్టుకొమ్మలు సోదరా ! నీకు దోమతెఱయూయెనా ? చెవులు గడియలుపడ హోరని వీచుగాలి విభూ ! వయసు సుందరులు వీచు వింజామరలగాలి యూయెనా? వందిమాగధుల స్తోత్రములు సంగీతవాద్యధ్వనులు కఠినములైన కాకికూఁతలా? పరమపురుష! ఈలపురుగుల గీఁ యను ధ్వనులు బంగారుసొమ్ముల జిలిబిలి ధ్వనులా ?

కం. మతి మోస మయ్యెఁ గాకీ క్షితి నిట్టిది సత్యమొండు • చెలఁగునె, కలచే
సతిమోహపడితి నారఘుపతి యేడన్ గటికి నేలఁ • బండుట యేడన్ ! ౨౦౨౯

తా త్ప ర్య ము.

ఒకదానిని జూచి మోహముచే నామనస్సు మోసపోయి వేఱొకటిగాఁ దలఁచుచున్నది. అట్లుగానియెడల నిటువంటి విపరీతసత్య మొకటి యుండునా !

ఉండదు. ఇట్లుదోఁచుటకుఁ గారణమేమన నాకలచే నేను మోహపడితిని. శ్రీరాముఁడెక్కడ ! ఈ గొడ్డునేలమీఁదఁ బండుకొనుటయెక్కడ ! ఇది నిజమని యెట్లు నమ్ముదును !

కం. తలఁపఁగఁ గాలముకంటెను, బలితము దైవంబు గాదు • పరికింపఁగ నీ
యిల దాశరథిని రాముని, ఖలునట్టులు నిద్దురింపఁ • గాఁ జేసెఁ గదా. ౨౦౩౦

తాత్పర్యము.

అన్నివిధముల గొప్పవాఁడగు శ్రీరాముని దశరథకుమారుని బరమపాపియగు దుష్టునివలె నిదురింపఁ జేసెను గావున దైవముకంటెఁ గాలమే బలీయము. దైవము శ్రీరాముఁడే. కాలబలముననాయనకిన్ని కష్టములువచ్చినపుడు కాలమేకదా బలీయము.

శ్రీరామచంద్రమూర్తి కాలాత్మకుఁడగు భగవంతుఁడే. అయినను లీలావిభూతియందు మానవధర్మ మనుష్ఠానమునఁ జూపఁదలఁచినపుడు దాని నతిక్రమించి తన పరత్వము ప్రకటింపరాదు కదా.

కం. జనకునిసుత యఁట దశరథ, జనపతికోడ లఁట రాము • సతి యఁట ప్రియద
ర్శన యఁట యాసీతయు, వని నేలను బండె నింత • పాపము గలదే. ౨౦౩౧

తాత్పర్యము.

మగవాఁడు కావున శ్రీరాముఁడెట్లో కష్టమువహించె ననుకొన్నను సీత యెట్లు నేలపైఁ బండుకొనెను ! ఆమెయనఁగానేమి సామాన్యురాలా ! జనకమహారాజుకూఁతురు, దశరథమహారాజు పెద్దకోడలు, శ్రీరామచంద్రునిభార్య, సంతోషకరమైన దర్శనముకలది. ఎట్టిదుఃఖమున మునిఁగియున్న మనస్సుగలవాఁడైనను ఆమెను జూచెనా దుఃఖముమఱచుటేకాదు, ఆనందమును బొందును. అటువంటి యయోనిజ లోకపావని సీత యామె నేలపైఁ బండెనుగదా. ఇంతకంటెను క్రూర విషయము వేఱొకటి కలదా. "పాపం స్యాత్క్రూర పాప్మనో" వైజయంతి.

కం. ఇది మాయన్న పరుండిన, యది శయనము కఠినధరణి • నటు నిటు పొర్లన్
జెదరి నలంగెను బూరియు, మృదుతనునకు దర్భశయ్య • యేమనవచ్చున్. ౨౦౩౨

పరుండినయది = పండుకొన్నది.

తాత్పర్యము.

ఇది మాయన్న పండుకొనిన శయనము. నేల కఠినముగా నున్న కారణముచేఁ బడకపొందక నిదుర సరిగాఁబట్టక యీప్రక్క కాప్రక్కకుఁ బొరలఁగా దర్భచెదరి నలఁగెను. మృదుదేహునకుఁ గఱుకుదర్భశయనము. దీనికేమనుకొందును.

ఉ. జానకి యుత్తమం బయిన • శయ్య యిదే, యిట నామె సొమ్ములన్
మేన ధరించియే బడలి • నిద్దుర పొందె నటంచుఁ దోఁచెడిన్
మానుగ నిందు పంకు నవె • మంజుల కాంచన సూక్ష్మరేణువుల్
గానఁగ నయ్యెడిన్, విధిని • కారము నే మనవచ్చు దైవమా. ౨౦౩౩

మంజులకాంచన సూక్ష్మరేణువుల్=మనోహరమైన బంగారు సన్నని యణువులు, విధినికారము=దైవముచేసెడిమోసము, ఉత్తమంబయినశయ్య = సీతాదేవి గాత్రసంస్పర్శమువలన దానికినిర్మాల్యమువలె నుత్తమదశ పూజ్యతగలిగెనని భావము.

తాత్పర్యము.

జానకీదేవి పండుకొనుటచే నుత్తమమైనశయ్యయిదే, దీనియందు నామెసొమ్ముల మీఁది యూశచే బడలికవలన వానిని దీయకయే పరుండెను. అది నీకెట్లు తెలియు నందువా ? సన్నని బంగారు రేణువు లిచ్చటనచ్చటఁ గానవచ్చుచున్నవి కంటివిగదా దైవము మోసగించినపుడు మనమేమి చేయఁగలము. (సూ. ప. ౧౪౪౩.)

ఉ. భామిని యుత్తరీయ మిటఁ • బట్టుకొనెం గనుఁగొంటివే కుశ
స్తోమమునన్ దుకూలమున•సూక్ష్మపుఁదంతువు లిందు రాజిలెన్,
నామది సాధ్వి యాపతికి • నాథునిశయ్యయె సౌఖ్యదాయి యౌ
నేమెయి నున్న నద్ది వగ • పేది శయించుట సీత యియ్యెడన్. ౨౦౩౪

తాత్పర్యము.

సీతాదేవిపైఁట (యుత్తరీయము) యామె లేచునపుడు దర్భలందిచ్చటఁ బట్టుకొన్నది చూచితివా ఆకారణముచే నామెకట్టుకొన్న పట్టువస్త్రములోని సన్నపోగు లిచ్చటఁ బట్టుకొన్నవి. సీతాదేవి యీప్రకారము పండుకొనుటచే పతివ్రతకు నేవిధముగనుండినను మగనిశయ్యయే మిగులసౌఖ్యము కలిగించునని తోఁచెడిని. మగనికి ప్రియమైనది యేదియైనను పతివ్రతయగు నతనిభార్యకుఁ బ్రియమే.

చం. కటకట యెంతపాపుఁడను • గష్టపుజీవిని నానిమిత్తమై
కుటిలత రాఘవుండు దన•కోమలితో నిటువంటిశయ్యపైఁ
గటికిధరిత్రి దర్భలను • గన్ను మొగుడ్చుట గల్గె దిక్కు లే
నటు వెత యింతకన్నఁ గల•దా తలపోయఁగఁ గష్ట భగ్గనన్. ౨౦౩౫

తాత్పర్యము.

అయ్యయ్యో! నేనెంతపాపాత్ముఁడను, ఎంతటి నీచుఁడను, రామచంద్రుఁడు తన భార్యతో నిటువంటి ప్రక్కమీఁదఁ గఠినభూమిపై దర్భలయందు దిక్కులేని వానివలె నిదురించుటకు నేనుగదా కారణము. ఇంతకంటె దుఃఖకారణము గలదా ? ఆలోచించినకొలఁది కడుపు మండిపోవుచున్నదే.

ఉ. పుట్టెను సార్వభౌమకుల•ము న్వెలిఁగించుచు, లోకసమ్మతిం
బట్టుగ సర్వలోకహిత•భావమునం జరియించె నీతికిన్
బట్టయి, యట్టిసుందరుఁడు • పద్మదళాక్షుఁడు రక్తలోచనుం
డిట్టికఠోరతల్పముప•యిం బవళింపఁగఁ గల్గె నే మనన్. ౨౦౩౬

సార్వభౌముఁడు=సర్వభూమికి నధిపతి, చక్రవర్తి, సర్వలోకహితభావమునన్ =సమస్తజనులకు మేలుచేయు తలంపుచే, పద్మదళాక్షుఁడు=కమలములవంటి కన్నులు

గలవాఁడు, రక్తలోచనుండు = సౌభాగ్యచిహ్నమగు ఎఱ్ఱనికన్నులుగలవాఁడు, కఠోర తల్పము=కఠినశయ్య.

తా త్ప ర్య ము.

సార్వభౌమకులమగు సగరునివంశమును ప్రకాశింపఁజేయుచుఁ బుట్టెను. లోకము సమ్మతించువిధముగ లోకమునకు హితమైన భావముతో వర్తించెను. నీతికి స్థానమయ్యెను. అట్టి సుందరుఁడు, అట్టి కమలనేత్రుఁడు, అట్టి రక్తలోచనుఁడు, ఇట్టి అంపమువంటి కఠినశయ్యపైఁ బండుకొనవలసి వచ్చెను.

కం. ధన్యుఁడు మహానుభావుఁడు, మాన్యుఁడు సౌమిత్రియే సు•మా కష్టదశన్
వనస్థలి నన్నను సౌజన్యమునన్ వెంట నంటె • సమయజ్ఞుండై. ౨౦౩౮

తా త్ప ర్య ము.

అక్కఱకాదుకొన్నవాఁడే చుట్టమను న్యాయ మనుసరించి శుశ్రూషచేయ వలసిన సమయమెఱిఁగినవాఁడై కేవలము తనమంచితనమే కారణముగా నన్నుకష్టదశవచ్చినపు డడవులందు సహాయపడ వెంబడించెను. జన్మము సార్థకముచేసికొన్న యదృష్టవంతుఁడు భక్తిగొప్పమహిమ తెలిసినవాఁడు కావుననే లోకమునకంతయు లక్ష్మణుఁడే పూజింపఁదగినవాఁడు సుమా.

ఆ. ధన్యురాలు సీత • తనపతితోడుత, వనికి నేగెఁ గుతుక • మునను సరగ
మనకుచేష్టఁదలఁప • మనల రాముండు ప్రసాదదృష్టిఁ గనుట • సంశయంబ.

తా త్ప ర్య ము.

పురుషులందు లక్ష్మణునివలె స్త్రీలలో సీతయొక్కతెయే ధన్యురాలు, మగఁడు పయనమైన వెంటనే సంతోషముతోఁ దానును బయలుదేఱెను.

తనవిషయమున మనము చేసిన కుచ్ఛితపుఁజేష్ట లాలోచించిన శ్రీరాముఁడు మనల దయాదృష్టితోఁ జూచు ననుట సందేహమే.

ఆ. దశరథుండు విబుధ•ధామంబుఁ జేరుట, రామవిభుఁడు గహన•రాజిఁ బడుట
నారకాటి లేమి • నల్లాడునావిక, పోలె ధరణితలము • జాలిఁ బడియె. ౨౦౩౯

తా త్ప ర్య ము.

దశరథుఁడు స్వర్గమునకుఁ బోవుటచేతను శ్రీరామచంద్రుఁడు వనములలోఁ బడుటను నోడనడుపువాఁడులేక యల్లాడు నావవలె భూమి మిగుల వ్యసనములఁ బాలయ్యెను.

సీ. వనవాసినైనను • వనజాతనేత్రుని, బాహురక్షిత మాటఁ • బత్తనంబుఁ
గొనఁ గోరఁ డెవ్వఁడుఁ • గోరఁ జాలు న దెట్లు, ప్రాకారములు గాచు • వారలేక
యేమఁగుల్ గుఱ్ఱంబు • లేర్పాటు లేకయుఁ, దెఱచి నగవఁకులు • దెఱచి యుండ
దిక్కులే కెదలను • దక్కు మోదంబులు, ప్రజ లున్న యాపాడు•పట్టనంబుఁ

ఆ. బగతుఁ డెవ్వఁడైన • భక్ష్యంబు విషమిశ్రితంబుఁ దినెకిబసుఁడు • ధరణిఁ గలఁడె
మన్నిమిత్త మకట • యున్ని ప్రిప్పులు వచ్చెఁ, బాచితంబుఁ జెప్ప•వాఁడ విసుఁడు.

వనవాసి = అడవులయందుండువాఁడు, వనజాతనేత్రుని = కమలమువంటి కన్నులుగల శ్రీరామునియొక్క, బాహురక్షితము = బాహుబలముచేఁ గాపాడఁబడునది, పత్తనంబు = నగరము, అయోధ్య.

శ్రీరాముఁ డరణ్యమందుండినను అయనభయముచే నేరాజైనను అయోధ్యపై దండెత్తివచ్చి వశపఱుచుకొనఁ బూనఁడనిభావము. ఆయనభయముచేఁ గోరకుండుటకాదు స్వతస్సిద్ధముగానే యెవ్వఁడుకోరఁడు. ప్రాకారములు = పురముచుట్టునుండు కోటగోడలు, ఎదలను=హృదయములయందు, విషమిశ్రితంబు=విషముతోఁ గలిసినది, జడుఁడు=బుద్ధిలేనివాఁడు, మన్నిమిత్తము = నేనుగారణంబుగ, పాచితంబు =ప్రాయశ్చిత్తము.

తాత్పర్యము.

ఏవిధముగఁ జూచినను నయోధ్యాపురమునకు భయములేదు. శ్రీరాముఁ డడవిలోనుండినను నాయన బాహుపరాక్రమముఁ దలఁచి యాపురిపై నెవఁడు నెత్తిరాఁడు. శ్రీరాముని భయముతోను పనిలేదు. స్వతస్సిద్ధముగ నేరాఁడు. ఏలన నేరాజైనను సంపత్సమృద్ధిగల నగరమును వశపఱుచుకొనఁ గోరునుగాని ప్రాకారముల రక్షించువారులేక యేనుఁగులయు గుఱ్ఱములయు నేర్పాటులేక తెఱచిన గవనివాకిండ్లు మూయువారులేక తెఱచినట్లేయుండు రక్షించువారులేమి సంతోషములేకయుండు ప్రజలఁగలిగి పాడుపెట్టినట్లుండు పట్టనము నేశత్రువు వశపఱుచుకొన యత్నించును? విషముకలిసినభక్ష్యంబు దినుమూర్ఖుఁడును గలఁడా? దీనివశపఱుచుకొనువాఁడు లాభమేమియు ననుభవింపక చెడిపోవునేకాని బాగుపడఁడు. ఇన్ని కష్టములకు నేనేకదాకారణము. కావున దానికిఁ బ్రాయశ్చిత్తము చెప్పెదను వినుఁడు.

ప్రాయశ్చిత్త శబ్దభవము పాచితము.

ఉ. పండెద నింతనుండి తృణ • పర్ణచయంబున నొండె భూమిపై
నొండె, ధరించెదన్ జడల • నూనెద నారల నెల్ల వేళలన్,
బండులఁ గందమూలములఁ • బ్రాణము నిల్పెదఁ, దక్క కాలమే
నుండెద హాయిగా వనిని • నోరిమి నన్ప్రతిజ్ఞఁ దీర్చెదన్. ౨౦౪౧

ఇంతనుండి = ఈదినము మొదలుకొని, తృణపర్ణచయంబుననొండెన్ = గడ్డియొక్కయు, ఆకులయొక్కయు సమూహమందుఁగాని, భూమిపైనొండెన్ = భూమిమీఁదఁగాని, నారలన్=నారచీరలను, తక్కకాలము = మిగిలినకాలము,ఓరిమిన్ = ఓర్పుతో.

తాత్పర్యము.

నేటినుండునేను గడ్డిపడుకమీఁదఁగాని యాకుల పడుకమీఁదఁగాని పండుకొనెదను; లేదా భూమిమీఁదనైనఁ బండుకొనెదను; జడలనుదాల్చెదను; సర్వకాలము నారచీరలు కట్టెదను; పండులు కందమూలములుదిని ప్రాణము రక్షించుకొని

దను; పదునాలుగు సంవత్సరములలో శ్రీరామచంద్రుఁ డనుభవింపఁగా మిగిలిన కాలమును నేను హాయిగా నోర్పుతో నడవులయందుండి యన్నప్రతిజ్ఞను దీర్చెదను.

ఉ. ఏలెడుఁ గాక రాముविభుఁ • డీయిల లక్ష్మణుతోడ, నన్నకై
వాలినభక్తిఁ గాననని•వాసముఁ జేయుచు నాకుఁ దోడగున్
బాలిని చిన్న తమ్ముఁ, డట • బ్రాహ్మణముఖ్యు లయోధ్యలోన నీ
శాలలనేకుఁ బట్టము య•థావిధిఁ గట్టి సుఖంత్రుగా కెడన్. ౨౦౮౨

తా త్ప ర్య ము.

శ్రీరామవిభుఁ డీభూమిని లక్ష్మణుఁడుతోడుగాఁ బాలించునుగాక, అన్న మీఁదనుండు నధికభక్తిచే నడవియందు నావినతమ్ముఁడు శత్రుఘ్నుఁడు నాకుసహాయుఁడుగా నుండును. అక్కడ బ్రాహ్మణముఖ్యులు శ్రీరామచంద్రున కయోధ్యలోఁ బట్టాభిషేకముచేసి సుఖంతురుగాక.

ఉ. దేవతలార ! మ్రొక్కెదను • దీర్పుఁడు నాయభికాంక్షితంబు నే
నావిభు రామచంద్రు చర•ణంబుల వ్రాలి యనేకరీతులన్
వావిరి వేఁడుకొందు, రఘు•వర్యుఁడు నామతిఁ బోవఁ డేని నే
నే వని నుందు నందు, నతఁ • డేటికి నన్ను నుపేక్ష సేసెడున్ ! ౨౦౮౩

అభికాంక్షితంబున్ = దృఢమైనకోరికను, వావిరి = బలము, నామతిన్ = నా యిష్టప్రకారము, నన్నున్ = భ్రాతను, శిష్యుని, దాసుని, శరణాగతుని.

* కాంక్షితము = కోరిక, అన్నబదులు మనము కానలకుఁబోయిన బాగుండును అనియే తొలుతనుండెను(చూ. ౮౫-౧౫ ప) అప్పటికింతపట్టుదలలేదు. ఇప్పుడిచ్చటి సంగతులన్నియుఁ జూచినపిమ్మట నాకోరిక బలపడి యడవులకుఁబోకతీరదు. తప్పక పోవలసినదే యను నభినివేశమెక్కువైనది. కావున నది యభికాంక్షితము. స్వల్పమైనకాంక్షితము విమర్శపై బలిష్ఠము చేయుట అభికాంక్షితము. భ. గీ.యందు అభిజానాతి యనుటకు శాండిల్యమహర్షి యిట్టియర్థమే వ్రాసియున్నాఁడు.

తా త్ప ర్య ము.

దేవతలారా! నాదృఢమైనకోరిక నెఱవేర్పుఁడు. మీకు నమస్కరించెదను. నే నా శ్రీరామచంద్రుని నానావిధముల నీవు పట్టాభిషేకము చేసికొమ్మని చరణములపైఁబడి పట్టుదలగా వేడుకొందును. నాయిష్టప్రకార మాయన చేయఁడయ్యెనా నేనే యడవియందు నుందును. అట్లుచేసితినేని తమ్ముఁడను- శిష్యుఁడను- దాసుఁడను- శరణాగతుఁడను నగు నన్నేల యాయన యుపేక్షించును.

ఇదియంతయు భరతుఁడు గంగాతీరము చేరిననాఁటిరాత్రి జరిగినవృత్తాంతము.

—• ౮౯-వ సర్గము. భరతుండు గంగానది దాఁటుట •—

మ. అనుచున్ వేఁగుచు నుండ వేగుటయు నా•త్మాధీశసూనుండు త
మ్ముని శత్రుఘ్నునిఁ జీరి రేయి గనులన్ • మోద్యంగనన్ రామచిం

తనచే; నాగుహుఁ డోడి తెమ్మ తటినిన్ • దాఁటించుఁ గా కెల్లవా
రిని నా, జాగరణంబ నా కనుచు ని•రీతిం బ్రసంగించుచోన్. ౨౦౪౪

వేఁగుచునుండన్ = పరితాపపడుచునుండ, వేగుటయున్=ఉదయముకాఁగా, క్ష్మాధీశసూనుండు = రాజకుమారుఁడు, చీరి = పిలిచి, తటినిన్ = నదిని, జాగరణంబ నాకున్=నాకును నిద్రలేదు, ప్రసంగించుచోన్ = మాటలాడుచుండఁగా.

శత్రుఘ్నుఁడు భాగవత పరతంత్రుఁ డగుటచేఁ జరమపర్వ నిష్ఠుఁడుగదా. ఆయనకేల రామచింతయను ప్రథమపర్వనిష్ఠయునిన భరతుని ప్రీతికొఱకై యని గ్రహింపవలెను. గురువునకుఁ బ్రీతికరమైనదే శిష్యునకుఁ బ్రీతికరమై యుండవలెను. ఆయన యిష్టదేవతయే తనకు నిష్టదేవత. ఆయనమతమే తనమతముగాని గురు శిష్యులు భిన్నమతములవారై యుండరాదు. కలిసి తెలియరాదు. తెలిసి కలియ రాదు. శ్రీరామునకై భరతుఁడు తపించెను. ఆయిరువురనిమిత్తమై శత్రుఘ్నుఁడు తపించెను. ఇది యాచార్య ప్రాచార్య న్యాయమువంటిది.

తాత్పర్యము.

ఈ ప్రకారము చెప్పుచుఁ దపించుచుండఁగా నుదయమయ్యెను. అప్పుడా భరతుఁడు శత్రుఘ్నుని బిలిచి రాత్రియంతయు శ్రీరాముని గూర్చిన చింతచేఁ గన్నుమూయలేదు. అందఱును నేఁటు దాఁటింపవలసిన పనియున్నది. గావున గుహుని బిలుచుకొనిరమ్ము. అనఁగా శత్రుఘ్నుఁడును రాత్రియంతయు నాకును నిద్రలేదు. అని యీరీతి ముచ్చటలాడుచుండఁగా.

ఉ. వచ్చి గుహుండు కే ల్మొగిచి • స్వస్థత రేయి నదీతటంబునం
బుచ్చితివే ? సుఖంబొకొ చ•మూతతి? కంచును స్నే హయుక్తి వా
క్రుచ్చిన సేమ మెల్లరకుఁ • గూరియు నీదుసపర్య లెల్ల మా
యిచ్చకు నెక్క, గంగఁ దరి•యింపఁగఁ జేయుము మమ్ము నెల్లరన్. ౨౦౪౫

కేల్మొగిచి=చేతులుజోడించుకొని నమస్కరించి, స్వస్థతన్=నిర్విచారముగా, చమూతతికిన్ = సేనాసమూహమునకు, వాక్రుచ్చినన్ = చెప్పఁగా, కూరిమిన్ = ప్రేమతో, సపర్యలు=పూజలు, ఇచ్చకునెక్కెన్=తృప్తికరములైనవి.

తాత్పర్యము.

గుహుఁడువచ్చి నమస్కరించి నదీతీరంబున మీకు నిర్విచారముగా రాత్రి గడచిపోయెనా ? సేనాసమూహమునకు సుఖమేకదా ? యని స్నేహముతో మాట లాడఁగా నందఱకు క్షేమము: నీవుచేసినపూజలు నాకు మిక్కిలి తృప్తికలిగించెను.

కం. అని తీవరించి పలికిన, విని గుహుఁడున్ నగరి కేగి • వేవేగమ త
జ్జనములఁ గని తెలెం డిఁకఁ,బనిగొని నావలను బూన్పఁ•బడుఁడీ మీరల్. ౨౦౪౬

తీవరించి=తొందరపెట్టి, పనిగొని=ప్రయత్నించి, తెండు+తెండు = తేతెండు.

### తాత్పర్యము.

అని తొందరపఱిచి పలికిన విని గుహుఁడు తనపరికిఁబోయి మిగుల శీఘ్రముగ నామనుష్యులనెల్లర రారండని పిలిపించి యిఁక లే లెండు,నావలఁ బూన్పఁ బోదుము అని చెప్పఁగా.

తే. సేనదాఁటింప వలయును • శీఘ్ర మనఁగ,వారు రాజాజ్ఞఁదలఁదాల్చి•పంచశతము
నావలను దీర్చి పెద్దఘం•టలు గవాక్ష, ములు పతాకలు కంబళ•ములునుగలిగి. ౨౦౪౭

### తాత్పర్యము.

మీరు సేన శీఘ్రముగ దాఁటింపవలయును. అనఁగ వారు రాజాజ్ఞ శిరసావహించి యైదునూర్ల నావలను జక్కఁజేసి పెద్దఘంటలు, కిటికీలు, ధ్వజములు, రత్నకంబళములును గలవై.

తే. స్వస్తికం బనుపేరఁ బ్ర•శస్తిఁగాంచు, గొప్పనావల నిల్పిన • గురులు విప్ర
జనులు మున్నుగఁ దల్లులు•సకలసతులు, నెక్కరందఱుఁ గుతుకంబు•లెదకునెక్క. ౨౦౪౮

స్వస్తికము  ఈయాకారముగానుండు సుఖకరములగు నోడలను,ప్రశస్తిగాంచి = ప్రసిద్ధికెక్కిన.

### తాత్పర్యము.

స్వస్తికమనుపేరఁ బ్రసిద్ధికెక్కిన గొప్పనావల నిలుపఁగా వానియందు గురువులు బ్రాహ్మణులు దల్లులు, తక్కిన యంతఃపురస్త్రీలు సంతోషముతో నెక్కిరి.

తే. అన్ని నావలలోన మే • లగుచుఁ బాండు,కంబళంబులు పఱచిన•క్రమఘంటి
కానినాదంబు చెన్న గు•దాని గుహుఁడు, తేర రాజకుమారులు•దీవరముగ. ౨౦౪౯

పాండుకంబళంబులు=తెల్లకంబళ్ళు, క్రమఘంటికానినాదంబు = వినసొంపైన గంటలధ్వని, తేరన్ = తీసికొనిరాఁగా.

### తాత్పర్యము.

అన్నిరోడలలో మేలగుచుఁ దెల్లకంబళ్ళు పఱచి చెవికింపైన గంటలధ్వనిచే నందమైనదాని గుహుఁడు స్వయముగఁ దీసికొనిరాఁగా రాజకుమారు లిరువురు శీఘ్రముగ.

సీ. ఆరోహణ మొనర్చ • నావల శకటముల్, వస్తువు లన్నియుఁ • బడవలందు
నెక్కింప నవ్వేళ • నే మున్న నే మున్న, యని యేట దిగిమెడి•యట్టివారి
తమనివాసంబుల • దహియించువవ్వారి, నాపాత్ర యిది యిద్ది • నాది యనెడి
వారి పెన్నులివు ద్యో•పథ మంటు బెస్తలు, గాలిచాఁపల నెత్తఁ • గదలి చనియె

ఆ. సతులతోడఁ గొన్ని • శకటాళితోఁ గొన్ని, హరులతోడఁగొన్ని •యానయుగ్య
తతులతోడఁ గొన్ని • తరు లేగి వింతగ, డించె గంగయావలి•తీరమునను. ౨౦౫౦

ఆరోహణమొనర్పన్=ఎక్కఁగా, శకటముల్=బండ్లు, పెన్నులివు=పెద్దధ్వని. ద్యోపథము=ఆకాశమార్గము, ద్యోవాహినీయని బాలసరస్వతి ప్రయోగముగలదు. హరులతోడన్ = గుఱ్ఱములతోడ, యానయుగ్యతతులతోడన్=యాన = రథములు పల్లకులు మొదలైనవి, యుగ్యములు=కాఁడికిఁగట్టునవి = ఎద్దులు, కంచరగాడిదలు, మొదలైనవి వీనిసమూహములతో. తరులు=నావలు, ఆవలితీరము=దక్షిణపుటొడ్డు.

తాత్పర్యము.

ఎక్కఁగా నావిమ్మట బండ్లుమొదలైనవస్తువులను బడవలందెక్కింపఁగా నప్పుడు నేనుముందు నేనుముందని యేటిలో దిగెడివారలయు వారు వారు దిగియుండిన పందిళ్ళఁ గాల్చువారలయు (రాజభటులు నిర్గమనకాలమున శ్రీసమాగమార్థము తాముండిన యావాసముల దహింతురని ప్రసిద్ధి) యిది నాపాత్రయని యొకరనిన యిది నాపాత్రయని మఱియొకఁడనిన నీరీతి వాదులాడువారలయుఁ బెద్దధ్వని యాకాశ మంటెను. తెప్పలు గాలిచాఁపల నెత్తఁగా నావలన్నియుఁ గదలిపోయెను. ఇట్లు కొన్ని స్త్రీలతోడను గొన్నిబండ్లతోడను గొన్నిగుఱ్ఱములతోడను గొన్నిరథాది వాహనములతోడను గొన్నియెద్దులు కంచరగాడిదలు మొదలగు వానితోడను నావలుపోయి గంగయావలి యొడ్డున దించెను.

కం. జంగమధరణీధరము ల,నంగఁ బతాకములతోడ • నాగము లరిగెన్
రంగుగ బరికాంద్రురతో, గంగానది నీఁదికొనుచుఁ • గమనీయగతిన్. ౨౦౫౧

జంగమ ధరణీధరంబులు = నడచుకొండలు, పతాకములతోడన్ = ధ్వజములతో, నాగములు=ఏనుఁగులు, బరికాంద్రురతోన్ = మావటివాండ్రతో, కమనీయగతిన్=అందమయిన నడకతో.

తాత్పర్యము.

ధ్వజములతో మావటీండ్రతో గంగానది నీఁదుకొనుచుఁ గొండలు పోవుచున్నవా యన్నట్లు లేనుఁగులు నడకొండలవలెఁ బోయెను.

ఉ. కొందఱు దాటి రీఁదుచును • గొందఱు తెప్పలమీఁదఁ బోవుచుం
గొందఱు ద్రాఁకు లండఁగొని • కొందఱు కుండలపైఁ బరుండియున్
గొందఱు యానపాత్రములఁ • గొందఱు కోలములం దరించి రా
యందఱు వారి వారి కను • వైన తెఱంగులఁ బెక్కు రేవులన్. ౨౦౫౨

యానపాత్రములన్=నావలను, కోలములన్ = తెప్పలను, తరించిరి=దాఁటిరి. అనువైన=అనుకూలమైన.

తాత్పర్యము.

కొందఱీఁదుచు దాటిపోయిరి. కొందఱు తెప్పలమీఁదఁబోయిరి. కొందఱు

పాలకిమొదలైన శిబికగానుండు ప్రాఁకులను జంకలలో నిఱికించుకొనియో వీఁపు నకు వడుమునకుఁ గట్టుకొనియో కొందఱు కుండలబోర్లించి వానిమీఁదఁ బండు కొని కొందఱు నావలయందుఁ గొందఱు తెప్పలయందు వారివారి కనువైన వగు రేవులలో దిగి పోయిరి.

ఈపద్య మీ గ్రంథకర్త తొలుత రచియించిన కౌసల్యాపరిణయంబునఁ గాన నగు- (మూ. ఆ. ౫-౬ ప.)

—• భరతుఁడు భరద్వాజమహర్షిని సందర్శింపఁ బోవుట •—

ఉ. అవ్విధి నేగి యందఱు ప్ర•యాగ వనమ్మును మైత్ర మైనమూ
ర్తమ్మునఁ జేరి రంత నుచి•తస్థలమం దొగి నెల్లవారి సౌ
ఖ్యమ్ముగ నుండఁ బంచి మను•జాధిపుఁ డాత్మపురోహితాళితో
సమ్మతిఁ బాదచారి యయి • చయ్యనఁ బోయె ఋషిప్రకాండమున్.　　౨౦౬౩

అవ్విధిన్=అవిధముగ, మైత్ర మైనమూర్తమ్మునన్=మైత్రమను పేరుగల ముహూర్తమునందు, ముహూర్తము (రెండుగడియలకాలము=౪౮ నిమిషము లొక ముహూర్తము; ౨౪ నిమిషములు = ఒకగడియ). పగలు ముప్పది గడియలను ౧౫ భాగములుగా భాగించిన నందొక్కొక్క భాగమునకు నొక్కొక్క ముహూర్తమని పేరు. మైత్రముహూర్తమున నొడ్డుచేరిరనఁగా గంగదాఁటునప్పటి కాఱుగడియల కాలమని యేర్పడిరె. ఇంచుమించు ౮-౩౦ కాలము మైత్రముహూర్తము చెప్పుట చేత వీరికి నపరిమితభోగము లభించెడినని సూచించుచున్నది. భరద్వాజుని విందిది యెకదా. ఈ పదునేనుముహూర్తముల పేర్లు రెండుచోటుల రెండువిధములుగాఁ జెప్పఁబడినవి. అందు మొదటిది బృహస్పతి మతము.

రౌద్రస్సార్పస్తథా మైత్రః పైత్రో వాసవ ఏవచ। ఆపో వైశ్వస్తథా బ్రాహ్మప్రా జేశైంద్రాస్తథైవచ॥ ఐంద్రాగ్నో నైరృతశ్చైవ వారుణార్యమణో భగః। ఏతేహ్నిక్ర మశోజ్ఞేయా ముహూర్తాదశపంచచ॥ విద్యమాధవీయమందు, ఆర్ద్రోరగ మిత్ర మఘావసు జలవిశ్వాభిజి ద్విరించేంద్రాః ఐంద్రాగ్ని మూల వరుణార్యమ భగయుక్తా దివాముహూర్తాస్స్యుః॥ ఏప్రకారమైనను మైత్రము మూఁడవది యగుచున్నది, ఉచితస్థలమందున్=అర్హమైనచోట, ఒగిన్=చక్కఁగా, ఆత్మపురోహితాళితోన్ = తనపురోహితులసమూహముతో, సమ్మతిన్=నిండుమనస్సుతో, పాదచారియయి = వాహనమెక్కక కాలినడకతో, ఋషిప్రకాండమున్=ఋషిశ్రేష్ఠుని, ప్రత్యక్షదర్శ నముగలవాఁడు ఋషి.

తా త్ప ర్య ము.

అవిధముగాఁ బోయి యందఱు మైత్రమనుపేరుగల ముహూర్తమందుఁ బ్రయాగవనమును జేరిరి. అంతనందఱను వారివారికి నుచితమైన స్థలమునందు సుఖ

ముగా నుండుఁడనిచెప్పి భరతుఁడు తనపురోహితులను దోడుతీసికొని పాదచారియై శీఘ్రముగా ఋషిశ్రేష్ఠుని.

పాదచారియయి యనిచెప్పుటచేఁ బెద్దలయొద్దకుఁ బెనుమాళ్ళయొద్దకుఁ బోవు నపుడు వాహనమెక్కి పోరాదనియు నడచియే పోవలయుననియు వినయము సూచించు వేషముసఁగాఁ దలగుడ్డపెట్టుకొని చుంగులుజాఱ నంగవస్త్రములు గప్పుకొని కవచములు దొడుగుకొని పాదరక్షలువేసికొని కీవిగాఁబోక నడుమున కుత్తరీయము చుట్టుకొని పోవలయునని సూచన.

తే. జ్ఞానవృద్ధుఁ దపోవృద్ధు • జంభదమన,వరపురోధ భరద్వాజుఁ •బ్రవయుఁ జూడఁ
బోవుచో మానివర్యప్ర•భూతరమ్య,నగవిరాజిత మైనవ•నమ్ముఁ గనియె. ౨౦౧౮

జ్ఞానవృద్ధున్=జ్ఞానముచే గొప్పవానిని, తపోవృద్ధున్=తపస్సుచేగొప్పవానిని. జంభదమనవరపురోధన్=ఇంద్రుని పురోహితుని, బృహస్పతికి మమతయను దాని యందుఁ బుట్టినవాఁడు, 'భరింపుమీద్వాజనని యె' నని భర + ద్వాజ ననుటచే భరద్వాజుఁడయ్యె, భరత్ + వాజ = భరింపఁబడు, వాజము కేతస్సుగలవాఁడు. అనఁగా రేతస్ఖలనము లేనివాఁడని యర్థము. భరద్వాజో హత్రి భిరాయుర్భి ర్బ్రహ్మచర్యమువాస "తంహి జీర్ణగ్ స్థవిరగం శయాన" మని శ్రుతి. ఈ కారణముచేఁ బ్రవయుఁడు=ముసలివాఁడు, భరద్వాజన్=బృహతో భరద్వాజయని శ్రుతి. ప్రసిద్ధుఁడైనవానిని, మానివర్య=మునిశ్రేష్ఠునియొక్క, ప్రభూత=మిక్కిలి, రమ్య = అందమైన, నగ=వృక్షములచే, విరాజితము=ప్రకాశించునది.

తాత్పర్యము.

జ్ఞానముచేతను తపస్సుచేతను వయస్సుచేతను వృద్ధుఁడయి భరద్వాజుఁడను పేరుగల యింద్రుని పురోహితుని జూడఁబోవునపుడు నాయన మిగుల నందమైన వృక్షములచేఁ బ్రకాశించు వనమ్మును భరతుఁడు చూచెను.

౯౦-వ సర్గము.

చం. కని యొకక్రోసునందె జన•కాండము నిల్వఁగఁ బంచి, శస్త్రముల్
ధనువును వీడి, మేనఁ బరి•ధానము మీఁదికి నుత్తరీయముం
బూనఁ, బురోహితాగ్రుఁ డయి • పోవ వసిష్ఠునిఁ జూచినంత నా
సనమునఁనుండి డిగ్గి తన•ఛాత్రుల నర్ఘ్య మొసంగఁ బంచుచున్. ౨౦౧౯

జనకాండమున్=జనసమూహమును, పంచి=ఆజ్ఞచేసి, పరిధానము = కట్టు వస్త్రము. ఉత్తరీయము=పై వస్త్రము, పురోహితాగ్రుఁడయి = పురోహితుఁడగు వసిష్ఠుని ముందుంచుకొన్నవాఁడై, ఛాత్రులన్=శిష్యులను.

తాత్పర్యము.

ఇట్లుచూచి యొకక్రోసుదూరమునందే జనులసందఱ నిల్వనాజ్ఞ సేసి యాభరణములు విల్లుబాణములు వదలి దేహమునఁ దెల్లని గట్టువస్త్రము మీఁదికి నుత్తరీ

యమమాత్రము గలవాఁడై వసిష్ఠుఁడు ముందుపోవుచుండఁగా నాయన వెనుకఁ దాను బోయెను. ఆ వచ్చుచున్న వసిష్ఠునిఁజూడఁగానే భరద్వాజుఁడు తానున్న యాసనము విడిచి దిగి తనశిష్యులను నర్ఘ్యము తెచ్చి తనచేతికిండని యాజ్ఞాపించుచు.

౨౦౪౧ "ఊనిద నారలనెల్ల వేళలన్" అని చెప్పనే ఇప్పుడీవస్త్రము లెట్లువచ్చె ననరాదు. ఇది యారాత్రివేళ చేసిన సంకల్పమే. అది ఇఁక నాచరణమం దుంచుకొనఁబడును.

సీ. మునిభరద్వాజుండు ♦ ఘను వసిష్ఠునిఁ జేరి, యాలనిపిఱుఁదన ♦ యరుగుదెంచి
తన కభివాదనం♦బును ఘటించినవాని, దశరథసుతుఁ డని ♦ తలఁచి మదిని
నానుపూర్వ్యంబుగ ♦ నర్ఘ్యపాద్యంబుల, ఫలముల నొసఁగి నీ♦బలములకును
గోశమిత్రాళికిఁ, ♦ గుశలమకా యని, ప్రశ్నించి దశరథు♦పా టెఱింగి
తే. యుండుటను దాని నడుగక ♦ యుండె నంత
భరతుఁడు వసిష్ఠుఁడును మునిఁ ♦ బక్షిహరిణ
వృక్షదేహాగ్నులకు నెల్ల ♦ వేఱు వేఱఁ
గుశల మడిగిన నాయన ♦ కుశల మనుచు. ౨౦౪౬

పిఱుఁదన=వెనుకనే, చేరి = సమీపించి, వసిష్ఠ భరద్వాజులు సమానవయస్కులు గనుక నమస్కరింపలేదు. ఆనుపూర్వ్యంబుగన్ = పెద్దచిన్నవరుసననుసరించి, బలములకున్ = సేనలకు, కోశమిత్రాళికిన్ = బొక్కసములకు స్నేహితులకు, కుశలమకా=కుశలమేకదాయని, దశరథుపాటు = దశరథునిమరణము, దశరథుఁడు బాగున్నాఁడా యని మర్యాదకు నడిగినను భరతుఁ డేడువనారంభించును. దుఃఖకారణము కావున నప్రియప్రశ్న మడుగలేదు. పక్షి = ఆశ్రమమందలి పక్షులకు, హరిణ = జింకలకు, వృక్ష=పూలచెట్లకు, పండ్లచెట్లకు, అగ్నులకున్ = అగ్నిహోత్రమునకు, వేఱువేఱన్=ప్రత్యేక ప్రత్యేకముగా నొక్కొక్కదానినే.

తాత్పర్యము.

భరద్వాజుఁడు వసిష్ఠునిఁ జేరఁబోయి యాయనవెనుకనేవచ్చి తనకు నమస్కరించువాని దశరథ సుతుఁడనితలఁచి పెద్దచిన్న వరుస ననుసరించి యర్ఘ్యము పాద్యము ఫలముల నొసఁగి భరతా! నీసేనలకు, ధనాగారములకు, స్నేహితులకుఁ గుశలమా యని యడిగి దశరథుఁడు మరణించుట యెఱిఁగినవాఁడు కావున నప్రియమైన యావృత్తాంతమును బ్రస్తావింపకయుండె. అంత భరత వసిష్ఠులును భరద్వాజని మీపక్షులకు జింకలకుఁ బూల పండ్లచెట్లకు క్షేమమాయని వేఱువేఱఁ గుశలమడిగినఁ గుశలమే యని యాయన చెప్పెను.

—♦ భరద్వాజుఁడు భరతుని రాకకుఁ గారణ మడుగుట ♦—

చం. భరతునిఁ జూచి రాఘవుని♦ప్రైఁ గలరక్తిని బల్కు, నేలుచున్
ధరణిని నీవు వచ్చినని♦దానముఁ జెప్పుము, నీదుచర్యలన్

దురితము దోఁచె, రామవిభుఁ • డాయ్యలితో ననుజాతుతోడుతన్
జిరవనవాసిఁ జేసెఁ గద • శ్రీవశుఁ డై నినుఁ గన్నయాతఁడున్. ౨౦౫౭

రక్తిన్=అనురాగముచే, శ్రీరామునియం దనురాగముచే ననఁగా భరతుని యందు ద్వేషబుద్ధిచేఁగాదని భావము. భరతునకు శ్రీరామభక్తి యెక్కువచేయ వలయుననియే భరద్వాజుని యభిప్రాయము. (౨౦౬౪-వ పద్యము చూడుఁడు). ఏలుచున్=పాలించుచు, నిదానము=మూలకారణము, దురితము=పాపము, తొయ్యలితోన్=భార్యయగు సీతతో, చిరవనవాసి=దీర్ఘకాల మరణ్యమం దుండువానిఁగ. కన్నయాతఁడు = కనుటచేతఁ దండ్రియనవలయునుగాని గుణములచేఁగాదు, శ్రీవశుఁడై=అఁడుదానికి లోఁబడి.

## తా త్ప ర్య ము.

భరతునిఁజూచి శ్రీరామచంద్రునియందుఁగల యనురాగముచే నలని రామ భక్తి దృఢపఱుప నిట్లనియెను. నీవు రాజ్యమేలుచు నిచ్చటికి వచ్చిన కారణమేమి? నీ నడవడియందు దోషము కానవచ్చుచున్నది. నిన్నుఁ గన్నవాఁ డాఁడుదానికి లోఁబడి శ్రీరామచంద్రుని భార్యతోఁ దమ్మునితోఁ జిరకాల మడవులలో నుండఁ జేసెఁగదా.

ఉ. పొమ్మనినంత మా టనక • పోయెఁ గదా పదునాలుగేండ్ల దా
నమ్మతిఁ గాన నుండఁగఁ బ్ర•శస్తచరిత్రుఁ డపాపశీలికిన్
దమ్మున కెగ్గుగూర్చి వసు•ధాతల మెల్ల నకంటకంబుగా
నెమ్మది నేల నెంచితివె • నిర్దయవృత్తిని కైకనందనా! ౨౦౫౮

ప్రశస్తచరిత్రుఁడు=ప్రశంసింపఁదగిన నడవడిగలవాఁడు, అపాపశీలికిన్ = పుణ్య చరిత్రుఁరామునకు, తమ్మునకున్=లక్ష్మణునకు, ఎగ్గు=కీడు, అకంటకంబుగాన్=బాధించువారు, లేకుండునట్లుగా, నిర్దయవృత్తిన్=దయలేనివ్యాపారముచే, కైకనందనా = కైకకొడుకా, కైకను సంతోషపెట్టువాఁడా, ఇట్టివాఁడవైన నీ యందు దశరథుగుణము లుండవుగాని కైకగుణములు లేకయుండునా?

## తా త్ప ర్య ము

కొడుకా పోయిన కైకయొకమాట చెప్పఁగానే ప్రత్యుత్తరమైన చెప్పక పుణ్య చరిత్రుఁడగు శ్రీరామచంద్రుఁడు పదునాలుగేండ్లడవులలోనుండ నమ్మతించిపోయెఁ గదా. అటువంటి ప్రశంసింపఁదగిన నడవడిగల వానికిఁ దమ్మునకు లక్ష్మణునకుఁ గీడు కలిగించి భూమియంతయు శత్రుబాధలేకుండ సంతోషముతో దయాహీనుఁడవై పాలింపఁ జూచితివా?

కం. పాపార్జితంబు నింతటి, తీపా నీ కనిన నతఁడు • దీనుం డై భా
ష్పాపూర్ణనేత్రుఁ డై యు,త్తాపముఁ గని యిట్లనియెఁ • దడఁబడఁ బల్కుల్.
౨౦౫౯

పాపార్జితంబు = పాపకార్యములచే సంపాదించినది, ఇంతటితీపా = అన్నను దమ్ముని దేశము వెడలఁ గొట్టుటయేకాక యొందోయున్న చోటికిఁబోయి చంప యత్నించునంతటి తియ్యనిపదార్థమా ! దీనుండై=దుఃఖించుచున్నవాఁడై, బాష్పపూర్ణనేత్రుఁడై=కన్నీళ్ళచేనంతట నిండిన కన్నులుగలవాఁడై. తడఁబడన్=తొట్రుపాటు పడుచుండఁగా.

తా త్ప ర్య ము.

నీకుఁ బాపముచే సంపాదించిన ధన మింత ఘోరకార్యము చేయించునంతటి యింపైనదా ! అనిన భరతుఁడు దుఃఖించుచుఁ గన్నులు నీళ్ళతో నిండఁగా మాట తడఁబడ నత్తపస్వితో నిట్లనియెను.

చం. అకట మహానుభావ ! నినువంటివాఁడును నిట్టు లెంచ నీ
    తకలుషు వ్యర్థజీవిని గదా ! యొకపాపము లేదు నాయెడన్;
    వికటకఠోర వాక్కులను వీనులఁ గ్రుచ్చుట మేలె; కైకపు
    త్రకుఁ డనునింద దప్ప నొకతప్పును గల్గదు సుమ్ము నాయెడన్. ౨౦౮౦

మహానుభావ=గొప్పతపోమహిమగలవాఁడా- నినువంటివాఁడును=నీయంత త్రికాలవేదియు, ఈమాటయే కౌసల్యాదేవి యన్నప్పుడు ఈమెయాఁడుది, అందుఁ బుత్రశోకముచేఁ దపించుచున్నది. ఈమెకిట్టిసందర్భమున వాస్తవము తెలిసికొను బుద్ధిబలమెచ్చటిదని మిగుల సంతాపించిన వాఁడఁగాను. మరల నిట్టులే గుహుఁ డడిగినప్పుడు అడవిమనుష్యుఁడు అనాగరికుఁడు నామనస్థితి వీఁడెట్లు తెలిసికోఁ గలఁడని సహించితిని గాని త్రిలోకవేదివి త్రికాలవేదివగు నీవు నావిషయమై సందేహించినపుడు నాజన్మమే వ్యర్థమని భావము. నీతకలుషున్=పాపములేనివానిని, వ్యర్థజీవిని=వ్యర్థముగా జీవించువాఁడను, వికట=మిక్కిలిభయంకరమైన, కఠోర=కఠినములైన, వాక్కులను=మాటలను.

తా త్ప ర్య ము.

అయ్యో ! తపోమహిమచే భూతభవిష్య ద్వర్తమానములఁ దెలిసికొను మహిమగలవాఁడా ! నీవంటి మూఁడుకాలముల మూఁడులోకముల వర్తమానముల నెఱిఁగినవాఁడుకూడ నీప్రకారము నన్ను నిర్దోషిని దోషి యని యెంచెనేని నాజన్మమే వ్యర్థము నామనస్సునేను శోధించిచూచితిని గాని యొకతప్పైనఁ గానరాలేదు కాఁబట్టి భయంకరములై కఠినములైన వాక్కులను సూదులచే నాచెవులు గ్రుచ్చుట మేలా ! నీవు పిలిచినట్లు కైకపుత్రుఁడను దోషముదప్ప నాయందు మఱియేదోషము లేదు. దైవముచేసినదానిని నేనెట్లు సవరింపఁగలను.

ఆ. నేను లేనివేళ నిష్ఠురనై నాదు,జనని సల్పినట్టి చెనఁటిచేఁత
    నామతంబు గాదు నాయిష్టమును గాదు, దాన సంతసంబుఁ బూన నెదను.
౨౦౮౧

నిష్ఠురవై=కఠినవర్తనముగలవై, చెనటిచేఁత=చెడ్డకార్యము.

తాత్పర్యము.

నామతంబుగాదు నాతోనాలోచించి నా యభిప్రాయము చొప్పునఁ జేసినది కాదు నాయిష్టమునుగాదు చేసినపిమ్మట నేనుదాని నంగీకరించిన వాఁడనుగాను.

ఉ. పోవుచు నున్నవాఁడ రఘు•పుంగవుఁ దోడ్కొనిరా నయోధ్యకున్
బావనశీల! యాయనఘు•పాదయుగంబులమీఁద వ్రాలి స
ద్భావమునన్ క్షమింపు మని • ప్రార్థన సేయఁగఁ బోనివాఁడ; నీ
వావిభుఁ డిప్పు డెచ్చట య•థాసుఖవృత్తిఁ జరించుఁ జెప్పుమా! ౨౦-౨

పావనశీల = పవిత్రస్వభావముగలవాఁడా, పాదయుగంబులమీఁదన్ = రెండు కాళ్ళమీఁద, సద్భావమునన్ = మంచియభిప్రాయముతో, యథాసుఖవృత్తిన్ = సుఖము నతిక్రమింపని వ్యాపారముతో.

తాత్పర్యము.

అట్లైన నీవిపుడింత సేనతో వచ్చుటకుఁ గారణమేమందువా? పవిత్రచరిత్రా! శ్రీరామచంద్రుని నయోధ్యకుఁ బిలుచుకొని వచ్చుటకై పోవుచున్నాను. పోయి యేమిచేసెదవందువా? ఆయన రెండుపాదముల మీఁదఁబడి మంచిమనస్సు గలవాఁడనై నన్ను క్షమింపుమని ప్రార్థనచేసి యాయన కచ్చటనే పట్టాభిషేకముచేసి పిలుచుకొని రాఁబోనివాఁడను. కావున శ్రీరాముఁ డెచ్చట హాయిగా విహరించుచున్నాఁడో యాస్థలమును చెప్పుము.

చం. స్థిరకృప నన్న నంతట వ•సిష్ఠుఁడు లోనగువారు వేఁడినన్
భరతునిఁ జూచి మౌని యిటు • పల్కెను రాఘవవంశ్య! నీకు నీ
గురుహితవృత్తియున్ దమముఁ • గోవిదసాధ్వను యాయితల్ దగన్
బరఁగుము నిత్యకీర్తివయి • భాసుర తేజ జగత్త్రియంబునన్. ౨౦-౩

స్థిరకృపన్=స్థిరమైనదయచే, పై పద్యములోని చెప్పుమా యనుదానితో నన్వయము. గురుహితవృత్తియున్=అన్నమేలుకోరు వ్యాపారము, దమము = ఇంద్రియ నిగ్రహము, కోవిదసాధ్వనుయాయితల్=పండితులగు సాధుల ననుసరించి పోవలయు నను, భాసుర తేజ=ప్రకాశించు తేజస్సుగలవాఁడా, జగత్త్రియంబునన్ = మూఁడు లోకములందు, నిత్యకీర్తివి=శాశ్వతమైన కీర్తిగలవాఁడవు.

తాత్పర్యము.

స్థిరమైనకృపతోఁ జెప్పుము. అని చెప్పఁగా వసిష్ఠుఁడు మొదలగువారు మునీంద్రా! భరతుని యభిప్రాయము దుష్టముగాదు ఆయన సత్యమే చెప్పెను. మంచి మనస్సుతోనే పోవుచున్నాఁడని ప్రార్థింపఁగా భరతునిఁజూచి భరద్వాజుఁ డిట్లనియె. దశరథ నందనా! నీకు నన్నకు హితమైన వర్తనము, ఇంద్రియ నిగ్రహము, జ్ఞాన

లగు సాధుల ననుసరించి వర్తించుట దగును. నీ తేజస్సు లోకమునఁ బ్రకాశింప మూఁడులోకములందు శాశ్వతకీర్తి కలవాఁడ వై యుండుము.

చం. ఎఱుఁగనివాఁడఁ గాను భరతేశ్వరనందన! నీమనంబు, నే
నెఱిఁగియు నీకుఁ గీర్తి ఘటియింపఁగ బుద్ధి దృఢీకరింపఁగా
బిఱుసన నాడినాఁడఁ; బృథివీజయుఁ దమ్ముఁడుఁగొల్వ రాముఁడున్
వఱలెడిఁ జిత్రకూటగిరివర్యమునన్, నిజ మే నెఱుంగుదున్. ౨౬౪

తా త్ప ర్య ము.

రాజకుమారా! నీ మనస్సెట్టి దైనది నాకుఁ దెలియకపోలేదు. నేనెఱిఁగియు శ్రీరామభక్తి యందు నీబుద్ధిని స్థూణానిఖనన న్యాయమున స్థిరపఱిచి నీకుఁ గీర్తి కలిగింపఁగోరి పరుషవాక్యము లాడితిని. సీతారామలక్ష్మణులు మువ్వురు చిత్రకూట పర్వతంబున నున్నవారు. నిజముగా నాకుఁ దెలియును.

స్థూణానిఖననన్యాయ మనఁగా నొకగుంజను నేలలో గట్టిగాఁ బాఁతియు గట్టిగ నున్నదో లేదోయని కదలించి చూచుటవంటిది.

కం. ఈపూఁట నిందు నిల్వుము, నీపరిజనమంత్రిజనులు నీవుఁ బ్రియమునన్
రేపాడి పోవఁ జను నీ, తాపతిఁ గనఁ గామితార్థదానప్రవణా. ౨౬౫

ఈపూఁట = పూఁట దివమునకుపలక్షణ- పరిజన = సేవకులలో, మంత్రిజనులతో, నీవునిలువుము- ఒకానొకచో సహార్థంబున యుష్మదస్మదర్థంబు లభితంబగుచోఁ గ్రియాబు తత్కర్తృకంబులు విభావనగు. సు. వ్యా. వాక్య- సూ. ౫౧. ఈసూత్రప్రకార మేకవచనక్రియ, రేపాడి = ఉదయమున, కామితార్థదానప్రవణా=కోరిన కోరిక లిచ్చుటయందు నాసక్తి గలవాఁడా, కావున నాకోరిక నెఱవేర్పుము.

భరద్వాజుఁ డిట్లుచెప్పుటచే రాజు తనయింటికి వచ్చినపుడు సపరివారముగ నతనికి నాతిథ్యమిచ్చి యాదరింపవలయునని సూచన.

యావంతః ఖలు వై రాజాన మనుయాంతి తేభ్యః
సర్వేభ్య అతిథ్యంక్రియ తే ఐతరేయబ్రాహ్మణము.

తా త్ప ర్య ము

కోరినవారికోరికలు నెఱవేర్చుటయం దాసక్తి గలవాఁడా నీవు నీపరిజనులతో మంత్రులతో నీదినము నా యాశ్రమంబున నిలువుము శ్రీరామునిఁజూడ రేపటి యుదయము పోవచ్చును.

౯౧-వ సర్గము.

కం. అనవుడు నట్టులుకా యని, జనపాలతనూజుఁ డానిశ నిలిచె నటన్
ముని యాతిథ్యార్థము ప్రార్థన మొనరుప నాతఁ డాభరద్వాజు ననున్. ౨౬౬

తా త్ప ర్య ము.

అని ముని యాతిథ్యమిచ్చుటకై భరతునిఁ బ్రార్థింపఁగా నారాత్రి యచ్చట

నిలుచుట కంగీకరించెను. నిలుచుట కంగీకరించి పరిజనులకందఱకు నాతిథ్యమిచ్చెద నన్నవిషయమై యిటులు భరద్వాజతో ననెను.

కం. ఇచ్చితిరి పాద్య మర్ఘ్యం, బిచ్చితి రాతిథ్య మడవి ♦ నెసఁగెడిదానన్
సచ్చరితా! తుష్టుఁడ నన, మచ్చిక నగ వంకురింప ♦ మౌని వచించెన్. ౨౦౬౭

ఇచ్చితిరి=పూజ్యార్థంబున బహువచనము.

తాత్పర్యము

మునీంద్రా! మీరర్ఘ్యమిచ్చితిరి, పాద్యమిచ్చితిరి, అడవిలోఁ బుట్టువానితో నాతిథ్యమిచ్చితిరి చాలసంతోషించితి ననిన నాయన నిష్కల్మష హృదయమునకు వినయమునకు గర్వములేమికిఁ దానేల విందుపెట్టెద ననుచున్నానో యని తెలియమికి నడవులయందు వాఁడింతకన్న నేమి యెక్కువ చేయఁగలఁడను నతని యభిప్రాయమెఱింగి నామహిమ వీనికిఁ దెలియదా యెనని చిఱునవ్వునవ్వి ముని యిట్లనెను

ఉ. ఏమియొ కొంచె మిచ్చుటనె ♦ తృప్తి వహించితి, వే నెఱుంగుదున్;
భూమిప! నీకు సేనకును ♦ భోజన మీయఁగ వేడ్కయయ్యెడున్
నామతి నీవు పోవుట ఘ♦నంబు ముదం బిడు నాకు, వాహినీ
స్తోమము దూరమం దిడితి ♦ తోడ్కొని రా వది యేల నావుడున్. ౨౦౬౮

తాత్పర్యము.

రాజా! నేనేదియొ కొంచె మిచ్చుటచేతనే నీవు సంతుష్టుఁడ వైతివి. అదినాకుఁ దెలియును. ఈదినము నీకు నీసేనకు నందఱకు భోజనము పెట్టవలయు నని నాయభిలాష. నామనస్సుప్రకారము నీవుపోయిన నాకు మిక్కిలి సంతోషమగును. నీవు సేనాసమూహమును దోడఁదీసికొనిరాక యొంటరిగా వచ్చితివేల?

చం. మునివర! మీభయంబునఁ జ♦మూనివహంబులఁ దేను, రాజులేన్
జనపతిపుత్రులేని జత♦నంబునఁ ద్యాజ్యము చేఁత మే లగున్
మునివిషయంబు,లశ్వకరి♦ముఖ్యబలాంగము లాశ్ర మోటజా
వనిరుహపాళిఁ దీర్చు నని ♦ వచ్చితి నొంటరిగాఁగ, నం చనన్. ౨౦౬౯

జతనంబునన్=యత్నము, తద్భవము, జతనము = ప్రయత్నపూర్వకముగా, త్యాజ్యముచేఁత=వదలిపెట్టుట.మునివిషయంబులు=మునులుండు ప్రదేశములు, అశ్వకరి ముఖ్య బలాంగములు = గుఱ్ఱములు, ఏనుఁగులు మొదలగు సేనాంగములు, ఒంటెలు భటులు, ఆశ్రమోటజావనిరుహపాళిన్=ఆశ్రమమందలి పర్ణకుటీరమందలి చెట్లసమూహమును, తీర్చును=నాశముచేయును.

తాత్పర్యము

మునీంద్రా! మీవలన భయముచే నేను సేనలనుగూడఁ దీసికొని రాలేదు. రాజులైనను రాజకుమారులైనను మునుల యాశ్రమములందు సంచరింపక ప్రయత్నపూర్వకముగా వదలిపెట్టవలయును. సేనలయందలి యేనుఁగులు గుఱ్ఱములు ఒంటెలు

లోనగునవి యాశ్రమము నందలివియుఁ బర్ణశాలలయం దుండునవియు నగు వృక్షములను ధ్వంసముచేయునని దూరమునందే వదలి నే నొంటరిగానే వచ్చితిని. అవి వచ్చి మీయాశ్రమ వృక్షములను విఱిచి ధ్వంసముచేసిన మీరు కోపింతురు. మఱి శపింతురు. ఇది మీవలనిభయము.

ఒంటరిగానే = భరతుఁడొక్కఁడే రాలేదు. శత్రుఘ్నుఁడు వసిష్ఠాదులు కూడ వచ్చినవారే. కావున నొంటరిగా ననఁగా సేనలు మొదలయినవి లేకయనియర్థము.

కం. వలదు తడ వింక సేనలఁ, బిలిపింపు మటంచు మౌని ♦ ప్రియమునఁ బలుకన్
బలఁగం బంతయు రా రఘు,కులముఖ్యుఁడు పనిచె నంతఁ ♦ గుతుకము మీఱన్. ౨౦౬౦

తాత్పర్యము.

అని చెప్పఁగా నీవు భయపడవలదు. ఆలస్యములేక నీవు సేనలఁబిలిపింపుము. అని ముని సంతోషముతోఁ జెప్పఁగా సేనయంతయు రావలసినదని భరతుఁ డాజ్ఞాపించెను. అంత సంతోషముతో.

—♦ భరద్వాజుండు భరతునకు విందుపెట్టుట ♦—

సీ. ఋషివరేణ్యుండగ్ని ♦ గృహమునఁ జొచ్చియు, మున్మాఱువార్చియుముఖ ♦ మార్జనంబు
నిరుమాఱు సల్పి భూ ♦ వరుం కాతిథ్యార్థ, మయి విశ్వకర్మ నా ♦ హ్వాన మొనరఁ
జేసి యాతిథ్యంబుఁ ♦ జేసెద సేనకు,విశ్వకర్మయుఁ ద్వష్ట ♦ వేగ వచ్చి
గృహసంవిధానంబుఁ ♦ నిప్పుడ సేయుఁడు, శక్రాదిదిక్పతుల్ ♦ సకలవస్తు

తే. తతుల నరయుఁడు ప్రాక్ప్రత్ ♦ యక్కు లందు, నింట నేలను గలిగిన ♦ మేటినదులు
కొన్ని యిక్షుజలంబులఁ ♦ గొన్నిసురను, గొన్ని మైరేయముల నిటఁ ♦ గూర్చుఁగాక. ౨౦౬౧

అగ్నిగృహమునన్=అగ్నులుండు నింటియందు, ఇది దేవతాసన్నిధానస్థలము గావునఁ బవిత్రము, మున్మాఱు = మూఁడుసారులు, అచ్యుత-అనంత-గోవింద యని కేశవ-నారాయణ-మాధవ యని, వార్చి = ఆచమించి, ఇచ్చట 'యు' ననునది యను క్తసముచ్చయము, ముఖమార్జనంబు=రెండుమార్లు పెదవి తుడుచుకొనుట, ఇది సపర్యాంగాచమనమున కుపలక్షణ. త్రిరాచామేత్ ద్విఃపరిమృజ్య సకృదుపస్పృశ్య శిరశ్చక్షుషీ నాసికే శ్రోత్రే హృదయ మాలభ్య అని చెప్పఁబడినప్రకారము ముఖమార్జనంబు పెదవి తుడుచుకొనుట. ఏవైదిక కార్యమునకు ముందాచమింపవలెను. ఆచమింపక యేకార్యము చేయరాదు. ఆతిథ్యార్థము = ఆతిథ్యముకొఱకు, ఆహ్వానము=పిలుపు. విశ్వకర్మ=శిల్పకార్యముల నన్నిటిని జేయువాఁడు త్వష్ట=కొయ్యపని చేయు శిల్పి, గృహసంవిధానంబు=ఇండ్లనుగట్టుటను, ముందుచెప్పఁబడు నన్నాదుల రక్షించుటకు నింద్రాదులఁ బిలుచుచున్నాఁడు. శక్రాదిదిక్పతుల్=ఇంద్రుఁడు మొదలయిన దిక్పాలకులు, ప్రాక్ప్రత్యక్కులందున్=తూర్పు పడమరలందు, ఇక్షుజలం

బులన్ = చెఱకుపాలవంటి నీటిని, సురను, గౌడి పైష్టి మాగధి యనఁబడు మూఁడు విధములైన మద్యములను, మైరేయము=మిరాదేశమందు ఖర్జూరాదులచేఁ జేయఁబడు మద్యములను.

తాత్పర్యము.

ఋషిశ్రేష్ఠుఁడయిన భరద్వాజుఁడు దేవతాసన్నిధాన మగుటచేఁ బవిత్రమైన యగ్నిగృహముఁ బ్రవేశించి మూఁడుమార్లాచమించి రెండుమార్లు పెదవితుడుచుకొని రాజున కాతిథ్యము కల్పించుటకై దేవశిల్పి విశ్వకర్మను బిలిచి రాజుసేనకు నే నాతిథ్య మొసఁగెదను. నీవు త్వష్ట యిపుడే వచ్చి యందఱు దిగుటకు నింద్లు నేర్పాటు సేయుఁడు. ఇంద్రాది దిక్పాలకులారా! సమస్త వస్తువులను విచారించుకొనుఁడు. తూర్పు పడమర నాకాశమున నేలఁగలిగిన నదులన్నియుఁ గొన్ని చెఱకుపాలవంటి నీటిని, గొన్ని సురను, గొన్ని మైరేయములను గూర్పఁగాక.

సీ. దేవగంధర్వవి • శ్వావసుహాహాహూఁడు హాహూండు నుభయవి • ధాప్సరసలు
విశ్వాచియు ఘృతాచి • వినుత యలంబుస, నాగదంతయు హేమ • నగనివాస
హేమయుమిశ్ర కే • శీడ్యనామ్నియు మొదల్, బ్రహ్మేంద్రులను గొల్చు • పద్మముఖులు
తుంబురుఁ డాదిగాఁ • దో కొప్ప మేళంబు, తో రందు ధనదుని • తోషణదము

తే. వస్త్రభూషణసత్పత్ర • వంత మంగ
నాఫలము నైన చైత్రవ • నంబ రమ్మ
చరిద్రుఁ గొనఁగుత భక్ష్యభో • జ్యములు లేహ్య
చోష్యములు వివిధాన్నముల్ • చొప్పు చెడక. ౨౦౭౨

ఉభయవిధాప్సరసలు = దేవజాతి యప్సరసలు, గంధర్వజాతి యప్సరసలు, అందు ముఖ్యాప్సరసలు విశ్వాచి మొదలగువారు, పద్మముఖులు=స్త్రీలు, విశ్వాచి= అందఱిచేతఁ బూజింపఁబడునది, ఘృతాచి = నేయివలెఁ గరఁగునది, "వెన్నవలెం గరంగు నలివేణులఁ గౌఁగిటఁ జేర్చు భాగ్యముల్" మనుచరిత్ర. అలంబుస=దేవతలకుఁ దగినది, బుసులనఁగా బుధులు దేవతలు, వారికి అలం = యోగ్యమైనది బుస+ అలమ్మనునది వర్ణవ్యత్యయముచే అలంబుసయయ్యెను. నాగదంత=ఏనుఁగుదంతముల వలె శుభ్రమగు దంతములుగలది, హేమ=బంగారుచాయగలది, హేమనగనివాస = హేమ ఇది వేఱొకతె. ఇది మహేంద్రపర్వతమున మయుఁడు కట్టియిచ్చినచోట నుండునది. స్వయంప్రభా బిలమందుండినది యిదియే. (చూ కిష్కింధ. ౧౨౦౮ పద్యము). ఇది మయుని యుంపుడుకత్తె. మిశ్రకేశి = దట్టమైన తలవెంట్రుకలు గలది, మిశ్రకేశీడ్యనామ్ని = మిశ్రకేశియను శ్లాఘ్యమైన పేరుగలది, ఇట్లే పేర్లకు వ్యుత్పత్త్యర్థములు. తుంబురుఁడు = అప్సర స్త్రీలకు గానశాస్త్రము చెప్పువాఁడు, మేళంబుతోన=నాగసరము మద్దెల తాలము లోనగు వాద్యములతో, ఇక భోగ స్థానములఁ జెప్పుచున్నాఁడు. ధనదుని = కుబేరుని, తోషణదము = సంతోషము

నిచ్చునది, వస్త్రభూషణ సత్కృతవంతము=వస్త్రములు భూషణములు అనెడిమేలైన యాకులుగలది, అంగనాఫలము=స్త్రీలనెడి పండ్లుగలది, చైత్రవనంబ=చైత్రవనమా, ఇది కుబేరుని యుద్యానవనముపేరు, తోఁటలను, నదులను బిలుచుటయనఁగా వాని యధిష్ఠానదేవతలను బిలుచుటగా గ్రహింపవలెను. అన్నపతియగు చంద్రునిఁ బిలుచుచున్నాఁడు. భక్ష్యములు=అప్పచ్చులు, భోజ్యములు=అన్నాదులు, లేహ్యములు=ఊరుపిండులు పచ్చళ్ళు మొదలయినవి; చోష్యములు = వడియాలు మొదలగునవి, వివిధాన్నముల్=అనేకవిధములయిన యన్నములు.

తా త్ప ర్య ము

దేవగంధర్వ విశ్వావసులు, హాహాహూహూలు. దేవతాప్సరసలు, గంధర్వాప్సరసలు, విశ్వాచి ఘృతాచి యలంబుస నాగ మేరుపర్వతమునుండు హేమ మిశ్రకేశి మొదలయినవారు బ్రహ్మను నింద్రునిఁ గొలుచుస్త్రీలు తుంబురుఁడు మొదలుగా నందఱు మద్దెల తాళము మొదలగు వాద్యములతో రావలయును. కుబేరునికి సంతోషకరమై వస్త్రభూషణము లాకులుగాను స్త్రీలు ఫలములుగాను గల చైత్రవనమా! రమ్ము చంద్రుఁడా! భక్ష్య భోజ్య లేహ్య చోష్యములు నానావిధములైన యన్నములు సమకూర్పుము.

కం. పలుతెఱఁగులగుపూవులచేఁ జెలువగుమాల్యములు సురయు • సిద్ధరసముతోఁ
  దులితము లగుపేయంబులుఁ, గలిగింపఁగ వలయు శశి స•కలమాంసంబుల్. ౨౦౭౩

మాల్యములు=పూలదండలు, పేయంబులు=త్రాగయోగ్యములైనవి, శశి = చంద్రుఁడు, సకలమాంసంబుల్=సమస్తవిధములైన మాంసములు, సిద్ధరసముతోన్=అమృతముతో, తులితములు=సరిపోల్పఁదగినవియు.

తా త్ప ర్య ము.

అనేకవిధములగు పూవులచే నేర్పఱుపఁబడిన దండలు సుర, అమృతముతో సరిపోల్పఁదగినవియగు పేయంబులు, అన్నివిధంబులైన మాంసంబులు వీనినెల్లఁ జంద్రుఁడు సమకూర్పవలయును.

చం. అనుచు సమాధియుక్తుఁడయి • యమ్ముని శిక్ష స్వరంబు తప్ప కా
  స్థను గరముల్ మొగిడ్చి జప•తత్పరుఁడౌచును బ్రాఙ్ముఖుండునై
  వినుతి యొనర్ప దేవతల • వేఱుగ వేఱుగఁ బేరువాడి చ
  య్యన మలయాద్రిదక్షిణరసు•భానిల మయ్యెడ వీచె హాయిగన్. ౨౦౭౪

ఇంతకార్యము ముని యేశక్తిచేఁ జేసెననఁ జెప్పుచున్నాఁడు.

సమాధియుక్తుఁడై=అష్టాంగయోగమునఁ జెప్పఁబడిన సమాధితోఁ గూడినవాఁడై, ఏకాగ్రచిత్తుఁడై, శిక్ష, స్వరంబు = శిక్షాశాస్త్రమునఁ జెప్పఁబడిన యుదాత్తాది స్వరములు, తప్పక = ప్రమాదపడక, "దుష్టశ్శబ్దస్స్వరతో వర్ణతోవా,

మిథ్యాప్రయుక్తోనతదర్థమాహ, సవాగ్వజ్రోయజ మానంహినస్తి । యథేంద్ర శత్రు స్స్వరతోపరాధాత్త" న్నట్లు వేదమున స్వరము తప్పినను శబ్దముతప్పినను బఠించు వానిని బాధించును. అట్లు తప్పక చెప్పెనని యర్థము. కరముల్ మొగిడ్చి=చేతులు జోడించి, ఇది యాహ్వానముద్ర. దీనితోనే పిలువవలయును. ప్రాఙ్ముఖుఁడు=తూర్పు దిక్కుగాఁ దిరిగినవాఁడు, ఇట్లుండుటవలన జపము చక్కఁగా ఫలించును. జపతత్పరుఁడు=జపమున నభిలాషగలవాఁడు, దేవతలన్ = విశ్వకర్మాదులను, పేరు+వాడి, పేరు+పాడి=పేరు చెప్పి, వేఱుగవేఱుగన్ = ప్రత్యేక ప్రత్యేకముగ, ఒకొక్కరినే, మలయాద్రిదర్దుర సుఖానిలయు = మలయపర్వతమునుండి దర్దురపర్వతమునుండి సుఖకరమైనగాలి.

## తా త్ప ర్య ము.

అనిచెప్పి సమాధియందున్నవాఁడై యాముని స్వరముదప్పక శ్రద్ధతోఁ దూర్పుముఖముగాఁ దిరిగి జపముచేయుచు నాహ్వానముద్రఁ బట్టి చేతులు దోసిలివలె జోడించి దేవతలపేర్లు చెప్పుచు వేఱువేఱుగ స్తోత్రముచేయఁగా శుభసూచకముగా మలయపర్వతము నుండి దర్దురపర్వతమునుండి చల్లని మెల్లని కమ్మని గాలి వీచెను.

కం. కురిసెను బువ్వులవానలు, మొరసెను దుందుభులు దిశల • ముఖముల నెందున్
  బెరసెను దివ్యామోదము, నెరసెను నచ్చరలపిండు • నృత్యము లంతన్. ౨౦౭౯

దుందుభులు=దేవదుందుభులు, దివ్యామోదము=శ్రేష్ఠమైనసువాసన, బెరసెను=వ్యాపించెను, అచ్చరలపిండు = అప్సరస్త్రీల సమూహముయొక్క, నృత్యములు=ఆటలు.

## తా త్ప ర్య ము

పూలవాన కురిసెను, దిక్కులయందు దేవదుందుభులు ధ్వనించెను. దివ్యమైన వాసన వ్యాపించెను. అచ్చరల గుంపులయాటలు నెరసెను.

ఉ. అచ్చరమచ్చకంటుల ల • యాన్వితహారిసుఖావహంబు నా
  నచ్చుపుపీతనాదముల • యుం గెటఁగించెను వారిరాకలన్
  మెచ్చులు గొల్పునారవము • నిల్చినయంతన సేన లెల్ల నిం
  పెచ్చఁగఁ గాంచి రచ్చటను • హృద్యము నౌగృహసంవిధానమున్. ౨౦౮౦

అచ్చర మచ్చకంటుల=అప్సరస్త్రీలయొక్క, లయ=లయముతో, నృత్యగీతవాద్యముల యేకకాలవిరామము లయమనఁబడును, అన్వితక=కూడిన, హారి=మనోహరమైనదియు, సుఖావహంబు=సుఖము కలిగించునదియు, ఔ=అయిన, అంగు = విధము, అరవము=అధ్వని, హృద్యము = మనోహరము, గృహసంవిధానమున్ = ఇండ్లయేర్పాటును.

తాత్పర్యము.

అప్సరస్త్రీలయొక్క లయములతోఁగూడినవై మనోహరమై సుఖము గలిగించునదియగు స్వచ్ఛపు వీణానాదముల విధము వారిరాకల నెఱింగించెను. శ్లాఘ్యమైన యాధ్వని నిలువఁగానే యచట నేర్పాటుగాఁబడిన యిండ్లను సేనలెల్లఁజూచెను.

తే. ఉర్వి సమతను గని నైదు • యోజనములు, నీలవైడూర్యసన్నిభ • స్నిగ్ధశాద్వ
లంబులొప్పారెనందు బి • ల్వంబు వెలగ, మాదిఫలములు పనసలు • మావిడులును. ౨౦౭౭

ఉర్వి=భూమి, సమతను=గుంటమిట్టలేక యుండుటను, చదరమగుటను, నీల వైడూర్య = నీలములతోను వైడూర్యములతోను, సన్నిభ = సమానములైన, స్నిగ్ధ=నునుపైన, శాద్వలంబు = పచ్చికపట్టు, బిల్వంబు=మారేడు, పనసలు; కుశ, దర్భ, పనస, వీనికిఁ దెనుఁగున మువర్ణకంబులేదు. కుశాదులు స్త్రీసమాబులు.

తాత్పర్యము.

ఐదామడభూమి చదరమయ్యెను. ఇంద్రనీలములతోను వైడూర్యములతోను సమానమైన వర్ణముగల నునుపారు పచ్చికపట్టులు వెలసెను. అందు మారేడులు వెలగలు మాదిఫలములు (మాతులుంగములు) పనసలు మామిడులు వృక్షములు వెలసెన.

కం. వెలసెను వట నుసిరికలును, ఫలయుక్తిని శైత్రవనము • పఱతెంచె నదుల్
విలసితతటగతతరుసంకలితంబులు నగుచు నటకుఁ • గ్రన్ననవచ్చెన్. ౨౦౭౮

ఫలయుక్తిని=పండ్లతో, వికసిత=ప్రకాశించు, తటగత=ఒడ్డునందున్న, తరు = చెట్లచే, సంకలితంబులు=కూడినవి, క్రన్ననన్=శీఘ్రముగ.

తాత్పర్యము.

అం దుసిరికచెట్లునుండెను. పండ్లతోడఁ జైత్రవనము వచ్చెను. నదులు తీరమున నుండు చెట్లతోఁగూడినవై యచటికి శీఘ్రముగవచ్చెను.

సీ. చదరపుటిండ్లుఁ గుం • జరవాజిశాలలుఁ, దోరణంబులు, హర్మ్య • వారములును
సితమేఘనిభములు • భృతతోరణంబులు, శుక్ల మాల్యాకృతుల్ • సురసువాస
నాన్వితంబులు చతు • రస్రములై విశా, లంబులు శయనాస • నంబులు మఱి
యానముల్ దివ్యర • సాంచితాన్నంబులు, వస్త్రముల్ నిర్మల • భాజనములు

తే. నైన రాజగృహంబులు • నమరి యుండె
స్నానభోజనవసతులు • శయనగృహము
లొప్పు భరతుండు తద్భవ • నోత్తమంబుఁ
జొచ్చె మునియాజ్ఞ మనిశక్తి • మెచ్చుకొనుచు. ౨౦౭౯

చదరము+ఇండ్లు=చదరపుటిండ్లు, కుంజర = ఏనుఁగులయు, వాజి = గుఱ్ఱములయు, శాలలు=ఇండ్లు, హర్మ్యవారములును=ధనికుల యిండ్లసమూహములు, సిత

మేఘనిభములు = తెల్లనిమబ్బులతో సమానములు, ధృతతోరణంబులు=ధరింపఁబడిన తోరణములుగలవి, శుక్లమాల్యాకృతుల్=తెల్లనిపూలదండల యాకారములుగలవి, పరమసువాసనాన్వితంబులు=శ్రేష్ఠమైన పరిమళముతోఁగూడినవి, చతురస్రములై = చచ్చౌకములై, శయనాసనంబులు=శయన = పడుకలు, ఆసనములు = కూర్చుండు పీటలు మొదలైనవి, యానముల్=వాహనములు, దివ్యరసాంచితాన్నంబులు=అమృతమువలె మనోహరములైన యన్నంబులు, భాజనములు = పాత్రలు, పళ్ళెలు, రాజగృహంబులు=రాజులయిండ్లు, స్నానభోజనవసతులు = స్నానశాలలు భోజనశాలలు, శయనగృహములు=పడుకటిండ్లు, తత్+భవనోత్తమంబు = ఆశ్రేష్ఠమైన యింటియందు. చొచ్చెన్=ప్రవేశించెను.

తాత్పర్యము.

చదరపుటిండ్లు, ఏనుఁగులయు, గుఱ్ఱములయు నిండ్లు, తోరణంబులు, ధనికుల యిండ్లసమూహములు తెల్లమబ్బులతో సమానములు తోరణములు కట్టఁబడినవి తెల్లపూలదండవలె నుండునవి మంచి పరిమళముగలవి చచ్చౌకములై వెడలుపు పొడవుగల పడుకలు పీటలు వాహనములు, అమృతమువలె మనోహరములయిన యన్నములు వస్త్రములు నిర్మలములైన పాత్రలుగల రాజులయిండ్లమరి యుండెను. అందు స్నానముచేయుటకు భోజనము చేయుటకు గదులు, పడుకటిండు లొప్పియుండెను. అటువంటి శ్రేష్ఠమైన యింటియందు మునియాజ్ఞ చొప్పున మునిశక్తి మెచ్చుకొనుచు భరతుఁడు ప్రవేశించెను.

చం. అనుచరమంత్రియుక్తిని నృపాసనమున్ వ్యజనంబు ఛత్రమున్
గని యటఁ గైకయీసుతుఁడు గాఢతరం బగుభక్తి వానికిన్
జనుచుఁ బ్రదక్షిణంబు రఘుచంద్రుఁ దలంచుచుఁ జామరంబుఁ గై
కొని సచివాసనంబునను గూరిమి మీఱఁగఁ గూరుచుండినన్. ౨౦౮

అనుచరమంత్రియుక్తిని = సేవకులయు, మంత్రులయు కూడికతో, నృపాసనమున్=రాజుకూర్చుండు సింహాసనమును, వ్యజనంబు = చామరము, ఛత్రమున్ = తెల్లని గొడుగును, కని = చూచి, గాఢతరంబగు = మిక్కిలి యధికమైన, సచివాసనంబునను=మంత్రులు కూర్చుండు నాసనమునందు, భరతునిమనస్సు ప్రలోభింపఁజేసి పరీక్షించి దృఢపఱుచుటకే భరద్వాజుఁ డీవిందమర్చెను.

తాత్పర్యము.

సేవకులు మంత్రులు తనవెంటరాఁగా లోపలఁ బ్రవేశించి భరతుఁడచ్చట రాజయోగ్యమైన సింహాసనమును వింజామరము శ్వేతచ్ఛత్రముఁజూచి శ్రీరామచంద్రునిఁ దలఁచి వానికి నత్యంతభక్తి నమస్కరించి ప్రదక్షిణముగాఁ బోయి చామరము చేతికిఁ దీసికొని మంత్రికూర్చుండు స్థానంబునఁ గూర్చుండెను.

తే. మంత్రులుఁ బురోహితులును న్రగ•మంబుగాఁగఁ
గూరుచుండఁగ నారాచ•కొమరు వెనుక
సైన్యపతియుఁ బ్రశాస్తయు • సరస నుండి
రంత దివ్యప్రభావమ•హర్షి మహిమ.  ౨౦౭౧

తాత్పర్యము.

అవల వరుసగా మంత్రులు పురోహితులు రాజకుమారు వెనుకఁ గూర్చుండిరి. సేనానాయకుఁడు ప్రశాస్త (డేరాలు మొదలగు నివేశముల నేర్పాటు చేయువాఁడు Palace Controller) దగ్గఱనుండిరి. అట్లుండఁగ కూర్చుండినతరువాత ఋషీశ్వరు మహిమచేత.

ఆ. ఆముహూర్త మంద • యచ్చటఁ బాయస, కర్దమితము లేర్లు • కైకతనయు
దాపునందుఁ బాఱె • నాపగాతటములఁ, బాండుమృద్విలిప్త•వసతు లమరె.
౨౦౭౨

పాయసకర్దమితములు = పరమాన్నముచే బురదగాఁ జేయఁబడినవి, ఏర్లు = నదులు. ఆపగా = నదులయొక్క, తటములన్ = తీరములందు, పాండు = తెల్లని, మృత్ =మంటిచే, విలిప్త=పూయఁబడిన. వసతులు=గృహములు.

తాత్పర్యము.

ఆముహూర్తమందే యచ్చటఁ బాయసముచే బురదగాఁ జేయఁబడిన నదులు పాఱెను. ఆనదులయొడ్డులందుఁ దెల్లని సుద్దతోఁ బూయఁబడిన యిండ్లు కానవచ్చెను.

కం. సురకంజాక్షులు దివ్యా•భరణవిభూషితలు బ్రహ్మ•పనుపున నపుడే
యిరువది వేవురు వచ్చిరి, యరుదందుచు నుండఁ జూచు•నట్టిజనంబుల్.  ౨౦౭౩

తాత్పర్యము.

దివ్యములైన సొమ్ములచే నలంకరింపఁబడిన దేవతాస్త్రీలు బ్రహ్మపంపఁగాఁ జూచువా రాశ్చర్యపడునట్లు లిరువదివేలమంది వచ్చిరి.

కం. పవడంబులచే నవరత్న వితానముచేతఁ గాంచ•నంబున సొబగౌ
వివిధాలంకృతు లొప్పఁగ, నవలా లేతెంచి రర్థ•నాథునియాజ్ఞన్.  ౨౦౭౪

అర్థనాథుని=కుబేరునియొక్క, నవలాలు=స్త్రీలు, ఇది దేశ్యపదము; దీర్ఘాంతము.

తాత్పర్యము.

పగడంబులచేతను, నవరత్నముల సమూహములచేతను బంగారుచేతను నందమైన నానాలంకారములుగల స్త్రీలు కుబేరుని యాజ్ఞాప్రకారము వచ్చిరి.

తే. మనుజు నెవ్వరు సోఁకిన•మాత్రలోన, వెఱ్ఱి పట్టినయటు లగు • వికలమతిని
నట్టియచ్చర లరుదెంచి రమరవనము, నుండి యిరువదివేవు ర•త్యుత్సవమున.
౨౦౭౫

వికలమతిని=చెదరినమనస్సులో, అచ్చరలు=అప్సరశ్శబ్దభవము అప్సరసలు, అమరవనము = నందనము, దేవతలయుద్యానము, అత్యుత్సవమునన్ = మిక్కిలి సంతోషములో.

తా త్ప ర్య ము.

ఎవరు మనుష్యుని సోకినంతమాత్రముచేతనే వానిమనస్సు చెదరి పిచ్చిపట్టిన యట్లు లగునో యటువంటి యప్సరసలు సంతోషములో నిరువదివేలమంది వచ్చిరి.

కం. తుంబురునారదగోపులు, దంబున నీరేజహితు వి॥డంబించెడివా
రింబుగఁ బాడిరి మునియాజ్ఞం బృథివీనాథతనయు॥సన్నిధియందున్. ౨౦౭౬

తుంబురునారదగోపులు = తుంబురుతోడఁ జెప్పఁబడు నారదుఁడు దేవగంధర్వులలోఁ జేరినవాఁడు. వీఁడు దేవర్షినారదుఁడుగాఁడు. అతఁడు పర్వతనారదుఁడని చెప్పునపుడు చెప్పఁబడును. దంబునన్=కాంతియందు, నీరేజహితున్ = కమలాప్తుఁడగు సూర్యుని, నీరేజము అలుక్సమాసము. విడంబించెడివారు=పోలెడివారు, ఇంబుగన్=మనోహరముగ, సన్నిధియందున్=సమీపమందు.

తా త్ప ర్య ము.

కాంతిచే సూర్యుని బోలిన తుంబురుఁడు నారదుఁడు గోపుఁడనువారలు ముని యాజ్ఞప్రకారము భరతునెదుట మనోహరముగఁ బాడిరి.

తే. మిశ్రకేశి యలంబుసా॥మీనవేత్ర, పుండరీకయు వామన ॥ పోఁడిమిగను
భరతుముంగల నాడిరి॥ పలుతెగ లగు,చైత్రరథవనసుమము ల॥చ్చటికి వచ్చె. ౨౦౭౭

తా త్ప ర్య ము.

మిశ్రకేశి=చేఁపలవంటి కన్నులుగల యలంబుస– పుండరీక = వామన యను స్త్రీ లందముగా భరతునిముందట నాడిరి. చైత్రరథవనమందలి నానావిధములైన పుష్పము లచ్చటికి వచ్చెను.

కం. మారేడులు మార్దంగికు, లై రావులు నర్తకులుగ ॥ నై తాండ్రలు నిం
పారంగఁ దాళధరులై, యారేయిమునిఁబంచుఁ గూర్చె ॥ నమ్మునిముదలన్. ౨౦౭౮

మార్దంగికులు=మృదంగము వాగించువారు, నర్తకులు = నాట్యమాడువారు, తాళధరులు=తాళములు వాయించువారు, ముదలన్=ఆజ్ఞచే.

తా త్ప ర్య ము.

మారేడు వృక్షములు (వృక్షాధిదేవతలు) మృదంగములు వాగించిరి. రావి చెట్లు నర్తనములు చేసిరి. తాండ్రలు తాళములు వాయించిరి. ఈ ప్రకారము మునీశ్వరు నాజ్ఞచే నారాత్రి వారికందఱకు సంతోషము గలిగించిరి.

తే. తాలతిలకంబులును నక్త॥మాలకములు, సరళములుఁ గుబ్జలగుచును ॥ సంచరింప
స్త్రీలరూపంబులం గొని ॥ శింశుపలును, నుసిరికలును జంబూద్రుమ॥విసరములును
౨౦౭౯

తాలతిలకంబులు = తాటిచెట్లు బొట్టుగుచెట్లు, నక్తమాలకములు=కానుగుచెట్లు, సరళములు=దేవదారువులు, కుబ్జలు=పొట్టివారు, ఇంక సంస్కృతభాషలో స్త్రీలింగాంతములగు పదములచేతఁ జెప్పఁబడు చెట్లను స్త్రీలుగనే కవి చెప్పుచున్నాఁడు. ఉసరిక సంస్కృతపదము గాకున్నను తెనుఁగున స్త్రీసమమే. శింశుపలు=ఇరుగుడుచెట్లు, జంబూద్రుమ=నేరేడుచెట్లయొక్క, నికరములు=సమూహములు.

తా త్ప ర్య ము

తాటిచెట్లు, బొట్టుగుచెట్లు, కానుగుచెట్లు, దేవదారువులు కుబ్జలై తిరుగఁగా స్త్రీలవలెనై ఇరుగుడుచెట్లు ఉసిరికలు. నేరేడుచెట్లు.

తే. మాలతీమల్లికాజాతి•మంజు లతలు, నమ్మహామునివర్యుని•యాశ్రమమున
శ్రవ్యతర మైనసూక్తుల • శ్రవణపర్వ ముగనుభాషించె సుందర•మూర్తులొప్ప. ౨౯౦

మాలతీ=జాజి, మల్లికా=మల్లె, జాతి = ఈజాతిలోఁ జేరిన మంజులతలు = అందమైన తీఁగలు, శ్రవ్యతరమైన=వినసొంపైన, సూక్తులన్ = మంచిమాటలచేత, శ్రవణపర్వముగన్ = చెవులపండువుగ. సుందరమూర్తులు = సొగసైన యాకారములు, భాషించెన్=మాటలాడెను.

తా త్ప ర్య ము.

జాతి- మల్లెజాతుల యందమైనతీఁగ లాముని యాశ్రమమునందు వినసొంపైన మాటలచే వీనులకు విందుగ సుందరములైన యాకారములు ధరించి యిట్లు మాటలాడెను.

మ. మదిరాపాయులు! రండు త్రాగుఁ డిదిగో • మద్యంబు, నాఁకొన్నవా
రిదిగోఁ బాయస మారఁ గ్రోలుఁ, డివె • స్వేచ్ఛన్ మాంసముల్ మెక్కుఁడీ,
పదఁడీ యంచును నొక్కనొక్కనికి శం•పాదేహ లెన్మండ్రు స
మ్మద మారం దలయంటి నల్గిడుచు నం•భఃపూరముల్ పోయుచున్. ౨౯౧

మదిరాపాయులు=మద్యముత్రాగువారలారా! మదిర యనునది ఆఫ్రికాదేశమునకుఁ బడమటినైఋతిపునందు మదిరా (Madiera) ద్వీపమునుండి వచ్చినది. ఆద్వీప మిప్పటికిని మద్యమునకే ప్రసిద్ధి. మద్యంబు=సారాయము, ఆఁకొన్న వారు=ఆఁకలిగొన్నవారు, ఆరన్=పూర్ణముగా, శంపాదేహాలు=మెఱుఁగువంటి కాంతిగల దేహముగలవారు, అంభఃపూరముల్=నీటిప్రవాహములు.

తా త్ప ర్య ము

సారాయి త్రాగెడువారలారా ! యిదిగో సారాయము త్రాగరండు. ఆఁకలిగొన్నవారలారా ! ఇదిగోఁ బాయసము, మాంసము దినెడివారలారా ! యిదిగో స్వేచ్ఛమైన మాంసము; పొందు పొండని యొక్కొక్కనికి సెనిమిదిమంది స్త్రీలు సంతోషముతోఁ దలయంటి నలుగుపెట్టి నీళ్ళు ప్రవాహములుగఁ బొయఁ బోసిరి.

చం. జిలుఁగుమడుంగు లిచ్చుచును • సీవిరులం గొని ప్రక్క నిల్చుచున్
గలికి సురన్ సుపాత్రములఁ • గమ్మగఁ గ్రోలఁగ నిచ్చి యిచ్చి యి
చ్చెలువున సంచరింప ముని•శిక్షితవాహనపుల్ గజాశ్వజా
ఖులకును మేపు వెట్టిరి య•లోభగతిన్ ఖరభద్రజాతికిన్. ౫౨

జిలుఁగుమడుంగులు = సన్నని శుద్ధమైన వస్త్రములు, సీవిరులన్=విసనకఱ్ఱలను, ఇచ్చెలువునన్= ఈవిధముగ, మునిశిక్షిత=మునిచేనేర్పఁబడిన, వాహనపుల్ = వాహనముల పతులు, గజాశ్వపాళీకకున్=ఏనుఁగులు గుఱ్ఱములు వీని సమూహములకు, ఖరభద్రజాతికిన్ = కంచరగాడిదలకు, ఎద్దులకు, అలోభగతిన్ = పిసినితనము లేకుండ.

తాత్పర్యము

పరిశుభ్రములైన వస్త్రము లిచ్చుచు విసనకఱ్ఱల విసరుచుఁ బ్రక్కనిలఁబడి మంచిపాత్రములందు సారాయము త్రాగనిచ్చుచుఁ దిరుగుచుండ మునివాక్యము ప్రకారము కొందఱు వాహనాధిపతులు గుఱ్ఱములకు ఎద్దులకు కంచరగాడిదలకు లోపములేకుండ మేపుపెట్టిరి.

కం సేలలతో సారాయము, వాలాయము గలిపి చెఱకు•పా లిడిరి మహీ
పాలకసేనావాహన,జాలంబుల కెల్ల నెక్క•సం బగుదాఁకన్. ౫౩

. మహీపాలక=రాజుయొక్క, సేనా=సేనలయొక్క, వాహనజాలంబులకున్ = వాహనసమూహములకు (వహించునది వాహనము.)

తాత్పర్యము.

.నెక్కసమగువఱకు సారాయమందుఁ జెఱకుపాలు- పేలలు- జొరుగులు- కలిపి భరతుని సేనలయందలి వాహనములకుఁ బెట్టిరి.

ఉ. కట్టరు రౌతు లశ్వములఁ •గట్టరు మావటివాండ్రు దంతులన్
బొట్టలు నిండ నెక్క పడి • పొర్లుచు గుఱ్ఱ లెఱుంగఁ జాలమిన్
దొట్టినసర్వకామములఁ • దోరముగాఁ దని వొంది వెండి కే
ల్పట్టి వియచ్చరాంగనలు • బల్విడి వెంబడి రాఁగ సైనికుల్. ౫౪

రౌతులు=రాహుత్త శబ్దభవము గుఱ్ఱపు దండునందు గుఱ్ఱములపై సవారి చేయువారు. అశ్వికులు ఈరౌతుశబ్దమే రావుతు. ఇందలి కడవర్ణము తు పోఁగా మిగిలినది రావు. ఇది పూర్వము గుఱ్ఱపుదండునందున్న శూరులే (మహారాష్ట్రులు- గోలకొండవేవారులు- వెలమలు) దీని నుపపదముగాఁ జేర్చుకొందురు. ఇప్పుడందఱుఁ జేర్చుకొనుచున్నారు. తోరముగాన్=అధికముగా, తనివి=తృప్తి, కేల్పట్టి = చేతిని బట్టుకొని, వియచ్చరాంగనలు=వియత్+చర+అంగనలు = దేవతాస్త్రీలు, సైనికుల్=సేనయందుఁ గొలువుండువారు.

## తాత్పర్యము.

కడుపులునిండఁదిని కావలసినంత త్రావి పొరలుచుఁ దమగుఱ్ఱములేవో తమ యేనుఁగులేవో గుఱ్ఱపట్టఁజాలక రౌతులు గుఱ్ఱములను గట్టినవారుగారు మావటు లేనుఁగులఁ గట్టినవారుకారు. వారువారు కోరిన సమస్తకోరికలును బూర్ణముగా నధికముగా లభించుటచేఁ దృప్తిపొందినవారై మఱియును దేవతాస్త్రీలు తమచేతులు పట్టుకొని వెంబడిరాఁగా సైనికు లిట్లని చెప్పఁదొడఁగిరి.

ఉ. పోమిఁక దండకాటవికిఁ • బోమ యయోధ్యకు నుందు మిద్యోడన్
సేమము గల్గుఁ గాత నృప • శేఖరుఁ డౌ రఘురామమూర్తికిన్
క్షేమము గల్గుఁ గాక యల • కేకయరాజతనూజపట్టికిన్
బోమిఁక వార లెట్లయినఁ • బోదురు గా కని కూఁతపెట్టఁగన్. ౨౦౯

మేమిఁక దండకారణ్యమునకును బోము. మేమయోధ్యకును బోము. అడవియందు శ్రీరాముఁడు క్షేమముగ నుండునుగాక. అయోధ్యయందు భరతుఁడు క్షేమముగ నుండునుగాక వారలిరువు రెట్లయినఁబోనీ మేము దీనివిడిచి పోము అని కూఁతలుపెట్టిరి.

కామసుఖముల మరగిన రాజసులగతి యింతయే. "మర్త్యేతిష్ఠంతి రాజసా" యను భగవద్గీతోక్తి యిట స్మరించునది. "ఇప్పటి సుఖంబులె మేలయితోఁచు వారికిన్". భారతము.

సీ. ఆడెడివారును • బాడెడివారును, గూడెడివారును • వీడువారు
నవ్వువారును మదిఁ • గ్రొవ్వువారును బరు,వెత్తువారును బూవు • లెత్తువారు
నయి యెల్లసైనికుల్ • నాక మియ్యది పొమ్మ,టంచుగర్జింపఁ బ్ర • హర్షితమతిఁ
దిని యుండియును నన్న • మును మఱి తినంగోరి,యును గడుపు లేమిఁకి • నుమ్మలింత్రు

తే చేటులును బరిచారికల్ • చేడియలును
నూతనాంబరములఁ దాల్చి • రాతతముగ
మునికృతాన్నంబు దక్క — న•వ్వనములోన
రాఁజవేయరు ప్రొయ్యు లా • రాజభటులు. ౨౧౦

నాకము=స్వర్గము, కం=సుఖము, అది లేనిది అకమ్=దుఃఖము, న+అకమ్ = దుఃఖములేనిది నాకము. స్వర్గము, గర్జింపన్=బొబ్బలుపెట్టఁగా, ప్రహర్షితమతిన్= సంతోషించిన మనస్సుతో. ఉమ్మలింత్రు = దుఃఖపడుదురు. చేటులు=దాసికలు, పరిచారికల్=పరిచారము చేయువారు దాసీజనులు. చేడియలు=సైనికులభార్యలు. నూతనాంబరములు = క్రొత్తవస్త్రములు. మునికృతాన్నంబు=ముని కల్పించిన యన్నము.

తా త్ప ర్య ము.

ఆడువారు పాడువారు గూడువారు జతపీడువారు నవ్వువారు మదిలోఁ గ్రొవ్వువారు పరువెత్తువారు పూవుల నెత్తువారునై సేనలయం దుండువారందఱు నిదియే స్వర్గము స్వర్గమిఁక వేఱెయెందున్నది యని సంతోషముతోఁ గేకలువేయు చుండిరి. కొందఱు కడుపారఁ దినియుండియును రుచిగానున్న కారణమున మఱి తినఁగోరి యయ్యో కడుపుపట్టలేదే యని దుఃఖింతురు. దాసికలు పరిచారికలు యితరస్త్రీలు క్రొత్తవస్త్రముల ధరించిరి. ఆ వనములో మునికల్పించిన యన్నము దక్క నితరాన్న మెవ్వరికిలేదు. రాజభటులెవ్వరు గ్రోయ్యి రాఁజవేసినవారుకారు.

కం. మావులు ఖరములు లొట్టెలు, గోవులు మృగసంతతులును ♦ గుంజరములు నా
నావికిరంబులు నాపో, కావటిలన్ ముదముఁగాంచె♦నా సమయమునన్. ౨౦౧౭

మావులు=గుఱ్ఱములు, ఖరములు = కంచరగాడిదలు, లొట్టెలు = ఒంటెలు. కుంజరములు=ఏనుఁగులు, నానావికిరంబులు=అనేకజాతులపక్షులు, ఆపోక తృప్తి, అవటిలన్=కలుగఁగా, ముదముగాంచెన్=సంతోషించెను.

తా త్ప ర్య ము.

ఈ విందునందు సంతోషించినవారు మనుష్యులుమాత్రమే కాదు గుఱ్ఱములు కంచరగాడిదలు, లొటపిట్టలు, అవులు, మృగసమూహములు, ఏనుఁగులు, అనేకములగు పక్షులు తృప్తిపడి యాసమయమున సంతోషించెను.

కం. తల మాసిన మెయి మాసిన, వలువలుమాసిన నరుండు ♦ పరికింపఁగ న
బ్బలముల లేఁ డొకఁడును నాఁకలిగొన్న యతండు లేఁడు ♦ కలికంబునకున్. ౨౦౧౮

మెయి=దేహము, వలువలు=వస్త్రములు, పరికింపఁగన్ = చూడఁగా, తల మాసిన మెయిమాసిన వలువలుమాసిన యనునవి మూఁడును నరుఁడనుదానికి విశేషణములు కర్మధారయసమాసము. బలములన్ = సేనలయందు, కలికంబునకున్ = కొంచెమైనను అను నర్థమున నిది వాడుకపదము.

తా త్ప ర్య ము.

తలమాసిననరుఁడు దేహముమాసిననరుఁడు వలువలుమాసిననరుఁడు ఆఁకలి గొన్నవాఁడు కన్నులకుఁ గలికము వేసికొందమని వెదకినను నాసేనలయం దొకఁ డైన లేఁడు.

కం. పలుతెగ లగుపలనిచయముఁ, బలుతెగ లగుఫలచయములు ♦ బహుకుసుమగణో
త్కలితధ్వజములు బంగరు, తెలతొప్పను వేనవేలు ♦ దివ్యము లగుచున్. ౨౦౧౯

పలుతెగలు=అనేకవిధములు, పలనిచయము = మాంసముల సమూహము, ఫలచయములు=పండ్ల సమూహములు, బహు=అనేకములైన, కుసుమ=పువ్వుముల

రయొక్క, గణ=సమూహములచే, ఉత్కలిత = అలంకరింపఁబడిన, ధ్వజములు = టెక్కెములు, తెలెలు=పళ్ళెరములు, "తెలియపళ్ళెరంబు తెలెహరివాణంబు",
నిఘంటువు.

తా త్ప ర్య ము.

దేవతలకు సంబంధించినవగు ననేకములయిన మాంసములు, పండ్లు, పూల సమూహములచే నలంకరింపఁబడిన ధ్వజములు బంగారుపళ్ళెరములు వేలకొలఁదు లొప్పుచుండెను.

సీ. వనపార్శ్వములఁ బాలు • వరరుచిమంతంబు, లమలధేనువులుచ • న్నవియఁబిదికె
మైరేయపాయస • మాంసకూపంబులు, పెక్కులై యొప్పు న • ల్దిక్కులందుఁ
గుక్కుటంబులయుఁ గే • కులయు జింకలయును, వండినమాంసముల్ • నిండియున్న
బంగారుపాత్రముల్ • రంగారుచెఱకుపాల్, బావులు స్నానసం • భావ్యము లగు
ఆ. సురభికల్కములును • సున్నిపిండులు నుష్ణ,జలము లమరె మేలి • కోలఁకులందు
దంతధావనార్హ • కాంతకూర్చాకృతు,లైనపుడక లెసఁగె • నన్నికడల. ౨౧౦౦

వనపార్శ్వములయందున్ = అడవిప్రక్క ప్రదేశములందు, వరరుచిమంతంబులు=మంచిరుచిగలవి, పాలు=నిత్యైకవచనమని కొందఱయభిప్రాయమని తెలియ వచ్చెడిని. ఈ గ్రంథకర్తయభిప్రాయ మదికాదు. పాయి యేకవచనము పాలు బహువచనము రేయి, రేలు, జాయి, జాలు వలెనని యెఱుంగునది. అమ్మపాయి యని వాడుకయందును గలదు కావున నిచట విశేషణ విశేష్యములు భిన్నవచనములు గావు. అమల=నిర్మలములైన, ధేనువులు=ఆవులు, చన్ను=పొదుగు, అవియన్ = పగులునట్లు, మైరేయ=సారాయముయొక్కయు పాయస=పరమాన్నముయొక్కయు, మాంస = మాంసములయు, కూపంబులు = బావులు, నల్దిక్కులు, మిశ్రదిక్కగువు కావున బహువచనము, కుక్కుటంబులయు = కోళ్ళయొక్క, కేకులయు=నెమిళ్ళయొక్కయు, సురభికల్కములును=మంచివాసనపిండులు మొదలైనవి, స్నానసంభావ్యములు=స్నానసమయమున నుపయోగించుకోఁబడునవి. ఉష్ణజలము= వేఁడినీరు, దంతధావనార్హ = పండ్లుతోముటకు యోగ్యములయిన, కాంత=మనోహరములైన, కూర్చాకృతులు = కూర్చముల యాకారముగలది. కూర్చమనునది దర్భలతోఁ జాడుగుగాఁ గట్టినది. పుడకలు=పుల్లలు, అన్నికడలన్ =అన్నిదిక్కులయందు.

తా త్ప ర్య ము.

ఆ యడవిప్రక్కల నిర్మలములైన గోవులు మంచిరుచిగల పాలను జన్నులు పగిలిపోవునట్లు పిండెను. నాలుగు దిక్కులందు సారాయములయుఁ బరమాన్నములయు మాంసములయు బావులనేకములుండెను. కోళ్ళయొక్క జింకలయొక్క నెమిళ్ళయొక్క వండినమాంసముతో నిండించిన బంగారుపాత్రములు చెఱకుపాల బావులు స్నానయోగ్యములగు మంచివాసనగల పొడుగు సున్నిపిండులు వేఁడినీళ్ళ

సరస్సుల పంక్తులతోఁ ముకొనుటకుఁ దగిన కూర్మాకారములైన పుల్లలు సన్నిచోటు లందు నుండెను.

కం. ఆవులమావులమెత్తలు, రేవులు కమలోత్పలసుమ✦బృందంబులు నై
పావనజలములు గలనడ, బావులు మడుఁగులును శత్రు✦వర్గము పీటల్. ౨౧౧

మావుల =గుజ్జముల, మెత్తలు=పఱుపులు. రేవులు=నీళ్ళదిగుమార్గములు, కమలోత్పల సుమబృందంబులను=కమలములయుఁ గలువపూలయు సమూహములు, ఐ=కలిగి, ఐ యొకానొకచోఁగల యర్థంబున నగు సు. వ్యా. వాక్య. ౬౩ సూ. "కృష్ణునిసారథ్యమునై" "వెడలుపుటరమునై యల్లవాఁడె పాండవాగ్రజుండు" అని భారత ప్రయోగములు కలవు. నడబావులు = దిగుడుబావులు, చేఁదుడుబావులు గావనుట.

తాత్పర్యము

ఆవులకు గుజ్జములకుఁ బండుకొనఁ బఱుపులు రేవులు, కమలములు, కలువలు, గుంపులు గుంపులుగఁ గల నిర్మల జలములుగల దిగుడుబావులు, మడుఁగులు, శత్రుముల సమూహము కూర్చుండు పీటలు.

కం. మంచంబులు బంగారవుఁ, గంచములు రసాలరసము ✦ గల డిగ్గియలున్
మంచిలవంగము లేలా,సంచయములుఁ గమ్మఁబెరుఁగు ✦ జానగుకడవల్. ౨౧౩

రసాలరసము = జీలకఱ్ఱతోఁగూడిన మజ్జిగ, చిలికిన పెరుఁగు తక్రము. "అపక్వతక్రం సపోష్యమం, చతుర్జాతి గుడార్ద్రికం । సజీరకం రసాలాస్యా న్మజ్జికా శిఖరిణీత్యపి" నై జయంతి. ఇవి మజ్జిగయందలి భేదములు, శొంఠి పిప్పలి మిరియాలు కలిసిన మజ్జిగ సపోష్యమము. ఏలకులు- లవంగములు- తక్కోలములు- నాగపుష్పములు- చక్కెర- అల్లము- జీలకఱ్ఱ కలసినది రసాలము డిగ్గియలు = దీర్ఘికా శబ్దభవము- నడబావులు మీఁదఁజెప్పినవి నీళ్ళ బావులు- ఏలాసంచయములు ఏలకకాయల సమూహములు, కమ్మఁబెరుఁగు = తియ్యపెరుఁగుచే, జానగు=అందమైన, కడవలు=కుండలు.

తాత్పర్యము

మంచములు- బంగారుకంచములు- తియ్యమామిడిపండ్ల రసముగల దిగుడు బావులు- మంచిలవంగములు- ఏలకకాయల- కమ్మని పెరుఁగుకల కుండలు.

కం. ముచ్చెలును పావుకోళ్ళును నచ్చపుఁగిఱుచెప్పు లొప్పు ✦ నద్దము లమరెన్
మెచ్చుడుకాటుకబరణులు. నిచ్చకొలఁది దువ్వెనలును ✦ నెన్నియొ యుండెన్. ౨౧౪

తాత్పర్యము.

ముచ్చెలు- పావుకోళ్ళు- కిఱ్ఱుకిఱ్ఱుమని నడచునప్పుడు ధ్వనించు చెప్పులు- అద్దములు- మంచికాటుకగల బరణులు దువ్వెనలు నివన్నియు నెన్నియోయుండెను.

కం. తూర్ణంబుగ భక్షితములు, జీర్ణంబులు గావుటకును ♦ జిత్రౌషధసం
దీర్ణంబు లయినజలములఁ, బూర్ణంబులు నై నస్థలులుఁ ♦ బొలుపారె నటన్. ౨౧౦౮

భక్షితములు=భుజింపఁబడిన పదార్థములు, తూర్ణంబుగన్=శీఘ్రముగ, జీర్ణంబులుకావుటకు=అఱుగుటకు, చిత్రౌషధసందీర్ణంబులు = విచిత్రములయిన మందులతోఁగలిసిన, జలములు=నీళ్ళచే, పూర్ణంబులు=నిండినవి, స్థలులు=ప్రదేశములు.

తాత్పర్యము.

భుజించినవి శీఘ్రముగ జీర్ణమగుటకుఁ జిత్రములయిన యౌషధములతోఁ గలిసిన జలములతో నిండిన ప్రదేశము లందుండెను.

కం. కలఁబోలుచు నద్భుతమై, చెలువం బగుమౌనివర్యు ♦ చేసినవిందున్
దిలకించి యాజనంబులు, పలుకఁ దరము గానివింత ♦ పాటుం గాంచెన్. ౨౧౦౯

కలఁబోలుచున్ = కలవలెనై. ఆశ్చర్యకరమై, అద్భుతమగుటచే నది కలను బోలినదిగాని యసత్యమగుటచేఁ గాదు. ఏలనఁగా నీవిందు యథార్థవిషయము. చూ. ప. ౨౧౦౭. కలలయందలి పదార్థములు భగవంతునిచే సృజింపఁబడినవే యని యుపనిషత్తు చెప్పుచున్నది. కావున నిందలి యుపమానమును బట్టియు ౨౧౦౮ పద్యమునందలి విషయమునుబట్టియు దశరథ భరత త్రిజటాదుల కలలఁ బట్టియుఁ గలలు సత్యములనియే వాల్మీకి యభిప్రాయమని యేర్పడుచున్నది. మనస్సుచేఁ జేయఁబడిన పుణ్యపాపముల ఫలములు కలలయం దనుభవింపఁబడును. దేహముచేఁ జేసినవి స్థూల దేహముచే ననుభవింపఁబడును. వాక్కుచేఁ జేసినవి నిందాస్తుతుల రూపమున వాక్కుచే ననుభవింపఁబడును అనుకొన్నది. పూర్వమనుభవించినది, కాక యద్భుతమగుటచే నమ్మరాని సత్యమగుటవలనఁ గలనుబోలుచు నందమైన ముని శ్రేష్ఠుఁడు చేసిన విందును జనములు చూచి చెప్ప శక్యముగాని యాశ్చర్యమును బొందెను

కం. నందనమున నమృతాంధో, బృందంబులమాడ్కి నెలమి ♦ వెలయుచు మునిసం
క్రందనువనమునఁ దజ్జను, లందఱు విహరింప రేయి ♦ యంతయుఁ బోయెన్.
౨౧౧౦

అమృతాంధో బృందంబులమాడ్కిన్=అమృత మాహారముగాఁగల దేవతల సమూహమువలె, ఎలమిన్=సంతోషముచే, మునిసంక్రందను=మునీంద్రునియొక్క.

తాత్పర్యము

స్వర్గమునందలి నందనవనమునందుండు దేవతలవలె సంతోషపడుచు మునీంద్రునివనమున నాజనులందఱు సంచరించుచుండ రాత్రియంతయుఁ బోయెను.

పూర్వపద్యమునఁ జెప్పిన చిత్రమేమనఁగా స్వర్గమున సురేంద్రుని నందన మునందు దేవతలభోగము మునీంద్రు వనమునందు నీ మనుష్యులకుఁ గలుగుటయే యద్భుతము.

కం. గంధర్వులు బృందారక,సింధురయానలును నదులుఁ • జెక్కనవి తపో
బంధురుఁ డగుముని యాజ్ఞ వ,సుంధర విడి దివికిఁ జనియె•సురచయములతోన్. ౨౧౦౭

బృందారక సింధురయానలు = దేవతాస్త్రీలు, తపోబంధురుఁడు = తపస్సు యొక్క యాధిక్యముగలవాఁడు, దివికిన్ = స్వర్గమునకు, సురచయములతోన్= దేవతల సమూహముతో.

తా త్ప ర్య ము.

గంధర్వులు. దేవతాస్త్రీలు, నదులు తక్కినవియుఁ దపోబలాధిక్యముగల మునియాజ్ఞచే భూమిని విడిచి దేవతల సమూహముతో స్వర్గమునకుఁ బోయెను.

ఉ. త్రావినమత్తు పెక్కనప•దార్థము నిక్కు మెయిన్ ధరించున
పూవుల తావి మేనఁ గదుఁ•బూసినగందముసోఁపు దివ్యభూ
షావిభవంబు వస్త్రముల•సంచయముల్ పొలుపార సైనికుల్
రే విలసిల్లినట్టులె స•లీలగ నుండిరి సర్వ మెంచుచున్ ౨౧౦౮

భరతునివెంట వచ్చినవారందఱు ననుభవించినది యింద్రజాలమువలె నసత్యముగాదనియు సర్వము వాస్తవమే యనుటకు నుదయమైనవిమ్మట నాజనుల స్థితిని గవి వర్ణించుచున్నాఁడు.

తా త్ప ర్య ము.

ఉదయమైనను మఱునాఁటికి రాత్రి వారు త్రావిన పానీయము మత్తుదిగలేదు. తిన్నపదార్థములవలనఁ గలుగు దేహావస్థయుఁ బోలేదు. వారుధరించిన పూల వాసనగాని దేహమునఁ బూసికొనిన గంధపు సొగసుగాని దివ్యములైన సొమ్ముల విభవముగాని కట్టుకొన్న వస్త్రములుగాని పోక యందమై యుండుటచే సైనికులందఱు రాత్రి యేప్రకారముండిరో యాప్రకారమే సర్వము స్మరించుచు విలాసముగ నుండిరి. కావున రాత్రి జరిగినదంతయు వాస్తవమేగాని టక్కుగాదు ఇటువంటి మహిమగల భరద్వాజమహాముని గోత్రజులమనువారిప్పుడేగతిలో నున్నారో వారే యాలోచించుకొందురుగాక.

కం భరతుం డీగతి రాతిరి, పరివారముతోడఁ గడపి • వరువాతఁ జనెన్
దరిసింప భరద్వాజునిఁ, బరమర్షియు నతనిఁ జూచి • పరమప్రీతిన్. ౨౧౦౯

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము భరతుఁడు తనపరివారముతోఁ గడపినవాఁడై యుదయము కాఁగానే భరద్వాజుని దర్శింపఁబోయెను. పరమర్షియు నాయనను జూచి యెక్కువ ప్రీతితో నిట్లనియె.

-౯౨-వ సర్గము. భరతుఁడు భరద్వాజర్షిని రామాశ్రమంబునకుఁ ద్రోవయడుగుట.-

ఉ. రాతిరి మావనంబునను, రాజకుమారక ! నీకు సౌఖ్యముం
బ్రీతియుఁ గూడెనయ్య ! చెపు మీ భవదీయుల కాతిథేయమున్
శాతము లెస్స రంజిలఁగఁ జేసె నొకో ! యన నమ్రుఁడౌచు భూ
నేత నిజాశ్రమంబు విడి నిర్గతుఁడౌ మునితోడ నిట్లనున్. ౨౧౦

తా త్ప ర్య ము.

రాజకుమారకా ! రాతిరి మావనమందు నీకు సుఖముగా సంతోషముగాఁ గడచెనా ? నేనొసఁగిన యాతిథ్యము నీవారికి మనస్సు సంతోషింపఁజేసెనా ? యని యడుగ వినయమున వంగినవాఁడై భరతుఁ డాశ్రమము విడిచివచ్చు మునితోడ నిట్లనియె.

ఉ. సన్నుతశీల ! రాత్రి సుఖసంపదఁ దేలిరి యెల్లవారు, భో
గోన్నతి నిట్టి దట్టి దని యొప్పి వచింపఁగ నావశంబె, సం
పన్నము సర్వమున్, సచివవర్యులకున్ జనపాలికిన్ సుశా
ల్యన్నము లాదిగా శుభపదార్థములం దని వచ్చె మాకునున్. ౨౧౧

సన్నుతశీల = సాధువులచే స్తోత్రము చేయఁబడినవాఁడా, భోగోన్నతిన్ = భోగాతిశయముచే, సంపన్నము=సమృద్ధమైనది. సుశాల్యన్నము = మంచిబియ్యపు టన్నము, తనివి=తృప్తి.

తా త్ప ర్య ము.

సత్పురుషులచేత స్తోత్రముచేయఁబడినవాఁడా ! రాత్రి యందఱు సుఖసంపద నోలలాడిరి. భోగాతిశయ మిట్టిదని చెప్ప నాకుసాధ్యమా అన్నియు సమృద్ధియే కాని కొఱంత యేనియుండుటలేదు. మా మంత్రిముఖ్యులకు మాకుఁ దక్కిన జనులకు మంచివరియన్నముఁలు మొదలుగాఁగల మేలిపదార్థములచేఁ దృప్తిగలిగెను.

కం. అన్నను గను తమకంబున, నున్నాఁడను నెల వొసంగు మో మునివర్యా !
విన్నపమునాలకించి ప్రసన్నుఁడ వై మైత్రిదృష్టి సాగింపు ననున్. ౨౧౨

తమకంబునన్=త్వరతో, ప్రసన్నుఁడవై = సంతోషించినవాఁడవై, మైత్రి దృష్టి=స్నేహభావముచే, సాగింపుము=ప్రయాణము పోవనిమ్ము.

తా త్ప ర్య ము

అన్నగారినిజూచు త్వరగలవాఁడనై యున్నాను. మునీంద్రా యాజ్ఞ యిమ్ము. నా విన్నపమువిని కోపింపక స్నేహభావముచే నన్నుఁ బోవనిమ్ము.

కామభోగవిషయంబుల భక్తునకుఁ బామరునకు నిదియే భేదము. పామరు లీలోకసుఖములే పరమార్థములనినమ్మి యవి యనిత్యములనియుఁ దెలియక వానినే కోరుచు వానితోనే తృప్తిపడి ౨౧౧-వ పద్యమునఁ జెప్పినట్లు చెప్పుచుందురు.

భక్తుఁడో గృహస్థుఁడుగానుండియు వానియం దఖిలామపడక భగవత్ప్రీతినే భరతునివలెఁ గోరుచుండును. విషయసుఖములు వానిమనస్సు నాకర్షింపఁజాలవు భరతుని మనస్సిట్టిదానాకాదా తెలియుటకే భరద్వాజుఁ డీపరీక్షచేసెను.

ఉ. ఎక్కడ నున్న వాఁడొకో ము • నీశ్వర రాముఁడు, మార్గ మెద్దియో ?
యిక్కడ కెంతదూరగ? మిపు • డేగఁగఁ గోరెద, నన్న మౌని యీ
ప్రక్కన యోజనద్వయము • పై నఁటయోజన మేగఁ గానలోఁ
జక్కఁగ నిర్జనం బయిన • చాయ, నటన్ నయనాభిరామ మై. ౨౧౧౩

నయనాభిరామమై=కన్నులకు మనోహరమై.

తా త్ప ర్య ము.

మునీంద్రా ! శ్రీరామచంద్రుఁ డెక్కడనున్నాఁడు. ఆయన యుండుచోటికిఁ బోవు త్రోవయేది ? ఆస్థల మిక్కడ కెంతదూరము అక్కడకు నేను బోవఁగోరుచున్నాను. అని యడుగఁగా ముని త్రోవఁజూపించుచు నిక్కడికి రెండున్నరయామడ దూరము పోవఁగా నడవిలో జనములులేని చక్కనిచాయగలదు. అచ్చట గన్నులకు మనోహరమై.

సీ. చిత్రకూటం బనఁ • జెలువారు నగ మొండు, దానికి నుత్తర • తలమునందు
సుందరతరులతా • బృందతుందిలవని, మందాకినీనది • యందగించు
నానదీనికటంబు • నం దుండు చిత్రకూ,టం బను శైలంబు • డంబుమీఱి
యారెంటి నడుమను • నాశ్రమంబునఁ దండ్రి! నీయన్న వసియించు • నిక్కమిదియు

ఆ. నిట్లు దక్షిణముగ • నేగుము దవ్వేగ, సవ్యదక్షిణముగఁ • జను నొకొండు
బాట దానియందు • బలఁగంబు నడుపు మ,చ్చోటఁగనెదు రాము • సుగుణధాము. ౨౧౧౪

నగము=పర్వతము, ఉత్తరతలము = ఉత్తరప్రదేశమునందు, సుందరతరులతాబృంద తుందిలవని = అందమైన తీఁగలగుంపులచే నిండినయడవి, మందాకినీనది = మందాకినియను పేరుగలనది, ఇది భాగీరథికాదు. మందాకిని యను పేరుగల చిన్న నది. నదీనికటంబునందున్=నదికి సమీపమునందు, శైలంబు = పర్వతము, డంబుమీఱున్=కాంతిచే నతిశయించును. సవ్యదక్షిణముగన్=నైరృతిమూలగ, దవ్వు=దూరము, బలఁగంబు=సేన.

గుహుఁడు బంధువులతోడ వచ్చుచుండఁగాఁ ద్రోవ తెలుపుమని భరద్వాజ నడుగుట గౌరవార్థము కావచ్చును. పామరులు చెప్పినది సరియైనను నది పండితులు మెచ్చునంతవఱకు విశ్వసింపరాదని తెలుపుట కొండెనగు, కాళిదాసుఁడు శాకుంతలమున "ఆపరితోషా ద్విదుషాం ! నసాధుమన్యేప్రయోగ విజ్ఞానమ్ ! బలవదపి శిక్షితానా మాత్మన్యప్రత్యయంచేత" యని చెప్పెనుగదా.

## తాత్పర్యము.

చిత్రకూటమను పర్వతము మీకుఁగానిపించును. దీనికి నుత్తరభాగమందు నందమైనచెట్లు తీఁగలు గుంపులుగా నిండియుండు వనమొండుగలదు. అచ్చట మందాకిని యనునది గలదు. అనదికి సమీపమందుండు పర్వతమునకే చిత్రకూట మనిపేరు. ఆపర్వతమునకు నానదికి నడుమ నవఁగాఁ బర్వతమునకు నుత్తరముగ నదికి దక్షిణముగ నుండునాశ్రమమందు నాయనా! నీయన్న యున్నవాఁడు. ఇది నిజము. నేను యోగదృష్టిచూచితిని. కావున నిట్లు దక్షిణపునైపుగ దూరముపొమ్ము. అట్లుపోఁగా నచ్చట నైరృతిమూల నొకబాటపోవును. ఆబాటవెంట సేన పోనిమ్ము. అచట సుగుణధాము శ్రీరాముని జూడఁగలవు.

సీ. ఇట్లు భరద్వాజుఁ • డేగుమార్గంబును దెలుపఁగ దశరథు•దేవు లెల్లఁ
దమయానములు డిగ్గి • తద్విప్రవరుఁ జుట్టి, కొలిచిరి కౌసల్య • పలుకవాఱు
చిక్కినమేనితోఁ • బ్రక్క సుమిత్ర రా, మునిపాదయుగళికి • మ్రొక్కి నిలువ
వ్యర్థకామయు లోక•వర్గవిగర్హిత, కైక మ్రొక్కిడి ఋషి•లోకపతికి

ఆ. సిగ్గుచేత భరతు•చెంగట నిలిచిన, భరతుఁ జూచి యిట్లు • పలికెఁ దపసి
దివసనాథవంశ్య • తెలుపవే మీతల్లు, లెవ్వరనిన నాతఁ • డిట్టు లనియె నిగిగి

ఏగుమార్గంబును=రామాశ్రమంబునకుఁబోవు త్రోవను. దశరథుదేవులు = దశరథునిభార్యలు, యానములు=వాహనములు. పలుకవాఱు=తెల్లవాఱిన, చిక్కిన =కృశించిన, మేనితోఁ=దేహముతో, వ్యర్థకామము=కొనసాగని కోరికగలది. లోకవర్గవిగర్హిత=జనసమూహముచే నిందింపఁబడినది, మ్రొక్కిడి=నమస్కరించి.

## తాత్పర్యము.

ఈప్రకారము రామాశ్రమమునకుఁబోవు మార్గమును భరద్వాజుఁడు తెలుపఁగా దశరథుని భార్యలందఱుఁ దమవాహనములు దిగి యాబ్రాహ్మణునిజుట్టి సేవించిరి. కౌసల్య తెల్లవాఱి కృశించిన దేహముతోఁ దనప్రక్క సుమిత్రరాఁగా మునీశ్వరు రెండుపాదములకు మ్రొక్కి నిలువఁగా నిష్ప్రయోజనమైన కోరికగలదియు లోకనిందితయు నగు కైక నమస్కరించి యిట్టి యకార్యముచేసి యేమని యీయన యెదురుగ నిలుతునని సిగ్గుచే భరతుసమీపంబున చాటుగ నిలువఁగా భరతుని జూచి భరద్వాజుఁడు వీరిలో నీతల్లులెవ్వరెవ్వరో తెలుపుమని యడిగెను. భరతుఁ డిట్లు చెప్పెను.

ఇదియును భరతుని మనస్సు శిక్షించుట కేయని గ్రహించునది.

—• భరతుఁడు భరద్వాజునకుఁ దనతల్లుల నెఱిఁగించుట •—

ఉ. పుత్త్రుఁడుశోకభారమునఁ • బొక్కి చుఁపాసముచేఁ గృశించుచున్
బిట్టుగ ధర్మదేవత య•నం గనుపట్టెడిసాధ్వి యాజికిం

బట్టపుదేవి, యీమెయ సు•మా పురుషోత్తము సింహవిక్రముం
బట్టిగఁ గాంచె నయ్యదితి = మాధవుఁ గాంచినపోల్కి- రామునిన్. ౨౧౧౭

పుట్టెఁడు = పుట్టి+ఎఁడు– అంద్వం తాగమంబులందప్ప నపదాది స్వరం బున కచ్చుపరంబగునపు డన్నియచ్చులకు సంధినిత్యము. సు. వ్యా. సంధి ౧౮ సూ. అనఁగా—పుట్టికొలఁతిగలయని యర్థము. శోకభారమునన్ = శోకాతిశయముచే, పొక్కుచున్=దుఃఖించుచు, ఉపాసనచే = ఉపవాసముచే, కృశించుచున్ = చిక్కిపోవుచు, సాధ్వి=పతివ్రత, అజికిన్=దశరథునకు, పురుషోత్తమున్ = పురుషులకంటె నుత్తముని. సింహవిక్రమున్=సింహము పరాక్రమమువంటి పరాక్రమముగలవానిని, పట్టిగన్=కుమారునిగ.

తా త్ప ర్య ము

పుట్టెఁడు శోకాతిశయముచే దుఃఖించుచుఁ బస్తులచేఁ జిక్కిపోవుచు ధర్మదేవత యనునట్లు గానవచ్చు పతివ్రతయే దశరథునకుఁ బట్టపుదేవియై పురుషోత్తముఁడు సింహవిక్రముఁడైన శ్రీరామచంద్రుని నదితి యుపేంద్రుని గన్నట్టు కుమారునిఁ గనెను.

ఉ. అల్లదె యామె వామభుజ • మల్లన నూఁది దురంతవేదనన్
మల్లడిగొం చరణ్యమున • మ్లానసుమం బగుగన్నెరో యనన్
వెల్లనపాఱి తోఁచునది • విశ్రుతశీల సుమిత్ర, తత్సుతుల్
సల్లలితప్రచారు లగు•లక్ష్మణుఁడుం జినతమ్ముఁ డితఁడున్. ౨౧౧౮

వామభుజము=ఎడమభుజము, అల్లనన్=మెల్లగా, ఊఁది=ఒత్తి, దురంతవేదనన్=అంతములేనిబాధచే, మల్లడిగొంచున్=బాధపడుచు, మ్లానసుమంబు= వాడినపూవు, గన్నెరు=గన్నెరుచెట్టో, వెల్లనపాఱి=తెల్లనై, విశ్రుతశీల=ప్రసిద్ధికెక్కిన స్వభావముగలది, సల్లలితప్రచారులు=మంచిమనోహరమైన నడవడికలవారు.

తా త్ప ర్య ము

అదిగో వణఁకుచున్న కౌసల్య క్రిందఁబడకుండునట్లు లామె యెడమభుజమును దాను మెల్లగ నొత్తిపట్టి యంతములేని శోకమున బాధపడుచు నరణ్యమందు వాడినపువ్వుగల గన్నెరుచెట్టో యనునట్లయి తెల్లబాఱికానవచ్చు పతివ్రత ప్రసిద్ధికెక్కిన స్వభావముఁగలది సుమిత్రాదేవి. ఈమెకొడుకులే మంచి మనోహరములైన నడవడిగల లక్ష్మణుఁడు పినతమ్ముఁడగు నీ శత్రుఘ్నుఁడును

ఉ. ఏపె మహాపరాధము ము•నీశ్వర ! ప్రాణముబోఁదఁ దెచ్చె ని
ప్పావుల కన్నదమ్ములకుఁ • బార్థివు స్వర్గతుఁ జేసె నట్టి దా
పాపిని మూఢచిత్త ఖల • భామిని నిష్ఠురశీల శోకపం
ప్రాపితభోగ దుస్సుభగ•మానిని కైకయి యిద్దియే సుమీ. ౨౧౧౯

ఏపె=ఏ+ఆపె=ఏపె, మహాపరాధము = గొప్పదోషము, నిష్పాపులకున్ = పాపరహితులకు, పార్థివున్=రాజగు దశరథుని, స్వర్గతున్ = స్వర్గమునుబొందినవానిని, పాపిని=పాపాత్మురాలు, మూఢచిత్త=బుద్ధిలేనిది. ఖల=దుర్మార్గురాలు, భామిని = కోపశీల- "కోపనా సైవభామినీ" అమరుఁడు నిష్ఠురశీల = పరుషస్వభావముగలది. శాఠ్యసంప్రాపితభోగ=మోసముచే సంపాదించిన భోగముగలది, దుస్సహగమానిని = తానే యందగత్తెయను దురంహాకారముగలది.

తా త్ప ర్య ము.

మునీశ్వరా ! యెవతె చేసిన గొప్పదోషము పాప రహితులయిన శ్రీరామ లక్ష్మణులకుఁ బ్రాణగండము కలిగించెనో ? రాజగు దశరథుని స్వర్గమును బొందిన వాని నొనరించెనో? అటువంటి పాపిని, బుద్ధిలేనిది, దుష్టురాలు, కోపశీల, పరుషస్వభావము గలది. మోసగించు నాచారము గలది, కోపించు స్వభావముగలది కైకయి యనునది యిదియే.

తే. ఆర్యరూపిణి యైన య•నార్య యదయ, పాపనిశ్చయ నాదుసం•తాపమునకు
మూలకారణ మైనట్టి•మూర్ఖురాలు, నన్నుఁగన్నదిగా నెంచు • నన్ను తాఁక్య ! ౨౮

ఆర్యరూపిణి=రూపమున నార్యవలెఁ గనవచ్చునది, అనార్య=వాస్తవమున ననార్య. పాపములనుండి దూరముగఁ దొలఁగువాఁ డార్యుఁడని వ్యుత్పత్త్యర్థము. అదయ=దయలేనిది, పాపనిశ్చయ = పాపముచేయుటయందే నిశ్చయబుద్ధిగలది. నన్నుఁగన్నది=తల్లియను పదమునకు యోగ్యురాలుకాదు. కావున నిట్లుచెప్పెను.

తా త్ప ర్య ము.

చూపునకార్య, వాస్తవమున ననార్య, దయాహీనురాలు, పాపమందే నిశ్చయబుద్ధిగలది. నాదుఃఖమునకు మూలకారణమైన మూర్ఖురాలు. నన్నుఁ గన్నదిగా నెంచుము.

కం. అని బాష్పగద్గదధ్వనిఁ, దనపలుకులు తొట్రుపడఁగ • దర్వీకరరీ
తిని రోఁజుచుఁ గను లెఱ్ఱగఁ, బనవెడునాతనికి మౌని•పతి యిట్లనియెన్. ౨౯

బాష్పగద్గదధ్వని = కన్నీళ్ళుడ్డపడుటచే గద్గదికగల కంఠధ్వనిచే, దర్వీకర రీతిన్=పామువలె, రోఁజుచున్=బుసగొట్టుచు, పనవెడు=శోకించు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము కన్నీళ్ళడ్డపడుటచే డగ్గుత్తికపడిన గొంతుతోఁ దనపలుకులు దడఁబడఁ బామువలె బుసగొట్టుచుఁ గన్ను లెఱ్ఱగఁజేసి శోకించునతనికి మౌనిపతి యిట్లనెను.

కం. సీతల్లి నేల దూఱెదు. భ్రాతయశా ! రామవిభుని•గహననివాసం
బాతతసుఖదం బగుఁ జ,న్మాతపసుల కమరులకును•మనుదనుజులకున్. ౩౦

దూఱెదు=నిందించెదు, ఖ్యాతయశా=ప్రసిద్ధికెక్కిన కీర్తిగలవాఁడా, 'ఆమె నడవడివలననే నీవు కీర్తిగలవాఁడ వగుదువు. కావున నిందింపకుము. ఆమె యీపని చేయకున్న నీవెట్లు కీర్తిమంతుఁడవు కాఁగలవు. సానకు వేసినపుడుగదా వజ్రమునకుఁ బ్రకాశ మెక్కును. శ్రీరాముని, గహనవిప్రవాసంబు=అడవియందుండుట. అతతసుఖదంబగు=విస్తారసుఖము కలిగించునది.

మనుదనుజులకున్ = మనుజులకున్ + దనుజులకున్ ద్వంద్వాంత మందలి శబ్దము సమాసమునఁ బ్రతిపదముతో వేఱువేఱుగ సంబంధించియుండు- సు. వ్యా. సమాస సూ. ౧౭.

తా త్ప ర్య ము.

ప్రఖ్యాత కీర్తిగలవాఁడా! నీ తల్లి నేలదూఱెదు. శ్రీరాము నరణ్యవాసము తపసులకు దేవతలకు మనుజులకు దనుజులకు విస్తారసుఖము కలిగించునది యగును. కావున నామె నిందింపఁబడఁదగదు.

నీ తల్లు లెవరని ప్రశ్నించుటకుఁ గారణ మీహితము బోధించుటకే, కైక లేకున్న రామాయణమే లేదుకదా. త్రికాలవేదియగు భరద్వాజుఁడు శ్రీరామచంద్రుఁడు చేయఁబోవు రావణవధాదికము మనస్సునందుంచుకొని యిట్లు చెప్పెను.

—• భరతుఁడు చిత్రకూటంబునకుఁ బ్రయాణ మగుట •—

కం. పయనింపఁ దనిన మ్రొక్కుచు హయగజరథవివిధవాహ•నాదులతోడన్
రయమునఁ జనఁ జొచ్చెను యమి,నియమితమార్గమునఁ బుణ్య•నిష్ఠుం డంతన్. ౨౧౨౨

పయనింపుఁడు=ప్రయాణముచేయుఁడు, హయగజరథ వివిధ వాహనముల తోడన్=గుఱ్ఱములు, రథములు; నానావిధ వాహనములు వీనితో, రయమునన్ = శీఘ్రముగ, యమి = భరద్వాజునిచే నియమితమార్గమునన్ = నియమింపఁబడిన త్రోవన, పుణ్యనిష్ఠుఁడు=పుణ్యము చేయుటయందు నిష్ఠగలవాఁడు.

తా త్ప ర్య ము.

ఇట్లుఁ బ్రయాణము గండనిన నమస్కరించుచు గుఱ్ఱములు నేనుఁగులు రథములు నానా వాహనములు వెంటరాఁగా ధర్మనిష్ఠుఁడైన భరతుఁడు ముని చెప్పిన మార్గమున శీఘ్రప్రయాణము చేసెను.

కం. హాటకభూషోదంచిత, ఘోటకముల స్యందనముల • గురుజవమున నే
ర్పాటుగఁ దీరిచి జనతా,కోటులు పయనించె నెక్కి•కుతుకముతోడన్. ౨౧౨౩

హాటకభూషోదంచిత = బంగారు భూషణములచేఁ బ్రకాశించు, ఘోటకములన్=గుఱ్ఱములను స్యందనములన్ = తేర్లను, గురుజవమునన్=అధికవేగమున, జనతా=జనసమూహములు కోటులు=పెక్కు సంఖ్యలు.

### తాత్పర్యము.

బంగారుసొమ్ములచేఁ బ్రకాశించు గుఱ్ఱములను రథములను మిగులవేగముగ నొకదానితోనొకటి కలియక వేలువేలుగ వచ్చునట్లేర్పాటుచేసి శ్రీరామచంద్రుని జూచుకోరికతో ననేకసంఖ్యలప్రజలు పయనించిరి.

కం. కంజరకక్ష్యారాజిత,కుంజరకన్యకలు నేనుఁ◆గుల్ గంటలు మ్రోఁ
గం జని జడికారున ఘనపుంజంబులు గర్జ లోలయఁ ◆ బోయెడిరీతిన్. ౨౧౨౮

కంజర=బంగారుతోఁ జేయఁబడిన, కక్ష్యా=త్రాళ్ళచే, రాజిత=ప్రకాశించు, కుంజరకన్యకలు=ఆఁడేనుఁగులు, జడికారునన్=వర్షాకాలమునందు, ఘనపుంజంబులు =ఏనుఁగులగుంపులు, గర్జలు=ధ్వనులు.

### తాత్పర్యము.

బంగారు గొలుసులచేఁ బ్రకాశించు నాఁడేనుఁగులు మగయేనుఁగులు గంటలు ధ్వనించుచుండఁగా వానకాలమం దుఱుములతో మేఘముల గుంపులు పోవువిధ మునఁ బోయెను.

కం. చినచిన్నవి పెదపెద్దవి కన వివిధము లై మహోర్ఘ◆కలితంబులు వా
హనములు పోవం దొడఁగెను, జన మె భటావళియుఁ బాద◆సంచారమునన్. ౨౧౨౯

మహోర్ఘకలితంబులు=మిగుల వెలగలవి, పాదసంచారమునన్=కాలినడకతో.

### తాత్పర్యము.

చిన్నవి మఱిచిన్నవి పెద్దవి యంతకుఁ బెద్దవి యగు వెలగల వాహనములు పోవుచుండెను. భటులు కాలినడకతోఁ బోయిరి.

కం. కను ెప్పుడొ కోడలి నా,యిన తేజుల సుతుల ననెడి◆యెలమిని దమవా
హనములఁ గౌసల్యాదులు, చనిరి మహాసమ్మదమున◆సత్వర లగుచున్. ౨౧౩౦

ఇన తేజులన్ = సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవారిని, ఎలమిని=సంతోష ముతో, సత్వరలు=త్వరతోఁగూడినవారు.

### తాత్పర్యము.

కోడలిని సూర్యతేజులయిన కొడుకులను నెపుడెపుడు చూతుమా యను సంతోషముతోఁ ద్వరగాఁగౌసల్యాదులు పోయిరి.

కం. భరతుఁడు తరుణార్కామృత, కిరణనిభం బయినపల్ల◆కిని నెక్కి చనెన్
బరివారంబులు గొలువఁగ, వరిగెను వెనుమేఘ మన మ◆హాసేకినియున్. ౨౧౩౧

తరుణార్క=బాలసూర్యునితోను, అమృతకిరణ=చంద్రునితోను, నిభంబు= సమానమైనది, పరివారంబులు=సేవకులు, సేనలు మొదలయినవి, మహాసేకినియున్= గొప్ప సేనయును.

తా త్ప ర్య ము.

బాల సూర్యచంద్రులతో సమానమైన పల్లకినెక్కి భరతుఁడు సేవకులు కొలుచుచుండఁగాఁ బోయెను. ఇట్టి మహాసేన.

కం. చని చని దక్షిణపుందెస, వనచయముల దాఁటి గంగ•పరవేలను జో
  చ్చెను త్రస్తపక్షిమృగ మయి, పెను పగువన మొక్కఁ డచట •వీరవరుండున్. ౨౧౨

గంగపరవేలను = దక్షిణదిక్కుగాఁ బాఱు గంగయొక్క పడమటియొడ్డున. త్రస్తపక్షిమృగము=భయపెట్టఁబడిన పక్షులు మృగములు. అయి=కలిగి, పెనుపగు =పెద్దదయిన ఈగుంపునుజూచి యవి భయపడెనని భావము.

తా త్ప ర్య ము

దక్షిణపు దిక్కుగాఁ బోయిపోయి యచట దక్షిణముఖముగఁ బాఱు గంగ పడమటియొడ్డునఁ బ్రవేశించి భయపెట్టఁబడిన పక్షులు మృగములు గల యొకపెద్ద వనమును వీరాగ్రణి భరతుఁడు చూచెను.

౧౩-వ సర్గము.

సీ. అపురూప మగునమ్మ•హాసేనరాకకుఁ గలగుండుపడుచు న•క్కాననలోని
  వనగజంబులు పఱ్ఱ•పాఱె నార్తోక్కులఁ, హల్లకల్లోలంబు • లగుచు ఋక్ష
  రురుపృషతంబులు • గిరినదీవన రాజి, నెక్కడఁ జూచినఁ • బిక్కటిల్లె
  వాహినీపతిఁ బోలు • వాహిని వర్షాబ్ద, మన భూమి నెంతయు • నాక్రమించెఁ

ఆ. చటులజవము లైన•సైంధవంబులచేత, గంధసింధురముల•గణముచేత
  బంధురంబు నైన•వాహిని నడుచు చోఁ, గానరాదు దీర్ఘ•కాల మిలయు. ౨౧౨౯

అపురూపము=అపూర్వశబ్దభవము, మునుపెన్నఁడు చూడనిది. కలగుండు = కలఁత. హల్లకల్లోలంబులు=తాఱుమాఱు. ఋక్ష=ఎలుఁగులు. రురు=దేహములపై మచ్చలులేని జింకలు. పృషతంబులు=మచ్చలుగలజింకలు. గిరి=పర్వతమునందును, నదీ=ఏటియొడ్డులందును. వనరాజిన్=వనముల గుంపులయందును, పిక్కటిల్లెన్ = నిండెను. వాహినీపతిన్=నదులకుఁ బతియగు సముద్రుని. వాహిని=సేన. వర్షాబ్దము =వర్షా+అబ్దము=వానకాలమందలి మేఘము, చటులజవములు = అతివేగములు, సైంధవంబులచేతన్=గుఱ్ఱములచే. గంధసింధురముల గణములచేతన్ = మదించిన యేనుఁగుల సమూహముచే. బంధురంబు=దట్టమైన. దీర్ఘకాలము=చాలఁగాలము.

తా త్ప ర్య ము

మునుపెన్నఁడుచూడని యీమహాసేన వచ్చుటఁజూచి యీ యడవిలోని యేనుఁగులు కలవరపాటుచెంది నలువంకలఁ బరువెత్తెను. వాని త్రొక్కులచేత నెలుఁగులు జింకలు తాఱుమాఱయి పరుగెత్తుచుఁ గొండలను నడవులను నేటితీరములను నెక్కడఁజూచిన నవియే దట్టమయ్యెను సముద్రమువంటిసేన భూమిని

వర్షాకాలమందలి మబ్బులాకాశమువలె నాక్రమించెను. అతివేగములైన గుఱ్ఱములు మదపుటేనుఁగులు వీనిచే దట్టమైనసేన నడచునపుడు చాలఁగాలము భూమియే గాన రాకుండెను.

ఆ. ఇట్లు పోయిపోయి • యెంతయు దవ్వుగ, వాహనములు డయ్య • వాసవాభుఁ
డచోటు చేరి పలికె • ననఘు వసిష్ఠమహా,నీంద్రుఁ జూచి కంపు•యివ్వనంబు.

తా త్ప ర్య ము. ౨౧౩౦

ఇట్లు చాలదూరము పోయిపోయి వాహనములు బడలికచెందఁగా నింద్రునితో సమానుఁడైన భరతుఁడా చోటఁజేరి వసిష్ఠునిఁజూచి యిట్లనెను.

అచోట = కృతహ్రస్వంబగు త్రికంబు మీఁదిచోటు శబ్దంబు నోత్వంబున కత్వ హ్రస్వంబులు విభాషనగు సు. వ్యా సమాస. ౩౭ సూ.

కం. మనకు భరద్వాజుఁడు పల్కిన దేశం బిదిగఁ దోఁచె • గిరి యది యగుఁగో
ఘనచిత్రకూట మీవా,హిని మందాకినియ కంటి•రే దూరమునన్. ౨౧౩౧

నాలుగవ పాదంబునఁ బ్లుతయతి.

తా త్ప ర్య ము.

మనకు భరద్వాజుఁడు చెప్పిన ప్రదేశమిదియేనై యుండును. అదిగోఁ గానవచ్చు నదియే చిత్రకూటము, ఈనదియె మందాకిని, అదిగో దూరమందు.

—• భరతుఁడు శత్రుఘ్నునకుఁ జిత్రకూటవనంబు వర్ణించిచెప్పుట •—

కం. అసితజలదాభశోభా,లసితం బగువన మటంచు • లక్ష్మణుననుజన్
దెసఁ గన్గొని గిరిసానుల,పసఁ జెలుచు మదద్రితుల్య•వారణగణముల్. ౨౧౩౨

అసిత=నల్లని, జలదాభ=మేఘములతో సమానమైన, శోభా=కాంతిచే, లసితంబు=ప్రకాశించునది, గిరిసానుల = కొండపేటుల, పస = సారమును, మల్ = నారయొక్క, అద్రితుల్య=కొండలతో సమానములైన. వారణగణముల్=ఏనుఁగులు గుంపులు.

తా త్ప ర్య ము.

నల్లని మబ్బులవంటి కాంతిగలవనము, అని చెప్పి శత్రుఘ్నుని జూచి కొండలతో సమానములైన నాయేనుఁగుల గుంపులు కొండచఱుల సారము చెఱుచుచవినై యున్నవి.

ఉ. సామజముల్ చనంగ రభ•సంబున రా లొప్పడి యయ్యె, వృక్షముల్
కోమలసూనరాజులను • ఘు మ్మన రాల్చెను, నూమ్మకాత్యయ
శ్యామలవారివాహములు • నంబువులం దొరఁగించుభంగి నై;
యామరకిన్నరోత్కరస•మాచరితం బగుదేశ మల్ల దే. ౨౧౩౩

సామజముల్ = ఏనుఁగులు, సామవేదమువలనఁ బుట్టినవని వ్యుత్పత్తి, రభసంబునన్=శీఘ్రముగ, రాలు = శిలలు, కోమలసూనరాజులను = మృదువులైన పుష్ప

సమూహములను, ఊష్మక + అత్యయ = ఎండాకాలముపోఁగా వర్షాకాలమందలి, శ్యామల=నల్లనైన, వారివాహములు=మేఘములు, అంబువులన్=నీళ్ళను, తోరఁగించు =కురియించు, భంగినై = విధముగలదై, అమర = దేవతా సమూహముల చేతను, కిన్నర=కిన్నరులయొక్క, ఉత్కర=సమూహముచేతను, సమాచరితంబు = సంచరింపఁబడినది.

తా త్ప ర్య ము

మనయేనుఁగులు పోవువేగమున వానికాలిక్రిందఁబడిన శిలలు పొడియయ్యెను. వానకాలమందు నల్లని మేఘములు నీళ్ళబిందువులు వర్షించువిధమున చెట్లు కోమలములైన పూవులరాసులను ఘుమ్మనువాసన వ్యాపించుచుండఁగా రాల్చెను. అదిగో నాకానవచ్చునదే దేవతలు కిన్నరులు సంచారముచేయు ప్రదేశము.

చం. మకరనివాససాగరము•మాడ్కి రహించె మృగాకులంబు గో
త్రకటక దేశముం గనితె • తమ్మెడ తోలఁగ సైనికుల్ భయా
ధికగతిఁ బాఱఁ జొచ్చె నలు•దిక్కులవాతవిధూతశారద
ప్రకటవలాహకావళి న•భస్థలిఁ బోలె మృగోత్కరంబులున్. ౧౩౪

మకరనివాస సాగరముమాడ్కిన్ = మొసళ్ళునివాసముచేయు సముద్రమువలె, మృగాకులంబు = మృగములచేఁ గలఁతచెందినది, గోత్రకటకదేశమున్ = కొండచఱులచోటు, భయాధికగతిన్ = భయముచే మిగులవేగమున, వాత = గాలిచే, విధూత=ఎగురఁగొట్టఁబడిన, శారద=శరత్కాలమందలి, వలాహక = మేఘముల, ఆవళి=సమూహము, నభస్థలిన్ = ఆకాశమును, మృగోత్కరంబులున్ = మృగసమూహములు.

తా త్ప ర్య ము

కొండచఱులప్రదేశము మృగములచేఁ గలఁతచెందినదై మొసళ్ళు వసించు సముద్రమువలె నున్నది సైనికులు తఱుముగా భయముచే నధికమైన గమనముతో మృగసమూహము లాకాశమునందు గాలిచే నెగురఁగొట్టఁబడిన శరత్కాల మేఘముల గుంపువలె నాలుగువైపులఁ బరువెత్తుచున్నవి.

తా త్ప ర్య ము.

కం. నల్లనిమేఘం బన రుచి, మెల్లమి గలకురుల నెగయు • ముకి నైచి భటుల్
పెల్లుగఁబూవుల ముడిచిరి, యల్ల దిగో దాక్షిణాత్యు•లనఁగాఁ గంటే. ౧౩౫

రుచిమెల్లము=కాంతియొక్క యతిశయము, కురులన్ = వెండ్రుకలను, ఇది నిత్యబహువచనాంతము, దాక్షిణాత్యులు = దక్షిణదేశవాసులు, భరతుఁడు దక్షిణదేశము చూడలేదుగదా? ఇది యాయనకు నెట్లుతెలియునని సందేహింపఁ బని లేదు. ఒక గొప్పనగరము దన్ని దేశముల జనములుందురు. వారు వారి యాచారముల చొప్పుననే ప్రవర్తింతురు. రాకపోకలు లేవందురా? దేశమధ్యభాగ మరణ్యముగానే యుండెనుగాని సముద్రతీరమున జనావాసములైన దేశములే యుం

డెను. అదియునుగాక కప్పముగట్టుటకో యితర కారణములచేతనో యెందఱో వచ్చుచుఁ బోవుచుందురు. వీరిని భరతుఁడు చూచియుండును.

తా త్ప ర్య ము.

నల్లని మేఘమువలె నతిశయమైన కాంతిగల వెండ్రుకలను పైకి దక్షిణదేశ వాసులవలె నెగఁద్రోచిముడివేసి దానియందుఁ బూవులను విశేషముగ ధరించిరి. చూచితివా.

కం. జనవర్జిత మీశైలము, జనతాసంకీర్ణ మగుచు • సంశోభించెన్
మనపురి యయోధ్యరీతిని, గనులకుఁ బండువుగ నిపుడు • కాంచితె దీనిన్.
౨౧౩౬

జనవర్జితము=జనులచే విడువఁబడినది, శైలము=కొండ, జనతా=జనసమూహముచే, సంకీర్ణము=వ్యాపించినది, సంశోభించెన్=ప్రకాశించెను.

తా త్ప ర్య ము.

నిర్మానుష్యమైన యీకొండ యిపుడు జనులతోఁ గూడినదై యయోధ్యానగరమువలెఁ బ్రకాశించుచున్నది.

కం. గిట్టలతాఁకున ధూళులు, బుట్టి నభోమండలంబుఁ • బొరిఁగప్పినఁ దా
నెట్టన గాలియుఁ జెదరం, గొట్టెడి హర్షంబు నాకుఁ • గూర్చెడిభంగిన్. ౨౧౩౭

నభోమండలము=ఆకాశప్రదేశము, పొరిన్=పూర్ణముగా, నెట్టన=అడ్డులేక.

తా త్ప ర్య ము.

గుఱ్ఱము లెద్దులు మొదలైనవాని గిట్టలు నేలతగులుటచే లేఁగినదుమ్మొలాకాశమును బూర్ణముగాఁ గప్పఁగా రామాశ్రమము గానరాకుండఁగా నాకు నదికనఁ బడునట్లుచేసి సంతోషము గలిగించుటకై గాలి యీదుమ్మును జెదరఁగొట్టెను.

ఉ. రామునిఁ గాంచుకౌతుకభ • రంబున నెవ్వడిఁ బోవుసైనిక
స్తోమముఁ గంటె శేపుగమి • తోరపునాదున నుల్కి-పాఱు నీ
భూమిధరంబునందలి ప్ర • భూతమనోజ్ఞ మయూరపాళు లెం
తే మద మొప్పఁ గూర్చుఁ గని • శే యవె సానువులందుఁ దమ్ముఁడా. ౨౧౩౮

కౌతుకభరంబునన్ = సంతోషాతిశయముచే, నెవ్వడిన్=నిఱు+వడి = నిండు వేగమున, సైనికస్తోమము=సేనాభటుల సమూహము, తోరపునాదున = అధికమైన ధ్వనిచే, ఉల్కి- పాఱు = భయపడి పరువెత్తు, ప్రభూత = మిక్కిలి యతిశయించిన, మనోజ్ఞ = రమ్యములైన, మయూరపాళులు = నెమిళ్ళసమూహములు, ఎంతేన్ = మిక్కిలి, ఏని శబ్దమునందలి 'ని' వర్ణము లోపింపఁగా మిగిలిన రూపము 'ఎందేడెందము కందళించు' మనుచరిత్ర. హల్లుపరమైనపుడు ఏని శబ్దములోని ఇకారమునకు లోపము వైకల్పికము. సు. వ్యా. సంధి సూ. ౧౫. సానువులందున్=చఱులయందు.

తా త్ప ర్య ము.

తమ్ముఁడా! శ్రీరామచంద్రునిఁ జూడవలయునను సంతోషాతిశయముచే మిగుల వేగముగఁ బోవుచున్న సేనాభటులఁ జూచితివా! రథములగుంపుల యధికమైన ధ్వనులను భయపడి పరువెత్తుచున్న మిగుల రమ్యమైన నెమిళ్లు చఱులందు మిగుల సంతోషము గలిగించుచున్నవి చూచితివా.

ఉ. కన్నులపండు వయ్యెఁ గనఁగానిది కేవలనాకతుల్య మై
యున్నది, తాపసాశ్రమము • లుండెడు నిం దని తోఁచెఁ, బుష్పసం
ఛన్నము లట్లు బిందుమృగ•సంతతు లయ్యె వె, రామునాశ్రమం
బున్నెడ రోయఁ బంప నగు • నొయ్యనఁ గొండొకసాధుసైన్యమున్. ౨౦౩౯

కేవల నాకతుల్యమైన=స్వర్గముతోనే సమానమైనది, పుష్పసంఛన్నములట్లు=పూలచేఁ గప్పబడినవానివలె, బిందు మృగసంతతులు = చుక్కలుగల జింకలసమూహములు, ఉన్నెడ=ఉన్నస్థలము, రోయన్ = వెదకుటకు, కొండొక = అల్పసంఖ్యభటులుగల, సాధు=యోగ్యమైన, సైన్యమున్=సేనను, "సాధుస్త్రిషుచారౌ తేచాకాసత్యే వార్ధుషికేపి" నానా. వ.

తా త్ప ర్య ము.

ఇది చూచుటకెంతో సంతోషకరమై సాక్షాత్తుస్వర్గమువలెనేయున్నది. కావున నిచట మునులయాశ్రమము లుండవచ్చును. ఏలయన నాశ్రమములందు సందందు మచ్చలుగల జింకలు పూలచేఁ గప్పఁబడినట్లున్నవి. అదిగోఁ జూడుము. కావున నిందు శ్రీరామచంద్రమూర్తి యాశ్రమమున్న చోటు వెదకుటకై యల్పసేనాభటుల నాయుధపాణులు గానివారినిఁ బంపఁదగును.

చం. అన విని కొంద ఱేగి వని • నక్కడ నక్కడ రోసి యొక్కచోఁ
గని పొగ లేఁగు చుంటఁ జని • కైకయిపట్టికిఁ దద్దిగోఁ
గను మదె ధూమమున్, గలుగఁ•గా నెటు నేర్పు జనంబు లేనిచో
టను బొగ, గాన నయ్యెడ దృ•ఢంబుగ నుందురు రామలక్ష్మణుల్. ౨౦౪౦

వనిన్=అడవియందు, రోసి = వెదకి, ధూమము = పొగ, దృఢంబుగన్ = నిశ్చయముగ.

తా త్ప ర్య ము.

అని చెప్పఁగాఁ గొందఱు విని పోయి యడవియందు నచ్చటచ్చట వెదకి యొకచోట పొగ యెగయుచుండుట చూచివచ్చి భరతునితో నల్లదిగోఁ బొగచూడుము. నిప్పులేక పొగయుండదు. మనుష్యులులేక నిప్పుండదు. కావున నక్కడ శ్రీరామలక్ష్మణు లుందురు. అనిచెప్పిరి. దీనికే యనుమాన ప్రమాణమని పేరు. అనఁగా నూహించి తెలియునది.

ఉ. వారలు గాక యున్న రఘు•వర్యునితో సరి యైనవారు లేన్
వారక యుండు రం దనిన • వారలమాటల నాలకించి య
వ్వారలతోడ ని ట్లనియె • వాహినితో డుత నింద నిల్వుఁడీ
వీరలు; నే సుమంత్రుఁడును • మేటిగురుండును బోదుమం చనన్. ౨౧౪౧

తా త్ప ర్య ము.

అందున్న మనుష్యులు శ్రీరామలక్ష్మణులు కారేని వారితో సమానులైన మునీశ్వరులయిన నుందురు. వారినడిగిన శ్రీరామ లక్ష్మణులుండు నాశ్రమమును జూపుదురు. అనిన వారలమాటలువిని వీరందఱు సేనతో నిందేనిలువుఁడు. రాజులందు నేను శత్రుఘ్నుఁడు మంత్రులందు సుమంత్రుఁడు పురోహితులందు గురుఁడు వసిష్ఠుఁడు పోదుము అని చెప్పఁగా.

ఉ. వ్యగ్రత సేన లందు నిలు•వన్, భరతుండును దూల నున్నధూ
మాగ్రమునందు దృష్టి నిడి • యాదటఁ బోవుచు రాము నంద యే
కాగ్రముఁ జేసి చిత్తమును • హర్ష వికస్వరుఁ డయ్యె రాఘవ
ప్రాగ్రసరున్ వెసం గనుల•పండువుగాఁ గనుఁగొందు నం చెదన్. ౨౧౪౨

వ్యగ్రతన్=జాగ్రత్తతో, దూలన్=దవ్వులన్=దూరమునందు, ధూమాగ్రము నందున్ = పొగ కొనభాగమందు, ఆదటన్ = ప్రేమతో, ఏకాగ్రము = నిశ్చలము, హర్ష వికస్వరుఁడు=సంతోషముచే వికాసము నొందినవాఁడు, రాఘవప్రాగ్రసరున్ = రఘువంశపు రాజులలో శ్రేష్ఠునిన్.

తా త్ప ర్య ము.

రాజాజ్ఞప్రకారము సేనలన్నియు జాగ్రత్తగా నందేనిలువఁగా భరతుఁడు దూరమునందున్న పొగకొనయందుఁ జూపుంచి యాజాడపట్టుకొని ప్రీతి శ్రీరాము నందే మనస్సు నిశ్చలముగ నిల్పి శ్రీరామచంద్రుని గన్నులపండువుగఁ గనుఁగొందునను సంతోషముతో వికాసమునొందిన మనస్సు దేహము కలవాఁడై.

ఆదియందు నిర్వేదము గలవాఁడుకాని నివృత్తి మార్గనిష్ఠుఁడు కాఁజాలఁడు. నివృత్తి మార్గనిష్ఠుఁడుకాని భగవదన్వేషణపరుఁడుకాఁడు. కైకచేసిన చేష్టవలన భరతునకుఁ దొలుత నిర్వేదము జనించెను. ఈ నిర్వేదమువలన భగవద్దర్శనాభిలాషయుఁ దత్ప్రియత్నము జరగెను. ఈ నిర్వేదము గుహునివాక్యములవలన బలపడెను. ఆవల భగవత్సాక్షాత్కారము గలయాచార్యోపదేశము కావలయును. ఆచార్యుఁడు పాత్రమెఱుఁగక యుపదేశింపఁడు. కావున భరద్వాజుఁడు భరతుఁడు నిజముగా భరతుఁడా యని పరీక్షించి (భర+త = భరమునందు నిశ్చయబుద్ధిగలవాఁడు సర్వభరము భగవంతునిదేకాని తనదికాదను నిశ్చయము కలవాఁడు. తస్మిన్ పుంసి సంభోగే నిశ్చయే యని నానా. ర. తాను దాసుఁడేకాని స్వతంత్రుఁడు కాఁడని తలఁచువాఁడు). వ్యతిరేకవిధమున సహాయపడిన కైకను దూషింపవలదని యొవ్వాని

ప్రాప్తి భరతుఁడు కోరియున్నాఁడో యాభగవంతుఁడుండు స్థానమును దెలిపి యా మార్గమును జూపెను. గురువు మార్గముఁ దెలుపునేకాని యన్వేషణకార్యము శిష్యునిదే. శిష్యుఁడెల్లు భరతుఁడుగా నుండవలయునో గురువు అట్లు భరద్వాజుఁడై (భరించు వీర్యముగలవాఁడై) అనఁగా బ్రహ్మచారియై యింద్రియనిగ్రహము కలవాఁడై శిష్యుని శ్రేయస్సుగోరువాఁడై బ్రాహ్మణుఁడై యుండవలయును. ఈమార్గము నీచజాతివాఁడు చెప్పఁగలిగినను వానిసాహాయ్యము పొందవచ్చునుగాని యనుష్ఠానమునకుఁ దగిన యుపదేశము చేయువాఁడు సద్బ్రాహ్మణుఁడైయే యుండవలయును. ఆకారణముచే గుహుఁడు చెప్పినను భరతుఁడు దానితోఁ దుష్టిపడక భరద్వాజునిచేఁ దెలిసికొనవచ్చెను. ఆభరద్వాజుఁడు చిత్రకూటమందు శ్రీరామచంద్రుఁ డున్నాఁడని దృఢముగాఁ జెప్పెను. ఈ దార్ఢ్యము యోగదృష్టి బలసాధ్యము. చిత్రకూటమనఁగా నాశ్చర్యమైన గృహము. ఇదియే హృదయగుహ. ఇది మందాకినీ తీరమందున్నది. అకిని = దుఃఖముగలది. ఆ దుఃఖము మందమైనది మందాకిని. దుఃఖమును హరించునది. ఇదియే సుషుమ్న. అది నదివలె దీర్ఘమై యుండును. గావునను నది స్త్రీలింగము కావున మందాకిని యని స్త్రీలింగము చెప్పఁబడెను. సుషుమ్న నాడివెంటఁ బోయినవారికి దుఃఖములేదని భగవత్ప్రాప్తికదియె మార్గమని యోగశాస్త్రము, భాగవతము, ఉపనిషత్తులు చెప్పుచున్నవి. ఇది రెండున్నర యామడదూరమున నున్నదఁట, వీఁదినుంచియెంచిన (1) ఆజ్ఞాచక్రము (2) విశుద్ధచక్రము (3) అనాహతచక్రము. రెండవదానికి మూఁడవదానికి నడుమనున్నది హృదయస్థానము. కావున రెండున్నర యనిచెప్పుట సరియు, ఈ పద్యమునందు దర్శన సమాకారతుల్యధ్యానము చెప్పఁబడియె. భరద్వాజవాక్య మాప్తవాక్యము దానిని విశ్వసించి కృషిచేయఁగాఁ బ్రత్యక్షదర్శనమునకు ముం దనుమానచిహ్నములు కానవచ్చును అదియె ధూమము. ఇది యాధారముచేసికొని యన్వేషింపఁగా సాక్షాత్కారము కలుగును. అది ముందు తెలుపఁబడును.

ఇంతటితో భరతుని వృత్తాంతము ప్రకృతము చాలించి యీసమయమున శ్రీ సీతారామలక్ష్మణు లేమిచేయుచుండునది కవి తెలుపుచున్నాఁడు.

—•౯౪-వ సర్గము. శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటంబున వినోదములఁజూపుట•—

ఉ. అక్కడ రామచంద్రుఁడు ధ•రాత్మజతోఁ జిరకాల మద్రిపై
మక్కువ నుండియుం గుధర•మంజు లతిల్ గనఁ గ్రొత్తక్రొత్తలై
పెక్కువనొందుప్రీతి నిడ • వేసవఁ గార్యము లెల్లఁ దీర్చి తా
నొక్కడ సీతకుం దనదు • నుల్లము హర్షము నొంద శైలమున్. ౨౧౯౩

ధరాత్మజతోన్=సీతతో, చిరకాలము=దీర్ఘకాలము, అద్రిపై=కొండమీఁద, కుధర=(1) పర్వతముయొక్క, కు+ధరము = ప్రకృతి, "కు స్త్రీ భువి కుపాపీల్పేకు

తానాయాం' నానార. ప్రకృతి "నిత్యాపరితనిక్రియా" కావున సర్వదా వికార మునే పొందుచుఁ గ్రొత్తక్రొత్తగాఁ గానవచ్చుచుండును. "లోకవత్తు లీలాకైవల్య మ్మ"న్నట్లు రాజునకు గృహకృత్య విచారముకంటె వినోద క్రీడ సంతోషకరమైనట్లు భగవంతునకు నిత్యవిభూతికంటె లీలావిభూతి యెక్కువ ప్రీతికరమని భావము. మంజులతల్=(1) సొగసులు, (2) మనోహరమైన తీఁగలు, పెక్కువ = అతిశయము, ఇడన్=కలిగింపఁగా, వేకువకార్యములు = ప్రాతఃకాలకృత్యములు, స్నానసంధ్యాదులు, సీతకున్=భర్తతోడనుండి వనముఁజూచి హర్షింపఁగోరు సీతకు, ఆమెసంతోషమే తనసంతోషముగా నెంచు తనకు.

తా త్ప ర్య ము.

చిత్రకూటమందుండు శ్రీరాముఁడు సీతతో నెలదినములుగఁ గొండమీఁద నుండినను బర్వతముసొగసు దానియందలి మనోహరమైన తీఁగలు దినముచూచు చున్నవెనను క్రొత్తక్రొత్తగాఁ గనుపించుచు విశేషప్రీతిని గలిగింపఁగా నానాఁటుద యకృత్యములగు స్నానసంధ్యాదు లన్నియుఁ దీర్చికొని సీతతో నొకచోటఁ గూర్చుండి సీతకు నామెకారణముగాఁ దనకు మనస్సున సంతోషము కలుగుచుండఁగా నాపర్వతమును.

చం. హరిహయుఁ డాపులోమజకు • నట్టులు దేవనిభుండు చూపుచున్
ధరణిజ కిట్లు పల్కె- వని • తా! కను మీగిరిసొంపుఁ జూచినన్
భర మగురాజ్యమున్ విడిచి • వచ్చుటయున్ సుహృదాళిఁ బాయుటన్
మెరమెరఁ గూర్పఁజాలదు సు • మీ యిసుమంతయుఁ బద్మపాణిరో. ౨౧౪౪

హరిహయుఁడు=ఇంద్రుఁడు, ఆకుపచ్చ గుఱ్ఱములుగలవాఁడు, పులోమజకున్ = శచీదేవికి, శచీదేవి పులోముని కూఁతురు దేవనిభుండు = దేవశబ్దము భగవంతుని యందు ముఖ్యము- ఇతర దేవతలయం దౌపచారికము. కావున, దేవనిభుండు=విష్ణువుతో సమానుఁడగువాఁడు, అవతారమూర్తియగుటచే సమానత్వము. పద్మపాణిరో =(1) పద్మమువంటి పాణిగలదానా, (2) పద్మమును పాణియందుఁగలదానా, లక్ష్మీదేవీ, పరమగురాజ్యమున్=(1) శ్రేష్ఠమగు భూపాలనము- (2) నిత్యవిభూతి వైకుంఠము. సుహృదాళిన్=స్నేహితులను- (2) నిత్యసూరులను ముక్తులను, మెరమెర = దుఃఖము, ఇసుమంతయున్=కొంచెమైనను.

తా త్ప ర్య ము.

ఇంద్రుఁడు శచీదేవికి నాకపృష్ఠము చూపునట్లు శ్రీరామచంద్రుఁ డాచిత్ర కూట శైలమును జూపుచు శ్రేష్ఠమైన రాజ్యమును విడిచివచ్చుటగాని మిత్రుల బాయుటగాని నాకుఁ బద్మహస్తా! కొంచెమైనను దుఃఖము కలిగింపకున్నది.

ఉ. అంబుజనేత్ర! యల్లదిగొ • నంబరచుంబితటంబలోలరో
లంబకదంబ కీరమృగ • లాలితదేశము లొప్పఁ గంటివే,

యంబుగఁ గొన్ని పచ్చ నయి ♦ యింద్రమణిస్ఫటిక ప్రవాళపీ
తాంబర కైతకద్యుతులు ♦ నై మఱికొన్నియు రాజిలెం జెలీ. ౨౧౪౬

అంబుజనేత్రి=కమలములవంటి కన్నులుగలదానా, అంబర = ఆకాశమును, చుంబి=ముద్దుపెట్టుకొనుచున్న, అనఁగాఁ దాఁకుచున్న, నితంబ = చఱియలయందు, లోల=సంచరించుచున్న. రోలంబ=తుమ్మెదలయొక్క, కదంబ=సమూహాముల చేతను, కీర=చిలుకలచేతను, మృగ = జింకలచేతను, లాలిత= మనోహరమైన, దేశము = ప్రదేశము, స్థలము, ఇంబుగన్=మనోహరముగ, ఇంద్రమణి = నీలములయొక్కయు, స్ఫటిక = స్ఫటికములయొక్కయు, ప్రవాళ = పగడములయొక్కయు. పీతాంబర = పచ్చని వస్త్రములయొక్కయు, కైతక=మొగలిపువ్వులయొక్కయు, ద్యుతులును = కాంతులను, ఐ=కలిగి, రాజిలెన్=ప్రకాశించెను.

తాత్పర్యము.

దేవీ! యల్లదిగోఁజూడుము. ఆకాశమంటుచున్న చఱియలయందు సంచరించు తుమ్మెదల గుంపుచేతను, చిలుకలచేతను, జింకలచేతను సుందరమైన ప్రదేశము. అందు గొన్నిపచ్చగాను గొన్నినీలములవలె స్ఫటికములవలెఁ బగడములవలెఁ బచ్చని వస్త్రములవలె మొగలిపూవులవలెఁ గాంతులుగలవై ప్రకాశించుచున్నవి.

కం. క్రూరతఁ బాసి సివంగులు, ఘోరపు బెబ్బులులు దిరుగఁ ♦ గూటములందున్
జారురవాన్వితనానా, హారివిహగతతులతోడ ♦ నద్రి రహించెన్. ౨౧౪౭

*కూటములందున్ = శిఖరములందు, చారు=మనోహరమైన, రవ=ధ్వనితో, అన్విత=కూడుకొన్న, నానా = అనేకవిధములయిన, హారి=మనోజ్ఞమైన, విహగ = పక్షులయొక్క, తతులతోడన్=సమూహాములతో, అద్రి=పర్వము, రహించెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము.

చిత్రకూటపర్వతము శిఖరములందు నహింసావ్రత నిష్ఠాపరులైన మునీశ్వరుల సాంగత్యముచేతఁ బరిహింపనేరు సివంగులు భయంకరములైన పెద్దపులులు తమక్రౌర్యమువూని తిరుగుచుండఁగా శ్రవ్యమైన ధ్వనులతోడి నానావిధములైన మనోహరములైన పక్షుల సమూహాములతోఁ బర్వతము ప్రకాశించుచున్నది.

కం సాలతినిశప్రియాళాం,కోలామ్ర శ్రీతమాల♦కుజతిందుకవృ
క్షాళీయుత మై సుమఫల,జాలచ్ఛాయలనునొప్పు ♦ చందముఁ గంటే. ౨౧౪౮

సాల=మద్దిచెట్లయొక్కయు, తినిశ=తినాస వృక్షములయొక్కయు, ప్రియాళ =మోరట వృక్షములయొక్కయు, ప్రియాళుశబ్ద మకారాంతముగలదు. అంకోల = ఊడుగు చెట్లయొక్కయు, ఆమ్ర=తియ్యమామిడిచెట్లయొక్కయు,శ్రీ=మారేడుచెట్ల యొక్కయు, తమాలకుజ = కానుగుచెట్లయొక్కయు, తిందుకవృక్ష=తుమ్మికి చెట్ల

రయొక్కయు, ఆళీ=సమూహముతో, యుతము=కూడినది, సుమ=పూలయొక్కయు, ఫల=పండ్లయొక్కయు, జాల = సమూహములయొక్క, ఛాయలన్ = కాంతులచే, "ఛాయాకాంతిః సూర్యజాయా, ప్రతిబింబమనాతపః" నానా. ర. చందము=విధము.

తా త్ప ర్య ము.

మద్ది, తినాస, మోరట, యూడుగ, తియ్యమామిడి, మారేడు, కానుగు, తుమ్మికిచెట్ల వరుసలతోఁగూడి పూలపండ్ల సమూహముల కాంతులచే నొప్పువిధము చూచితివా.

ఉ. కీరమనోజ్ఞవాణి! యదె • కిన్నరదంపతు లేకచిత్తతన్
హారివిహారలీలల న•గాగ్రమునన్ రమియించు చున్నవా
రారయ రోమహర్షణము • నయ్యెఁ; నిజాంబరఖడ్గపాళులన్
భూరుహశాఖలందు నిడి • పొంపిరిపోవుముదంబు పెంపునన్. ౨౧౪౮

కీరమనోజ్ఞవాణి=చిలుకపలుకులవలె నింపైనవాక్కుగలదానా, దంపతులు = భార్యాభర్తలు, ఏకచిత్తతన్=ఒకమనస్సుతో, అనఁగా సమానమనస్సులతో, హారి= మనోహరములైన, విహారలీలన్ = సంచారకేళులచే, నగాగ్రమునన్ = పర్వతము పైభాగమున, రమియించుచున్నవారు = క్రీడించుచున్నవారు, రోమహర్షణము = సంతోషముచేఁగలుగు గగ్గురుపాటు, నిజ=తమ అంబర = వస్త్రములయు, ఖడ్గ = కత్తులయు, పాళులన్ = సమూహములను, భూరుహశాఖలందున్ = చెట్లకొమ్మల యందు, ఇడి=ఉంచి, పొంపిరిపోవు = వృద్ధిపొందుచున్న, ముదంబు = సంతోషము యొక్క, పెంపునన్=ఆధిక్యముచే.

తా త్ప ర్య ము.

చిలుకపలుకులవలె నింపైన వాక్కుగలదానా! అదిగోఁ జూడుము, కిన్నరులు భార్యాభర్తలొక్కమనస్సుతో మనోహరములైన లీలావిహారములతోఁ బర్వతము పైభాగమందుఁ గ్రీడించుచున్నారు. వారిని జూడఁగా గగ్గురుపాటు కలుగుచున్నది. తమ వస్త్రములను గత్తులను జెట్లకొమ్మలయందుంచి సంతోషము వృద్ధి పొందు చుండఁగా.

శా. క్రీడాదేశములఁ జరించెదరు వా•రే చూడు విద్యాధరుల్
పీడాలంకృతమస్తకల్ ! సకియ యు•ద్వేదించి భూభాగమున్
గూఢంబౌ జల ప్రపాతములఁ గ•న్గొ దేవి మత్తోత్కట
వ్యాడవ్యూహకటప్రసన్నదరుఝరీ•వ్యాపార మేపారెడిన్. ౨౧౪౯

క్రీడాదేశములన్=ఆటపట్టులందు, విద్యాధరుల్ = విద్యాధరస్త్రీలు, విద్యాధరి యేకవచనము, పీడాలంకృతమస్తకల్=సిగదండలచే నలంకరింపఁబడిన శిరములు గలవారు- ఆపీడమనినను పీడయనినను దలకుజుట్టుకొను పూలదండకుఁబేరు. "ఆపీడ శేఖరోత్తంసావతంసా శిరస్స్రజ" యని హలాయుధుఁడు. పీడావ్యథా కరుణయో

శ్శిరోమాల్యాపగర్వయో॰. నానా. ర. ఉద్భేదించుకొని=పెకలించుకొని, జలప్రపాతములు=నీళ్లపడుటలు, మత్త=మదించిన, ఉత్కట=అధికమైన, వ్యాడ=మదించిన యేనుఁగుల, రూ. వ్యాళము, వ్యూహ=గుంపులయొక్క, కట=చెక్కిళ్ళనుండి,ప్రవత్=కాఱుచున్న, మద = మదపునీళ్ళయొక్క, ఝరీ=ప్రవాహముయొక్క, వ్యాపారము=కార్యము, ఏపారెడిన్=అతిశయించెడిని, మొదటిపాదంబునఁ గాకుస్వరయతి.

తా త్ప ర్య ము.

ఆటలప్రదేశములందు సిగదండలచే నలంకరింపఁబడిన తలలుగల విద్యాధరస్త్రీలు సంచరించుచున్నారు. అదిగోఁజూడుము. సఖీ! భూమిని భేదించుకొని కలయఁ బ్రవహించుచున్న సెలయేళ్ళను దేవీ! చూడుము. అవి మదాతిశయముగల యేనుఁగులు చెక్కిళ్ళనుండి కాఱు మదముయొక్క ప్రవాహమును బోలి యున్నవి.

కం. కనఁ గనఁ గనులకుఁ విందుం, బొనరించెడి పెక్కుదెగల • పూవులవలపుల్
గొని గుహ వెడలెడి తెమ్మెర, జనకసుతా! యెవనిమదికి • సమ్మద మిడదో. ౨౧౪౦
వలపుల్=వాసనలు, తెమ్మెర=తెమ్మ+ఎర=చల్లగాలి. తేమ రూ. తెమ్మె.

తా త్ప ర్య ము.

చూడఁగాఁ జూడఁగాఁ గన్నులకుఁ బండువగు ననేకవిధముల పూవులవాసనలుగొని తెమ్మెర గుహ విడుచుచున్నది. ఇది యెవరికి సంతోషము గలిగింపదు?

ఉ. నీవును లక్ష్మణుండుఁ దరు • ణీమణి! కొల్వఁగ నెన్ని యేండ్లు నే
నీవనసీమ నున్న మది • కించుకయున్ వ్యథ లేదు, చారునా
నావిధపుష్పపక్వఫల • నవ్యశుకాదిశకుంతసంఘసం
భావితచిత్రకూటమును • బాయక నేఁ జరియింతుఁ బ్రీతితోన్. ౨౧౪౧

తరుణీమణి=స్త్రీరత్నమా, వ్యథ=బాధ, చారు=మనోహరమైన, నానావిధ=అనేకవిధములైన, పుష్ప = పూలచేతను, పక్వ = పండిన, ఫల = పండ్లు, నవ్యశుకాది=మనోహరమైన చిలుకలు మొదలయిన, శకుంత=పక్షులయొక్క, సంఘ = సమూహముచే, సంభావిత=కూడుకొనిన, పాయక=వదలక.

తా త్ప ర్య ము.

స్త్రీరత్నమా! నీవు లక్ష్మణుఁడు సేవింప నెన్నిసంవత్సరము లీ యడవియం దున్నను నామనస్సులోనఁ గొంచెమైన బాధలేదు. మనోహరమై నానా విధమైన పూలచేతను బండిన పండ్లచేతను వింతయగు చిలుకలు మొదలగు పక్షులసంఘముచే గౌరవింపఁబడిన చిత్రకూటమును వదలక సంతోషముతో సంచరింతును.

కం. జనకునిబుణంబుఁ దీర్చుట, యనుజానకుం బ్రియముఁ గూర్చు • టనుఫలయుగ్మం
బొనరెను జమ్మీ యీనా,వనవాసముచేత ఫుల్ల • వనజదళాక్షీ! ౨౧౪౨
ఫుల్లవనజదళాక్షీ=వికసించిన కమలముయొక్క రేకులవంటికన్నులు గలదానా.

### తాత్పర్యము.

వికసించిన కమలముయొక్క రేకులవంటి కన్నులుగలదానా! నా యీవనవాసమునకు రెండుఫలములు. ఒకటి తండ్రియప్పును దీర్చుట, రెండవది తమ్మునికి మేలు కలిగించుట.

తే. కలికి! యీచిత్రకూటన♦గంబునందుఁ, జారుమానసవాక్కాయ♦సంయుతవయి
వివిధభావంబు లెల్లను ♦ వేడ్క సరసి,కొనుచుఁ గ్రీడింతువే నన్ను ♦ గూడి ప్రీతి. ౫౧౯౩

కలికీ=అందకత్తెవగుసీతా, ఈ చిత్రకూట నగంబునందున్=భోగస్థానమునకు వలయు సౌభాగ్యమును విశేషముగఁగల యీపర్వతమున. మానసవాక్కాయసంయతవై=స్వాధీనపఱుచుకొనఁబడిన త్రికరణములు గలదానవై, వివిధ = మలయానిలము, కోకిలాలాపము పుష్పహారము మొదలగు పలువిధములుగల- భావంబులు =ఉద్దీపన భావములను, ఇవి కామమును వృద్ధిపఱుచునవి. నన్నున్ = సౌఖ్యానుభవ ప్రవాహమునందు నిన్నే ప్రధానురాలిఁగాఁ జేసెడినన్ను- "భావఃపదార్థసత్తాయాం క్రియాచేష్టాత్మయోనిషు, విద్వల్లీలాస్వభావేషు భూత్యభిప్రాయ జంతుషు" నానా. ర. వివిధభావంబులు=వివిధజంతువులనియుఁ జెప్పనగు- 'యతౌతు బద్ధనియతౌ' నానా. యతమనఁగాఁ గట్టఁబడినదానికి నియమింపఁ బడినదానికిఁ బేరు మనోవాక్కాయసంయతువు = ఎవతెచేత మనోవాక్కాయములు సంయతములయ్యెనో యామె మనోవాక్కాయ సంయత- అరసికొనుచున్=చూచుచు.

### తాత్పర్యము

సుందరీ! యీచిత్రకూట పర్వతంబునందు స్వాధీనపడిన మనోవాక్కాయములచే నానాజంతువులు చేయు విలాసచేష్టలను సంతోషముతోఁ జూచుచు నన్నుఁ గూడి యుద్దీపనవిభావముతోఁ గ్రీడించెదవా!

కం. ఈవనవాసవ్రతమును, దేవి! మాపెద్దలెల్లఁ ♦ దెలిపిరి యపవ
ర్గావహ మని సంసృతిపా,శావచ్ఛేదక మటంచు ♦ నాదరయుక్తిన్ ౫౧౯౪

అపవర్గావహము=మోక్షముగలిగించునది, సంసృతి =సంసారమనెడి, పాశ=త్రాటియొక్క, అవచ్ఛేదకము=త్రెంపుటగలది, ఆదరయుక్తిన్=ఆదరముతో.

### తాత్పర్యము

ఈ వనవాసవ్రతమువలనఁ గలుగునది నైహికసుఖము మాత్రమే కాదు. సంసారమనెడి త్రాటిని ద్రెంచి మోక్షమునుగూడ నిది కలిగించునని మాపెద్దలందఱును దెలిపిరి.

వనవాసము. ఈ ప్రపంచమున జీవులు పుట్టుట సంసారసుఖ మనుభవించుటకే కాదు. సంసారమును ధ్వంసముచేసి మోక్షముగాంచుటకును, అనఁగాఁ బైపద్యమునఁ జెప్పినట్టు లింద్రియ నిగ్రహము కలిగి నైహికసుఖ మనుభవించు గృహ

స్థుఁడు స్వాశ్రమ స్వధర్మ నిర్వహణముచేతనే మోక్షమును సంపాదింపఁగలఁడు. అనఁగా నింద్రియ నిగ్రహముగల గృహస్థుఁడు మోక్షార్థమై వేఱొక యాశ్రమ మును స్వీకరింపఁబనిలేదు.

ఆశ్రమములం దన్నిట శ్రేష్ఠమైనది గృహస్థాశ్రమమే. అది శిక్షాశాల. లోకసేవ సేయుటకు, దయాదిగుణములను వృద్ధిచేయుటకుఁ, గామక్రోధ లోభముల జయించుటకు, నింద్రియనిగ్రహము సాధించుటకుఁ బూర్ణముగా నేర్పుకొను తావు. దీనికి భయపడువాఁడు సన్న్యాసియగును. నీళ్ళలోదూఁకి యీఁదనేర్చుకొని నీళ్ళకు భయపడనివాఁడు గృహస్థుఁడు. నీళ్ళని భయపడుచు స్నానము చేయుటకును జంకెడువాఁడు సన్న్యాసి జితేంద్రియుఁడయిన గృహస్థుఁడు నూర్వురు యువతుల నడుమ నున్నను జలింపఁడు. సన్న్యాసి స్త్రీముఖము చూచుటకే భయపడును. ఎక్కడ దనమనస్సు చలించునో యని భయము. వీఁడు తన మనోదుర్బలత్వమును దూషింపక స్త్రీలను దూషించును. గృహస్థుఁడు ధీరుఁడు, రణవీరుఁడు. వీఁడు భోగి యై త్యాగియై యోగి యగును. సన్న్యాసి భీరువు. ఎందో ప్రమాదపడి రాగియై చిలుముపట్టి చెడిపోవును. "జ్ఞానమార్గపరిభ్రష్టశ్చండాలీం యోనిజాయతే" జ్ఞాన మార్గమున భ్రష్టుఁడు చండాలుఁడుగాఁ బుట్టును గృహస్థున కాభయములేదు.

"ఏకాశ్రమ్యమితి సర్వేషు వేదేషు ధర్మశాస్త్రేతిహాస పురాణేషు గృహస్థా ఏవాగ్నిహోత్రిణః। ప్రాచుర్యేణ విధీయంతే, స్తూయతేచ, తతో గార్హస్థ్యస్య ప్రత్యక్షవిధానాత్ సఏవైకఆశ్రమః। ఇతరేషు తత్రాశక్తానాం విధీయంతే ఇతి బహవ ఆచార్యా మన్యంతే" వైద్యనాథీయము. కావున గృహస్థాశ్రమము నిర్వ హింపలేనివారు సన్న్యాసులగుదురు.

తే. వన్ధలకొలంది చాఁపత్రా • లందు నిందు, నెందు నల్లగఁ దెల్లగ • నెఱ్ఱనగను
బెక్కురంగుల నొప్పారు•విధముఁ గంటె,సారసారసంకాశ•చారువదన! ౨౦॥

చాఁపత్రాలు=చాఁపవలె విశాలములై చదరముగానుండు తాలు, సార=రస వంతమైన, సారస=కమలముతో, సంకాశ=సమానమైన, చారు = మనోహరమైన వదన=ముఖముగలదానా.

తాత్పర్యము.

పద్మముఖీ! ఈ పర్వతమునం దెందుఁజూచినను నల్లగ నెఱ్ఱగఁ దెల్లగ నానా వర్ణములతో నూర్లకొలఁది చా పత్రాలున్నవి చూచితివా ?

తే. రేల నీరాలఁ దమడాలు•లీలఁ గ్రాల, వేలకొలఁది మహౌషధుల్•వెలయుచుండు
స్వప్రభాలక్ష్మి దెసలందు • వఱలు చుండఁ, గొండ నల్లెత శిఖశిఖా•కోటులనఁగ.
౨౧॥

రేలన్ = రాత్రులందు, ఈరాలన్ = పొదలయందు, ఈరములు=ఈరాలు, "ఈరాలఁ బోరాదు హేరాళము జవాది యీరాల నడుచక్కినేగవలయు" వసు.

తమడాలు=తమకాంతి, లీలన్=విలాసముగా, గ్రాలన్ = ప్రకాశింపఁగా, మహౌషధుల్=గొప్పమందుతీఁగలు, స్వప్రభాలక్ష్మి=తమకాంతిసంపద, దెసలందు=దిక్కులయందు, వఱలుచుండన్=ప్రకాశించుచుండ, శిఖశిఖాకోటులు=అనేకములైన యగ్నిజ్వాలలు, జ్యోతిష్మతీలతలుకొన్ని రాత్రులందు నగ్నిజ్వాలలవలెఁ బ్రకాశించును.

తా త్ప ర్య ము.

రాత్రులం దీపౌదలందు నగ్నిజ్వాలలవలెఁ దమకాంతి నాలుగుదిక్కులందుఁ బ్రకాశింపఁగా వేలకొలఁది యోషధు లీపర్వతమునందుఁ బ్రకాశించుచున్నవి.

కం. కొన్నిగృహంబులడంబునఁ, గొన్నియు నెలతోఁటలట్లు • కొండొకచోటన్
జెన్నారు నేకశిల లై, కన్నులపండువుగఁ జూడు • తన్మోధరతలముల్. ౨౧౨౨

గృహంబులడంబునన్=ఇండ్లవలె, ఎలతోఁటలు=లేఁదోఁటలు, ఉద్యానవనములు, 'ఎల' యనుపదియే వర్ణవ్యత్యయమై సంధిగలిసి 'లే' యయ్యెను. ఎల=లవె=లే- ఎలసిరు- ఎలప్రాయము. మొ. ఏకశిల = ఒక్కరకమురాయి, ఒకబండ, తన్మోధరతలముల్=కొండప్రదేశములు.

తా త్ప ర్య ము.

ఈ పర్వతప్రదేశమున గుహలు కొన్ని యిండ్లవలెనున్నవి. కొన్నిచోటుల నుద్యానవనములవలె నున్నవి. కొన్నిచోటుల విశాలముగ నొకబండగానే యున్నవి. ఇవన్నియు నెంతవినోదముగ నున్నవో చూడుము.

తే. భూమిఁ జెకలించుకొనివచ్చు • పోల్కిఁ జిత్రకూట మొప్పారెఁ బున్నాగ • కుష్ఠభూర్జ
పత్రములుదీఁదఁ బరచుదు • ప్పటులుగాఁగఁ, గాముకులతమ్మిపాన్పులు • గ్రాలెనవిగో. ౨౧౨౩

పున్నాగ=పున్నాగవృక్షములు, కుష్ఠ = చెంగల్వకోష్ఠు, భూర్జపత్రములు = భుజపత్రి, ఇప్పుడు కాగిదములవలెఁ దాటియాకులవలెఁ బూర్వ మీయాకులు వ్రాఁతకై యుపయోగించుచుండువారు. ఆకారణముచేతనే కాగిదములకుఁ బత్రములను పేరు పోలేదు అసలు తిరుగవేసినాఁడనియు వాడుకయందుఁ గలదు. తమ్మిపాన్పులు=తామరపూల పఱుపులు.

తా త్ప ర్య ము.

చిత్రకూటము భూమిని జెకలించుకొని వచ్చినట్లున్నది. చూడుమా! పున్నాగములు, చెంగల్వకోష్ఠులు, భుజపత్రములు వీనియాకులు దుప్పటులువలెనై కాముకులు పండుకొను తామరపూలపఱుపులు ప్రకాశించుచున్నవి చూడుమా.

తే. కాముకుల మేనిరాపులఁ • గందినలఁగి, యున్న తామరదండల • నొప్పఁ గనుమి
వారు బహువిధఫలముల • నారగించి, వితతనంబుల మొట్టెల • విడిచినారు. ౨౧౨౪

తా త్ప ర్య ము.

కాముకీ కాముకులు సంభోగించు సమయంబున వారిదేహములు రాచుకొను

టచే వాడి వలఁగియున్న తామరపూలదండల విధముఁజూడుము! వారనేకవిధము లైన పండ్లనుదిని విత్తనములను మొక్కలను వదలిపెట్టినారు.

తే. వివిధమూలఫలోదక•విశ్రుతంబు. చిత్రకూటంబు చెలువారు • చెన్ను గనితె
నళిని వస్వౌకసారయుం•దమునురమణి!, యుత్తరకురూర్వ్యలను మించి•యున్నదార. ౨౧౬౦

వివిధ=అనేకవిధములయిన, మూల=వేళ్ళచేతను, ఫల=పండ్లచేతను, ఉదక= జలముచేతను, విశ్రుతంబు = ప్రసిద్ధికెక్కినది, నళిని = (1) మానససరస్సు- (2) సౌగంధికాఖ్య సరస్సు- వస్వౌకసార = అలకాచ మహేంద్రస్య నగరీ వస్వౌకసారా స్యాత్. నానా. ర. వస్వౌకసారా శక్రస్య, పూర్వస్యాం దిశి సంస్థితా యని విష్ణు పురాణము. "పురీవస్వౌకసారాస్యా ద్విమానం పుష్పకోస్త్రియామ్" యాదవ నిఘంటు. ఉత్తర కురూర్వ్యలను = ఉత్తర కురుభూములను, ఇవి హిమాలయమున కుత్తరమున నుండునవి. ఇవి పూర్వము చాలరమ్యముగా నుండినట్లు గ్రంథముల వలనఁ దెలియవచ్చెడిని. తా త్ప ర్య ము.

అనేకవిధములయిన వ్రేళ్ళకు. పండ్లకు, జలమునకుఁ బ్రసిద్ధమైన యీచిత్ర కూటము నందమును జూడుము. ఇది మానససరస్సును, సౌగంధికమును, ఇంద్రకుబే రుల పట్టణములను, ఉత్తర కురుభూములను మించియున్నది.

కం. వనవాసకాల మెల్లను, వనితా! లక్ష్మణుఁడు నీవు • వరమతిఁ గొలువన్
గొనబుగ నిచ్చటఁ బుచ్చుచుఁ, జనువాఁడను బిదప రాజ్య•సంపదఁ బూనన్. ౨౧౬౧

వనవాసకాలము = (1) వనవాసము చేయవలయునని మనము నిశ్చయించు కొనిన కాలము పదునాలుగు సంవత్సరములు. (2) వనమువంటి యీప్రపంచమందు మనము నిలువఁదలఁచిన కాలము. వరమతిన్ = మంచిమనస్సుతో, గొనబుగన్=అంద ముగ, పిదపఁజనువాఁడను=వచ్చినకార్యము ముగిసినతరువాత- (1) అయోధ్యకు (2) పరమపదమునకు. తా త్ప ర్య ము.

ఇంతీ! నీవు లక్ష్మణుఁడు నిండుమనస్సుతో సేవింపఁగా వనవాసకాలమంతయు నిందే కడపి వచ్చినకార్యము ముగిసినపిమ్మట మరలఁ బురమునకు రాజ్యభారము వహింపఁ బోయెదను.

—• ౯౫-వ సర్గము. శ్రీరాముఁడు సీతకు మందాకినీనది వర్ణించి చెప్పుట •—

కం. అని గిరిని దాటి మందాకినిఁ జూపి విచిత్రపులిన•కీర్తితఁ జారు
స్వనసారసహంసాన్వితఁ, గవకనళినలసితనదిని • గాంచితె ముదితా! ౨౧౬౨

ఇంతవఱకుఁ బర్వతమును జూపి వర్ణించి యిఁక నదిని జూపివర్ణించుచున్నాఁడు.

విచిత్రపులినకీర్తిత=ఆశ్చర్యకరమైన యిసుకదిబ్బలచేఁ గీర్తింపఁబడినది, చారు స్వన=ఇంపైన ధ్వనిగల, సారస=బెగ్గురులతోను, హంస=హంసలతోను, అన్విత =

కూడినది, కనకనలినలసిత = బంగారు కమలములచేఁ బ్రకాశించునది, ముదితాయని సంబోధించుటచే సీతయు నదినిఁజూచి సంతోషించెనని యూహించునది.

ఇందలి వర్ణనముచే గొప్పపిఱుఁదులును (పులినము) శబ్దించు నూపురాది భూషణములును, అందములగు కర పాద నయన ముఖాది యవయవములు గల నీవలె నున్నదని యలంకారధ్వని.

తా త్ప ర్య ము.

అని పర్వతమునుదాఁటి మందాకినీనదిని జూపి యాశ్చర్యకరములైన యిసుక దిబ్బలచేతఁ గీర్తింపఁబడినదియు మనోహరమైన ధ్వనిగల బెగ్గురు హంస పక్షులతోను గూడినదియు బంగారుకమలములచేఁ బ్రకాశించునదియునగు నదిని జూచితివా!

కం. చారుతరపుష్ప ఫలసం, భారంబులచేత వెలుఁగు♦పలు తెగ లగునా
తీరభవభూజములను గు. బేరసరసియట్లు వెలసెఁ ♦ బ్రేయసి నదియున్. ౯౫-౩

చారుతర=మిగుల మనోహరములయిన, పుష్పఫలసంభారములచేతన్ =పూల పండ్లయతిశయముచే, తీరభవ=తీరములందుఁబుట్టిన, భూజములన్=చెట్లచే, కుబేర సరసి=సౌగంధికము, ప్రేయసి=ప్రియురాలా.

తా త్ప ర్య ము.

ప్రియురాలా! యందములయిన పూలపండ్ల యతిశయముచేతఁ బ్రకాశించు ననేకవిధములై యొడ్డులందుఁబుట్టిన చెట్లచేఁ గుబేరుని కొలనివలె నదియుఁ బ్రకాశించుచున్నది.

కం. జంతువులు నీరు ద్రావెను, గాంతా! యచ్చోటఁ గంటె ♦ గలుషిత మయ్యున్
గాంతంబై జల మమరెను, వింతబెడం గగుచు మదికి♦వేడ్క ఘటిల్లన్. ౯౫-౪

తా త్ప ర్య ము.

అచ్చట జంతువులు నీళ్లుద్రావెను. ఆచోట నీళ్లు కలసిపోయి యెఱ్ఱగా నున్నను జూచుటకు మనోహరమై క్రొత్తసొగసు కలదై మదికి సంతోషము గలిగించుచున్నది. అందగత్తెలు సొగసులు చేసికొనక యున్నను నదియొక సొగసుగానే కానవచ్చును. అభిజ్ఞానశాకుంతలము.

ఉ. కాలము దప్పకుండ ఋషి♦కాండము లందు జటాజినంబులం
దాలిచి దోఁగుచుండెడిని ♦ దారుణనిష్ఠలు కొంద ఱల్లదే
బాలిక! యూర్ధ్వబాహువులు ♦ భాస్కరుఁ గొల్చెద; రందుఁ గంటె వా
తూలచలద్గిరీంద్రగములఁ ♦ దూల సుమాళి నటించెఁ గొండయున్. ౯౫-౫

కాలము తప్పకుండఁగన్ = ఏవేళకు స్నానము చేయవలయునో యావేళకు సరిగ, ఋషికాండములు=ఋషుల సమూహములు, "బాణావసర గ్రంథి స్తంభరహో వాజవారి వర్గేషు, స్కంధే భూరుహాణాం గర్వే నాళే బలేచకాండోఒస్త్రీ" జటాజినంబులన్=జడలను జింకచర్మములను, దోఁగుచుండెడిని=స్నానముచేయుచుం

దును, దారుణనిష్ఠులు=తీవ్రమైననిష్ఠగలవారు, ఊర్ధ్వబాహులు = చేతులు మీఁది కెత్తినవారు, వాతూల = గాలిచే, చలత్ =కదలుచున్న, ద్రుమాగ్రములన్ = చెట్ల కొనలయందు సుమాళి = పూలగుంపు, తూలన్ = రాలఁగా, నటించెన్ = నాట్యమాడెను.

## తాత్పర్యము.

వేళవేళకు సరిగా ఋషులు జడలు జింకచర్మములు ధరించినవారై స్నానము చేయుచుందురు. తీవ్రనిష్ఠగలవారదిగోఁ జేతులు మీఁదికెత్తి సూర్యునకు నమస్కరించుచున్నారు. ఈవర్ణనముచే మాధ్యాహ్నిక సంధ్యావందన సమయమయ్యెనని తోఁచెడి, అదిగోఁ జేతులెత్తి సుమాంజలిచల్లి నృత్యముచేయు నటునివలెఁ గొండయుఁ జలించు చెట్లకొమ్మలనుండి పూలురాలఁగా నటించుచున్నట్లున్నది.

సీ. ఒకచోట జలవాటి ♦ యుత్తమముక్తాఫ.లాభికాంతి నెసంగె ♦ హారిగాత్రి
రొక్కక్రేవ హితభావ ♦ ప్రకటమనోజ్ఞసై,కతరాజి బాజిల్లెఁ ♦ దతవితంబ
రొకవంక మధుపాంక♦మకరాంకశరవార, మయ్యాల లూఁగెడి ♦ నుత్పలాక్షి
రొక్కప్రక్కఁ దమి నిక్క ♦ నువిద సిద్ధజనాళి, వయ్యాళి తిరిగెడి ♦ వనజపాణి

తే. గాలికిని బూలు తటముల ♦ రాలఁ గొన్ని
జలములను దేలెడిని గొన్ని♦జలదవేణి !
వల్లువచనంబులను జక్ర♦వాకలతులు
చక్రికుచ ! కుసుమంబుల♦శయ్యలెక్క. ౨౧౬

హారిగాత్రి = మనోహరమైన శరీరముగలదానా, జలవాటి = జలప్రదేశము, ఉత్తమముక్తాఫలాభికాంతిన్=మంచిజాతి ముత్తెములకాంతితో, ఎసంగెన్ = అతిశయించెను. నీదేహమందలి లావణ్యమువలె నీనదియందు మంచిముత్యముల కాంతి యతిశయించినది. మంచి ముత్యముల కాంతివంటికాంతి దేహమునం దుండెనేని దానికి లావణ్యమనిపేరు. తతనితంబ=విస్తరించిన పిఱుఁదులుగలదానా, ఒక్కక్రేవన్ =ఒకప్రక్క, హితభావ=మనస్సునకుసరిపోవు విలాసముచే, ప్రకట = స్పష్టముగాఁ దెలియవచ్చు. మనోజ్ఞ = సుందరమైన, సైకతరాజి = ఇసుకదిన్నెల సమూహము, నీయందలి నితంబములవలెనే యేటియందు నిసుకదిన్నెలున్నవి. ఉత్పలాక్షి = కలువలవంటి కన్నులుగలదానా, ఒకవంకన్=ఒకపార్శ్వమున, మధుప+అంక = తుమ్మెదలు చిహ్నముగాఁగల, మకరాంక=మన్మథునియొక్క, శరవారము = బాణముల సమూహము– "అరవిందమశోకంచ చూతంచ నవమల్లికా, నీలోత్పలంచ, పంచైతే పంచబాణస్యసాయకా" యన్నట్లు, నల్లకలువలు మన్మథుని బాణములే, కలువలవంటి కన్నులు వానియందుఁ దుమ్మెదలవంటి చూపులు నీయందెట్లున్నవో యట్లే నదియందు నొకచోటఁ దుమ్మెదలు చిహ్నములుగాఁగల నల్లకలువలగుంపులుయ్యాల లూఁగుచున్నవి.

వనజపాణి = చేతియందుఁ గమలముగలదానా, తమినికన్ = స్నానమందలి కోరిక యతిశయింపఁగా, సిద్ధజనాళి=సిద్ధులగుంపు, వయ్యాళి = వాహ్యాళికబ్బిభవము, ఒయ్యారముగాఁ దిరుగుట, వనజము=నీటియందుఁబుట్టినది కమలము దానిని చేతి యందుఁగలది, వనజపాణివినీవు, వీరునీటియందు స్నానముచేయు నభిలాషగలవారు, ఈసిద్ధులు నీచేతిలోనివారని భావము. జలదవేణి = మేఘమువంటి నల్లని జడగల దానా, తటములన్=గట్లయందు, మేఘము వర్షించునపుడు కొన్నిబిందువులు నేల మీఁదఁ గొన్నినీళ్ళమీఁద రాలినట్లు గాలికిఁ గొన్నిపూలు గట్లులందును రాలఁ గొన్ని నీళ్ళయందును దేలుచున్నవి; నీవు నల్లనిజడయందుఁ బూలు ధరించినపుడు జడమీఁదగొన్ని, ప్రక్కలందుఁగొన్ని యున్నట్లు చెట్లనుండి రాలినపూలు గొన్ని గట్లులయందుండఁగాఁ గొన్ని నీళ్ళయందుఁ దేలాడుచున్నవి. చక్రకుచ = జక్క వలవంటి స్తనములుగలదానా, వల్గువచనంబులను=మనోహరములైన మాటలచేఁ చక్రవాకతతులు=చక్రవాకపక్షుల సమూహములు, కుసుమంబులశయ్యలు = పూల పానుపులు, వల్గువచనంబులు = రతికై యాహ్వానించు నింపైనపిలుపులుగను పూల పానుపులెక్కుట రతికాంక్షగను భావించునది.

తా త్ప ర్య ము.

ఓహరిగాత్రీ ! యీమందాకినీనది యొకచోట జలములు మంచి ముత్తెముల కాంతివంటి కాంతిగలదై యున్నది. ఓతతనితంబా ! యొకచోట నింపైన విలాసము గల యందమైన యిసుకదిబ్బలుగలదై యున్నది. మఱియొకచోట నీ నదియందుఁ దుమ్మెదలతోడఁ బూవు లుయ్యాల లూఁగుచున్నవి. ఒకప్రక్క సిద్ధులు వాహ్యాళి దిరుగుచున్నారు. గాలికి రాలినపూలు గొన్ని గట్లమీఁదఁ బడియుండఁ గొన్ని నీళ్ళలోఁ దేలుచున్నవి. మనోహరధ్వనులు చేయుచుఁ జక్రవాకములు పూలపానుపు లెక్కుచున్నవి.

కం. లలనా ! యీమందాకిని, నలువారెడిచిత్రకూట • నగముం గనినన్
చెలి ! నిన్నుఁ జూచుకంటెను నలపురమును గనుటకంటె • హర్షం బిడెడిన్. ౭౧౮

తా త్ప ర్య ము.

సీతా ! యీనదిని నీ పర్వతమును చూచినపుడు నిన్నుఁ జూచుటకంటె నయోధ్యను జూచుటకంటె సంతోషమగుచున్నది.

నాయందీయన యింతకామముగలవాఁడై యున్నాఁడే నేను రావణవధార్థమై లంకలోనుండుకాలములో నీయనయెట్లు నావియోగమును సహింపఁగలఁడు. అప్ప టికి వచ్చి రావణుఁ జంపఁగలఁడని సందేహింపకుము. అయోధ్యను విడిచియు నీపర్వ తమును జూచి యెట్లు దుఃఖపడకున్నానో యట్లులే నిన్ను స్మరించుటవలనఁ గలిగెడి

సంతోషముతో గడుపు దీటువలెను మనకార్యము దీటువలెను నిబ్బరించుకొనెదను. కావున నీవు విచారపడవలదని ధ్వని.

తే. దమశమాన్వితు లగుచును • దపముఁ జల్పు,ధూతకలుషులుసిద్ధులు•దోఁగుకతన
నిర్మలం బగుమందాకి•నీజలముల, జలకమాడుము ననుఁగూడి • తలిరుఁబోఁడి.
౨౧౬౮

తలిరుఁబోఁడి=చిగురువంటి దేహముగలదానా, దమము = బహిరింద్రియనిగ్రహము, శమము=అంతరింద్రియ నిగ్రహము, అన్వితులు+అగుచున్ = కలవారై, ధూతకలుషులు=ఎగురఁగొట్టఁబడిన పాపములుగలవారు, అగుసిద్ధులు = భగవంతుఁడె యుపాయోపేయములనియుండు సిద్ధసాధననిష్ఠులు, దోఁగుకతన్ = స్నానము చేసిన కారణమున, నిర్మలంబు = మలినరహితము, జలకమాడుము=స్నానముచేయుము, పరమభక్తులు ప్రపన్నులు స్నానము చేసినకారణమున వారితేజస్సు నీళ్ళలోఁ బ్రవేశించి నీళ్ళను బవిత్రములను జేసి తీర్థములఁ జేయుచున్నవి. తీర్థంబులను దీర్థములుగాఁ జేయువారుకదా భక్తులు, ప్రపన్నులు, "తీర్థీకుర్వంతి తీర్థాని" నా- భ- సూ.

తా త్ప ర్య ము.

బాహ్యేంద్రియ నిగ్రహము అంతరింద్రియ నిగ్రహము గలవారై తపము చేయు(భగవంతునియందు మనస్సైస్థైర్యము చేయుటచేఁ బాపరహితులై ఁ భక్తియోగ ప్రపత్తియోగ సిద్ధులు స్నానముచేసిన) కారణముచే నిర్మలమైన మందాకినీ జలమునందు నాతోడ జలక్రీడసలుపుము.

కం. చెలికో నాడెదువడువున, జలకేళులు నన్నుఁ గూడి • సలుపుము సీతన్
వెలిదమ్ములుఁ గెందమ్ములుఁ, గలికి! మునుఁగ నీదుసొబగుఁ • గని సిగ్గుల్జన్.
౨౧౬౯

వెలిదమ్ములు=తెల్లదామరలు, కెందమ్ములు = ఎఱ్ఱతామరలు, ధవళాక్షివగు నీ కన్నులను కమలపాణివగు నీయొక్క చేతులను జూచి యందమున మనము వీనికి సరిరామైతిమికదా యను సిగ్గున నీళ్ళలో మునుఁగఁగా నీవు నీ చెలికత్తెతో నాడెడిరీతిఁ జనవుగా నాతో జలక్రీడసలుపుము. అలంకారము. ఉత్ప్రేక్ష, చెలితో నాడెడు వడువునన్=స్త్రీలతో స్త్రీలాడుకొనునపుడు కామోద్రేకము గలుగదు, మనము బ్రహ్మచర్యవ్రతము పూనియున్నారము. కావున నన్ను నీవుభర్తగానెంచి కామమునకు లోపడకుము నన్ను నీ చెలికత్తెవలె నెంచుమని భావము.

తా త్ప ర్య ము.

తెల్లకమలములు, ఎఱ్ఱకమలములు నీ కన్నులను కరచరణములను జూచి సిగ్గుబడి తలలు వంచుకొనుటయొకాక స్తనజఘనముల ఘాతములవలనఁ గలిగిన యలల తాఁకున నీటిలో మునిఁగిపోవ నీవు నీ చెలికత్తెతో నాడునట్లు జంకులేని మనస్సుతో నాతో జలక్రీడ సలుపుము.

తే. వనమునంగల మృగములే • పౌరజనుల, వర్గముఁగను, నయోధ్యగాఁ•బర్వతంబు
జలజలోచన! యీనది•సరయువుగను, దలఁచి వర్తింపుమీ యిందు•నెలమిదనర. ౨౧౮౦

పౌరజనుల=అయోధ్యాపురవాసులైన మనుష్యుల, వర్గము = సమూహము, ఎలమి=సంతోషము.

తాత్పర్యము.

ఈ యడవిమృగములే యయోధ్యాపుర జనులనుకొమ్ము. పర్వతమే యయోధ్యయనుకొమ్ము, ఈమందాకినియే సరయు వనుకొనుము. ఈప్రకారము దలఁచి విచారములేక సంతోషముగ వర్తింపుము.

అయోధ్యాపురవాసులే యడవి మృగము లనుకొమ్ము. అయోధ్యయె పర్వతమనుకొమ్ము. సరయు వీనదియే యనుకొమ్ము. అట్లైన నీకు విచారములేక సంతోషముగ నుండఁగలవు.

పురజనులయం దుండు ప్రీతి యీయడవి మృగములం దుంచుము. అట్లే యయోధ్యయందలి ప్రీతి పర్వతము మీఁదను సరయువు నందుండు ప్రీతి మందాకిని యందు నుంచుము విచారముగలుగదు. సంతోషింతువు. "సుఖస్యదుఃఖస్య నకోపి దాతా" యన్నట్లు సుఖదుఃఖములకు మనస్సు కారణముగాని పదార్థములు కావుగదా.

కం. నామాటను జవదాటని,సౌమిత్రి భజింప, నీవు • జానకి! పతి నై
నామతి ననువర్తింపఁగ, నీమహి నింతకును సౌఖ్య • మితరము గలదే. ౨౧౮౧

జవదాటని=అతిక్రమింపని, నామతిననువర్తింపఁగన్ = నామనస్సుకనిపెట్టి చరింపఁగా. ఈమహిన్ = ఈభూలోకమందు, ఇంతకును=ఇంతకంటెను; ఈభూలోకమందుఁ దనమాటమీఱని తమ్ముఁడు తనమనస్సెఱిఁగి వర్తించు పతివ్రతయగు భార్య యుండెనేని యంతకెక్కుడుసుఖ మీలోకమున లేదు.

కం. ఇమ్మందాకిని మునుఁగుచు, మువ్వాళులను సమధుమూల•ములఁ దిని నీతో
సమ్మతి నుండెద నే రాజ్యమ్మైన నయోధ్యయైన • నభిలాషపడన్. ౨౧౮౨

మువ్వాళులు = మూఁడుమాఱులును, అచ్ఛద్విగువున కీకవచనంబు ప్రాయికంబు, సు. వ్యా. సమా. ౫౧ సూ. వానప్రస్థాశ్రమమున నుండువారు దినమునకు మూఁడుమార్లు స్నానము చేయవలయును సమధు=తేనెతోడి, మూలములను = వేరులను, రాజ్యమైన=ఆలోకమున వైకుంఠమైనను, ఈలోకమున నయోధ్యయైనను గోరను.

తాత్పర్యము

నీవు నన్నువిడనాడక యుంటివేని యీనదిలో మూఁడుమార్లు మునుఁగుచుఁ దేనెతోడఁ గందమూలములఁ దినుచు నీతోసంతోషముగఁ గాలము పుచ్చెదను. నా కారాజ్యమైనను వలదు. అయోధ్యయైన వలదు.

కం. కరటిఘటాశాలినియును, గరి కేసరికీశపీత•కమలయు సుమనో
భరవృతయు నగుసీనది. దరుణీ! యెవ్వనికి ముదము•దనరింప దొకో. ౨౧౭౩

కరటి ఘటాశాలినియు = ఏనుఁగులగుంపులచేఁ బ్రకాశించునది, కరికేసరికీశపీతకమలయు=ఏనుఁగులచేత, సింహములచేత, క్రోఁతులచేతఁ ద్రాగఁబడు జలములు గలది,సుమనోభరవృతయు=పూలభారముగల చెట్లుగలది, తనరింపదు=కలిగింపదు.

తాత్పర్యము.

ఏనుఁగులమందలచేఁ బ్రకాశించునదియు, నేనుఁగులు, సింహములు, క్రోఁతులేక కాలమున నొకచో నీళ్ళుత్రాగు రేవులు గలదియుఁ దీరమ్మునందుఁ బూలభారముచే వంగిన కొమ్మలుగల చెట్లుగలదియునగు నీనది తరుణీ! యెవనికి సంతోషమొసంగదు! ఎట్టివానికైనను మనస్సునకు సంతోషము గలిగించును.

౯౫-వ సర్గము.

కం. అని రామామణికిని నా,యినకులుఁడు సుసంగతోక్తి • నింపెసయఁగ నా
ధునిఁ జూపుచు శుభనయనాం,జననిభ మగుచిత్రకూట•సానువునందున్. ౨౧౭౪

రామామణికిని = స్త్రీరత్నమైన సీతకును, ఇనకులుఁడు = సూర్యవంశమునఁ బుట్టినవాఁడు సుసంగతోక్తిన్=ఒకదానితోనొకటి పొసఁగిన మాటలతో, ఇంపు=సంతోషము, ఎసయఁగాన్=కలుగఁగా, ధునిన్=నదిని, శుభనయనాంజననిభము = కంటికిమేలుగలిగించు కంటికాటుకతో సమానము, అగు సానువు=చఱియ.

తాత్పర్యము.

స్త్రీరత్నమైన సీతకు శ్రీరామచంద్రుఁడు మిగులఁ జొందికగల మాటలచే సంతోషము కలుగ నానదిని జూపుచు ఆకులచేనిండిన చెట్లచే నిండియుండుటచే నల్లనై కాటుకవన్నెగల చిత్రకూటపర్వతము చఱియయందు.

కం. ఇది పూతంబిది స్వాదువు, సుదతీ! యిది తప్త మనుచు • సొంపుగఁ బలమున్
మదవతికిఁ జూపుతఱి మిం, గదియఁగ నాదంబు రేణు•కాండం బెగసెన్. ౨౧౭౫

పూతంబు=పవిత్రము, స్వాదువు=తీపు, తప్తము = వండఁబడినది, బాగుగఁ బక్వము చేయఁబడినది, పలముస్=మాంసమును, మదవతికిన్ = మదముగలసీతకు, మిన్=ఆకాశము, కదియఁగన్=చేరునట్లు, నాదంబు = ధ్వని, రేణుకాండము = దుమ్ముసమూహము, వండినది వర్ధించినది సీతనైయుండ నామెకు నిది పూతము ఇది స్వాదువు అని చెప్పుటచేఁ దనయుచ్ఛిష్టము సీతకిచ్చెనని తోఁచెడిని-ఉచ్ఛిష్ట మనఁగా నోటిఎంగిలి గాదు. తినఁగా మిగిలినది.

తాత్పర్యము

ఇది పవిత్రమైనది, ఇది తియ్యనైనది, ఇది బాగుగఁబక్వమైనది. అని మాంసమును సీతకుఁజూపు సమయమున నాకాశము తగులునట్లు ధ్వనియు ధూళిసమూహమెగసెను.

శా. ఆనాదంబున నులికి తద్గహనస • త్త్వావళుల్ శకుంతాదులున్
నానాయూథములుం గలంగి దెసల • గ్గగ్గోలుగాఁ బాఱినన్
క్ష్మానాథుం డది గాంచి లక్ష్మణునితోఁ • గంటే ధరా రేణుసం
తానంబుల్ దివిఁ దాఁకె భీషణమహా • నాదంబు పెంపారెడిన్. ౨౧౭౬

ఉలికి=భయపడి. తత్=ఆ, గహన = అడవియందలి, సత్త్వావళుల్ = మృగసమూహములు, శకుంతాదులున్ = పక్షులు మొదలగునవి, నానాయూథములున్ = అనేకములయిన యేనుఁగులగుంపులు, కలంగి=కలఁతచెంది, దెసలన్=దిశలయందు, గగ్గోలుగన్=గందరగోళముగ, పాఱినన్=పరువెత్తఁగా, క్ష్మానాథుండు = శ్రీరాముఁడు, ధరారేణుసంతానంబుల్=నేలదుమ్ముసమూహములు, దివిన్ = ఆకాశమును, భీషణ=భయంకరమైన, మహానాదంబు=గొప్పధ్వని, పెంపారెడిన్=అతిశయించెడిని.

తాత్పర్యము.

ఆధ్వనికి భయపడి యాయడవియందలి జంతుసమూహములు పక్షులు మొదలయినవియును అనేకము లేనుఁగుగుంపులును గలఁతచెంది గందరగోళముగా దిక్కులవెంటఁ బరువెత్తఁగా శ్రీరామచంద్రుఁ డదిచూచి లక్ష్మణునితో నిట్లనియె లక్ష్మణా! నేలదుమ్ము గుంపు లాకాశముఁ దాఁకెను. భయంకరధ్వనియు నతిశయించుచున్నది.

కం. కరులో కాసరమో కే, సరి భీతిని మృగములో ది • శాంతములకు స
త్వరముగఁ బాఱెడి వేఁటకు, నరపతి యరుదెంచెనో, క • నన్ శ్వాపదమో. ౨౧౭౭

కరులో=యేనుఁగులో, కాసరమో=అడవిదున్నపోతో, కేసరిభీతిని=సింహమువలని భయమున, దిశాంతములకున్=దిక్కులకొనలకు. సత్వరముగన్ = త్వరతోఁ గూడినట్లుగ, శ్వాపదమో=క్రూరమృగమో.

ఈపద్యమున రెండవపాదంబున నఖండయతి.

తాత్పర్యము.

ఏనుఁగులో యడవిదున్నపోతో సింహమునకు భయపడిన మృగములో దిక్కులకొనలకుఁ దొందరగాఁ బరువెత్తుచున్నవి. దీనికిఁ గారణము రాజెవఁడైన వేఁటకై వచ్చెనా ? లేక ఘాతుకమృగమేదైన నడవిలోనికి వచ్చినదా ?

చం. కనుఁగొన నొక్కపిట్టయినఁ • గానఁగ రా దిట, దీనితత్త్వమున్
గనుఁగొని రమ్ము టన్నఁ జని • గ్రక్కునఁ బుష్పితసాల మెక్కి తూ
ర్పును గని వెండి యుత్తరముఁ • బోలిచి చూడఁగ నందు ఘోరమై
తనదెస వచ్చుచున్న యొక • దారుణసైన్యముఁ గాంచె దవ్వులన్. ౨౧౭౮

పిట్ట+అయిన = చిన్నపక్షియైనను, తత్త్వమున్ = యథార్థవిషయమును, పుష్పితసాలము=పూచినచెట్టును, ఘోరమై=భయంకరమై, తనదెస = తానుండు దిస=వైపు, దారుణసైన్యము=భయంకరసేన, దవ్వులన్=దూరపుదేశమందు.

తా త్ప ర్య ము.

చూడఁగా నిచ్చట నొకచిన్నపక్షియైనను గానరాక యెక్కడికో పోయినవి దీనివాస్తవ కారణమేమో చూచిరమ్మనినఁ దీవరముగఁబోయి పూచిన చెట్టొకటి యెక్కి తూర్పునుగని యాప్రక్కనేమియుఁ గానరాకుండుటచే నుత్తరము పాలించి చూడఁగా నందు భయంకరమై తనవైపునకే వచ్చుచున్న భయంకర సైన్యమును దూరమునందే చూచెను.

చం. ఘనరథనాగవాజిభట • కాండవిరాజితభూరివాహినిన్
గని, యట నుండి రాముఁ గని • గ్రక్కున నార్పుము వహ్ని, నీశరా
సనమును నెక్కు పెట్టుమిఁక • జానకినిన్ గుహ నుండఁ బంపుమీ,
మునుకొని తాల్పుమీ కవచ • ముం, బెను మోసము వచ్చెనన్న యా! ౪౧౭౯

గొప్పవియగురథ=రథములచేతను, నాగ=ఏనుఁగులచేతను, వాజి=గుఱ్ఱములచేతను, భటకాండ = భటులసమూహముచేతను. విరాజిత=ప్రకాశించు, భూరి = గొప్పదియగు, వాహినిన్=సేనను, గ్రక్కునన్=శీఘ్రముగ, వహ్నిన్ = నిప్పుండి పొగరాఁజిన మనముండుచాయ దెలియును, భరతునిసైనికులు చూచిన దీపొగయే, శరాసనమును=వింటిని, మునుకొని=ముందుగ, పెను=పెద్ద.

తా త్ప ర్య ము.

గొప్పరథములు నేనుఁగులు భటసమూహము వీనిచేఁ బ్రకాశించు గొప్ప సేననిజూచి యచ్చటనుండియే శ్రీరామునిజూచి, యన్నయ్యా! వెంటనే నిప్పు నార్పుము, పొగలేవనీకుము. నీవిల్లెక్కుపెట్టుము, ఇఁక జానకిని గుహాలోనికిఁబంపుము. ముందుగఁ గవచముండొడఁగుము. అన్నా! పెద్దగండము వచ్చెను.

—• లక్ష్మణుండు శ్రీరామునితో భరతుండు సేనతో వచ్చుట దెలుపుట •—

కం. అనవుడు లక్ష్మణుతో నోయనఘా! కనుఁగొమ్మ లెస్స • యీవాహిని యె
వ్వనిదో నావుడు సైన్యముఁ, గనుఁగవనె దహించు నట్లు • కని మండి యనెన్. ౪౧౮౦

కనుఁగవనె=రెండుకన్నులతోనే, మండి=కోపముచేఁ బ్రజ్వలించి.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా శ్రీరామచంద్రుఁడు లక్ష్మణునితో లక్ష్మణా! యీసైన్యమెవ నిదో చక్కఁగాఁ జూడుమనఁగా నాయనయుఁ గంటి దృష్టులచేతనే యీసైన్యము నంతయుఁ దహించువానివలె మండిపడి యిట్లనెను.

చం. ఘనతరరాజ్యసంపదలు • గైకొని తా నభిషిక్తుఁడై పురిన్
మనల వధింప వచ్చెను జ • మా భరతుం డలకైకపట్టి, యీ
ఘనరథమందు నుద్గతప • తాకాండము గ్రాలెడిఁ గోవిదార కే
తన మదె చూడవన్న! మదిఁ • దక్కుము సందియ మాతఁడే చుమా. ౪౧౮౧

కైకకుమారుఁడు=భరతుఁడు, (అనఁగాఁ దల్లివంటికుమారుఁడేభరతుఁడు అని కైకగుణము జ్ఞప్తికిఁ దెచ్చుటకై చెప్పినమాట) ఘనతరరాజ్యసంపదలు=మిగుల గొప్పదైన రాజ్యముయొక్క యైశ్వర్యములు, కైకొని=గ్రహించి, అభిషిక్తుఁడై = అభిషేకము నొందినవాఁడై, ఉద్గతప్రకాండము=ఎత్తైనబోదె, అనఁగా నట్లుత్రాయఁ బడినదని భావము. కోవిదార కేతనము=కోవిదారధ్వజము.

## తా త్ప ర్య ము.

కైకకొడుకు భరతుఁడు గొప్పరాజ్యసంపదలు గ్రహించి యయోధ్యయందుఁ బట్టాభిషేకము నొందినవాఁడై శత్రుశేష ముండనీయరాదను తలంపుతో మనలఁ జంపవచ్చుచున్నాఁడు. నీకెట్లు తెలిసెనందువా ! ఎత్తైనబోదెగల కోవిదారకేతనము ప్రకాశించుచున్నది, అదిగోఁజూడుము; సందేహములేదు. భరతుఁడేసుమా.

ఉ. రౌతులు మావటీంద్రు లెస • గా నిటఁ జొచ్చిరి తాల్చి యాయుధ
వ్రాతము నశ్వనాగముల • పై వడిగా, మన మిప్డు చాపముల్
శాతశరంబులం గొనుచు • తన్మాధర మెక్కుటొ యింద యుండుటో
నీతలఁ పేది ? చిక్కెడిని • నేఁ డనిలో భరతుండు భూపతి. ౨౧౪

రౌతులు=గుఱ్ఱములనెక్కువారు, మావటీంద్రు = ఏనుఁగులఁ దోలువారు, ఇటన్=ఇచ్చటికి, రాఁజొచ్చిరి, ఆయుధవ్రాతము=ఆయుధములసమూహము, అశ్వనాగములపై=గుఱ్ఱముల యేనుఁగులమీఁదను, శాతశరంబులన్ = పదునైనబాణములు, అనిలోన్=యుద్ధమందు, చిక్కెడిని=వశపడును, తన్మాధరము=పర్వతము.

## తా త్ప ర్య ము.

రౌతులు మావటీలు త్వరగా మనవైపుగనే యాయుధములు ధరించి గుఱ్ఱముల నేనుఁగులనెక్కి త్వరగా వచ్చుచున్నారు. ఇప్పుడు మనము పదునైన బాణములు వింట్లుతీసికొని కొండయెక్కవలెనా ? ఇందేయుండవలెనా ? నీయాలోచనయేమి ! నేటియుద్ధములో భరతుఁడు చిక్కును.

ఉ. నీకును నాకు సీతకును • నిష్ఠురకష్టముఁ గూర్చి, శాశ్వత
శ్రీకి నినుం దొలంచె, మఱి • కేర్చునికారవిధంబు నట్టియా
కైకతనూజుఁ డారిపుఁడు • క్రమ్మఱఁ బైపడి వచ్చెఁ గంటివే
భీకరబాణపాతముల • బీరము నీ టొనరించి త్రుంచెదన్. ౨౧౫

నిష్ఠురకష్టము = పరుషమైనకష్టము, శాశ్వతశ్రీకిన్ = శాశ్వతమైనసంపద నుండి, పంచమ్యర్థమున షష్ఠి, తొలంచెన్=తొలఁగించెను, నికారవిధంబు = మోసవిధము, రిపుఁడు=శత్రువు, భీకరబాణపాతమున్ = భయంకరములయిన బాణముల రొక్కపడుటచేత, బీరము=వీర్యము, నీఱు=బూడిద, త్రుంచెదన్ = ఖండించెదను

తా త్ప ర్య ము

నీకును సీతకు నాకు నిటువంటి పరమమైన కష్టము కలిగించెను. నిన్ను శాశ్వతలక్ష్మినుండి తొలఁగించెను. మనసులోఁ దాను మంచివానివలె దూరమున నుండి తల్లిచే నింత మోసమును జేయించెను.

అట్టి కైకకొడుకు, తలచుట్టము తొలఁకపగలేదు. తల్లిశత్రువైనఁ గొడుకు మిత్రుఁడగునా ? కావున నాకారణముచేతనే విరోధి యూరఁజేసినదానితోఁ దృప్తి పడక యిక్కడికిని దళముకొనివచ్చెను చూచితివా ? భరతుఁ డెటువంటివాఁడో. కావున భయంకర బాణప్రయోగములచేత వానిపౌరుషము బూడిదచేసి ఖండించెదను.

చం. భరతునిఁ ద్రుంచుటందు నొక • పాపము లే దని నాకుఁ దోఁచె, దు
 శ్చరితుని మున్ను కీడులను • జల్పినవానిఁ బరిత్యజించినం
 దొరయ దధర్మ మందురు ఘ • నుల్, విను త్యక్తసుధర్ముఁ డీతఁ డా
 పరణిఁ జరించె, నీయలుచుఁ • జంపెద, నేలుము రాజ్య మంతయున్. ౨౧౮

నీకన్న నాకుఁ దమ్ముఁడు. అటువంటిభరతుని జంపెద ననెదవే, ఇదియేమి పాపము అనెదవా? దుశ్చరితున్ = చెడ్డనడవడికలవానిని, పరిత్యజించినన్ = వదలి నను, దొరయదు=కలుగదు, ఘనుల్=గొప్పవారు, త్యక్తసుధర్ముఁడు = వదలిన పెద్ద పిన్నధర్మముగలవాఁడు, ఆపరణిన్=తల్లిమూలమునఁ బెద్దవారిసంపద హరించిన యా విధముగా, అలుచున్=నీచుని.

• "యోహింసార్థమభిక్రాంతం హంతిమన్యు రేవ మన్యుః స్పృశతి న తస్మిన్‌దోష ఇతిపురాణే" అని యాపస్తంబులు. ఎవఁడు హింసించుటకై కత్తినిబూని వచ్చునో యట్టివానిని హింసించిన దోషములేదు వానిక్రోధమే వానిని జంపును.

తా త్ప ర్య ము.

భరతుని జంపినఁ బాపములేదని నాయభిప్రాయము. ఏలన : నిరపరాధిని జంపిన దోషముగాని పూర్వము తానై కీడుచేసినవానిని దండించిన బాపములేదని పెద్దలు చెప్పుదురు. ధర్మమునువదలి పీడావిధముగఁ జరించెను కావున నీచుని జంపెదను. రాజ్యమంతయు నీవే యేలుము

చం. తనతనయుండు మచ్ఛరవి • తానములన్ ధరఁగూల నేడ్చుచున్
 గనుఁగొనుఁగాక రాజ్యభర • కాముక కైకయి మత్తహస్తిభ
 గ్ననగమునట్లు, సానుచరఁ • గైక సబాంధవ నెండిఁ ద్రుంచు మే
 దినియు నపాస్తపాప యయి • తేజము నొందెడుఁ గాక నిత్యమున్. ౨౧౯

మచ్ఛరవితానములన్ = నాబాణసమూహములచే, రాజ్యభరకాముక = రాజ్యభారమునందుఁ గోరికగలది. మత్తహస్తిభగ్ననగమునట్లు = మదపుటేనుఁగుచే విఱువఁబడిన చెట్టువలె, సానుచర=అనుచరులతోఁ గూడినది, సబాంధవ = బంధువులతోఁ గూడినది, అపాస్తపాప=పాపమునుండి తొలఁగింపఁబడినది.

తాత్పర్యము

తనకొడుకు నాబాణములచే నేనుఁగువిఱిచిన చెట్టువలె నేలఁబడఁగా రాజ్యమనుభవింప నాశపెట్టుకొనిన కైక వాని నేడ్చుచుఁ జూచునుగాక పరిచారకులతోఁ గూడినవారై చుట్టముల సహాయముతోఁ దాను పైపడి విరోధించి వచ్చినా కైకను గూడఁ జంపెదను. అప్పుడు భూమి పాపహీనయై శాశ్వతముగఁ బ్రకాశించును.

కం. ఎండినపొదరులమీఁదఁ బ్ర, చండహుతాశనునియట్ల • నసత్కారభవో
ద్దండక్రోధము శాత్రవ, కాండంబులమీఁద విడుతుఁ • గాకుత్స్థవరా! ౨౧౮౬

పొదరులమీఁదన్ = పొదలమీఁద ప్రచండహుతాశనునియట్ల=తీక్ష్ణమైన యగ్నివలె, అసత్కార=అవమానమువలన, భవ=పుట్టిన, ఉద్దండ = అధికమయిన, క్రోధము=కోపము, శాత్రవకాండంబులమీఁదన్ = శత్రుసమూహముమీఁద.

తాత్పర్యము.

ఎండిన పొదలమీఁదఁ దీక్ష్ణమైన దావానలమువచ్చి పడినట్టు లవమానము వలనఁ గలిగిన కోపమును శత్రుసమూహములమీఁద విడిచిపెట్టెదను.

తే. చించి చెండాడి శాత్రవ • సేన నెల్ల, ఘోరసునిశితనారాచ • కోటిఁ బరపి
చిత్రకూటంబురక్తపి • శితసుసిక్త, ముగనుగావింతునేనిప్డు • జగముమెచ్చ. ౨౧౮౭

చెండాడి=చెండుతోనాడినట్లాడి, ఘోర = భయంకరమైన,సునిశిత=మిగులఁ బదునైన, నారాచకోటిన్=బాణసమూహములను, పరపి = ప్రయోగించి, రక్త = నెత్తుటిచేతను, పిశిత=మాంసముచేతను, సుసిక్తముగన్=బాగుగఁ దడిసినదానిఁగ, నేను గావింతును.

నేను=ఇదివఱకు నీతోడవచ్చి శంబరసుతాదులతో యుద్ధము చేసినపుడెట్లు జయము కలుగఁజేసితినో నీవెఱుఁగవా? అట్లే నేనిపుడు చేసెదను. అప్పుడు లోకము మెచ్చినట్లిపుడు మెచ్చును. 'నశత్రుర్వశమాపన్నో మోక్తవ్యో వధ్యతాంగతః' భార. ౫-౩౮-౨౫. చంపఁదగినశత్రువు వశపడినపుడు విడువరాదు.

తాత్పర్యము

భయంకరమైన పదునైన బాణసమూహములను బ్రయోగించి విరోధిసేన నంతయును జించి తూంటుముకలను చెండువలెనాడి లోకము మెచ్చునట్లు చిత్రకూటమును రక్తమాంసములతోఁ దడిసినదానిఁ జేసెదను.

తే. శరవినిర్భిన్నహృదయకుం • జరతురంగ,మానవకళేబరముల న • నూనమోద
మునను దినుఁగాక శ్వాపద • ములును నిట్లు, చాపశరములకు నాకు ని • జముగు వాఁడ. ౨౧౮౮

శరవినిర్భిన్న = బాణములచే భేదింపఁబడిన, హృదయ=గుండెలుగల, కుంజర= ఏనుఁగులయు, తురంగ=గుఱ్ఱములయు మానవ = మనుష్యులయు, కళేబరములను= దేహములను, కళే+అవరము=కళేవరము కళేబరము వబలకభేదము కావున. కళా

విహీనమైనది అనూనమోదమునను=కొఱఁతలేని సంతోషముతో, శ్వాపదములు =మాంసమునుదిను క్రూరమృగములు, చాపశరబుణముక్తిని = విల్లు బాణముల యప్పు దీర్పుటను. తా త్ప ర్య ము.

బాణముచే భేదింపఁబడిన గుండెలుగల యేనుఁగులయు గుఱ్ఱములయు మను ష్యులయు దేహములను మాంసము దిను జంతువులు కడువార భోజనము దొరికెనను నిండు సంతోషముతోఁ దినని, ఈప్రకార మూరకమోచి తిరుగు విల్లుబాణముల యప్పును దీర్చెదను. అతిస్నేహము పాపశంకి యనున్యాయము ననుసరించి రామ చంద్రునియందలి ప్రేమాతిశయముచే నాయనకుఁ గీడు రాఁగలదని వెఱచి లక్ష్మణుఁ డిట్లు చెప్పెను.

—•౯౭-వ సర్గము. భరతునిపైఁ గినిసినలక్ష్మణుని శ్రీరాముఁడు శాంతిపఱుచుట•—

చం. అనుచును గ్రోధమూర్ఛితుఁడు • నై రణయత్నము సేయు చున్న ల
క్ష్మణుఁ బరిసాంత్వనోక్తులను • శాంతిపడంగ వచించు రాముఁడున్
బని గలదే సుమిత్రసుత • బాణముచే నసిచేత వింటిచే
తను గురుచాపుఁడున్ సుమతి • తానుగ రా భరతుండు సోదరా! ౨౧౮౯

క్రోధమూర్ఛితుఁడు=కోపముచే దేహము తెలియనివాఁడు, పరిసాంత్వనోక్తు లను=ఊరార్పుమాటలచే, అసిచేత=ఖడ్గముచేత. గురుచాపుఁడున్ = గొప్పవిల్లుగల వాఁడు, అనుటచే నీ వెంతబలవంతుఁడవో భరతుఁడు నంతబలవంతుఁడే కావున నీ వనుకొన్నట్లు నీకు సులభసాధ్యుఁడు కాఁడనుట. సుమతి = మంచి మనస్సుగల వాఁడు, బలముగలదని గర్వించి యితరులకు నిష్కారణముగ నీవలె బాధగలిగింపఁ దలఁచువాఁడుకాఁడని భావము సోదరా=నీవు నాకెట్టి తమ్ముఁడవో వాఁడు నాకట్టి తమ్ముఁడే, సుమిత్రసుత = భరతుఁడు కైకకొడుకగుటచే దుర్మార్గుఁడయ్యెనేని నీవు సుమిత్రకొడుకవే నీవేల యిట్టి క్రౌర్యమునకుఁ బాలుపడితివి. భరతుఁడు సవతితల్లి కొడుకగుటచే ద్వేష్యుఁడేని నీవుమాత్రము గావా. సోదరా = సవతితల్లికొడుకను భేదబుద్ధి మీకుండిన నుండని నాకు మీరందఱు సోదరులే స+ఉదర=సోదర = ఒకకడుపునఁ బుట్టినవారమే. సమానోదరులమే.

తా త్ప ర్య ము

ఈప్రకారము చెప్పుచుఁ గోపముచే దేహము తెలియక యుద్ధయత్నము చేయుచున్న లక్ష్మణుని నూరార్పుమాటలచేఁ గోపము చల్లారినవానిఁగాఁ జేయు నెంచి శ్రీరామచంద్రుఁ డిట్లనియె. సుమిత్రనందనా! గొప్ప విల్లు గలవాఁడును మంచి మనస్సుగలవాఁడును నగు భరతుఁడు తాను స్వయముగ వచ్చెనేని మనకు బాణముతో నేమిపని, కత్తిచే నేమిపని, వింటిచే నేమిపని.

చం. జనకునిసత్యమున్ నిలుప • సమ్ముఖమం దిట నన్నుఁ జూడ వ
చ్చినభరతున్ మనీషి గత•జీవితుఁ జేసియు లోకనిందలన్

గనుచు ధరాతలంబుఁ గొనఁ • గార్యము లక్ష్మణ యేమి చెప్పుమా !
మనమున నీకు నంతరుచి•మంతములే ధనమున్ మహామతీ !        ౨౧౦

జనకునిసత్యమున్ నిలుపన్ = తండ్రిచేసిన ప్రమాణమును నిలుపుటకు, తండ్రి తనకు రాజ్యమిచ్చెను గావున నాయనమాట కొనసాగింప రాజ్యభారము వహించెనుగాని తానుగాఁగోరి గాదనుట సమ్ముఖమందున్ = ప్రత్యక్షముగ, ఇటన్ = ఇచ్చట, మనీషిన్ = ఇంద్రియ నిగ్రహము గలవానిని, గతజీవితున్ = ప్రాణము పోయినవానిని, రుచిమంతములు=ఇంపైన రుచిగలవి, మహామతీ=గొప్పమనస్సుగలవాఁడా, సర్వసుఖములు వదలి నాసేవకై వచ్చినవాఁడవే; నీకీక్రోధము తగునా !

తా త్ప ర్య ము.

తండ్రిసత్యవాక్యమును బాలించుటకును నిచ్చట నన్నుజూచుటకును వచ్చిన బుద్ధిమంతుఁడు నింద్రియ నిగ్రహము గలవాఁడు నగు భరతుని జంపి లోకముచేఁ దండ్రి తనతమ్మునకిచ్చిన సామ్మతనిఁ జెందనీయని సోదరఘాతుకుఁడని నిందలపాలయి భూప్రభుత్వము సంపాదించిన లాభమేమి ? గొప్పమనస్సు గలవాఁడా ! నీకుఁ గూడ ధనమింతతీపా.

దీనివలన నపకీర్తివచ్చుకార్య మెంతలాభకరముగ నున్నను శేయరాదని సూచన. ఎంతవఱకు నపకీర్తి లోకమున నుండునో యంతవఱ కాపాపికి నరకావాసము తప్పదు.

అకీర్తిః కీర్త్యతేలోకే, యస్య భూతస్య కస్యచిత్
సపతత్యధమాం లోకా, న్యావచ్ఛబ్దః ప్రకీర్త్యతే ॥        భారతము.

ఉత్తరకాండమందు శ్రీరామచంద్రమూర్తి తమ్ములతోఁజెప్పిన ౯౫౪-౯౫౫ పద్యములఁ జూడుఁడు.

కం. హితబాంధవవర్గంబులు మృతిఁజెందిన వారిధనము • లేఁ గొన నొల్లన్;
మృతసప్తస్వము లే విషకృతభక్ష్యములట్లు చూచు•టీవెఱుఁగ వొకో.        ౨౧౧

హితబాంధవవర్గంబులు = హితులయు చుట్టములయు, సమూహంబులు. మృతసప్తస్వము=వచ్చినవారి పాడుద్రవ్యము, విషకృతభక్ష్యములట్లు = విషముతోఁ జేయఁబడిన యాహార పదార్థములవలె.

తా త్ప ర్య ము

యుద్ధమునందు భరతుని నీవు చంపితివనుకో. అతనిరాజ్యము నేను గ్రహింతునని తలంచితివా ? తండ్రి యతనికిచ్చినరాజ్య మతనిదిగాక మనదెట్లగును. హితులుగాని బంధువులుగాని మరణించిరేని వారిసొత్తు నేను గ్రహింప నిష్టపడను అది, మరణించినవారి పాడుసొత్తును విషముకలిసిన భక్ష్యములవలెఁ జూతును. ఈ నా మట్టిమును నీ వెఱుఁగవాయేమి? కావున నీవు భరతుని జంపినను నే నారాజ్యమాశింపను.

కం. భూమియు ధర్మంబర్థముఁ, గామముఁ గాంక్షింతు మీకుఁ•గా రాజ్యంబేన్
మీమేలునకే కోరెద, సౌమిత్రీ శస్త్రమంటి • శపథ మొనర్తున్. ౭-౫-౭

తా త్ప ర్య ము

భూమి-ధర్మము - అర్థము - కామము మీనిమిత్తము నేను గోరుచున్నాను గాని నేను వానివలన సుఖంపవలయునని కాదు. నాసుఖము నిమిత్తమై నేనేమియుఁ గోరుటలేదు. రాజ్యము కోరుటకూడ మీమేలుకోరియే. మీకేమైనఁ గీడుకలిగనేని నాకీరాజ్యమేల సుఖమేల? ఇది నానిజమైన యభిప్రాయమని నేను శస్త్రముఁదాఁకి ప్రమాణము చేసెదను.

ఇచ్చటి శ్రీరామచంద్రమూర్తి మాటలు యుద్ధరంగమందలి యర్జును మాటలతోఁ బోల్చునది.

ద్వి. భ. కృపలేక చుట్టాల నిచ్చటఁ జంప। గలుగు శుభంబేమి గానంగ లేను। గెలుపునేఁ గోర నీక్షితిఁ గోర సౌఖ్యములను నేఁగోర; నీభోగ రాజ్యములు। కలుగుటచే నేమి? కలదె ఫలంబు। బ్రతికియుఁ జెప్పుమా? రాజ్యభోగములు ప్రతత సుఖంబు లెవ్వారికై కోరఁ। బడియెనో వారలు ప్రాణముల్ ధనము। విడిచి నిల్చిరి యుద్ధపృథివి గోవింద।..........మిమ్ముఁ జంపినను నో మాధవా! వారినొల్ల నే జంప। దై త్రిలోక్యరాజ్య కారణముచేనైన। నేలచెప్పంగ మహీస్థలిమాట! "అటుగాన బంధు సమన్వితులగుచు। నిటయున్న వీరుల ధృతరాష్ట్రసుతులఁ జారిగొన నొల్ల॥ ఈచుట్ట ములఁ జంపి యేమెట్టులోక్కొ- యోచక్రహస్త! సుఖోన్నతిఁ గందు।

చం. జలధిపరీతభూవలయ•సంపద లేఁ గొన నా కసాధ్యమే॥
తలఁగి సధర్మమార్గమును • దమ్ముఁడ! శక్రత నేనిఁ గోర, ని
స్తులితగుణాఢ్యుఁడైన భర•తుండును నీవును నీదుతమ్ముఁడున్
బొలుపుగ లేనినాదుసుఖ•మున్ శిఖి నీఱుగఁ జేయుఁ గావుతన్. ౭-౮-౩

జలధిపరీత భూవలయ సంపదలు = సముద్రముచేఁ జుట్టఁబడిన భూచక్రమునందలి సంపదలు, సధర్మమార్గమును=ధర్మముతోఁగూడిన మార్గమును, తలఁగి=విడిచి, శక్రతన్=ఇంద్రత్వమును, నిస్తులితగుణాఢ్యుఁడు = అసమానమైన సద్గుణసంపత్తిగలవాఁడు, నీఱుగన్=భస్మముగ.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! నేను గోరితినేని సముద్రపర్యంతముఁగల భూచక్రమునందలి సంపదనంతయు గ్రహించుట నాకసాధ్యమని తలఁచితివా? అసమర్థుఁడనై యాశింపవాఁడఁగాను. ధర్మముతప్పిన మార్గము నింద్రత్వము లభించినను నాకువలదు. అసమాన సుగుణసంపదగల భరతుఁడు నీవు శత్రుఘ్నుఁడు చక్కఁగాలేని నాసుఖము నగ్నిహోత్రుఁడు భస్మముచేయుఁగాక (ఇందు సీతాదేవి పేర్కొనఁబడలేదు.)

సీ. భ్రాతృవత్సలుఁ డైన • భరతుండు నిజకుల, ధర్మ మెంచుచు నయోధ్యకును వచ్చి
నేను నీతో సీత • తో నారలను గట్టి, ప్రవ్రాజితుండ నై • వనికి రాక
యాలకించియు నాకుఁ • బ్రాణంబుకంటెను, బ్రియతరుం డౌట భా • వించి నీతి
నాకులితేంద్రియుం • డగుచు స్నేహాక్రాంత, హృదయంబునను జూడ • నేగుదెంచెఁ

ఆ. గాని యొండు గాదు • కైకపైఁ గోపించి, యప్రియంబు లాడి • యనఘుజనకు
కరుణ వడసి నాకుఁ • గ్రమ్మఱ రాజ్యంబు, నీయ వచ్చు వింటె • యింతనిజము.
౨౧౯౮

భరతుని రాకవిషయమైన నీ యభిప్రాయము సరిగాదని శ్రీరామచంద్రమూర్తి తన యభిప్రాయముఁ జెప్పుచున్నాఁడు. భ్రాతృవత్సలుఁడు=సోదరులయందుఁ బ్రేమ గలవాఁడు. నీవలె భ్రాతను హింసింపఁ దలఁపుగలవాఁడు కాఁడనుట. నిజకులధర్మ మెంచుచున్=తనవంశాచారమును తలంచుచు, ప్రవ్రాజితుఁడ నై= దేశభ్రష్టుఁడ నై, వనికిన్=అడవికి, రాక = వచ్చుట, ప్రియతరుండు = మిగులఁ బ్రియముగలవాఁడు, భావించి=ఆలోచించి, ఆకులేంద్రియుఁడగుచున్ = కలఁతచెందిన యింద్రియములు గలవాఁడై, స్నేహాక్రాంత హృదయంబునను = స్నేహముచే నాక్రమింపఁబడిన మనస్సుతో,

తాత్పర్యము.

భరతుఁడు మనమీఁదికి యుద్ధమునకు వచ్చుచున్నాఁడని తలఁచితివి. నీ యభిప్రాయము సరిగాదు. సోదర ప్రీతిగల భరతుఁ డయోధ్యకువచ్చి నేను నీతో సీతతో నారచీరలుగట్టి దేశభ్రష్టుఁడ నై యడవికి వచ్చినవార్తవిని తనవంశ ధర్మమగు జ్యేష్ఠానువర్తనము నాలోచించి నాకు నా ప్రాణముకంటెను మిగులఁ బ్రియుఁ డైన కారణమున వికలమైన మనస్సుగలవాఁడై స్నేహభావంబున నన్నుఁజూడ వచ్చుచున్నాఁడు గాని యితరమైన తలంపుతోఁ గాదు, ఇట్లు వచ్చువాఁడు నేనలనేల తేవలెఁ దానుమాత్రమువచ్చి చూచిపోరాదా! యందువేమో! కైకమీఁదఁ గోపించి యామెను దూషించి పాపరహితుఁ డైన తండ్రిదయ సంపాదించుకొని తనయభిప్రాయప్రకారము జరుప నాయన యంగీకారమును సంపాదించుకొని నాకు రాజ్యమిచ్చుటకై వచ్చుచున్నాఁడు. ఇదినిజము.

కం. భరతుండు మనలఁ జూడఁగ, నరుదెంచుట యోగ్యవిధమ • యగు, నతఁ డంతః
కరణంబున నేనియుఁ గీ, డరయఁడు మనయందు నీకు • నలుగం దగునే? ౨౧౯౯

తాత్పర్యము.

భరతుఁడు మనలఁ జూడవచ్చుట సరియైనకార్యము. రాకుండినఁ దప్పు. అతఁడు మనకుఁ గీడుకలుగవలయునని మనసునందైనఁ గోరఁడు. నీవు వానిపైఁ గోపింపఁ దగునా?

చం. వినుతగుణాఢ్య నీకు నొక • విప్రియ మెన్నఁడు సల్పె నయ్య యా
యనఘుఁడు? నేఁడు నేరకు భ • యంపడ నేటికి? నిట్టిమాట లే

ననియెనె ? సందియంబు దగు • నా? యిఁక నాడకు మిట్టు లాతనిన్
వినయము దప్పి పల్కి-నను • విన్మది న న్ననినట్టు లెంచెదన్. ౨౧౯౬

వినుతగుణాఢ్య = స్తోత్రము చేయఁబడిన గుణసంపద గలవాఁడా.

తా త్ప ర్య ము.

ఆ పుణ్యాత్ముఁడు నీ కేనాఁడైన నప్రియకార్యము చేసెనా? ఏలనీవు నిష్కారణముగ భయపడెదవు? అప్రియము చేయకపోవుట యటుండనీ నీవలె నిట్టిమాటలయిన నెన్నఁడైన నాడెనా? ఎన్నఁడు చెడుమాట నాడనివాని విషయమై సందేహింపవచ్చునా? ఇప్పటి కనినదేమో యంటివి. ఇఁకమీఁదఁ బెద్దవాఁడను గౌరవ మెంచక వినయము విడిచి యిట్లతని ననకుము. అంటివా నీవనినది నన్నని తలఁచెదను. ఈనాఁడు వానిననినవాఁడవు రేపు నన్ననవా?

దీనివలనదనభక్తులను దూషించినవానిని భగవంతుఁడు తన్ను దూషించిన వానిఁగా నెంచునని భావము.

ఉ. ఎంత విపత్తియైనఁ గలఁ • డే తపతండ్రిని జంపుపుత్రుఁడున్
సొంతము ప్రాణతుల్యుఁ డగు • సోదరుఁ జంపెడిభ్రాతయుం? గటా
యింతలు నీదునాలుకకు • నేగతి వచ్చెను? రాజ్యకాంక్ష నీ
కంతఘనంబ యేని భర • తా ధర వీనికి ని మ్మటందునా ! ౨౧౯౭

. విపత్తి=ఆపద, ప్రాణతుల్యుఁడు=ప్రాణముతో సమానుఁడు, ఇంతలు = ఇటువంటి క్రూరవాక్యములు, ఘనంబు=గొప్పదియే, ధర=భూమి.

లక్ష్మణుఁ డింతకుఁబూర్వము తండ్రిని జంపెదననెను (౫౯-౨-వ ప.) ఇప్పుడన్నను భరతుని జంపెద ననెను. ఇట్టివానిని నూరకవిడిచిన నెప్పుడో యొకప్పుడనర్థముఁదెచ్చి పెట్టునని తలఁచి చెప్పుచున్నాఁడు.

తా త్ప ర్య ము

ఎంతటి యాపదయందైనను దండ్రినిజంపు కొడుకైనను సొంతము ప్రాణతుల్యుఁడగు తోఁడఁబుట్టినవానిని జంపు తమ్ముఁడునుగలఁడా ! ఇంతటి క్రూరవాక్యములు నీనాలుక కెట్లువచ్చెను. నీకు రాజ్యముమీఁద విశేషవాంఛ యున్నదేని భరతా ! రాజ్యము వీనికిమ్మని చెప్పుదునా ?

కం. ఊరకయు మాటమాత్రము, ధారిణి లక్ష్మణున కిమ్ము • తమ్ముఁడ ! యన నేఁ
గూరిమి వల్లే యనుఁ జుమి, కోరిక లే దతని కింత • క్షోణీస్థలిపై. ౨౧౯౮

తా త్ప ర్య ము.

వేడుకకైన నూరక భరతా! రాజ్యము లక్ష్మణునకిమ్మని మాటమాత్రమంటినేని తథాస్తని యంగీకరించును, ఏలన వానికి భూమిమీఁద నీకున్నంత కాంక్ష లేదు.

ఆ. అనిన ధర్మశీలుఁ • డైన రామునివాక్య,తతుల నాలకించి • తద్ధితార్థి
లక్ష్మణుండు మిగుల • లజ్జచేఁ దనలోనఁ, గ్రుంగి యిట్టు లనియెఁ•గుతిలపడుచు. ౨౧౯౯

ధర్మశీలుఁడు=ధర్మస్వభావుఁడు, తద్ధితార్థి=రాముని మేలుగోరువాఁడు, ఇట్లు చెప్పుటచేఁ దాను దైవమని నమ్మియున్నవానికి నన్యాయముగ నింతకష్టము గలిగించిరని లక్ష్మణునకు దశరథాదులపైఁ గోపమేకాని తనకుఁగష్టము సుఖహాని కలిగించిరనికాదు. కుతిలపడుచున్=సంకటపడుచు.

## తాత్పర్యము.

ఈ ప్రకారము ధర్మస్వభావుఁడైన శ్రీరామచంద్రమూర్తి యాడిన మాటలువిని ఆ శ్రీరాముని మేలుగోరినవాఁ డగుటచే బదులుచెప్పక లక్ష్మణుఁడు మిగుల సిగ్గుచేఁ దనలోనే క్రుంగి సంకటపడుచు నిట్టులనియె.

తే. మిమ్ముఁ గనుఁగొన మనతండ్రి•మేదినీవి,భుండు దశరథుఁ డరుదేరఁ•బోలుననిన
వ్రీళితుని లక్ష్మణునిఁ జూచి•లాలితోక్తి,భావవిదుఁడైన శ్రీరామ•భద్రుఁడనియె. ౨౨౦౦

## తాత్పర్యము.

మిమ్ముఁ జూచుటకు మనతండ్రి దశరథుఁడే వచ్చుచున్నాఁడేమో యని మాటఁ దప్పింపఁగా నిర్దోషియందు దోషమెంచితినే యని సిగ్గుపడిన లక్ష్మణుని జూచి యతని యభిప్రాయమెఱిఁగిన శ్రీరామవిభుండు బుజ్జగింపుమాటల నిట్లనియె

సీ. మనలఁ జూడంగనే • జనపతి వచ్చెనో, వనవాసమున మన•పడెడిపాట్లు
మదిలోనఁ దలపోసి • మనల నింటికిఁ దోడు,కొని పోవ వచ్చె నం•చును దలంతు
మనకు నై కాకున్న • మనుజేంద్రుఁ డీసుకు,మారి సుఖార్హను•తెన్మితనూజఁ
దలఁచి యైనను మన•తండ్రి దశరథుఁడు, వచ్చు నత్యంబ యా•వచ్చు చున్న

తే. పవనజవనంబులును గోత్ర•వంతములును,చారుతరములునై నయ•శ్వములు రెండుఁ
దండ్రిశత్రుంజయం బను•దంతి దండు, మున్నునడ లెంచుచున్నవో•యన్న! కంటె. ౨౨౦౧

సుఖార్హను=సుఖమనుభవించుటకు యోగ్యురాలిని. పవనజవనంబులును = గాలివేగమువంటి వేగముగలవి. గోత్రవంతములు = మంచివంశమునఁ బుట్టినవి, చారుతరములు=మిగుల మనోహరములు. తండ్రిశత్రుంజయము=అనఁగా నాకు నా మేనమామ యిచ్చినదియు నేను సుయజ్ఞున కిచ్చినదియుఁ గాదని భావము. దండు మున్ను = సేనయొక్క ముందటిభాగమున, కోవిదారధ్వజము కానవచ్చెనే కాని రథమునందలి మనుష్యుఁడు కానరాఁడయ్యెను. కావుననే లక్ష్మణుఁడు తొలుత భరతుఁడని చెప్పి యావల దశరథుఁడేమో యని మాటపొల్లింప ననుకూలపడెను.

తోలుత శ్రీరామచంద్రుఁడు దశరథుఁడు వచ్చుచున్న యూహ నంగీకరించి నిపుణముగా శోధించి రాజార్హమైన శ్వేతచ్ఛత్రము లేమిని సందేహించు చున్నాఁడు.

తా త్ప ర్య ము.

మనలను జూచుటకే దశరథుఁడు వచ్చునేమో ! ఊరక చూచుట కింతదూరము వచ్చునా కాదు. కాదు, మనలనింటికిఁ దోడుకొనిపోవ వచ్చునేమో యని తలఁచెదను. అదియును సరిగాదు. మననిమిత్తము రాఁడు. సుకుమారి సుఖార్హయగు సీతను దలఁచియైన దశరథుఁడు వచ్చును. ఇదియేనిజము. మంచి జాతిగుఱ్ఱములు రెండు మనతండ్రిది శత్రుంజయమను పట్టపుటేనుఁగు సేనకు ముందు వచ్చుచున్నవి చూచితివా !

కం. కనఁబడ దెం దరసిన మన,జనకుని దివ్యంబు భువన•జనపూజిత మై
తనరెడి శ్వేతచ్ఛత్రం, బనుమానం బయ్యె లక్ష్మ•ణా ! నామదికిన్. ౨౨౦౨

తా త్ప ర్య ము.

ఎక్కడ వెదకినను మనతండ్రి ధరించునదియగు దివ్యమును లోకులచేఁ బూజింపఁబడునది యగు తెల్లగొడుగు గానరాలేదు. కావున దండ్రివిషయమై నాకను మానము కలుగుచున్నది. (ఆయున జీవించియున్నాఁడో లేదోయని నాసందేహ మని భావము.)

కం. నామాట వినుము లక్ష్మణ, భూమీజము డిగుము వేగ•ముగ రమ్మన నా
సౌమిత్రి యట్లు రొనరిచి, రామునకున్ మ్రొక్కి రొక్క•ప్రక్కగ నిలిచెన్.
౨౨౦౩

తా త్ప ర్య ము.

లక్ష్మణా ! నేనుజెప్పఁబోవు మాటలు వినుము. నీవు చెట్టుదిగిరమ్మ్ము అనిన నాయునయు నట్లుచేసి శ్రీరాముని మనసు నొప్పించినదానికిఁ బ్రాయశ్చిత్తముగా నమస్కరించి యన్న కేమి కీడుమూడునో యను భయముతో వ్యసనముతో నాయన ప్రక్కనే నిలిచెను.

చం. భరతుఁడు క్రందుసందడిని • భ్రాతలయాశ్రమ మార్తి చెందునం
చుచుతర సైన్యసంఘము న•గోత్తమసీమను ధర్మబుద్ధినై
నిరవుకొనంగ నిల్పెనటు • లెంతయుసైన్యము సార్ధయోజనం
బిరవుకొనం, బదంపడి మ•హీశసుతుండు వినీతవేషుఁడై. ౨౨౦౪

క్రందుసందడిని=గుంపులగొప్ప సమ్మర్దధ్వనులచే, ఆర్తి=పీడ,చుచుతర=మిగుల గొప్పదగు, నగోత్తమసీమను=శ్రేష్ఠమైన పర్వతముయొక్క యెల్లయందు, అనఁగాఁ బర్వతపాదమందు; ధర్మబుద్ధినై = ఆశ్రమములకు హానిగూర్పరాదను ధర్మజ్ఞానము చేత, ఇరవుకొల్పంగన్ = స్థానముగఁ జేసికొనునట్లు, సార్ధయోజనంబు= ఒకటిన్నర

యూమడ, పదంపడి=పిమ్మట, వినీతవేషుఁడై = వినయమును దెలుపు వేషముగల వాఁడై, పెద్దవారియొద్దకుఁ బోవునపుడు గర్వముసూచించు వేషములోఁ బోరాదు. ఉత్తరీయము నడుమునకుఁ జుట్టుకొని భృత్యునివలెఁ బోవలయును.

తా త్ప ర్య ము.

భరతుఁడు జనసమ్మర్దమునఁ దోఁటబుట్టినవారల యాశ్రమము బాధపడిచెడు నని తలఁచి యాగొప్ప సేనాసమూహము నాశ్రమసమీపమునకుఁ బోనీయక కొండ క్రింద ప్రదేశమందే నిలుచునట్లుచేసెను ఆసేన యొకటిన్నరయామడ ప్రదేశ మాక్రమించుకొనెను. ఇట్లు సేనలనెల్ల నొకచో నిల్పి భరతుఁడు వినయము దెలుపు వేషముగలవాఁడై పైయుత్తరీయము నడుమునకుఁ జుట్టుకొని చేతులు జోడించుకొని మీఁదిపద్యములో నన్వయము.

—• ౯౮-వ భరతుండు పాదచారియై రామాశ్రమంబు వెదకుట •—

ఉ. అన్నను జూడఁ గోరి గురు•నానతిఁ గైకొని పాదచారి యై
తన్ను భజించి యున్నపిన•తమ్ముని గన్గొని యెల్లవార మీ
యున్నవనంబులోపల ర•ఘూత్తముఁ గాల్నడ నారయంగఁ బో
లు న్నిఖిలావనీజనులు • లుబ్ధులుఁ గొల్వఁగఁ బొమ్ము నీ వటన్. ౨౨౦౫

గురునానతి = గురు+ఆనతి, గురువగు వసిష్ఠునియొక్క యాజ్ఞ, పాదచారియై=వాహనము లేక కాలితో నడచువాఁడై, నిఖిలావనీజనులు=సమస్తభూప్రజలు, లుబ్ధులు=బోయలు, అటన్=అవైపున.

తా త్ప ర్య ము.

అన్నను జూడవలయునను కోరికచే గురువగు వసిష్ఠుని యాజ్ఞను గ్రహించి తన యాలోచన నాయన సమ్మతింపఁగా దన్ను సేవించుచుఁ బ్రక్కనయుండు శత్రుఘ్నుని జూచి యీకానవచ్చు నడవియందు శ్రీరామచంద్రుని నడచుచుఁబోయి యందఱు వెదకవలయును. వాహనములమీఁదఁ బోరాదు. నీవు సమస్తజనులు బోయలు కలసి యీప్రక్కన వెదకుచుఁ బొమ్ము

చం. మనలను గొల్చి వచ్చు నస•మానబలుండు గుహుండు బంధురా
జిని వెసఁ గూడి; మంత్రిజన•శేఖరులున్ గురుపౌరవర్గముల్
వెనుకొనువారు నన్ను నిట • వేగపడన్ హృదయంబు వారలన్
గనుఁగొనుదాఁక శాంతి మదిఁ • గల్గఁగ నేరదు చుమ్ము తమ్ముఁడా! ౨౨౦౬

అసమానబలుండు = సరిలేని బలముగలవాఁడు, బంధురాజిని = చుట్టముల గుంపును, వెసన్ = త్వరగా, గురుపౌరవర్గముల్ = గురువులు పౌరులు వీరల సమూహములు.

తా త్ప ర్య ము

మనతోడ మహాబలవంతుఁడగు గుహుఁడు తనబంధువులతోడ వచ్చెను. మంత్రిజనులందు ముఖ్యులగువారు గురువులు పౌరజనులు నావెంటవత్తురు నేను సీతా రామ లక్ష్మణులను జూచువఱకుఁ దమ్ముఁడా! నామనస్సున నారాటముపోదు.

కం. రాముని దుర్ధమబలుఁ డగు సౌమిత్రి మహానుభావ ♦ జనకాత్మజ నే
సేమముగఁ గాంచుదాఁకను, నామదికిని శాంతి లేదు ♦ నాసోదరుఁడా! ౨.౨౦౭

దుర్ధమబలుఁడు=అణఁపరాని బలముగలవాఁడు, మహానుభావ = గొప్ప పాతి వ్రత్యముగలది.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రుని మిగుల బలిశాలియగు లక్ష్మణుని మహాపతివ్రతయగు సీతను వారుక్షేమముగ నుండుటను గన్నారఁజూచువఱకు నా మనస్సులోని యారా టము పోదు.

కం. వనజదళనేత్రుఁ డగు రా,మునిపూర్ణసుధాంశుఁ డెగడు ♦ మోముదమ్మిన్
మనమారఁగఁ గన్నారఁగఁ, గనుదాఁకను నాకు శాంతి ♦ గలుగు నటయ్యా. ౨.౨౦౮

వనజదళనేత్రుఁడు = తామర రేకులవంటి కన్నులు గలవాఁడు, పూర్ణసుధాం శున్=నిండుచందురుని, మోముదమ్మిన్=ముఖకమలమును.

తా త్ప ర్య ము.

తామర రేకులవంటి కన్నులుగల శ్రీరామచంద్రుని నిండుచందురుని బోలు ముఖకమలమును గన్నుల కఱవుదీరఁ జూచి నిండుమనస్సు నానందించువఱకు నా మనస్సెక్కడ శాంతిపడును?

కం. భూమిపలక్షణయుతములు, రామునిచరణాంబుజములు ♦ రాగంబున నే
నామస్తకమునఁ దాల్పక, నామదికిని శాంతి లేదు ♦ నాసోదరుఁడా! ౨.౨౦౯

భూమిపలక్షణయుతములు=రాజచిహ్నములచేఁ గూడినవి.

తా త్ప ర్య ము.

రాజ చిహ్నములగు వజ్రము ధ్వజము కమలము పుష్పము అంకుశము అమృతకలశము మొదలగున రేఖలనెడి లక్షణములతోఁగూడిన శ్రీరాముని పాద పద్మములను అనఁగా శ్రీరాముఁ డాయనయోగ్యతకుఁ దగినట్లు పట్టాభిషిక్తుఁడై కిరీటముఁదాల్చి సింహాసనమునఁ గూర్చుండి నాయోగ్యతకుఁదగినట్లు లాయన శ్రీ పాదములను నాశిరస్సున నుంచి సేవించువఱకు నాతమ్ముఁడా! నాకు మనశ్శాంతిలేదు.

కం. మనతండ్రిదాత లేలిన,ఘనరాజ్యభరంబుఁ బూని ♦ తేజ్మపతి యగుచున్
మనయగ్రజుఁ డభిషేకముఁ,గనుదాఁకను నాకు శాంతి♦గలుగు నటయ్యా. ౨.౨౧౦

తా త్ప ర్య ము.

మనతండ్రియును దాతలును బరిపాలించిన రాజ్యముయొక్క భారమును దాను రాకై మనయన్న పట్టాభిషేకము చేసికొనుట నేను గన్నులారఁ జూచువఱకు నామనస్సునకు శాంతికలుగునా? ఇది బాహ్యదర్శనము.

కం. ఎంతటిధన్యుఁడో సీతా,కాంతసుధాంశూపమాన • కమనీయాస్యం
బెంతయు సంప్రీతిని నే,కాంతముఁ గను లక్ష్మణుండు • కాకుత్స్థమణీ. ౨౨౧౧

సీతాకాంత = శ్రీరాముల, సీతావిశిష్టుఁడైన శ్రీరాముఁడనుటచే దంపతు లిరువురు నుభయవిభూతుల సేవ్యులని భావము. సుధాంశుసమాన = చంద్రునితో సమానమైన, కమనీయ=మనోహరమైన, ఆస్యంబు=ముఖము, సంప్రీతిని=సంతోషముతో, ఏకాంతము=ఎల్లవేళ, రహస్యముగను, ఇది హార్దదర్శనమును ముక్తదశ యందుఁ జేతనుని బ్రహ్మానందానుభవమును దెలుపును.

తా త్ప ర్య ము.

సీతతోఁడి శ్రీరాముని చంద్రునిబోలు సందమైన ముఖమును నెల్లవేళ నొంటరిగఁ జూచి యానందమనుభవించు లక్ష్మణుఁ డౌరా! యెంతసార్థక జన్ముఁడో.

కం. ధన్యాత్మిక సాధ్వీమూ,ర్ధన్య మహాభాగ జనక • రాజాత్మజ రా
జన్యవరుం దనభర్త న,నన్యమతిం గొలిచి వెంట • నంటెను గంటే. ౨౨౧౨

ధన్యాత్మిక=ధన్యమైన యాత్మగలది, సాధ్వీమూర్ధన్య = పతివ్రతలయందు శ్రేష్ఠురాలు, మహాభాగ = గొప్పభాగ్యముగలది, రాజన్యవరున్ = రాజులయందు శ్రేష్ఠుని అనన్యమతిన్=వేఱువిషయములపైఁ బోని మనస్సుతో, ఏకాగ్రచిత్తముతో శ్రీరామునికంటె వేఱుదైవముగాని యుపాయముగాని ఫలముగాని లేదనియుండుట.

తా త్ప ర్య ము.

అహో! సీతాదేవి యెంతసార్థకజన్మ, ఎటువంటి పతివ్రతారత్నము, ఎంతటి భాగ్యశాలిని, రాజశ్రేష్ఠుఁడగు తనభర్తను ప్రేమతో వేఱువిషయమున మనస్సు పోనీయక కొలుచుచు భర్తవెంటఁ బోయెను.

ఇది ప్రకృతికి భగవంతునకుఁగల యవినాభావసంబంధము. విశేషణ విశేష్య భావమును దెలిపెడిని.

కం. నందనవనిని గుబేరుం, డందంబున నుండునట్లు • లవనీశ్వరుఁ డీ
సుందరగిరివరకూటం,బం దుండెడి దీని భాగ్య • మగునే పొగడన్. ౪౨౧౩

నందనవనిని = నందనోద్యానమునందు, (2) సంతోషింపఁజేయునది కావునఁ జైత్రరథమందు, కుబేరుఁడు = (1) ఉత్తరదిక్కునకధిపతి, (2) కు+బేరుఁడు, కు= భూమి, బేరము=దేహము, కావునఁ బ్రపంచము దేహముగాఁగలవాఁడు, భగవంతుఁడు, అవనీశ్వరుఁడు, 1 రాజు, రాముఁడు 2 హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ యన్నట్లు శ్రీమహావిష్ణువు, 1 యక్షరాజు కుబేరుఁడు తనయింటినివదలి యుద్యానమైన చైత్ర

రథమందెట్లు క్రీడించునో యట్లు శ్రీరాముఁ డీ సుందరమైన పర్వతకూటంబునఁ గ్రీడించుచున్నాఁడు. "ఇక్ష్వాకూణామియం భూమి స్సశైలవనకాననా" యన్నట్లు లయోధ్యయుఁ జిత్రకూటము రెండు రామునివే అయినను నింటికంటె నుద్యానవనము రమ్యమైనట్లు లయోధ్యకంటె నేకాంత భోగస్థానముగుటచే నిందున్నాఁడని భావము. ఈయర్థము సూచించుటకే యవనీశ్వరపద మిందుఁ గూర్పఁబడెను. 2 కుబేరుఁడు తనసొంత యుద్యానమును వదలి యంతకంటె నందమైన నందనమునఁ గ్రీడించునట్లు శ్రీరాముఁ డయోధ్య వదలి యీ స్వభావసుందరమైన పర్వతశ్రేష్ఠ మందున్నాఁడు. 3 ఈ పర్వతము లోకములోని యితరసామాన్య పర్వతముల వంటిదేయైనను శేషాచలమందు వేంకటేశ్వరునివలె హస్తిగిరియందు వరదరాజస్వామివలె నేకశిలయందు శ్రీ కోదండరాములవలె శ్రీరాముఁ డిందుండుటచే నిదియు గిరివరమయ్యెను. ఈయన యిక్కడఁ జేరఁడేని దీనిపేరు దెలిసినవారెందరుందురో. 4. సమస్తప్రపంచము తనశరీరముగాఁగల భగవంతుఁడు వైకుంఠమునందలి నందనమున నుండునట్లనిభావముఁ ఈ పర్వతముభాగ్య మేమని పొగడ సాధ్యము ?

తే. వ్యాళపాళీనిషేవిత • మైనవనము, రామచంద్రుండు భువనాభి• రాముఁ డిందు
నధివసించుటఁ జేసి ధ•న్యత్వ మందె, ఘనత గన దెట్టి రామునాం•గత్యమునను.
౨౨౧౪

.వ్యాళపాళీ=వ్యాళస్సర్పే దుష్టగజే శ్వాపదే నాశకేత్రిషు నానా. ర. పామునకు, దుష్టగజమునకు, క్రూరమృగమునకు దుష్టునకు వ్యాలమనిపేరు. దుష్టజంతుసమూహముచే, నిషేవితము=కూడియుండునది, వనము = అడవి, ఇట్టిదయి "దుఃఖమతోవన"మన్నట్లు దుఃఖకారణమైన దగుటచే వాసయోగ్యముగాదు. అయినను భువనాభిరాముఁడు = ప్రపంచమందంతటను గ్రీడించువానికి నిదిమాత్ర మభిమానస్థలము గాకుండునా ? ఆయన కనుగ్రహమువచ్చిన పాషాణమునకు స్థావరత్వము పోలేదా. ఒక్కసారి తాఁకుటచేతనే యట్లు ధన్యత్వము ప్రాప్తింపఁగా నిన్నాళ్ళిచ్చట నుండుటచే నీపర్వతము ధన్యత్వమందకుండునా ? శ్రీరాముని సాంగత్యముచే నది ఘనతవహింపదా ? పరుసవేది సోఁకుటచే నినుము బంగారమైనట్లు రామసాంగత్యమున నెట్టి నికృష్టజన్మమైన నుత్కృష్టజన్మమే యగును. వ్యాళపాళీనిషేవితమైన వనము ప్రపంచమే అదివాసయోగ్యముకాదు. ఛీ మనుజజన్మ మేటికినికడా సీత యేడ్చెను. అయినను భగవంతునకు దీనియందనుగ్రహము కలదు కావుననే యంతర్యామిగను విభూతులుగను అర్చలుగను దీనియందుండును గావున భగవత్సేవాపరుల కిది గర్హ్యముకాదు. శ్లాఘ్యమేయగు.

నం. అని వచియించి యూథకరుఁ • డవ్వనసీమను బాదచారియై
చనుచును వాగ్మిశేఖరుఁడు • దారుసుమార్గము లైనశైలసం

జనితనగాళిమధ్యమునఁ • జక్కఁగఁ బోవుచు సాల మొందు డా
సిన నట గోచరించె రఘు • శేఖరునాశ్రమధూమమూలముల్. ౩౩౧౭

వాగ్మిశేఖరుఁడు=చక్కఁగ మాటలాడువారిలో శ్రేష్ఠుఁడు. శ్రీరామునిసన్నిధానమునఁ దాను మాటలాడవలసిన విధము శ్రీరాముని ప్రశ్నలకుఁ దానుబ్రత్యుత్తరము చెప్పవలసినవిధ మిదియంతయుఁ జక్కఁగ నాలోచించుచుఁ బోవుచున్నాఁడని దీనిచే సూచితము. చారుసుమాగ్రము=అందమైనపూలు కొనలయందుఁగలది, శైలసంజనితనగాళి మధ్యమునన్ = కొండయందుఁబుట్టిన చెట్లనడుమ, సాలము = వృక్షము, డాసినన్ = సమీపింపఁగా, గోచరించెన్ = కానవచ్చెను, రఘుశేఖరు = శ్రీరామచంద్రుని, ఆశ్రమధూమమూలముల్=ఆశ్రమమునుండి వెలువడు మొదలు (క్రిందిభాగము) ఇంతవఱకుఁ బొగకొననుజూచి దానికి సూటిగఁ బోవుచుండిరి. ఇప్పుడు పొగ యడుగుభాగమును జూచినవారైరి. ఇట్లనుటచే నిది యాశ్రమసమీప ప్రదేశముగను బయలుగాను నుండవలెను.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చెప్పి భరతుఁ డామడవియందుఁ బాదచారియై పోవుచుఁ దనలోఁదాను శ్రీరామునిఁ దాను బ్రార్థింపవలసిన విధము ఆయన చెప్పఁబోవు ప్రత్యుత్తరము దాను దానికిఁ జెప్పవలసిన విషయ మివియున్నియు నాలోచించుచుఁ జూచిన కొనకొమ్మలు గలిగి కొండయందుఁబుట్టిన చెట్లనడుమఁ బోవుచు నొకచెట్టు నొద్దకుఁబోఁగా నచ్చటికి శ్రీరాము నాశ్రమమందుండెడి పొగ యడుగుభాగము కానిపించెను.

కం. శ్రీరాముఁ డచట నుండు ప్ర,కారము భరతుం డెఱింగి • కడలీఁదునరుం
డారఁగఁ బారముఁ గనిన ట,పారముదమ్మును వహించె • బంధుయుతుండై.
౩౩౧౮

కడలి=సముద్రము, పారము=గట్టు, అపారముదమ్ము = అంతములేనిసంతోషము, బంధుయుతుండై=బంధువులతోఁ గూడినవాఁడై.

తా త్ప ర్య ము.

ఆ పొగవెడలు ప్రదేశమునందు శ్రీరాముఁడున్న విధము భరతుఁడు తెలిసికొని సముద్రము నీఁదువాఁ డొడ్డుచేరినట్లు చుట్టములతో మిగుల సంతోషించెను.

—• ౯౯-వ సర్గము. భరతుండు రామాశ్రమమును జూచుట •—

చం. అనఘచరిత్రు డచ్చటిమ • హాత్ములు రామునియాశ్రమం బదే
యనఁ దనతోడిసైన్యముల • నచ్చట నిల్పి గుహుండు వెంట రాఁ
జని గురువత్సలుండును వే • సన్ మునుమున్న వసిష్ఠుఁ బంచెఁ బ
య్యనఁ దనయెల్లతల్లులను • నచ్చటికిం దొడితేర, నీగతిన్. ౩౩౧౯

పూర్వము (౨౧౮౦ ప.) భరద్వాజాచార్య వాక్యమునందు శ్రద్ధయుంచి తదుపదిష్టమార్గంబునఁ బోవ ననుమానచిహ్నము (పొగ) కానవచ్చెను. ఆ యనుమానప్రమాణము నాధారము చేసికొని దానియందు దృష్టిచెదరనీక పోవఁగాఁ బ్రాప్యవస్తు సమీపమునకుఁ దీసికొనపోవును. అప్పుడచ్చట భగవత్సాక్షాత్కారముగల భాగవతు లీజిజ్ఞాసువునకు (ఆరురుక్షునకు) భగవన్నివేశనమును జూపి యందు భగవంతుఁడుండుట సత్యమని స్వానుభవముచేఁ జెప్పుదురు. అవల భగవత్సాక్షాత్కారమగును. ఈ విషయ మీ క్రిందిపద్యమువలనఁ దెలియనగు మీఁదఁ జెప్పిన విషయములన్నియుఁ బ్రత్యాయురుక్షుఁడగు భక్తునకు ననుభవసిద్ధంబులే.

అనఘచరిత్రులు = పాపరహితమైన నడవడిగలవారు, మహాత్ములు, ఆత్మ, ఆత్మాయత్న ధృతిస్వాంతస్వభావ పరమాత్మను జీవబుద్ధి శరీరేషు"నానా. ర. నాయమాత్మా బలహీనేన లభ్యో నచ ప్రమాదాత్ తపసో వాప్యలింగా"త్తను శ్రుతివచనము ప్రమాణము. మహాధైర్యము, అప్రమాదమైన మహాప్రయత్నము, గొప్ప స్వభావము, గొప్పబుద్ధిగలవారు, ఇంతటివారు గనుకనే భగవంతుఁడగు శ్రీసీతారాముల యాశ్రమమును భక్తి భరితుఁడైన భరతునకుఁ జూపఁగలిగినారు. తనతోడి సైన్యములన్=తన వెంటవచ్చిన సేనలను, గురువత్సలుండును=గురుభక్తిగలవాఁడు, గురుభక్తి లేనివానికి భగవద్విషయమే బోధపడదు. ఇఁక భగవత్సాక్షాత్కార మెక్కడిది? "యస్యదేవే పరాభక్తి ర్యథాదేవే తథాగురౌ। తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥ శ్వేతాశ్వ॥ మహాత్ముఁడగు గురువు వసిష్ఠుఁడు వెంటవచ్చిన కారణమున నితఁడు యోగ్యుఁడని గ్రహించి మహాత్ములు రామాశ్రమమును భరతునకుఁ జూపిరి. ఇంతవఱకు గురుకార్యమే. తోడితేరన్ = తోడుకొని వచ్చుటకు, గురునియోగ్యతనుబట్టి శిష్యునియోగ్యత దెలియవచ్చును. గుహుండు వెంటరాన్ పశుర్మనుష్యః పక్షీవా యేచవైష్ణవ సంశ్రయాః। తేనైవతే ప్రయాస్యంతి, తద్విష్ణోః పరమంపదమ్మన్నట్లు భాగవతు నాశ్రయించినవారు వాఁడుపోయిన విష్ణులోకమునకుఁ బోదురు అనునది యిచ్చట ననుసంధించునది.

తనయెల్ల తల్లులను దోడితేర వసిష్ఠుఁ బంచె ననుటచే నేను రామాశ్రమము నునికి నిశ్చయపఱచుకొని మీకుఁ జెప్పిపంపెదను. అంతవఱకు మీరిందే నిలువుండని వారిని నిలిపి వచ్చెనని యేర్పడుచున్నది.

## తాత్పర్యము.

అచటనుండిన పాపరహితులైన మహాత్ములు భరతునకు రామాశ్రమమిదే. అందు శ్రీరాముఁడు సీతాలక్ష్మణసహితుఁడై యున్నాఁడని తెలుపఁగా గురుభక్తిగల భరతుఁడు వసిష్ఠునితో మీరు తల్లులనందఱఁ బిలుచుకొని రండని చెప్పిపంపి గుహుఁడు తనవెంట రాఁగా రామాశ్రమమువైపు పోయెను. గురువువచ్చువఱకుఁ గాచియుండినవాఁడుగాఁడు. అచ్చటనుండి యన్వేషణసమర్థులు గురువుసాహాయ్య

మక్క-అలేకయే స్వతంత్రించి పోవఁగలరు. స్వసామర్థ్యములేక గురువుపై నాధార పడియుండు వారిని గురువే భగవత్సన్నిధానమునకుఁ దోడుకొని పోవలెను. ఈ విధముగా.

కం. చనునెడ సీతాధవదర్శన కాంక్షను భరతునకును • సముఁడు సుమంత్రుం
డును దాపునంద శత్రుఘ్నుని నెయ్యికొనంగఁ గైక • కొడు కనుజునకున్. ౨౨౧౮

చనునెడన్ = పోవుసమయమందు, సీతాధవదర్శనకాంక్షను = శ్రీరాముని దర్శించి కోరికయందు, దాపునంద=సమీపమందే, ఎయ్యికొనంగన్=కలిసికొనఁగా.

## తాత్పర్యము

౨౨౦౫-వ పద్యమునఁ జెప్పఁబడిన ప్రకారము భరతుఁడు వసిష్ఠునితో నొక ప్రక్క- వెదకఁబోయెను. శత్రుఘ్న సుమంత్రులు మఱియొక ప్రక్క- వెదకఁబోయిరి. భరతునకు రామాశ్రమము నునికి నిశ్చయముగాఁ దెలిసినవార్త రాఁగానే శత్రుఘ్నుఁడు భరతునిఁ గలిసికొనెను. శ్రీరామదర్శనమందు భరతునంత కోరికగల సుమంత్రుఁడును వచ్చి శత్రుఘ్నునిఁ గలిసికొనెను. శత్రుఘ్నుఁ గలిసికొని వనుటచే భరతుఁడు ముందడుగు శత్రుఘ్నుఁడు వెనుకడుగుగాఁ బోవుచుండిరనియుఁ బెద్ద వారితో సమానముగఁ బోరాదు. గావున భరతునివెనుక శత్రుఘ్నుఁడు శత్రుఘ్ను వెనుక సుమంత్రుఁడు నుండిరని తెలియవలెను.

తే. తాపసాగారనిచయమ • ధ్యంబునందు
నున్న రామాశ్రమముఁ జూపు • చుద్ధవిడిని
నరుగుచును దూరమున నున్న • యగ్రభవుని
యాకుటిల్లును నుటజంబు • నారఁ గనియె. ౨౨౧౯

తాపసాగారనిచయ మధ్యంబునందున్ = తాపసులయిండ్ల సమూహముల నడుమ, ఉద్ధవిడిని = శీఘ్రముగ, అగ్రభవుని = అన్నయగు రామచంద్రునియొక్క-, ఆకుటిల్లును=అగ్నిగృహమగు పర్ణశాలను. ఇది పవిత్రస్థలము దీనిలోనికి శుచులు పోవలయునేకాని యెప్పుడనినను డెవరనినవారు పోరాదు. కనుక నదిప్రత్యేక ప్రదేశము. ఉటజము = తన్నుఁజూడవచ్చిన ఋషులతోఁ గూర్చుండి మాటలాడుట కనుకూలమగు పర్ణశాల. (౨) అగ్రభవుని యాకుటిల్లు = సీతయు శ్రీరాముఁడు రాత్రిపరుండు పర్ణశాల. (౨) ఉటజము=పగటివేళనుండునిల్లు, (౩) ఆకుటిల్లు=పెద్ద యిల్లు, ఉటజము=దానినడుమనుండు నిల్లు, అరన్=బాగుగ.

## తాత్పర్యము.

తాపసుల యిండ్లనడుమనున్న రామాశ్రమమును శత్రుఘ్ననకుఁ జూపుచుఁ దొందరగాఁబోవుచు దూరముననున్న యన్న యాకుటింటిని నుటజమును బాగుగఁ జూచెను.

కం. వెలుపను నుటజమునకు ముం,దలఁ బూజార్థంబు పుష్ప•తతులుం జీక
ట్లలిమిన మంటలు వేయఁగ, విఱిచినకట్టియలుఁ గాంచి • వీరుఁడు చనుచున్.
౨౨౨౦

వెలుపను=బయల, అలిమినన్=క్రమ్ముకొనఁగా.

తాత్పర్యము.

పర్ణశాలముందు బయటియందు దేవపూజార్థము పూల సమూహములను చీఁకట్లు వ్యాపించినపుడు మంటవేయ నుపయోగించుటకై విఱిచి సిద్ధముగా నుంచిన కట్టియలును జూచుచుఁబోయి.

తే. రామలక్ష్మణులందుస్వా•శ్రమము తెరువు, గుఱుతు తెలియంగ నందంద•గుర్తులుగను
జెట్లకొనకొమ్మలను కుశ•చీరములను, గట్టియుండుట గనుఁగొనెఁ•గైకసుతుఁడు.
౨౨౨౧

స్వాశ్రమము తెరువు=ఏటినుండియో, యడవినుండియో నీటికిఁ గందమూలాదులకుఁ బోయినపుడు మరలి చక్కఁగాఁ దమయాశ్రమమునకు వచ్చుటకై మార్గము కుశచీరములును=దర్భలును నారచీరలును.

తాత్పర్యము.

ఏటికి నీళ్ళకు నడవికిఁ గందమూలాదులకుఁ బోయి మరల సూటిగాఁ దమయాశ్రమమునకు వచ్చుటకై మార్గము తెలియుటకుఁగాను జెట్లకొనకొమ్మలందు దర్భలు నారచీరలు కట్టఁబడి యుండుటను భరతుఁడుచూచి యీత్రోవనే మనము పోవచ్చునని తలఁచెను.

కం. అడవుల మృగముల దున్నల,పిడకలఁ జలికాఁచుకొనఁగ •విడి కుప్పలుగా
నిడినవి చూచుచు సంతస,పడుచు సమాత్యునకుఁ దనదు•భ్రాతకు ననియెన్.

తాత్పర్యము ౨౨౨౨

చలివేళ దేహము కాచుకొనుటకై మంటవేసికొనుటకుఁ గావలసిన యడవి మృగములవియు దున్నపోతులవియు నెండిన పేఁడకళ్ళు తెచ్చి కుప్పలుగా నుంచినవి చూచుచు సమీపమునకు వచ్చితిమిగదా యని సంతోషించుచు భరతుఁడు సుమంత్రునకు శత్రుఘ్నునకు నిట్లనియెను.

కం. మనకు భరద్వాజుం డా,డినదేశం బిదిగఁ దోఁచె•డిన్ నది మందా
కిని యిటకు ననతిదూరం,బున నుండఁగ నోపు నన్ను•పొలిచెడి నిచటన్. ౨౨౨౩

ఆడిన=చెప్పిన, అనతిదూరంబునన్ = కొంచెముదూరమందు. పొలిచెడిన్ = ఉన్నాఁడు.

తాత్పర్యము.

మనకు భరద్వాజుఁడు గుర్తుచెప్పినప్రదేశ మిదియేయని తోఁచుచున్నది. ఇచ్చటికి సమీపమందే మందాకిని యుండవలయును. ఈ ప్రదేశమందే యున్నయు నున్నాఁడు.

ఉ. ఎత్తునఁ గట్టియున్నయవి • వృక్షములం దవె నార చేలికల్
చిత్తమునందుఁ జూడ వన•సీమలనుండి యకాలమందు న
త్యుత్తమశీలి లక్ష్మణుఁడు నొయ్యనఁ గ్రమ్మఱుచోట గుర్తుగా
నిత్తెఱఁ గాచరించె నని • యెంచెదఁ దమ్ముఁడ! చూడు మియ్యెడన్. ౨౨౨౪

తాత్పర్యము.

తమ్ముఁడా! చెట్లయందు నెత్తుగనున్నచోట నారచీరలచేలికలు గట్టఁబడి యున్నవి. ఆ వకాల వికాల సాయంకాలమందు నడవులనుండి మరలివచ్చు నపుడు త్రోవ తెలియుటకై యుత్తమస్వభావముగల లక్ష్మణుఁడు గుర్తుగాఁ గట్టెనని తలఁచెదను. ఈదారినే మనము పోవచ్చును.

కం. దంతాదంతిరణంబుగ, దంతులు పోరాడికొనుచు • దారుణభంగిన్
దాంతి గన కాశ్రమంబున, బ్రాంతంబునఁ జనియె లోని • కరుగఁగ రామిన్. ౨౨౨౫

చెట్లమీఁది గుర్తులుచూచుచుఁ బోనేల నేలకాలియడుగులజాడఁ జూచుచుఁ బోరాదా యనిన నేనుఁగులు మృగములు త్రొక్కుటచే నవి మాసినవని చెప్పుచున్నాఁడు.

దంతాదంతిరణంబుగన్=ఒకదానినొకటి కొమ్ములతోఁ గ్రుమ్మిచేయు యుద్ధము. ఇది వ్యతిహారలక్షణ బహువ్రీహి. వ్యతిహారమనఁగాఁ దనవిషయమం దొకఁడేవిధముగ వర్తించునో యట్టులే యతనియందుఁ దానువర్తించుట, దంతులు=ఏనుఁగులు, దాంతి=ఓర్పు.

తాత్పర్యము.

ఏనుఁగు లొకదానినొకటిఁ గొమ్ములతోఁ గ్రుమ్మి భయంకరముగఁ గలహించుచు నోర్పులేక యాశ్రమములోనికిఁ బోవ వలనుపడమి దానిప్రక్కనఁ బోయెను.

కం. సాయంప్రాతర్హోమము,కై యేయగ్నులను ఋషులు • కలకాలంబున్
బాయక రక్షింతురు త,ద్వ్యాయతధూమంబు నిబిడ • మై తనరె నదో. ౨౨౨౬

సాయం=సాయంకాలమందలివి, ప్రాతః = ఉదయమువి, కలకాలంబున్ = సర్వదా, తద్వ్యాయత=తత్=దానియొక్క, వ్యాయత = విశేషముదూరముగల, నిబిడము=దట్టము.

ఈ యగ్ని వంటకనుకూలమగు నగ్నికాదు. హోమాగ్నియుఁగాదు. ఇది పదాయుండెడి గార్హ్యపత్యాగ్ని యని నిబిడమై యనుపదము సూచించును. వంటనిప్పునందు మంటవిశేషించి యుండునుగానఁ బొగ విశేషించియుండదు హోమమునకుఁ గావలసినది కణకణమను నిప్పులు. దానియందుఁ బొగ విశేషించియుండదు. శ్రీరాముఁడుంచుకొన్న యీయగ్ని దార్వాగ్నియే. ఈయన యగ్న్యాధానము చేయలేదు కాన నిదార్వాగ్ని. శ్రౌతాగ్నికాదు, ఇది శ్రౌతాగ్నియైనచో

బట్టమునుండి వచ్చినపుడు తెచ్చియుండవలెను. అట్లాయగ్నిని దేలేదు. ఈయన రాజ్యపాలన కాలమందు శ్రౌతాగ్ని యుండుటచేతనే కదా యుత్తరకాండమున మహాప్రస్థానము పోవునపుడు వెంటఁబెట్టుకొనిపోయెను. "రామః కమలపత్రాక్షః పురోధ సమధాబ్రవీత్ ॥ అగ్నిహోత్రంవ్రజ త్వగ్రే సర్పిర్జ్వలిత పావక" మ్మని యా ప్రకరణమున నున్నది. మఱియు శ్రౌతాగ్నిగల పట్టనములోని బ్రాహ్మణులందఱు (తమ యగ్నులను దోడఁదెచ్చిరిగదా. మఱియు "దీక్షితుని వ్రతిసంపన్ను దివ్య తేజ। నజివధరు శుచి నిన్ను నే హరిణ శృంగ। హస్తు నినునేను భజియింప నాశ్రయింతు" అని సీత (౪౭౦-వ ప.) చెప్పెను. కావున రాజ్యాభిషేకమునకుఁ బూర్వము శ్రీరాముఁడు యజ్ఞాదులఁ జేయులేదు. అని యేర్పడుచున్నది. అట్లుండఁగా యజ్ఞము చేసినవారుంచుకోఁదగిన శ్రౌతాగ్ని శ్రీరామున కిపుడు రాఁజాలదు. కావున నిది స్మార్తాగ్నియే. ఇది యెప్పటికప్పు డచ్చటనచ్చట నేర్పాటుచేసికో వలసినదే కాని సర్వత్ర సర్వదా కూడఁదీసికొని పోవలసినది కాదు. ఎచ్చట నీయగ్నిని ముగించునో యచ్చట దాని నాత్మారోపణ చేసికొని స్థలాంతరమున మరలఁ బుట్టింపవలెను. శ్రీరాముఁ డొకచో నొకదినముండెనేని యచ్చట నప్పుడగ్నిని నావాహనముచేసి హోమముకాఁగానే యాత్మారోపణము చేసికొనును కొన్నిస్థలములందు నెలలకొలఁదియు సంవత్సరములకొలఁదియు నుండెనేని యచట దార్వాగ్నిగానే యుంచుకొనును. ఇది స్మార్తాగ్నియైనను నిందు సాయంప్రాతర్హోమము తప్పరాదు. శ్రీరాముఁడు తమసా గంగా తీరాదులయందు హోమముచేసినట్లు కవి చెప్పలేదనరాదు. ఒక ప్రయోజనమున్నప్పుడే యొకవిషయమును జెప్పును గాని యట్టిప్రయోజనము లేనప్పు డావిషయము ప్రస్తావింపఁడు. పూర్వోక్తస్థలములందుఁ బ్రయోజనములేదు గానఁ జెప్పలేదు. "అథ తేస్మిం సురాంశ్చైవ వై దేహీ రామ లక్ష్మణౌ। కాల్యం విధివదభ్యర్చ్య తపస్విశరణేవనే ॥ ఉదయంతం దివాకరం దృష్ట్వా విగతకల్మషాః। సుతీక్ష్ణ ముభిగమ్యైవ మిదంవచన మబ్రువన్' అని సుతీక్ష్ణాశ్రమ ఘట్టమునఁ జెప్పఁబడును. అచ్చటఁ జెప్పుటకొక ప్రయోజనమున్నది. సూర్యోదయమునకుఁ బూర్వమౌపాసనము చేయవచ్చునని కొందఱిపక్షము, మఱికొందఱు సూర్యోదయానంతరమే చేయవలయునని, యిట్లు రెండుపక్షములుగలవు. ఆరెంటిలో మొదటిది సమ్మతమని తెలుపుటకై యచ్చట నౌపాసనము ప్రస్తావించెను. ఇట్టివిషయమైన నొకప్రయోజనమున్నప్పుడే కవి చెప్పెను. అన్యత్ర చెప్పఁడు. ఆమాత్రమున నిచటఁ జెప్పిన యగ్ని పచనాగ్నిగాఁ జెప్పుట సరిగాదు. కావున వనవాసకాలమున శ్రీరాముఁడు సీత తనయొద్ద నున్నంతవఱకు నౌపాసనము చేయుచునేవచ్చెను. ఒక దినమైనను వదలలేదు. స్థిరముగా నుంచుకొనుట స్థలముల ననుసరించి యుండెను. దీనిచే రామాశ్రమమునకు గుర్తు చెప్పుటయేకాక యది పావనమనియు సూచితము.

కం. పురుషవ్యాఘ్రుని రాముని, గురుతరసంస్కారకరునిఁ • గోవిదవర్యున్
బరమర్షిఁ బోలె నిం దే, హరుసంబునఁ గాంచువాఁడ • సకలుషచరితా. ౨౨౨౭

గురుతరసంస్కారకరునిన్ = మిక్కిలి గొప్పదగు మంత్రోపదేశము (విశ్వామిత్రుఁడు నేర్పిన యస్త్రమంత్రములను) మొదలగువానిని జేసినవానిని, గోవిద వర్యున్=పండితశ్రేష్ఠుని.

తా త్ప ర్య ము.

పురుషశ్రేష్ఠుఁడును నాకుగొప్ప యస్త్రమంత్రాదుల నేర్పినవాఁడును పండిత శ్రేష్ఠుఁడును నగు శ్రీరామచంద్రుని మహర్షివలె నిండుఁడఁగా నేను సంతోషముతోఁ జూడఁగలను.

కం. అని కొండికదూరంబుం, జని మందాకినిని గాంచి • సహచరతతితో
నను భరతుఁడు చింతాభర,వినతాననుఁ డగుచు నీరు • వెడలం గనులన్. ౨౨౨౮

కొండిక=ఒకకొంత, కొంచెము, సహచరతతితో = కూడవచ్చువారిసమూహముతో, చింతాభర=చింతయొక్క యతిశయముచే, వినత=వంగిన, ఆననుఁడై = ముఖముగలవాఁడై.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారముచెప్పి మఱికొంతదూరముపోయి మందాకిని జూచి భరతుఁడు శోకభారముచే వంగినముఖము గలవాఁడై కన్నులనుండి నీరుగాఱఁ గూడవచ్చు వారితో నిట్లనియెను.

కం. క్షితిపతి వీరాసనసుస్థితుఁడై రహిమీఱు పురుష•సింహుఁడు సీతా
పతి నిర్జనవని నుండెడి, హతకుఁడ నాజన్మ మేల•ప్రాణము లేలా. ౨౨౨౯

క్షితిపతి = రాజు, వీరాసనసుస్థితుఁడై = కుడితొడపై నెడమపాదముంచి కూర్చుండినవాఁడు నిర్జనవనిన్=మనుష్యులులేని యడవియందు, హతకుఁడన్=పాడై పోయినవాఁడను.

తా త్ప ర్య ము.

భూమికంతయు నధిపతియై సీతకు భర్తయై వీరాసనమం దున్నవాఁడై ప్రకాశించు పురుషశ్రేష్ఠుఁడు జనులులేని యడవియందున్నవాఁడు ఇహమునఁ బరమునఁ జెడి భూమిపైఁ బుట్టనేల పుట్టితినిబో వెంటనే చావక బ్రతుకనేల.

సీ. అక్కటా నాకయి • యఖిలసౌఖ్యంబులఁ, బోనాడి వనముల•లోనఁ బడియెఁ
జగతీశుఁ డౌ రామ•చంద్రుఁ డంచనియెడ,యపకీర్తి జగ మెల్ల • నావరించె
రాముపాదంబుల • వ్రాలి సీతకు లక్ష్మణునకు మ్రొక్కుద•మనసు దేఱ
ననుచు వాపోవుచు • నరుగుచు సాలతా,లాశ్వకర్ణచ్ఛదా•శ్వావృత మయి

తే. విరివి యవుదానిఁ గుశలచే • వేదివోలె, నంద మవుదాని భూరిశ•క్రాయుధాభ
భారసాధనశాత్రవ•భయదచాప, రాజిచేతను మెఱుఁగులు•గ్రక్కుదాని. ౨౨౩౦

పోనాడి=వదలి, లక్ష్మణునకును, మ్రొక్కెదను=నేను శ్రీరాముని పాదముల మీఁదఁబడి నన్నుమన్నింపఁ బ్రార్థింపఁగా లక్ష్మణుఁడు కైకచేసిన యపరాధమును శ్రీరామచంద్రునికిఁజెప్పి యాయన నన్నుఁ గరుణింపకుండునట్లు చేసెనేని యపుడు లక్ష్మణునకును నమస్కరించెదను. రోగమునకుఁ దగినమందు తినవలసినదే. నిష్కారణముగ వారియెడ నింతయపరాధమొనర్చి లోకమున శాశ్వతమైన మహాపకీర్తి సంభవించినదాని దానిని బోఁగొట్టుకొనుటకై యేమిచేసిన నేమితప్పు. మనసుదేఱన్=మనసునిష్కళంక మగుటకు, వాపోవుచున్=ఏడ్చుచు, సాల=మద్దిచెట్లయొక్కయు, తాల = శ్రీతాలవృక్షములయు, అశ్వకర్ణ = ఇనుమద్దియొక్కయు, ఛద = ఆకుల యొక్క, అళి=సమూహములచే, అవృతము=కట్టఁబడినది, భూరి = గొప్పదియగు, శక్రాయుధాభ=ఇంద్రచాపముతో సమానమైన, భారసాధన = (1) తలపలమనెడి వింటి కొలఁతప్రకారము సాధింపఁబడినదియు, భారమనునది వింటి కొలఁతయందలి భేదము. ధనుర్వేదమున నీశానసంహితయందు "భారం పలశతంవిదుః, తేనభారేణ చాపానాం ప్రమాణముపలభ్యతే" యని కలదు. (2) గొప్పకార్యము సాధించునదియును, కావున భయద=శత్రువులకు భయము గలిగించునదియగు, చాపరాజి = విండ్ల సమూహముచేతను. తా త్ప ర్య ము.

అయ్యయ్యో! నానిమిత్తమై సౌఖ్యములనెల్ల వదలి ప్రపంచమునకెల్ల నధిపతి యగు శ్రీరామచంద్రుఁ డడవులపాలాయెననియెడి యపకీర్తి లోకమునం దంతయు వ్యాపించెను. ఆముప్పూరవిషయంబున నేనపరాధినే కావున మాయన్నకు వదినెకు మ్రొక్కుటయేగాక లక్ష్మణునకును మ్రొక్కెదను. ఆయన నీకంటెఁ జిన్నవాఁడు కదా నీవాయనకు మ్రొక్కవచ్చునా? యందురేని శ్రీరాముని పాదములపై పడి నమస్కరించి నన్ను క్షమింపఁ బ్రార్థించినపుడు కైకచేసిన యపరాధమును స్మృతికిఁ దెచ్చి యీఁడు క్షమింపఁ దగినవాఁడుకాఁడు వీని క్షమింపవలదని లక్ష్మణుఁడు చెప్పెనేని యప్పు డాయనను బ్రసన్నుని జేయుటకై యీతనకును నమస్కరించెదను. అట్లు చేయనైతినేని యాయన నానిమిత్తముగఁ బడెడిదుఃఖమున కేది పరిహారము. ఉపచారముమాటలు చాలినంత ప్రాయశ్చిత్తముకాదు. అని యేడ్చుచుఁ బోవుచు మద్ది శ్రీతాల యినుమద్ది వృక్షముల యాకులచేఁ గప్పఁబడి విశాలమై దర్భలచే వేదివలె నందమయి పెద్ద యింద్రధనస్సుతో సమానమైన శత్రుభయంకరమైన విండ్లచే మెఱుఁగులు గ్రక్కుచు.

తే. అర్కరశ్మిప్రతీకాశ•మగుచుఁ జూడ, దిగులు గొల్పుచుఁ దూణుల • దీప్తవదన
మగుచు శోభింపశరతతి • యహులచేత,భోగవతినాఁగ నెంతయుఁ•బొలుచుదాని
౨౨౩౧

అర్కరశ్మిప్రతీకాశమగుచున్ = సూర్యకాంతితో సమానమగుచు, ఘోరప్రదీప్తవదనమగుచున్=అంబులపొదులచే మండుచున్న నోరుగలదియగుచు, శోభింపన్=ప్రకాశింపఁగా, శరతతియహులచేన్ = బాణముల సమూహమనెడి పాములచేత, భోగవతి=వాసుకిముఖ్యపట్టనము.

తా త్ప ర్య ము.

సూర్యకిరణములతో సమానమై చూచుటకు భయంకరమై యంబులపొదులచే మండుచున్న నోరుగలవై ప్రకాశింపఁగా బాణసమూహములనెడి పాములచేత భోగవతీపురమువలె నొప్పుచుండుదానిని.

ఆ. పసిఁడిరొమ్ములతోడఁ • బసమీఱుకరవాల,సంచయంబుచేత • జాతరూప
బిందుతతులచేత • సుందరం బగుఫల,కములచేతఁ దేజ • ంగాలుదాని. ౨౨౩౨

కరవాలసంచయము=కత్తులగుంపు, జాతరూపబిందు తతులచేతన్ = బంగారు చుక్కలచేత.

తా త్ప ర్య ము.

బంగారు గవిసెనలచేఁ బ్రకాశించు కత్తుల సమూహముచేతను సుందరమగు కడెములచేఁ దేజస్సుగలదియగు దానిని.

తే. కాంచనాభరణాదిస•ముచితంబు, లైనగోధాంగుళీత్రాళి • యమలకాంతు
లమరుదానిని సింహగ•హ్వర మనంగఁ, బగఱకును నప్రధృష్యమై • పరఁగుదాని.
౨౨౩౩

కాంచనాభరణాది సముచితంబు=బంగారు సొమ్ములచేఁ బ్రకాశించునదియు, గోధాంగుళీత్రాళి = ఉడుముచర్మముచేఁ జేయఁబడినదియై వ్రేళ్ళను రక్షించుదాని యొక్క,అమలకాంతులు=నిర్మలమైనకాంతులు, సింహగహ్వరము=సింహముల గుహయో యన్నట్లు, పగఱకున్=శత్రువులకును, అప్రధృష్యమై=చెడఁగొట్టరానిదై.

తా త్ప ర్య ము.

బంగారుసొమ్ములచే నలంకరింపఁబడిన వ్రేళ్ళురక్షించుటకై తొడుగుకొను నుడుముచర్మముతోఁ జేయఁబడిన తిత్తులుగలదై నిర్మల కాంతులుగలిగి సింహముండు గుహవలెఁ బగవారికి ధిక్కరింపరానిదై

తే. ప్రాగుదగ్భాగనిమ్నమై • ప్రజ్వలద్ధు,తాశనం బగువేదిచే • నతిమనోహ
రంబు నవుదానిఁ బుణ్యా హా•రామునఁ దున్న,పర్ణశాలను గాంచె నా•వరగుణుండు.
౨౨౩౪

ప్రాగుదగ్భాగ నిమ్నమై=తూరుపు, ఉత్తరము అనఁగా నీశాన్యమూల పల్లమై, ప్రజ్వలత్=ప్రకాశించుచున్న, హుతాశనంబు = అగ్నిహోత్రముగల వేదిచేత, అతిమనోహరము=జనులమనస్సునాకర్షించునది, వరగుణుండు=శ్రేష్ఠమగు గుణములు గలవాఁడు.

తా త్ప ర్య ము.

ఈశాన్యమూల మెత్తై యుండుచున్న యగ్నిహోత్రముగల వేదిచే మిగుల నందమైన ముఖ్యమైన శ్రీరాముఁడున్న పర్ణశాలను శ్రేష్ఠములగు గుణములుగల భరతుఁడు చూచెను.

—• భరతుఁడు శ్రీరాముని దర్శించుట •—

కం. నిండుతమిఁ గొంతవడి భర,తుం డారఁగఁ గాంచి తెలిసెఁ • దోరంపుజటా
మండలితో నుటజాసీ,నుం డగు శ్రీరాము నన్న•నున్ ధీరగుణున్. ౨౨౩౫

నిండుతమిన్=సంపూర్ణమైన యభిలాషతో, కొంతవడి=కొంచెము కాలము, ఆరఁగన్=బాగుగ, తోరంపుజటామండలితోన్=విస్తారమైన జడలగుంపులతో, ఉటజాసీనుండు=ఆకులయింటియందుఁ గూర్చుండినవాఁడు, ధీరగుణున్=ధైర్యవంతుని.

తా త్ప ర్య ము.

అన్నను జూడవలయునను నిండుకోరికతో నీకానవచ్చువాఁ డన్నయగునా కాఁడా? యని కొంతసేపు చక్కఁగాఁజూచి జడలగుంపులతోఁ బర్ణశాలయందుఁ గూర్చుండిన తనయన్నను శ్రీరాముని దన్నుఁజూచి సంతోషముగాని కోపముగాని వ్యసనముగాని లేనివానిని జూచి యితఁడే మాయన్న శ్రీరామచంద్రుఁ డని గుర్తించెను.

సీ. కృష్ణాజినం బుత్తరీయంబు గాఁ జీర,వల్కలంబులు గట్టు•వస్త్రములుగఁ
పావకనిభుఁ డయి • భాసిల్లు చాసీనుఁ, డగుమహాబాహుఁ గం•జాయతాక్షుఁ
జతురబ్ధివలయిత•క్ష్మామండలేశు సిం,హస్కంధు ధర్మని•త్యానురక్తు
జానకీలక్ష్మణ•సహితుఁ నై దర్శనం, స్తరణంబుమీఁదను•దరము మీఁతే

తే. శాశ్వతబ్రహ్మవైఖరి•జాను మిగులు, రాముఁ గని పరు వెత్తి చే•రంగఁ బోయి
చూచినంతన యేడ్చుచు • శోకబాష్ప,వారి సందిగ్ధవచనుఁడై • పలికె నిట్లు.
౨౨౩౬

భరతుఁడు చూచునప్పటికి శ్రీరాముఁడున్నస్థితి కవి వర్ణించుచున్నాఁడు.

ఉత్తరీయము=పైవస్త్రము, చీరవల్కలంబులు=వస్త్రములుగా ధరింపఁబడిన నారపట్టలు రెండుమూఁడు కలిపినఁగాని నడుముచుట్టు తిరిగిరాదు. కనుక బహువచనము. ఇదివఱకు మహార్హవసనోపేతుఁడు దానికంటె విలక్షణవేషమిది, దానిని చెప్పుచున్నాఁడు. మునుపటివేషముకంటె దీనియందు శోభావిశేషము గలదని చెప్పుచున్నాఁడు. పావకనిభుఁడయి=(1)అటువంటి తపస్సుచేఁగలిగిన పూర్ణతేజోవిశేషముచేఁ జుట్టఁబడినవాఁడు 1 మహార్హవసనోపేతుఁడై యుండినప్పుడు నివురుగప్పిన నిప్పువలె వస్త్రములచే దేహమంతయుఁ గప్పఁబడి యుండుటచే నైజదేహతేజస్సు మఱుఁగుపడియుండెను. ఇప్పుడా ముసుఁగులు లేమిని మండెడుమంటవలెఁ గానవచ్చుచున్నాఁడు 'నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా' విద్యుల్లేఖ నడుమునందుఁ

ప్రకాశించు నల్లమేఘమువలె నని యర్థము. అంచులయందు మెఱుపు, నడుమ మేఘమున్నట్లులని యర్థము. (2) శత్రువులకు సమీపింపనురానివాఁడు (3) శేటి చూచుటకు సాధ్యపడనివాఁడు కనుకనే భరతుఁడు గుర్తింప నాలస్యమయ్యెను. ఆసీనుఁడు = ఆసనమునఁ గూర్చుండినవాఁడు. అయోధ్యాపురమందలి సభాభవనము కంటె నిదిచిన్నదయ్యెను నీయుటజసభ గొప్పది ఏలన :—ఆసభయందు నెవరైనను సమీపించు చుండిరి. ఇచ్చటనో తమ్ములుగూడ సమీపింపరానివారై యున్నారు. మండెడు మహాగ్ని నెవఁడుసమీపించును ! మహాబాహూన్ = నిడుపాటి చేతులుగల వానిని, కంజాయతాక్షున్ = కమలములవలె దీర్ఘమైన కన్నులుగలవానిని, చతురబ్ధి =నాలుగు సముద్రములచే, వలయిత=చుట్టఁబడిన, క్ష్మామండల=భూచక్రమునకు, ఈశున్=ప్రభువైనవానిని, సింహస్కంధున్=సింహము మూఁపురములవంటి మూఁపురములు గలవానిని, ధర్మనిత్యానురక్తున్=ధర్మమునందు నెడఁదెగని యనురాగము గలవానిని దర్భసంస్తరణముమీఁదన్ = దర్భాసనముపై. దరమువిూఱి = రాజదశ నతిక్రమించి, శాశ్వతబ్రహ్మవైఖరిన్ = అశాశ్వత చతుర్ముఖ బ్రహ్మవలెఁగాక, పరబ్రహ్మమువలె, పరబ్రహ్మముండువిధ మిదిగాయున్నను భక్తులకు సమయోచితమగు నాకారముతో భగవంతుఁడు దర్శనమిచ్చును గావున నీరూపములో భరతునకు ననుగ్రహించెనని తెలియవలెను అర్జునునకు విశ్వరూపముఁ జూపినట్లు భగవంతుఁడు తనభక్తులకు సమయ యోగ్యతానుసారముగ దర్శనమిచ్చునుగాని యందఱ కేకవిధముగ దర్శనమీయఁడు. జానుమీఱు=అందముచే నతిశయించు, అయోధ్య యందున్నప్పటికంటె నిప్పుడు విశేష తేజోవంతుఁడై యున్నాఁడని భావము. దీనిచే వనవాసక్లేశ మాయనను నేమియు బాధింపలేదని భావము రాత్రి చంద్రుని బాధించునా ? శోకబాష్పవారి = శోకముచేరాలుచున్న కన్నీళ్ళతో, సంధిగ్ధవచనుఁడై=డగ్గుత్తికపడుటచే మాటసరిగా రామిని కొంత తెలియవచ్చి కొంత తెలియరాని మాటలతో.

## తాత్పర్యము.

జింకచర్మము పైవస్త్రముగా, నారచీరలు కట్టువస్త్రములుగా, నగ్నిహోత్రునితో సమానుఁడయి ప్రకాశించుచు నాసనమునఁ గూర్చుండిన యాజానుబాహుని పుండరీకాక్షుని నాలుగు సముద్రముల నడిమి భూమికంతయుఁ బ్రభువైన వానిని సింహము మూఁపురమువంటి మూఁపురములు గలవానిని ధర్మమందు శాశ్వతమైన యనురాగము గలవానిని సీతాలక్ష్మణులతోడ దర్భాసనమునఁ గూర్చుండినవానిని మునుపటికంటెఁ దేజస్సుచే నధికుఁడగువానిని శాశ్వతబ్రహ్మమువలె నుండువానిని శ్రీరామునిజూచి పరువెత్తుచు సమీపమునకుఁబోయి చూడఁగానే యేడ్చుచు శోకముచేఁ గన్నీళ్ళు రుస్తికకడ్డపడ నెదుటివారికిఁ గొంతయర్థమై కొంత యర్థముకాని మాటలతో నిట్లు చెప్పెను.

కం. ఉన్నతసింహాసనమున, సన్నుతిఁ జేయంగ జనులు • సభ నుండెడిమా
యన్నయె యిటువలె నడవుల,నున్నాఁడారణ్యమృగఖ•గోత్కరవృతుఁడై. ౨౨౩౭

ఉన్నతసింహాసనమునన్ = ఎత్తైనసింహాసనమందు, ఆరణ్య = అడవికి సంబంధించిన, మృగ=మృగములయొక్కయు, ఖగ=పక్షులయొక్కయు, ఉత్కర = సమూహముచే, వృతుఁడై=చుట్టఁబడినవాఁడై.

తా త్ప ర్య ము.

ఎత్తైన సింహపీఠమున లోకులందఱు స్తోత్రముచేయఁగాఁ గొలువుకూటంబుననుండు మాయన్నయా యిప్పుడీనేలమీఁద నిటువలె నడవిమృగములు పక్షులు చుట్టుకొని కర్ణకఠోరముగా నఱువఁగా వినుచునుండువాఁడు ? మాయన్నయా యిటులున్నవాఁడు ? అయ్యైన మాజీవితమే వ్యర్థము.

సీ. వెల లేని దువ్వలు•వలను దాల్చెడి మహా,మహుఁడెయాజింక చ•ర్మము ధరించెఁ
బట్టణంబున సౌఖ్య•పడయోగ్యుఁడగుసుకు,మారుఁడా యడవుల • మలయువాఁడు
వలపులు చల్లుపూ•వులు దాల్చు సొబగుఁడా, తలజటాభారంబుఁ • దాల్చినాఁడు
చందనచర్చల • నందంబు మీఱునా యంగమా యాధూళిఁ • బ్రుంగినదియు

ఆ. మన్నిమిత్త మకట • యిన్నిదుఃఖంబులు, సౌఖ్యపరుఁడు రామ•చంద్రునకును
సంభవించెజగతి • నడి గన్నయీ క్రూరు,బ్రతుకదేల యేల•ప్రాభవంబు. ౨౨౩౮

మలయువాఁడు = తిరుగువాఁడు, వలపులు = వాసనలు, చందనచర్చలన్= గంధపుఁ బూఁతలచే, బ్రుంగినది = మునిఁగినది. నడి=అపకీర్తి, నింద, ప్రాభవంబు= ప్రభుత్వము, దుగ=దువ+వలువ=దువ్వలువ.

తా త్ప ర్య ము

పూర్వము వెలచెప్పసాధ్యపడని సన్నని పట్టువస్త్రముల ధరించుచుండిన వాఁడా యిప్పుడీ జింకచర్మము ధరించియుండువాఁడు. పట్టణములయందు నానావిధముల సుఖపడ నర్హుఁడైన కోమలదేహముగలవాఁడా యీ యడవులలోఁ దిరుగువాఁడు గుమగుమ పరిమళించు పూవులు శిరమునధరించు సుందరుఁడా యిప్పుడీజడల భారమును దాల్చినవాఁడు గంధపుఁబూఁతలచే సందమైన యాదేహమా ! యిందు నేల మట్టియందు మునిఁగియున్నది. అయ్యయో ! యెంతో సుఖమనుభవించు శ్రీరామచంద్రునకు నానిమిత్తముగా నిన్నిదుఃఖములు కలిగెను. ప్రపంచమున నిట్టి యపకీర్తిగన్న యీక్రూరుబ్రతుకేల ? ప్రాభవమేల ?

కం. సన్నుతగతి విధియుక్తగ, జన్నంబులు సలిపి ధర్మ•సంపన్నుఁడుగా
నున్నయతండా యడవుల, నిన్ని తి రెంయిగాసి ధర్మ•వెంచెం గూర్చన్. ౨౨౩౯

సన్నుతగతిన్=సజ్జనులచేత స్తోత్రము చేయఁబడినవిధముగా, విధయుక్తగన్= శాస్త్రప్రకారము, జన్నంబులు=యజ్ఞములు, ధర్మసంపన్నుఁడు=ధర్మమేసంపదగాఁ

గలవాఁడు. కానున్నవాఁడా=కాఁబోవువాఁడా. ఇట్లనుటచే నిప్పటికి నేయజ్ఞములు చేయలేదని యేర్పడుచున్నది. ఇన్నెఱిన్=ఈవిధముగా, మెయిగాసిన్ = దేహకష్టములో, ధర్మముగూర్ప నెంచెను=ధర్మము సంపాదింపనెంచెను.

తా త్ప ర్య ము.

శాస్త్రప్రకారము సజ్జనులు మెచ్చువిధముగ యజ్ఞములుచేసి ధర్మముసంపాదింపవలసినవాఁడా యీరీతి నడవులలోఁ దిరిగి దేహాయాసము సహించి ఋషుల మార్గమున ధర్మమార్జింపవలసినవాఁడు దేహకష్టముతోఁ గూడి కూటికి నీళ్ళకు మొగమువాఁచి దుఃఖింపవలసిన పర ధర్మమైన ఋషులమార్గమున ధర్మముసంపాదింపనెంచెను. సుకరమైన స్వధర్మానుష్ఠానమునఁ బుణ్యమార్జించుట విడిచి కష్టముతోఁడి పరధర్మము ననుష్ఠించుట శ్లాఘ్యముకాదని భావము.

కం. ఖిన్నుండై యిటు లేడ్చుచు, స్విన్నముఖాంభోజుఁ డగుచుఁ • జేరఁగఁ జన లే
కన్నను భరతుం డిలఁ బడె, నన్నా! యని యొండుపలుకు • నన లే కీలిన్.
౨౨౪౦

ఖిన్నుండై=ఖేదమునొందినవాఁడై, స్విన్న ముఖాంభోజుఁడు=కన్నీటిచేఁ దడిసిన ముఖకమలము గలవాఁడు, చేరఁగఁజనలేకన్నను=అన్నను సమీపింప శక్తిలేక, ఇలన్=భూమియందు. తా త్ప ర్య ము.

దుఃఖముచే నేడ్చుచుఁ గన్నీటిచేఁ దడిసిన ముఖకమలము గలవాఁడై డిలుపడి యన్నసమీపమునకుఁ బోలేక యడుగుపెట్టలేక యన్నా! యని యఱచి నేలఁ బడెను. గాని యింకొకమాటనైనఁ జెప్పగలిగినవాఁడుకాఁడు.

కం. కన్నులనీళ్ళులు కంఠం,బు న్నెఱి మాటంగఁ గైక • పుత్త్రుఁడు రామున్
గన్నెత్తి చూచి పిలిచియు, నన్నా! యని వేఱుమాట • నన లేఁ డయ్యెన్.
౨౨౪౧

తా త్ప ర్య ము

కన్నీళ్ళు కంఠమునుండి మాటరాకుండ నడ్డగింపఁగా భరతుఁడు శ్రీరామునిఁ గన్నెత్తిచూచి యన్నా! యని పిలిచెనుగాని వేఱొకమాట యనలేఁడయ్యెను.

తే. రోదనము సేయు చంత శత్రుఘ్నుఁ డన్న,పాదముల వ్రాలెఁ దమ్ములఁ • బట్టియెత్తి
నీరజాక్షుండు వారి క • న్నీరు దుడిచి, కౌఁగిలించుచు వారల • కలఁకఁ బాపె.
౨౨౪౨

తా త్ప ర్య ము.

అంతట శత్రుఘ్నుఁ డేడ్చుచుఁబోయి శ్రీరామచంద్రుని పాదములమీఁదఁ బడెను. అప్పుడు శ్రీరాముఁడు భరత శత్రుఘ్నులఁ బట్టి యెత్తినిలువఁబెట్టి వారి కన్నీళ్ళు దుడిచి కౌఁగిలించుచు వారి నూరార్చి మనస్తాపముఁ బాపెను.

తే. ఆవలసుమంత్రగుహులునె•య్యమునఁదాయ,శత్రుఘ్నయుక్తులై నట్టి•సూర్యచంద్రు
లనఁగ నొప్పిరి భ్రాతలు • వననివాసిజనములునుగూడ దుఃఖించె•గనుచువారి.

తాత్పర్యము. ౨౨౪౩

భరతశత్రుఘ్నులసిమ్మట సుమంత్రుఁడు గుహుఁడు స్నేహమున సమీపింపఁగా గురుశుక్రులతోఁగూడిన సూర్యచంద్రులవలె నన్నదమ్ములు రామలక్ష్మణు లొప్పిరి. వారినిఁజూచి యాయడవియందలి మనుష్యులుకూడ దుఃఖించిరి.

— • ౧౦౦-వ సర్గము. శ్రీరాముఁడు భరతునిఁ గుశలప్రశ్న సేయుట •—

తే. జడలు ధరియించినారవ•స్త్రములు గట్టిపుడమిఁ బ్రాంజలి యగుచును•బడినకల్ప
భానుపోలిక దుర్దర్శు • దీనుఁ గృశు వి,వర్ణు నెట్టకేల్తో తా నాన•వాలు పట్టె.
౨౨౪౪

కల్పభానుపోలికన్ = ప్రళయకాలమందలి సూర్యునివలె, దుర్దర్శున్=చూడఁ గష్టమైనవానిని, దీనున్=దుఃఖించువానిని, కృశున్=శుష్కించినవానిని, ఆనవాలు =గుర్తు.

తాత్పర్యము

తండ్రి మెచ్చుటనైన మంచిపూలదండలు లభించునేని యవి తన ప్రియురాలి కొడుకగుటచే ముందుగఁ బిలిచి బుజ్జగించి ప్రార్థించినఁగాని వానిని ధరింపనివాఁడు శిరమున జడలుధరించి, యట్లే తండ్రిమెంతో వేఁడుకొని బలవంతముగఁ గట్టినఁగాని విలువగలవలువలఁ గట్టనివాఁడు నారపట్టలు గట్టుకొని, తండ్రిమెంతో ప్రార్థించినఁగాని యేదియు గ్రహింపనివాఁడు, (చూ. ౯౧౭-౯౯౯ ప.) పూలపానుపు కూడఁ గఠినమని తనతొడమీఁదఁ దండ్రి పండఁబెట్టుకొనఁ బండువాఁడు సాష్టాంగముగా నేలపైఁబడి ప్రలయకాలమందలి సూర్యునివలెఁ దేజోహీనుఁడయ్యుఁ దేటఁ జూడరానివానిని స్నేహితులుచూడ దక్కింపనోల్లని కష్టదశయందుండువానిని, శుష్కించినవానిని వన్నెమాసినవానిని భరతు నతికష్టముపై నెట్టకేల్తో గుర్తుపట్టె.

తే. తనదు నెయ్యంపుటనుజు హ• స్తముల నెత్తి
రాముఁ డక్కునఁ జేర్చి శి•రంబు మూరు
కొనుచుఁ దనతోడఁ గూర్చుండఁ • గూర్మిఁ దిగిచి
కుశలసంభాషణముఁ జేసె • విశదభణితి. ౨౨౪౫

నెయ్యంపుటనుజున్=స్నేహముగల తమ్ముని భరతుని, అక్కునన్ = రొమ్మునందు, మూరుకొనుచున్=వాసనచూచుచు, విశదభణితిన్=స్పష్టవాక్కులచేత.

తాత్పర్యము

తన గారాబుతమ్ముని భరతుని చేతులనెత్తి రొమ్మున నొత్తికొని శిరము వాసనచూచి యాక్షి తనతొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని విశదవాక్కుల నిట్లు కుశలప్రశ్నము గావించెను.

ఉ. ఎక్కడ నున్న వాఁడ వొకొ యి • టీ విట వచ్చుటఁ జేసి తండ్రి ! నీ
విక్కడ రావుగా జనకుఁ • డింటను జీవముతోడ నుండఁగా ?
నక్కజ ! యెన్నినాళ్ళకొ ? • నయ్య నినుం గని,గుర్తు చిక్కనై
తక్కట దుర్గమాటవులకై • యిటు రాఁ బని యేమి తమ్ముఁడా ? ౨౨౮౮

తా త్ప ర్య ము.

నీ వీప్రకార మిచ్చటికి వచ్చితివే, తండ్రియేమైనాఁడు. ఆయన జీవించియుండఁగా నావలెనే నీవు నాయనను దుఃఖపెట్టి యిచ్చటికి రాలేదుగదా ? నిన్నుఁజూచి యెన్నాళ్ళయెనురా నాయనా ? నిన్ను గుర్తుపట్టుటయే కష్టమాయెనే ! నీ వీ విధముగా మనుష్యులు సంచరింపఁగష్టమైన యడవులకు నేలవచ్చితివి ? నీ వడవులకు రావలసిన పని యేమిపడెనా ? తండ్రియే నిన్నుఁబోయిరమ్మనెనా ? లేక నేనునీవు లేని సమయమున బలవంతులు నీరాజ్య మపహరింప నీవు బయలుదేఱివచ్చితివా ?

ఉ. నీ విటు రా నెఱింగి మన • నేర్చినవాఁ డొకొ తండ్రి, నాకముం
బోవఁగ లేదుగా ? మిగులఁ • బూజ్యము రాజ్యము బాలకుండ వౌ
నీవు ధరింప భ్రష్ట మయి • నెమ్మదిఁ బాయదుగా ? మహాత్మునిన్
భూవిభుఁ దండ్రినిం దినముఁ • బూజలఁ దన్పుదు గాదె నాయనా ? ౨౨౮౯

తా త్ప ర్య ము.

తండ్రియాజ్ఞప్రకారము నీవువచ్చితివా ? నీ విచ్చటికి వచ్చుట నెఱిసి తండ్రి బ్రదికియున్నాఁడుకదా ? మరణింపలేదుగదా ? బాలుఁడవైన నీ పెట్టినవారికిని బూజ్యమగుటచే బలవంతులగు రాజులందఱు గోరునది గావున రాజ్యము నీ యసామర్థ్యమునఁ జెదరిపోయి వ్యాకులపడలేదుగదా ? ప్రతిదినము గొప్పమనస్సు గలవాఁడును రాజునునగు తండ్రిని నాయనా ! పూజించుచున్నావుగదా.

“బాలకుండవౌ నీవు ధరింప భ్రష్టమయి” దీనివలన బాలనాయకము స్త్రీనాయకము అనాయకము చెడునని సూచన.

“యత్రస్త్రీ యత్రకితవో, బాలో యత్రానుశాసితా ! మజ్జంతి తేవశారాజన్ నద్యా మశ్మప్లవా ఇవ” స్త్రీ, జూదరి. బాలుఁడు పెత్తనముచేసి కార్యములు చేయువారైన నీటిలోని రాతి తెప్పవలె మునుఁగుదురు.

“పూజలం దండ్రిని దన్పుదుగాదె ?” దీనివలనఁ బితృపూజ యనివార్యమని సూచన. దాని ఫలమేమన :—

“శుశ్రూషతే యః పితరం, నచాసూయత్కదాచన,
మాతరం భ్రాతరంవాపి, గురుమాచార్యమేవచ.
తస్యరాజన్ ఫలం విద్ధి, స్వర్లోకే స్థానమర్చితమ్,
నచపశ్యేత నరకం, గురు శుశ్రూష యాత్మవాన్ !”

తండ్రిని, దల్లిని, అన్నను, గురువును ఆచార్యుని బూజించువానికి స్వర్గలోకము స్థానము. వాఁడు నరకమును జూడఁడు.

—♦ శ్రీరాముఁడు కుశలప్రశ్న వ్యాజంబున భరతునకు ధర్మోపదేశము సేయుట ♦—

ఆ. సత్యసంగరుండు ♦ సకల ధర్మవిదుండు, రాజసత్తముండు ♦ రాజసూయ
సైంధవాధ్వరముల ♦ సలిపినపుణ్యుండు, కుశలి యయ్యె తండ్రి ♦ దశరథుండు. ౨౨౪౮

ఈ౧౦౦-వ సర్గమునకుఁ గచ్ఛిత్సర్గ మనిపేరు. ఇట్టిది మహాభారతమున సభాపర్వమునఁ గలదు. ఆవిషయము ౨౩౦౦-వ పద్యమునుందుఁ జర్చింపఁబడును.

సత్యసంగరుండు = (1) యథార్థప్రతిజ్ఞ కలవాఁడు. (2) యథార్థక్రియా నిశ్చయమును దెలుపువాఁడు "క్రియాకారప్రతిజ్ఞా పద్యుర్థార్థేపుంసి సంగరః" నానా. ర. తాను జేసిన సత్యప్రతిజ్ఞనుదలఁచి పశ్చాత్తాపపడి తండ్రి యారోగ్యము చెడినవాఁడాయెనా యని యొకయర్థము. నావిషయమునఁ బరితాపపడి తన మునుపటి నిశ్చయము మార్చుకొని తా నసత్యమాడినను సరియె శ్రీరాముని బిలుచుకొనిరమ్మని నిన్నుఁ బంపలేదుకదా యని మఱియొకయర్థము.

సకలధర్మవిదుండు=సమస్తధర్మములు దెలిసినవాఁడు కావున నాయందలి పుత్రవాత్సల్యముచే నసత్యమునకు వెఱువకుండునని నేను దలఁపను అనిభావము. రాజసత్తముండు=రాజశ్రేష్ఠుఁడు కావున వ్యసనముచే రాజకీయవ్యవహారములఁ నుపేక్షింపలేదుగదా. రాజసూయసైంధవాధ్వరములన్ = రాజసూయయాగము. అశ్వమేధయాగము నెఱవేర్చిన పుణ్యాత్ముఁడు. ఈ రెండుయాగములందును సర్వరాజులను జయించుట యనివార్యము కావుననే స్వపౌరుషముచే రాజసత్తముఁ డయ్యెనని భావము. రాజసత్తమ శబ్దము నేటిబీరకాయవంటిది కాదని భావము. కుశలి=కుశలముతో నున్నాఁడుగదా. నావిరహమున వ్యాధిగ్రస్తుఁడు కాలేదుకదా.

## తా త్ప ర్య ము.

ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడును గార్యమును నిశ్చయించి మరల దానినుండి చలింపని మనస్సుగలవాఁడును రాజసూయయాగము అశ్వమేధయాగము చేయుటచే సార్వభౌముఁడై రాజశ్రేష్ఠుఁడని సార్థకనామధేయము వహించినవాఁడును బుణ్యాత్ముఁడును నగు మనతండ్రి దశరథుఁడు కుశలముతో నున్నాఁడుకదా.

కం. మనకులముగురువు విద్వ౽జ్జనవర్యుఁడు బ్రాహ్మణుండు ♦ సారద్యుతి యగా
మునివర్యుండు వసిష్ఠుఁడు, మునుపటివలెఁ బూజితుండె ♦ యొగి దాశరథీ. ౨౨౪౯

కులముగురువు = వంశపరంపరగా వచ్చిన గురువు, మనకు వంశపరంపరగా వచ్చిన గురువనుటచే నాదినుండి వసిష్ఠుఁడు సూర్యవంశరాజులకెల్ల గురువు. కులగురుఁడు వసిష్ఠుఁడఁట యని విశ్వామిత్రుఁడు చెప్పెను. దీనివలన వసిష్ఠుఁడను పేరు

గలవాఁ డొక్కఁడేయనియు నాయనయే యాదినుండి పురోహితుఁడనియు నది బిరుదుపదము గాదనియు నేర్పడు చున్నది. విద్వాల్ + జనవర్యుఁడు = సర్వ విద్యలు తెలిసిన పండితులయందు శ్రేష్ఠుఁడు, బ్రాహ్మణుఁడు=బ్రహ్మకుమారుఁడగుటచే బ్రాహ్మణజాతికిఁ జేరిన బ్రహ్మజ్ఞాన నిష్ఠుఁడు, సారద్యుతి=గట్టియగు బ్రహ్మ వర్చస్సుగలవాఁడు, మునివర్యుండు=మునిశ్రేష్ఠుఁడు, వసిష్ఠుఁడు; మునుపటివలెన్ = తండ్రిపూజించిన విధముగా, ఇల్లనుటచే దశరథుఁడు మగణించెనని శ్రీరాముఁడు నిశ్చయించుకొన్నట్లు తేర్పడుచున్నది. మొగిన్ = చక్కఁగా, దాశరథీ=దశరథకుమారా!, అపత్యార్థక తద్ధితము. గురువు=జ్ఞానోపదేశముచే నజ్ఞానము నణఁగొట్టువాఁడు. బ్రహ్మ, తదధీతే తద్వేద యను నర్థమున నణ్ ప్రత్యయము రాఁగా బ్రాహ్మణుఁడని రూపమేర్పడెను.

దశరథకుమారా! యనుటచే నీవు దశరథున కిష్టుఁడవైన పుత్రుఁడవు. కావున నాయన యింటఁగాని వెలుపలఁగాని చేసిన యేర్పాటును నీవు తప్పింపరాదు. ఆయన యిష్టప్రకారము వర్తింపవలయుఁ ననియుఁ గావుననే నీభాగమైన రాజ్యము నీవు తృణీకరింపరాదనియు భావము.

తా త్ప ర్య ము

ఇక్ష్వాకువంశమునఁ బుట్టిన మనకు వంశపరంపరగా వచ్చినవాఁడును సమస్త శాస్త్రములు దెలిసిన పండితులలో శ్రేష్ఠుఁడును వేదాధ్యయనముచేసి యర్థమెఱిఁగి బ్రహ్మజ్ఞానము గలవాఁడును వేదార్థ మెఱిఁగి యనుష్ఠానమం దుంచుకొనుటచే బ్రహ్మ వర్చస్సుచేఁ బ్రకాశించువాఁడును, మననశీలురయందు శ్రేష్ఠుఁడును, జితేంద్రియుఁడును నగు వసిష్ఠుఁడు దశరథనందనా! దశరథుని కాలమందువలెనే పూజింపఁబడుచున్నాఁడా!

కం అమాడ్కిన్ విడిచి వచ్చిన, నామాత సుమిత్ర సాధునందన సుఖ లే?
నీమాత పూజ్య కైకయి, యామోదముతోడ నున్నదయ్యా భరతా! ౨౩౪౦

అమాడ్కిన్=అవిధముగా, నానిమిత్తమై కంటికిఁ గడవెఁడుగాఁ గన్నీరు కార్చుచుండఁగా, నేను అనునది అధ్యాహారము. నామాత=నాతల్లికౌసల్య, సాధునందన=సాధువులగు కుమారులఁగలది, పూజ్య=గౌరవింప యోగ్యురాలు, ఆమోదముతోడన్ = మిక్కిలి సంతోషముతో, సౌగంధ్య హర్షామోదౌ = నానా. ర. భరతా=భరించువాఁడు, భరతుఁడు. కావున వీరివారలఁ జక్కఁగా సమదృష్టిని భరించుచున్నాఁడవుగదా యని భావము. పూజ్య కైకయి యనునది శ్రీరామునకుఁ గైకయందుఁగల గౌరవబుద్ధిని సూచించుచున్నది. కౌసల్యా సుమిత్రలు సుఖులా యనుటచే వారు దుఃఖము మానినారా! యని భావము. ఇది యనిష్ట నివారణము మాత్రము సూచించును. కైక యామోదించుచున్నదా! యనుటచే దుఃఖకారణమే లేక యిష్టప్రాప్తివలన సంతోషముకూడఁ గలిగియున్నది కదా! యని భావము.

## తా త్ప ర్య ము.

భరతా! నా వనగమనమునకై మిగుల దుఃఖించుచుండుట చూచియు నేను విడిచివచ్చిన నాతల్లి కౌసల్యయు, జ్యేష్ఠానువర్తనమను గొప్ప సాధుగుణము గల కొడుకులఁగన్న సుమిత్రయు శోకింపమానినారుగదా! పూజ్యరాలగు నీ తల్లి రాజ్య ప్రాప్తివలన మిక్కిలి సంతోషించుచున్నదికదా! కౌసల్యా సుమిత్రలు దుఃఖింప కుండునట్లును కైక సంతోషించునట్లు భరించుచున్నావుగదా!

కం. కులపుత్రుఁడును వినయము, గలవాఁడు బహుశ్రుతుండు • కార్యజ్ఞుఁడు ని
ర్మలమతి యనసూయుం డయి, యలఘుమతీ నీపురోధ•యర్చితుఁ డగునే. ౨౨॥౧

కులపుత్రుండును=మంచికులమునందుఁ బుట్టినవాఁడు, వినయము గలవాఁడు, నీకు లోపడియుండువాఁడు, బహుశ్రుతుండు=అనేకులవలనఁ జెప్పఁబడవ లనేకవిషయములు విన్నవాఁడు దీనివలన గ్రంథపఠనమాత్రము పర్యాప్తముగాదు. పెక్కుర వలన వినుటవలన భిన్నాభిప్రాయములు పూర్వపక్షసిద్ధాంతములు చక్కఁగాఁ దెలియును. ఒకకార్యమందు నిస్సందేహముగా నిశ్చయముగాఁ బ్రవర్తించు శక్తిగలుగును. కార్యజ్ఞుఁడు=వసిష్ఠుఁడు చెప్పినదానిని మరలఁ దాను మనకుఁదగినట్లు చెప్పి కార్యములు చేయుటకుఁ గార్యస్వరూపమెఱిఁగినవాఁడు. వసిష్ఠుఁడు పురోహితులందుఁ బెద్దవాఁడు ఏవైన గొప్పకార్యములు నిర్వహింపవలసి వచ్చినపుడు మాత్రమే యాయనవచ్చును. అల్పకార్యములకు నితరపురోహితు లుందురు. వీరు వసిష్ఠుని యాజ్ఞప్రకారము వర్తింతురు. అనసూయుఁడు = అసూయలేనివాఁడు, నీపురోధ = నీపురోహితుఁడు, రూ. పురోధసుఁడు, మనపురోహితుఁ డనక నీపురోహితుఁ డనుటచే శ్రీరామునకు సుయజ్ఞునివలె భరతునకొకఁడు కలఁడని సూచితము. సుయజ్ఞుఁడే శ్రీరామునకు భరతునకుఁగూడఁ బురోహితుఁడని కొందఱ యభిప్రాయము. అర్చితుఁడు=పూజింపఁబడుచున్నవాఁడు, దీనిచేఁ బురోహితుఁడు సదా పూజ్యుఁడని భావము. ఈ ప్రకారము మున్ముందు గ్రహింపవలెను. "హితులు భిషగ్గ్రహజ్ఞబుధబృందకవీంద్ర పురోహితుల్" అముక్త, అన్నట్లు. పురోహితులు సర్వదా గృహస్థుని మేలే కోరుచుందురు. కావున వారు పూజ్యులు.

ఉ. ఘనమతి యగ్నిహోత్రములఁ • గావఁగఁ బూనినవాఁడు, సత్క్రియా
విధియమవేది, ధీయుతుఁడు • నెల్వల లోపలఁ దుల్యహోమని
ష్ఠనుగలవాఁడు, హోమములు • సల్పఁగలట్టివి సల్పినట్టివిన్
వినిచెడివాఁడు, నై యుచిత•వేళల నొప్పునె నీపురోధయున్? ౨౨॥౨

పురోహితుఁడు చేయవలసిన కార్యములు చెప్పఁబడుచున్నవి.

నీపురోధఘనమతి = గొప్పమనస్సుగలవాఁడు, అగ్నిహోత్రములఁ గావఁగఁ బూనినవాఁడు = అగ్నిహోత్రమును రక్షించువాఁడు, ఈప్రశ్నవలన భరతుఁడు

యజ్ఞముచేసినట్లు సూచితము. అన్నయగు రాముఁడు యజ్ఞముచేయుటకుఁ బూర్వమే తమ్ముఁ డెట్లుచేసె ననరాదు. అది సోదర విషయమేకాని భిన్నోదర విషయము గాదు. శ్రీరామ భరతులు సవతుల కొడుకులు గావున విధి వేదనదోషములేదు. "పితృవ్యపుత్రే, సాపత్నే, పరనారీసుతేషుచ । వివాహ దాన యజ్ఞాదౌ పరివేదో న దూషణ"మ్మని శాస్త్రముగలదు. అని గోవిందరాజీయము.

వివాహమైన కొలఁది కాలములోనే భరతుఁడు మేనమామగారింటికిఁ బోయెను. అనాఁడు పోయినవాఁ డీనాఁడువచ్చుచున్నాఁడు. మేనమామగారి యింట యజ్ఞము చేసెననుట యసంభావ్యము. కావున నీ ప్రశ్నకు నీపురోహితుఁ డిట్టిశక్తిగల వాఁడా యని గ్రహింపవలెను. లేదా ౨౨౨౬-వ పద్యంబున శ్రీరాముని విషయమై చెప్పినటు లిది స్మార్తాగ్ని యనియైన గ్రహింపవలెను. లేదా గోవిందరాజీయమునఁ జెప్పినట్లు యద్వా యని యగ్ని కార్యములందని యైన గ్రహింపవచ్చును. సత్క్రియావినియమవేది=అగ్నిహోత్రము మొదలు అశ్వమేధాంతమగు సకలవైదిక కార్యముల విధి నెఱింగినవాఁడు. ధీయుతుఁడు=సమయోచితమగు నూహాపోహములయందు సమర్థుఁడు, వెల్పలన్ = బాహ్యాచారమందు, లోపలన్=అంతఃకరణమందు, తుల్యనిష్ఠను=ఏకవిధమైన నిష్ఠనుగలవాఁడు తానునమ్మినది యొకటి, పరులకుఁ జెప్పునదియొకటి గలవాఁడు గాఁడనిభావము. సల్పఁగలట్టివి.... వేళలన్ = చేసినవి చేయవలసినవి యగు కార్యములను నాయాసమయ మతిక్రమింపకుండఁ జెప్పుచుండెడివాఁడు.

నైవకన్యా నయువతి ర్నాల్పవిద్యో నబాలిశః । హోతాస్యా దగ్నిహోత్రస్య, నార్తో నాసంస్కృత స్తథా ॥ నరకేహి పతత్యేతే జుహ్వాతః సచయస్యతత్ ॥ దీని వలనఁ గన్యగాని, యౌవనవతిగాని, విద్యలేనివాఁడుగాని, మూఢుఁడుగాని, ఆర్తుఁడుగాని సంస్కారము లేనివాఁడుగాని హోమము చేయరాదని యేర్పడుచున్నది.

తాత్పర్యము.

భరతా! నీపురోహితుఁడు గొప్పబుద్ధిగలవాఁడేకదా! ధనాశచే నీచకార్యములు చేయఁడుగదా! సోమరియై యశ్రద్ధచేఁ గర్మ, మంత్ర, తంత్ర లోపముల సహింపఁడుగదా! నీ యగ్నిహోత్రముల రక్షింపఁ బూనికకలవాఁడేకదా! అగ్నిహోత్రము మొదలశ్వమేధమువఱకు సకలవైదిక కర్మము లెఱిఁగినవాఁడేకదా! ఏకవిధమైన శ్రద్ధ యాచారము గలవాఁడేకదా! తానొకటినమ్మి నీకొకటి చెప్పఁడు కదా! త్రికరణశుద్ధి గలవాఁడేకదా! నీయెదుట నొకవిధముగఁ జాటున మఱియొక విధముగఁ జేయఁడుకదా! ఏయేసమయమున నేయే హోమములఁ జేయవలయునో వానినెల్ల సకాలముననే వినిపించుచుండునుగదా !

సీ. దేవతలను బితృ • దేవతలను నెల్ల, జనముల గురువుల • జనకసముల
వృద్ధుల వైద్యుల • విప్రుల సత్కృతిఁ, దన్పుదే? యర్థశా • స్త్రప్రవీణు
నిష్వస్త్రసంపన్ను • హితు సుధన్వాఖ్యు ను,పాధ్యాయుఁ బూజింతు • వా సభక్తి?
శూరులే కులజులే • శ్రుతవంతులే యాత్మ, సములె జితేంద్రియ • శాలు లోక

తే. యింగితజ్ఞులె నీమంత్రు • లెల్లఁ దండ్రి! మంత్రమే జయమూలంబు • మహిపులకును
శాస్త్రకోవిదు లైనట్టి • సచివవరులు, దాని రక్షింతురా ప్రమా • దంబు లేక ?

౨౨. ౧౩

జనకసములన్=తండ్రితో సములైనవారిని, సత్కృతిన్ = సత్కారములను, ఎవరినెవరి నెట్లెట్లు సంతోషింపఁ జేయవలయునో యట్లు చేయుచున్నావా? ఇషు+అస్త్రసంపన్నున్=మంత్రము లేక ప్రయోగించు బాణాది శస్త్రములను మంత్రములచేఁ బ్రయోగించు నస్త్రములను జక్కఁగఁ దెలిసినవానిని, హితున్=మనమేలు గోరువానిని, సుధన్వాఖ్యున్ = సుధన్వుఁడనుపేరు గలవానిని, ఉపాధ్యాయున్ = ధనుర్వేదాచార్యుని, కులజులే = మంచివంశముల గొప్పకులములఁ బుట్టినవారా, అనఁగాఁ బ్రాహ్మణక్షత్రియ కులములందుఁ బుట్టినవారా, శ్రుతవంతులే = నీతిశాస్త్రము నెఱింగినవారా, ఆత్మసములె=నీకుసములా అనఁగా నీవు నిన్ను నమ్మినట్లు వారును నమ్మఁదగినవారా యని భావము. జితేంద్రియశాలులు = ఇంద్రియ నిగ్రహముచేఁ బ్రకాశించువారా, అనుటచే లంచగొండులు కారుగదా యనియర్థము ఇంగితజ్ఞులే =ముఖనైఖరి చూచి యితరులయభిప్రాయ మెఱుఁగఁ గలవారా, మంత్రమే = ఆలోచనమే, సచివవరులు=మంత్రిశ్రేష్ఠులు, ప్రమాదంబు=పొరపాటు.

సుధన్వాచార్య లక్షణము మనుస్మృతియం దిట్లు చెప్పఁబడెను.

శ్లో॥ వైశ్యాత్తుజాయతే వ్రాత్యా సుధన్వాచార్య ఏవచ.

వ్రాత్యుఁడగు వైశ్యునివలన సవర్ణస్త్రీయందుఁ బుట్టినవాఁడు సుధన్వాచార్యుఁడు, మను. 10-23.

వీనికే దేశభేదమునఁ గారూశుఁడు విజన్ముఁడు మైత్రుఁడు సాత్వతుఁడు అనిపేరు.

తా త్ప ర్య ము.

దేవతలను యజ్ఞాదులచేఁ దృప్తిపఱుచు చున్నావా? ఈ నెలలోపలనే యజ్ఞములన్నియుఁ జేసితివా? యని యర్థముకాదు. రాజుగానుండువాఁడు చేయవలసిన కృత్యములఁ దెలుపుచున్నాఁడని యెంచవలయును. ఇట్లే తక్కినవని యెఱుంగవలయును. శ్రాద్ధాదులచేఁ బితృదేవతలఁ దృప్తిపఱుచుచున్నావా? జనను లను వారుచెప్పినట్టువిని సంతోషపఱుచుచున్నావా? గురువులను శుశ్రూషచేఁ దృప్తులఁ జేయుచున్నావా? తండ్రితో సమానులగువారిని ద్రవ్యదానము చేతను పెద్దలను నమస్కారాదులచేతను దృప్తిపఱుచుచున్నావా? విద్వాంసులను ఆయు

ర్వేద మెఱింగినవారిని బ్రాహ్మణులను ద్రవ్యమునిచ్చి సంతోషపెట్టుచున్నావా? అర్థశాస్త్రము నీతిశాస్త్రము నెఱింగినవానిని శస్త్రాస్త్రజ్ఞాన పూర్ణుని మనమేలుగోరు వానిని సుధన్వుఁడను పేరుగల యుపాధ్యాయుని భక్తితోఁ బూజించుచున్నావా? నీ మంత్రులందఱు శౌర్యవంతులా? గొప్పకులముల గొప్పవంశములఁ బుట్టినవారా? నీతిశాస్త్రము చక్కఁగా నెఱింగినవారా! బుద్ధియందు నీతోసమానులా? ఇంద్రియ నిగ్రహము గలవారా? ముఖములుచూచి యెదుటివారి యభిప్రాయ మెఱుఁగఁ గలవారా? రాజులకు మంత్రాలోచనమే జయమునకు మొదటికారణము. శాస్త్రము నెఱింగిన మంత్రులు కార్యము నెఱవేర్చుటకుముందు నీ యాలోచనముల పొర పాటుననైన వెలిపెట్టకుందురుగదా.

కం. కావు గదా యెప్పుడుని ద్రావశుఁడవు, మేలుకొనుదె తగుకాలమునన్?
 నీ వాలోచింతె ధన,ప్రావీణ్యము లేచి యపర రాత్రములందున్? ౨౨౪౮

నిద్రావశుఁడవు=నిద్రకు లోపడినవాఁడవు, ధనప్రావీణ్యము=ధనార్జనవిషయ మున నేర్పును, అపర రాత్రములందున్ = రాత్రి కడపటిభాగములందు.

"బ్రాహ్మేముహూర్తే చోత్థాయ ధర్మమర్థంచ చింతయేత్" భారతము.

బ్రాహ్మముహూర్తమున లేచి ధర్మ మర్థము నాలోచింపవలెను.

నిద్రయు మేలుకొనుటయుఁ దగినకాలములందుఁ జేయవలయును. "సంవిశే చ్చయథాకాల ముత్తిష్ఠే ద్విగతక్లమః। వీతవృత్తిం సమాతిష్ఠేదరోగః పృథివీపతిః॥ సోమరులు తలఁచునట్లు నిద్ర భోగముకాదు. పనిచేసియుండు నవయవములకు విశ్రాంతి యిచ్చుటకే నిద్రపోవలెను. కాని యదిగొప్పకార్యముగ నిద్రాదాసుఁడు కారాదు. మితనిద్రవలన దేహము లఘువుగానుండును. అమితనిద్రవలన దేహము బరువెక్కును, ముసలితనము శీఘ్రముగ వచ్చును, రోగములువచ్చును. కాలము వ్యర్థముపోవును.

తాత్పర్యము

నీవు నిద్రింపఁ దలఁచినపుడు నిద్రవచ్చునేకాని తనంతటనది పైపడిరాదు గదా? ఏసమయమందు మేలుకొని యుండవలయునో యప్పుడు మేలుకొనియే యుండుదువుకదా. మంత్రసమయములందు నిద్రింపవుగదా? అర్ధరాత్రమున కావల లేచి ధనప్రాప్తి విషయమై యాలోచింతువా?

కం. ఒక్కనితో నైనను మఱి,పెక్కురతో నైనఁ జేయవే కద మంత్రం?
 బెక్కరణి నీదుమంత్రము,గ్రక్కన వెలువడదుగాదె రాష్ట్రమునందున్? ౨౨౪౯

తాత్పర్యము.

నీవు రహస్యవిషయము లొక్కనితోఁగాని పెక్కురతోఁగాని యాలోచిం పవుగదా! ఒక్కనితో నాలోచించితివా వానికిఁ బక్షపాత మెవనియం దుండునో వాని కనుకూలముగాఁ జెప్పును. పెక్కురతో నాలోచించిన వారిలో నొకఁడు

గాకున్న మఱిరొక్కఁడైన వెలిపఱుచును లేదా భిన్నాభిప్రాయులై వారిలోవారు కలహింతురు. ఆలోచనయం దాఱుకన్నులు (ముగ్గురు) సమ్మతము నీయాలోచన మేవిధముగనైనఁ గార్యము జరగుటకు ము దెవ్వరికి నీవు దెలుపకుందువుగదా.

కం. నయుత లఘుమూలము మహో,దయ మగుకార్యంబు నిశ్చి•తం బగుడు మఱిన్
రయమునఁ జేయుదె? కార్యము,క్షయ మగుగతిఁ దడవు సేయ•గాఁ దలఁపవుగా? ౨౨౫౭

నయుతన్ = నీతిశాస్త్ర ప్రకారము, లఘుమూలము = సులభసాధనము, మహోదయము=గొప్పఫలము, క్షయమగుగతిన్ = చెడిపోవువిధముగా, 'క్షిప్రమ క్రియ మాణస్య కాలః పిబతి సంపద' యని నీతిశాస్త్రము. "ఆలస్యమమృతం విష మ్మ"ని కలదుగదా.

తా త్ప ర్య ము.

నీతిశాస్త్రము ననుసరించి సులభసాధనము మహాఫలము నగు కార్యము నిశ్చయమైనపిమ్మట వెంటనే దానిని జేయుదువుగదా! కార్యము చెడునట్టు లాల స్యము చేయవుకదా.

కం. సామంతభూమిపాలురు, నీమంత్రితకార్యసమితి • నెఱవేఱెడిమున్
దా మేమి యెఱుఁగ కుందురే?యాపిఁదన యెఱుఁగు చుందు•రా?యెల్లపుడున్? ౨౨౫౮

సామంత భూమిపాలురు = లోపడి కప్పముగట్టుచుండురాజులు, మంత్రితకా ర్యసమితి=ఆలోచించి నిశ్చయించిన కార్యసమూహమును, నెఱవేఱెడిమున్=కొన సాగుటకుముందు. ౪—గవ పాదంబునఁ గాకుస్వర యతి.

యస్యకృత్యం నజానాతి, మంత్రంవా మంత్రితంపరే,
కృతమే వాస్య జానాతి, సవై పండిత ఉచ్యతే. ఉద్యోగ.

ఎవని కృత్యముగాని యాలోచనగాని యాలోచింపఁ బడినదిగాని యితరు లెఱుఁగకుందురో కార్యమైనపిమ్మటనే యెఱుఁగుదురో వాఁడు పండితుఁడనఁబడును.

తా త్ప ర్య ము.

నీవాలోచించి నిశ్చయించుకొనిన కార్యములు నెఱవేఱుటకు ముందే నీ సామంతరాజులు వాని నెఱుఁగకుందురుగదా! కార్యము నెఱవేఱిన పిమ్మటనేకదా తెలియుచున్నారు.

కం. పలుయుక్తులనో తర్కము,వలననొ మఱి యెట్టులైనఁ • బరు లెవ్వరు నీ
వలననొ నీధీసచివుల,వలననొ యెఱుఁగరు గదయ్య•వరమంత్రితమున్. ౨౨౫౯

పలుయుక్తులనో=అనుమానములచేతనో, తర్కములననొ = ఊహలచేతనో, మఱియెట్టులైనన్ = ఇంగితాదులచేతనైనను, ధీసచివులు = మంత్రులు, ఎఱుఁగరు

గదయ్యా=నీవుగాని నీమంత్రులుగాని చేసిన యాలోచనము బైటఁబడు మార్గములను దాఁచి యున్నారా ?

తా త్ప ర్య ము.

నీవుగాని నీమంత్రులుగాని నడచెడి నడత ఆడెడిమాటలు చూచెడి చూపులు భ్రూముఖవికాసాదులు వీనివలనను ననుమానముచేతనో యుక్తిమాటల చేతనో యింగితము చేతనో పరులెవ్వరైనను మీ యాలోచనము తెలిసికోఁజాలరు గదా! అనఁగా నట్లువారు తెలిసికొనుటకు మీరవకాశమిచ్చుట లేదుగదా.

కం. దండిగ వెయిమూర్ఖులకును, బండితుఁ డొక్కండు మేలు ♦ భావించె మదిన్ ।
గండంపులర్థకష్టము, నిండినయెడ నతఁ డొసంగు ♦ నిశ్శ్రేయసమున్. ౨౨౧౯

తా త్ప ర్య ము.

వేయిమంది మూర్ఖులకంటెఁ గార్యమాలోచించి చేయఁగలవాఁడు చెప్పఁగలవాఁ డొక్కఁడుమేలు. ప్రాణగోష్ఠమైన ధనవిషయమైన కష్టము సంభవించునపుడు ఆపండితుఁడు సుఖముగలిగించును గాని మూర్ఖులు నూర్గురున్నను బ్రయోజనపడరు పండితునిబుద్ధి యేకవిధమైనదిగా నుండును మూర్ఖులొక్కఁ డొక్కఁ డొక్కొక్క యాలోచన చెప్పుటేకాక నిశ్చయజ్ఞానము లేమిచేతఁ దాను ముందు చెప్పినదానికి విరోధముగఁ దరువాతఁ జెప్పును. "వ్యవసాయాత్మికాబుద్ధి, రేకేహ కురునందన। బహుశాఖాహ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్. భ-గీ. ౨-౪౧

ఉ. వేవు రకేల యొక్కపది♦వేవురు మూర్ఖులు గొల్చుచుండినన్
భూవిభు, వారిచేఁ గలుగఁ♦బోదు సహాయుత, గాన నొక్కమే
ధావియు శూరుఁడుం బనుల ♦ దక్షుఁడు నీతివిదుండు మంత్రిగా
త్మావిభునేని భూమివిభు♦మాత్రునినే ధనవంతుఁ జేసెడిన్. ౨౨౦

తా త్ప ర్య ము.

మీఁదఁ జెప్పినదానినే విశదీకరించి చెప్పుచున్నాఁడు.

వేయిమంది గాదు పదివేలమంది నీ సేవకులుగా నుండినను నక్కఱ అవసరము లందు వా రేసాహాయ్యము చేయఁజాలరు. కావున సరియైన యాలోచన చెప్పఁగలవాఁడును, పరులు చెప్పినదానిని దటుకున గ్రహింపఁగలవాఁడును, నగు బుద్ధిమంతుఁడు, దానిని సాధింపఁగల శూరుఁడు, పనులయందు నేర్పరి, నీతి తెలిసినవాఁడు, మంత్రియయ్యెనేని సామాన్యరాజునైనను ధనవంతునిఁ జేయఁగలఁడు.

ఆ. గొప్పవారి నెల్ల ♦ గొప్ప కార్యంబుల, మధ్యములను మధ్య♦మంపుఁబనుల
నధము లైనవారి♦నధమకృత్యంబుల,భృత్యజనుల నును తె♦ పేర్మిఁ గొలఁది! ౨౨౧

భృత్యజనులు = కూలితీసికొని పనిచేయు సేవకులు, జీతగాండ్రనియర్థము. భృతి=కూలి, దానిచే జీవించువారు భృత్యులు.

తా త్ప ర్య ము.

జితగాంభ్రీరను బనులయందు నియోగించునపుడు వారివారికిఁగలది గొప్ప తారతమ్యము లెఱింగి కులమునందు గుణమునందు గొప్పవారుగా నుండువారిని నీ గృహకృత్యమునందును, వంట మొదలగు కార్యములందును. నడిమిరకమువారిని బడుక వేయుట లోనగు సాధారణ కార్యములందును. నధములైనవారిని గాళ్ళుపిసుకుట మొదలగు కార్యములందును, నియమించు చున్నావుగదా! యోగ్యతలేని వారిని యోగ్యులుచేయఁదగు కార్యములందు నియమించుట లేదుగదా! పాదములందు ధరింపవలసిన యాభరణములు శిరస్సున ధరింపరాదు, తలయందు ధరింపవలసినవి పాదముల ధరింపరాదు.

ఉ. ప్రేమఁ గలారిఁ, బెక్కులుప•రీక్షలఁ జేసినవారిఁ, బూర్వపున్
భూమిపు లాదిగా మనలఁ • బూనికఁ గొల్చెడివారి, సత్యవా
ణీమతికర్మము ల్గలుగ•నిర్మలులన్, సచివాగ్రగణ్యులన్
గా మదిఁ జూచి శ్రేష్ఠ మగు• కార్యముల న్నియమింతె శ్రేష్ఠులన్. ౨౭–౨

రాజ్యకార్యములందు నియోగింపఁదగిన యుత్తములఁ జెప్పుచున్నాఁడు. నీయందు నిజమైన ప్రేమగలవారిని పరీక్షలఁ జేసినవారిని రాజులు వస్త్రాభరణాదులను దమసేవకులచేతికిచ్చి యంతఃపురస్త్రీలు మీకిచ్చిరమ్మనిరనియో, శత్రురాజులు మీకుఁబంపిరనియో చెప్పి యిచ్చిరండని మోసముగా మంత్రులకుఁబంపి యామూలముని వారి యభిప్రాయ మెఱుంగుదురు. ఇట్టిపరీక్షలనేకముల నీమంత్రులు జేసినవారుగా నుండవలయును. పూర్వపున్భూమిపులు, ఇచట స్థిరము పరమైనపుడు నుగాగమము. వంశపరంపరగా వచ్చినారు. సత్యవాణి = సత్యవాక్కు, సత్యమతి=సత్యమగుబుద్ధి, సత్యకర్మము, నిర్మలులన్=త్రికరణముల మలినములేనివారిని, సచివాగ్రగణ్యులన్=మంత్రిశ్రేష్ఠులను. తా త్ప ర్య ము

నీయందు నిజమైన ప్రేమగలవారిని, అనేక పరీక్షలయందుఁ గడతేఱినవారిని ఆదినుండి మనపెద్దలను మనలను దమవంశ పరంపరగా సేవచేయుచుండు వారిని, వాక్కు మనస్సు కర్మము మూఁడును సత్యముగానే యుండువారిని ఏవిధమైన మాలిన్యము లేనివారినిగాఁజూచి శ్రేష్ఠకార్యములందు శ్రేష్ఠులయిన మంత్రులనే నియమించుచున్నావా?

తే. ఉగ్రదండంబుచేత నీ • పుర్విజనులఁ, బీడితులఁ జేసి శేని మో•మోడి నీదు
మంత్రివర్యులు నీపోవు•మార్గములకుఁ, దలల నూఁచుచు నుండురా•తగవుమాలి? ౨౭–౩

ఉగ్రదండంబు = తీక్ష్ణమైన శిక్ష. కొంచెము నేరమునకు గొప్పశిక్ష. మోమోడి=మోము + ఓడి = నీయందు దాక్షిణ్యముగలవారై, తలల నూఁచుచు నీవుచేసినది సరియని యంగీకరింతురా, తగవుమాలి=ధర్మము విడిచి.

### తా త్ప ర్య ము.

నిష్పక్షపాతముగ విచారించి నేరమునకుఁ దగినట్లు దండింపక కొలఁది దోషములకు దయలేనివాఁడవై గొప్ప కఠినదండములు విధించుచుంటివేని యదిసరిగాదని చెప్పిన నీవేమనుకొందువో యని నీదాక్షిణ్యముచే జంకి న్యాయమువదలి నీవు చేసినదే సరియని నీమంత్రు లంగీకరింపరుకదా. నీవుచేసినది తప్పని నీకు భయపడక చెప్పుదురా ?

చం. ధనమును దుష్టమార్గమునఁ • దా నొడఁగూర్చి సవంబుఁ జల్పఁ గో
 రినఖలు యాజకుల్, ప్రసభ•రీతి గ్రహింపఁగఁ గోరుకాముకున్
 వనితలు వీడనాడుగతి • నాయన! తీవ్రగతిన్ ధనంబులన్
 బెను పొనరించునిన్నుఁ బ్రజ • వీక్షణ సేయదుగా యనాదృతిన్.        ౩౭-౮

దుష్టమార్గమునన్ = పాపపుఁ గార్యములు చేయుటచే, ఒడఁగూర్చి=సంపాదించి, సవము=యజ్ఞముఁ, ఖలు=దుష్టుని, యాజకుల్ = యజ్ఞముచేయించుబుత్విజులు. ప్రసభరీతిన్ =బలాత్కారముగా, తీవ్రగతిన్=క్రూరమైనమార్గమున, పెనుపు =వృద్ధి, అనాదృతిన్=ప్రేమలేమిచే,

### తా త్ప ర్య ము.

• పాపపుఁగార్యములు చేసి ధనముసంపాదించి దానితో యజ్ఞముచేయఁ బూనినవానిని బుత్విజులవలె, బలవంతముగఁ దన్ను గ్రహింపఁగోరిన కాముకుని స్త్రీలవలె కఠిన దండముచేత ధనముసంపాదించు నిన్ను లోకులు నిరాదరణ దృష్టిని జూడరుగదా ! నీవు జనులను నన్యాయముగఁ గఠినముగా దండించి వారిని నొప్పించి యవమానపఱిచి బలాత్కరించి ధనము సంపాదించుట లేదుగదా !

ఉ. లేరు గదయ్య నీకడ మ•లీమసచిత్తులు, దుష్టనీతివి
 ద్యారతు, లాత్మభృత్యజన•తాపరిదూషకులున్, నృపాలభీ
 దూరు లసూయకుల్ చెనఁటి•త్రొక్కుడుగూర్పరు లర్థతృష్ణ శ్రీఁ
 గోరెడివారు? వీరిఁ బతి • గూల్పఁడ యేనియుఁ జచ్చు వారిచేన్.        ౩౮-౯

మలీమసచిత్తులు = మలినమైన మనస్సుగలవారు అనఁగా దయలేనివారు, లోభులు, క్రూరులు కుత్సితులు, వంచకులు, మొదలగువారు దుష్టనీతివిద్యారతులు=కుత్సితనీతులఁ జెప్పునట్టి కణంక చాణక్యాదుల నీతివంటి నీతిని దెలుపువారు, ఆత్మభృత్య=నీ సేవకులయందు, ఆత్మజనతా = నీకుఁ గావలసినవారియందు, పరిదూషకుల్=కొండెములుచెప్పి వెడలఁగొట్టించువారు, నృపాలభీదూరులు=రాజభయము లేనివారు, రాజునే వారు చంపవలెనని యత్నించుచుందురు గావున రాజవలనిభయము వారికిలేదు. అసూయకుల్=ఒకరిమేలు కీర్తి ప్రతిష్ఠలుచూచి సహింప